Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

ముహూర్తం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, తిథి: బహుళ త్రయోదశి రా. 2.45 వరకు, అనంతరం చతుర్దశి; నక్షత్రం: జ్యేష్ఠ మ.2.10 వరకు, అనంతరం మూల; అమృతకాలం: లేదు; వర్జ్యం: రా. 11.00 నుండి 12.46 వరకు; దుర్ముహూర్తం: సా. 4.24 నుండి 5.12 వరకు; రాహుకాలం: మ. 4.30 నుండి 6.00 వరకు; యమగండం: మ. 12.00 నుండి 1.30 వరకు; విశిష్టత: భోగి పండగ

సంపుటి:56 . సంచిక:274 . ఆదివారం 14 జనవరి 2018 . హైదరాబాద్ * పేజీలు:12+4 . వెల: 6.00 . Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

• పతంగుల నీడలో భాగ్యనగరం....!



పరేడ్ గ్రౌండ్స్‌లో పతంగులు ఎగురవేస్తున్న భాగ్యనగర వాసులు

పట్నం పల్లెబాట

• సంక్రాంతి వేళ భాగ్యనగరం ఖాళీ • బోసిపోయిన రోడ్లు
• రెండ్రోజుల్లో 20 లక్షల మంది సొంతూళ్లకు పయనం
• కిటకిటలాడుతున్న రైళ్లు, బస్సులు • జాతరను తలపిస్తున్న టోల్‌ప్లాజాలు • ఎయిర్‌లైన్స్‌ల సంక్రాంతి దోపిడీ
• కోడిపందాలపై గట్టి నిఘా.. పటిష్ట బందోబస్తు

వివరాలు 2లో...

నేడు భోగి



మార్చి 11న కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు


ఏకకాలంలో రైతులకు పంపిణీ
రాష్ట్రపతి లేదా ప్రధాని మోడీ చేతుల మీదుగా శ్రీకారం?
ఆ రోజు నుంచే కొత్త రిజిస్ట్రేషన్లు
ఎమ్మార్వోలకే రిజిస్ట్రేషన్ బాధ్యత
ధరణి పేరుతో ల్యాండ్ వెబ్‌సైట్
కోర్ బ్యాంకింగ్ తరహా విధానం
నూతన పాస్ పుస్తకాల జారీ, రిజిస్ట్రేషన్‌లో మార్పులపై సీఎం కేసీఆర్ సమీక్ష



ప్రగతిభవన్‌లో శనివారం నిర్వహించిన సంక్రాంతి పర్వదిన పూజల్లో సీఎం కేసీఆర్ దంపతులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మార్చి 11న రాష్ట్రవ్యాప్తంగా ఏక కాలంలో అన్ని గ్రామాల్లో కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూ రికార్డుల ప్రక్షాళనతో వెల్లడైన అంశాల ఆధారంగా కోర్ బ్యాంకింగ్ తరహాలో ప్రత్యేక ల్యాండ్ వెబ్‌సైట్‌ను ధరణి పేరుతో అమలులోకి తేవాని, అదే రోజునుంచి రెవెన్యూ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్ కార్యాకలాపాలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు కొత్త పాస్ పుస్తకాల జారీ, రిజిస్ట్రేషన్ విధానంలో సంస్కరణలపై శనివారం ఆయన ప్రగతి భవన్‌లో 8 గంటల పాటు సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలను అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మార్చి 11న కొత్త పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్రపతి, లేదా ప్రధానిని ఆహ్వానించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అవినీతికి ఆస్కారం లేని పారదర్శకమైన నూతన రిజిస్ట్రేషన్ విధానం కూడా అదేరోజున ఆరంభిస్తామని ఆయన వెల్లడించారు. రెవెన్యూ శాఖ పరిధిలోనే ఇకమీదట భూముల నిర్వహణ, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతుందని, ఈ రెండు శాఖల మధ్య మరింత సమన్వయానికి

9వ పేజీలో...



తెలుగింట కాంతి సంక్రాంతి
ఆదివారం అనుబంధం ప్రత్యేక సంచిక

సామాజిక భద్రత లేక

వృద్ధతరం విలవిల..!

ఒంటరి దంపతుల జీవితాలు దుర్భరం
అన్నీఉన్నా ఆదుకునేవారు లేక అగచాట్లు
సామాజిక మార్పులతో జీవన సమస్యలు
ఉపాధి వెతుక్కుంటూ పిల్లలు సుదూర తీరాలకు

అన్నీ ఉన్నా ఒంటరితనంతో భయం
చట్టబద్ధంగా చనిపోయేందుకు సిద్ధం
రాష్ట్రపతికి ముంబై దంపతుల పిటిషన్



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

సంక్రాంతి నేపథ్యంలో దేశంలోని ఎయిర్‌పోర్టులన్నీ రద్దీగా మారాయి. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు జనంతో కిక్కిరిసిపోయాయి. టికెట్లు దొరక్క, రిజర్వేషన్లు లభించక లక్షలాది మంది సొంతూళ్ళు వెళ్లలేక దిగాలు పడుతున్నారు. సొంత వాహనాల్లో బయలుదేరిన వారంతా జాతీయ రహదారిపై కిలోమీటర్ల పొడవునా నిల్చిపోయిన వాహనాల శ్రేణిలో ఇరుక్కుపోయారు. ఎప్పుడు బయటపడతారో తెలీక కొట్టుమిట్టాడుతున్నారు.

ఏడాదికోసారి వచ్చే సంక్రాంతికి ముందు దేశంలో కొన్నేళ్ళుగా గోచరిస్తున్న పరిస్థితిది. వీరంతా ఎక్కడికెళ్తున్నారు. అక్కడెవరున్నారు అని ఆలోచిస్తే తమ స్వగ్రామాలకు వెళ్తున్నారు. అక్కడ వృద్ధులైన తల్లిదండ్రులు, ఇతర పెద్దలు ఉన్నారు. ఏడాది పొడవునా దేశంలోని ప్రధాన నగరాలు, విదేశాల్లో భార్యాబిడ్డలతో నివసిస్తున్న వీరంతా ఏడాది పొడవునా తమ తల్లిదండ్రులకు దూరంగానే ఉంటున్నారు. ఆరుపదుల వయసుదాటిన వృద్ధతల్లిదండ్రులు ఏడాదికోసారి వచ్చి తమ మధ్య పండగ జరుపుకునే వీరి కోసం ఏడాది పొడవునా కళ్ళుకాయలు కాసేలా ఎదురుచూడ్డం ఇక్కడ సంప్రదాయమైంది.

దేశంలో కుటుంబ బంధాలు విచ్ఛిన్నమౌతున్నాయి. ఒకప్పటి వసుధైక కుటుంబం చరిత్రగతిలో కలిసిపోతున్నది. ఉమ్మడి కుటుంబాలు విడిపోతున్నాయి. జంట కాపురాలకే ప్రాధాన్యతనిస్తున్నారు. పట్టణీకరణ, నగరీకరణతో ఉద్యోగాల పేరిట గ్రామాల నుంచి తరలిపోతున్నారు. ఉపాధి అవకాశాలంటూ సుదూర దేశాలకు ఎగిరెళ్తున్నారు. గత ఐదు దశాబ్దాల్లో దేశంలో కుటుంబ వ్యవస్థ తీరు పూర్తిగా మారిపోయింది. వృద్ధతల్లిదండ్రులు గ్రామాలకే పరిమితమౌతున్నారు. పట్టణాలకొచ్చినా అక్కడి వాతావరణం, పరిస్థితుల్లో ఇమడలేక పోతున్నారు. ఇది దేశంలో ఒంటరి వృద్ధుల పెరుగుదలకు కారణమౌతోంది.

పిల్లలు తరలిపోవడమే కాదు.. గత నాలుగు దశాబ్దాలుగా పిల్లల్ని కనడం పట్ల మహిళల్లో తగ్గిన ఆసక్తి కూడా ప్రస్తుత పరిస్థితికి దర్పణం పడుతోంది. మహిళల్లో విద్యార్హతలు పెరిగి ఉద్యోగావకాశాలు

3వ పేజీలో...



రంగంలోకి బార్‌కౌన్సిల్

న్యాయమూర్తులతో చర్చలకు
ఏడుగురు సభ్యులతో కమిటీ
రాజకీయం చేయొద్దు
పార్టీలకు బార్ కౌన్సిల్ విజ్ఞప్తి

11

పట్టాదారులే ప్రామాణికం

కౌలుదారులకు హక్కులు కల్పించడం సాధ్యం కాదు
పెట్టుబడి మద్దతు పథకంలోనూ వారికి సహాయం చేయలేం
రెవెన్యూ అధికారులకు స్పష్టం చేసిన సీఎం కేసీఆర్

9 లో

నిరంతర విద్యుత్‌పై

తుదినిర్ణయం రైతన్నదే..!



లాభ నష్టాల బేరీజుపై ప్రభుత్వం దృష్టి
గ్రామసభల్లో తీర్మానం చేస్తే తగ్గించేందుకు సూచనప్రాయ నిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వ్యవసాయ రంగానికి నిరంతర ఉచిత విద్యుత్ లాభ, నష్టాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. గత ఏడాది ఆఖరులో ప్రయోగాత్మకంగా అమలు చేసిన మూడు జిల్లాల్లో కొంత మేరకు ప్రతికూల పరిస్థితులు కనిపించినప్పటికీ, తెలంగాణ ప్రతిష్టను దేశానికి చాటి చెప్పాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ ఏడాది మొదలుకుని రాష్ట్ర వ్యాప్తంగా 24 గంటల నిరంతర విద్యుత్‌ను నిరాటంకంగా సరఫరా చేస్తోంది. ఈ నిర్ణయం వ్యవసాయ అనుబంధ రంగాల్లో కొంతమేరకు ఫలితాన్నిస్తున్నప్పటికీ, మెజారిటీ రైతుల నుంచి వ్యతిరేకత కనిపిస్తోంది. అన్నదాతల కోసమే నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తున్న ప్రభుత్వం,

9వ పేజీలో...

ఔరా..!



చిదంబరానికి సన్ స్ట్రోక్...!



చిద్దూ, కార్తి నివాసాల్లో ఈడీ సోదాలు

ఏకకాలంలో 10చోట్ల తనిఖీలు
పీఎంఎల్ఏ కేసు దర్యాప్తులోనే: ఐటీ
ఈడీకి ఏమీ దొరకలేదు: చిదంబరం

11 లో

మళ్లీ డ్రగ్స్ కలకలం



46 కేజీల మాండ్రాక్స్ పట్టివేత

విలువ రూ.50 కోట్లు

మహారాష్ట్ర టు హైదరాబాద్ టు చెన్నై
ముగ్గురి అరెస్ట్... కారు స్వాధీనం

5





అట్టహాసంగా పతంగుల పండుగ

● మూడురోజుల సంబురం షురూ ● వేడుకలకు 22విదేశీ క్లబ్ లు ● ఆకర్షిస్తున్న రంగుల పతంగులు ● స్వీట్ ఫెస్టివల్ కు ఏర్పాట్లు పూర్తి ● ప్రదర్శనకు 1000 రకాల వంటకాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అంతర్జాతీయ పతంగుల పండుగను తెలంగాణ ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది ఘనంగా ప్రారంభించింది. శనివారం సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, గిరిజన సంక్షేమశాఖా మంత్రి చందూలాల్, మండలి చైర్మన్ స్వామిగౌడ్‌లు ఫెస్టివల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. తొలిసారి ఫెస్టివల్‌ను సికింద్రాబాద్ పెరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నారు. పెరేడ్‌గ్రౌండ్స్‌లోని భారీ గాలిపటాలు విశేషంగా ఆకర్షిస్తుండగా, వీటిని చూసేందుకు చిన్నారులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వివిధ ఆకృతుల్లో ఉన్న పతంగులు బాగా ఆకట్టుకుంటుండగా, విదేశీయులు విభిన్న పతంగులతో సందడి చేశారు. 22దేశాలకు చెందిన కైట్ క్లబ్‌ల సభ్యులు ఈ పతంగుల ఫెస్టివల్‌కు హాజరయ్యారు. గతంలో కైట్ ఫెస్టివల్‌ను శంషాబాద్ వద్ద ఉన్న ఆగాఖాన్ అకాడమీలో నిర్వహించగా, తొలిసారి నగనం నడిబొడ్డున సికింద్రాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా టూరిజం శాఖ కార్యదర్శి మాట్లాడుతూ మూడురోజుల పాటు జరిగే అంతర్జాతీయ పతంగుల పండుగను వీక్షించేందుకు లక్షమంది వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. తొలిసారి ఈ ఫెస్టివల్‌కు అనుబంధంగా స్వీట్ ఫెస్టివల్ ఏర్పాటుచేస్తున్నామన్నారు. 15వతేదీ వరకు కైట్ ఫెస్టివల్ జరుగుతుందన్నారు. రాష్ట్ర బాషాసాంస్కృతిక శాఖ డప్పుల దరువులు, కోలాటాలు, గంగిరెద్దులు, హరిదాసులు, బుడబుడకలు వంటి సాంస్కృతిక కళారూపాలను సంక్రాంతి సందర్భంగా ప్రదర్శించనుంద న్నారు. స్వీట్ ఫెస్టివల్ ఆది, సోమవారాలు కొనసాగుతుంద న్నారు. వెయ్యికి పైగా మిఠాయిలు స్వీట్ ఫెస్టివల్‌లో కొలువుదీరుతున్నాయన్నారు. అన్ని రాష్ట్రాలకు సంబంధించిన స్వీట్స్ ఉంటాయన్నారు.

ఆకట్టుకున్న వెండిగాలిపటం

పతంగుల పండుగ సంబురం హైదరాబాద్‌లో అంబురాన్ని తాకుతుండగా, అట్టహాసంగా ప్రారంభమైన కైట్ ఫెస్టివల్‌లో వెండిగాలిపటం ముచ్చటగొలుపుతోంది. నగరానికి చెందిన ఆనంద్‌రెడ్డి 0.5గ్రాముల వెండితో గాలిపటాన్ని తయారుచేశాడు. గాలిపటాల దుకాణం నిర్వహిస్తున్న ఆనంద్‌రెడ్డి తయారుచేసిన వెండిగాలిపటం చూసినవారు ఆశ్చర్యపోతున్నారు. రంగుల పతంగులను ఎగరవేస్తూ పిల్లలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఢిల్లీలో సంక్రాంతి వేడుకలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: దేశ రాజధానిలో సంక్రాంతి వేడుకలు మొదటి రోజు ఘనంగా జరిగాయి. వారాంతంలో రెండు రోజుల పాటు సంక్రాంతి వేడుకలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ భవన్ అధికారులు నిర్వహించారు. ఏపీ భవన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా, సాంస్కృతిక సంస్థ, ఢిల్లీ తెలుగు అకాడమీ, తెలుగు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆదిలీల ఫౌండేషన్‌ల సౌజన్యంతో ఏపీ భవన్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాలను భవన్ డిప్యూటీ కమిషనర్ టి. సూర్యనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ పి. రవిశంకర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె. లింగ రాజు, స్పెషల్ ఆఫీసర్ కె. జయరావు, ఆదిలీలా ఫౌండేషన్ ఆదినారాయణ, ఢిల్లీ తెలుగు అకాడమీ చంద్రశేఖర్, తెలుగు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సుశీల వరదరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాజమండ్రికి చెందిన శాంతి వినోద్, వి. కృష్ణ బృందం ప్రదర్శించిన జానపద కళారూపాలు, హరిదాసులు, జంగందేవర, బుడబుక్కల వేషదారులు, పగటి వేషాలను ప్రదర్శనలు ఎంతో అలరించాయి.

లాలూచీ అవసరం లేదు

రాజ్యసభ సభ్యుడు సుబ్బిరామిరెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణకు విద్యుత్ సరఫరా చేసే విషయంలో తాను ఎవరికీ లాలూచీ పడాల్సిన అవసరం లేదని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ టి.సుబ్బిరామిరెడ్డి స్పష్టంచేశారు. విద్యుత్ కొనుగోళ్ళ విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సుబ్బిరామిరెడ్డితోనూ చేతులు కలిపారన్న ఆరోపణల్లో ఎలాంటి అవాస్తవం లేదని ఖండించారు. తమకున్న విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు తెలంగాణ ప్రభుత్వం కరెంట్ కావాలంటూ విజ్ఞప్తి చేస్తే నిబంధనల ప్రకారం టెండర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని అన్నారు.

ఒకవేళ అవసరం లేదనుకుంటే ఇప్పటికిప్పుడు సరఫరా ఒప్పందాన్ని ఉపసంహరించుకోవడానికి సిద్ధమన్నారు. అంతేతప్ప డబ్బుల కోసం కక్కుర్తిపడి ఎవరితోనూ చీకటి ఒప్పందాలు కుదుర్చుకోవడం తనకు అలవాటు లేదన్నారు.



పట్నం పల్లెబాట

● సంక్రాంతి వేళ భాగ్యనగరం ఖాళీ ● రెండు రోజుల్లో 20 లక్షల మంది సొంతుళ్లకు ● కిటకిటలాడుతున్న బస్సులు, రైళ్లు ● జాతరను తలపిస్తున్న టోల్ ప్లాజాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పండగొస్తే చాలు... బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు క్రిక్కిరిసిపోతున్నాయి. అందులోనూ సంక్రాంతి పండుగకు రద్దీ మరీ ఎక్కువ. లక్షలాది మంది ప్రయాణీకులు ఒకేసారి సొంత ఊళ్లకు వెళ్తుంటారు. అరకొర రవాణా సౌకర్యాలతో నరకయాతన పడాల్సి వస్తోంది. బస్సుల సామర్థ్యం సరిపోక టాప్‌పై ఎక్కి ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంటోంది. టోల్‌ప్లాజాల వద్ద కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ స్తంభిస్తోంది. సంక్రాంతి సంబురాల కోసం నగర వాసులు పల్లెబాట పట్టారు. బస్సులు, రైళ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతు న్నాయి. శుక్రవారం ఒక్క రోజు సుమారు 10 లక్షల మంది స్వస్థలాలకు పయనమయ్యారని ప్రజా రవాణా వర్గాలు పేర్కొన్నాయి. శని, ఆదివారాల్లో మరో పది లక్షల మంది నగరం విడిచి వెళ్లిపోతారని వెల్లడించారు. దసరా, సంక్రాంతి పండుగలకు ఏటా సుమారు 20 నుండి 23 లక్షల మంది సొంతూళ్లకు వెళుతుంటారని, ఈ మేరకు అవసరమైన మేరకు ప్రత్యేక బస్సులు, రైళ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆ వర్గాలు వివరించాయి.

సందట్లో సడేమియా అన్నట్లు ప్రైవేటు ట్రావెల్స్ అందిన కాడికి దండుకుంటున్నాయి. రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల రద్దీ అధికంగా కనిపిస్తోంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అయితే మరీనూ.. రైలు బోగీల్లో స్థలం లేకపోవడంతో డోర్‌మెట్లపై నిల్చుని ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణంచాల్సి వస్తోంది.

ఎయిర్ లైన్స్ సంక్రాంతి దోపిడి

ప్రయాణికుల జేబులు కొల్లగొట్టేందుకు విమానయాన సంస్థలు కూడా పోటీపడుతున్నాయి. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం టికెట్ రూ.18 వేలకు పెరిగింది. ఇక విజయవాడ వెళ్లాలంటే రూ. 12,931 చెల్లించుకోవాల్సిందే. హైదరాబాద్ ఎయిర్ పోర్టుల్లో విశాఖ, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి కౌంటర్లు చాలా బిజీగా కనిపిస్తున్నాయి. ధరలు ఆకాశాన్ని అంటుతున్నా పలువురు ప్రయాణానికి మొగ్గు చూపుతుండటం, ప్రైవేటు ఎయిర్ లైన్స్ సంస్థలు డైనమిక్ ప్రైసింగ్ విధానానికి తెర తీశాయి.

టోల్ ప్లాజాల వద్ద బారులు బారులు

యాదాద్రి చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో పంతంగి టోల్‌ప్లాజా వద్ద అరకిలో మీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు టోల్‌ప్లాజా వద్ద పది గేట్లు తెరచినా వాహనాల రద్దీ మాత్రం తగ్గడం లేదు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బోసిపోయిన భాగ్యనగరం

భాగ్యనగరం దాదాపు ఖాళీ అయింది. ఊళ్లకు వెళ్లే వారితో వారం రోజులుగా క్రిక్కిరిసిపోతున్న బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు శుక్ర, శనివారం రెండురోజులూ జాతరను తలపించాయి. పండుగ సమయం దగ్గర పడడంతో ఇళ్లకు వెళ్లే వారి సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. దీంతో హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు నడుస్తున్న 3500 రెగ్యులర్ బస్సులకు అదనంగా మరో 3650 ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. కొందరు పండుగ రద్దీని తట్టుకోలేక సొంత వాహనాలను ఆశ్రయిస్తున్నారు. నాలుగు రోజుల నుంచి ఇప్పటి వరకు 20 లక్షల మందికి పైగా పల్లెబాట పట్టారు. మరో ఐదు లక్షలమంది సొంతూళ్లకు వెళ్లే అవకాశం ఉంది.



పారాహుషార్

సంక్రాంతి పండగ వేళ పట్టణం పల్లె బాట పట్టిన నేపథ్యంలో హైదరాబాద్‌తో సహా జిల్లాల పోలీసులంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గడచిన రెండు రోజులుగా పట్నం నుంచి పల్లెలకు వాహనాలు బారులు తీరడంతో చాలా చోట్ల రహదారులు రద్దీగా మారాయి. అనేక చోట్ల గంటల కొద్దీ రద్దీ నెలకొంది. పలు చోట్ల టోల్ గేట్ల వద్ద పోలీసులు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తున్నారు. శనివారం సాయంత్రం నుంచి రద్దీ పెరగడంతో కొన్ని టోల్‌గేట్ల వద్ద టోల్ వసూలును నిలిపి వేశారు. పండుగ కోసం ఇళ్ళకు తాళాలు వేసి ఉండటంతో దొంగలు విజృంభించే ప్రమాదం నెలకొన్నందున గస్తీని తీవ్రం చేయాలని ఆదేశించారు. శని, ఆదివారాలలో కొంత మంది సీనియర్ పోలీసు అధికారులు జిల్లాల యంత్రాంగంతో మాట్లాడి పలు సూచనలను చేశారు. హైదరాబాద్‌లోని కాలనీలలో రాత్రి పూట తిరిగే వాచ్‌మన్‌లకు సూచనలు చేయడంతో పాటు సిసి కెమెరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని, తాళం వేసి ఉన్న ఇంటి పక్కన ఉన్న వారిని కూడా అప్రమత్తం చేయాలని సూచించారు. రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లలోనూ నేరస్థుల కదలికలపై నిఘా పెట్టాలని, బస్సులలో వెళ్ళే వారిపై కూడా కన్నేసి ఉంచాలని సూచించారు. పల్లెల్లో పండగ సందడి నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని, కోడి పందాలు, పేకాట తదితర వాటిపై నిఘాను పెట్టాలని సూచించారు. ఇదే సమయంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు చోటు ఇవ్వరాదని పేర్కొన్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రమాదరహిత ప్రయాణానికి దోహదపడేలా చూడాలని సూచించారు.

ఎంపీటీసీ ఉప ఎన్నికలో తెరాస జయభేరి

16 స్థానాల్లో పది కైవసం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రవ్యాప్తంగా పలుజిల్లాల్లో ఖాళీగా ఉన్న మండల ప్రాదేశిక నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ హవా కొనసాగింది. మొత్తం 16ప్రాదేశిక నియోజకవర్గాలకు రెండు రోజుల క్రితం ఉప ఎన్నికలు జరగ్గా, శనివారం ఫలితాలు వెల్లడయ్యాయి. పది స్థానాల్లో టిఆర్ఎస్ భారీమెజారిటీతో జయభేరి మోగించింది. సిఎల్‌పి నేత జానారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని నిడమనూరు మండలం ఎర్రబెల్లి ఎంపిటిసిని టిఆర్ఎస్ 536ఓట్ల ఆధిక్యంతో కైవసం చేసుకుంది. మునుగోడు మండలం కిష్టాపురం ఎంపిటిసి స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లోనూ టిఆర్ఎస్ 520ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించింది. ఇవి రెండూ గతంలో కాంగ్రెస్ స్థానాలు కాగా, ఇపుడు టిఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూరు మండలం నేట్నూరు, కౌటాల మండలం కౌటాల స్థానాలను టిఆర్ఎస్ గెలుచుకుంది. సిరిసిల్ల జిల్లాలోని అంకుశాపూర్‌ను, భద్రాద్రి జిల్లాలోని భద్రాచలం-7, ఖమ్మం జిల్లాలోని జక్రేపల్లి స్థానాలను. మహబూబ్‌నగర్ జిల్లా నర్వ మండలం కన్మనూర్ స్థానాన్ని, రంగారెడ్డి జిల్లా శంకరపల్లి స్థానాన్ని టిఆర్ఎస్ గెలుచుకుంది. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గంగాధరను, కామారెడ్డి జిల్లా మద్నూరు స్థానాలను బిజెపి కైవసం చేసుకుంది. గంగాధర మండలం అచ్చంపల్లి స్థానాన్ని, సిద్ధిపేట జిల్లా జనగామ నియోజకవర్గంలోని చేర్యాల మండలం ఆకునూరు స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మండలం లింగంపల్లి, రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ స్థానాలను ఇండిపెండెంట్‌లు గెలుచుకున్నారు. మెజారిటీ స్థానాలను టిఆర్ఎస్ కైవసం చేసుకోవడం పట్ల ఆయా జిల్లాల్లో టిఆర్ఎస్ కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. నల్లగొండలో మంత్రి జగదీష్‌రెడ్డి, ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సిరిసిల్ల జిల్లాలో మంత్రి కెటిఆర్ క్లీన్ స్వీప్‌చేశారు.

గంగాధర, ఆచంపల్లిలో టీఆర్ఎస్‌కు షాక్

కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో : కరీంనగర్ జిల్లా, చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని గంగాధర, ఆచంపల్లి ఎంపీటీసీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో రెండు చోట్ల టీఆర్ఎస్ అభ్యర్థులు పరాజయం పాలయ్యారు. గంగాధర నుంచి బీజేపీ అభ్యర్థి పెరుక శ్రవణ్ 1,252 ఓట్ల మెజారిటీతో గెలుపొందగా, ఆచంపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్ 734 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రెండు చోట్ల ప్రతిపక్షాలు భారీ మెజారిటీని సొంతం చేసుకున్నాయి. రెండు ఎంపీటీ స్థానాలలో టీఆర్ఎస్ అభ్యర్థులకు గెలిచిన అభ్యర్థులకు వచ్చిన ఓట్లలో సగం కూడ రాలేకపోయాయి.

గులాబీ కోటలో కమల వికాసం

రెండు ఎంపీటీసీ స్థానాలు బీజేపీ వశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గులాబీ కోటలో కమలం విరభూసింది. మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో జరిగిన ఎంపీటీసీ ఉపఎన్నికల్లో రెండు స్థానాలను అత్యంత భారీ మెజార్టీతో విజయాన్ని దక్కించుకుంది. కొత్త సంవత్సరంలో ఇది నూతన ఉత్సాహాన్ని ఇస్తోందని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె. లక్ష్మణ్ వ్యాఖ్యానించారు.

గెలిచిన ఇద్దరు అభ్యర్థులను పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తరలివచ్చిన పార్టీ నేతలను ఉద్దేశించి లక్ష్మణ్ మాట్లాడుతూ, అధికార పార్టీ ప్రలోభాలు, ఒత్తిళ్ళకు లొంగకుండా భాజపా అభ్యర్థుల విజయం కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల్లో గెలవడానికి అధికార తెరాస తెరచాటుగా ఎన్ని ప్రయత్నాలు చేయాలో...అన్నీ చేసిందన్నారు. కానీ పార్టీ అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ధైరంగా బరిలో ఉండి భాజాపా పతాకాన్ని ఎగరవేయడం సరికొత్త ఉత్సవాన్ని ఇస్తోందన్నారు. ఇదే స్ఫూర్తి...ఉత్సాహంతో వచ్చే ఎన్నికల్లో పనిచేస్తే రాష్ట్రంలో అధికారం కూడా మనదేనన్నారు. రాష్ట్ర ప్రజలకు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ పండుగ ప్రజలందరికి మంచి జరగాలని అభిలాషించారు.

సిద్దిపేటలో కాంగ్రెస్ విజయం

ఉప ఎన్నికల్లో రెండు స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్

ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు సొంత జిల్లాలో జరిగిన ఎంపీటీసీ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించారు. అదే విధంగా తెలంగాణ ఉద్యమానికి మొదటి నుంచి కంచుకోటగా ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కూడా కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ గెలుపొందడం విశేషం. సిద్దిపేట జిల్లాలోని చెర్యాల మండలం ఆకునూరి గ్రామంలో ఎంపీటీసీ -1కు జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన తాటికొండ వేణుగోపాల్ 95 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండలంలోని అచ్చంపల్లిలో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిపై 734 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి కె. మనోహర్ విజయం సాధించారు.

సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్లలో ఏర్పాట్లను పరిశీలించిన రైల్వే జీఎం

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఏర్పాటు చేసిన అదనపు సౌకర్యాలను వివిధ రైల్వే స్టేషన్లలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ శనివారం పరిశీలించారు. సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లను అయన తనిఖీ చేశారు. అధికారులు, ప్రయాణికులతో ఏర్పాట్లపై మాట్లాడారు. బుకింగ్ కౌంటర్, క్యాటరింగ్ స్టాల్స్, స్టేషన్ పరిసరాల్లో పరిశుభ్రత పరిశీలించడంతో పాటు విశాఖ, బెంగుళూరు తదితర ప్రాంతాలకు ప్రత్యేకంగా నడిపిస్తున్న రైళ్లలో తిరిగి సౌకర్యాలపై ప్రయాణికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగని విధంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక రైళ్ల గురించి ఎప్పటికప్పుడు అనౌన్స్‌మెంట్లు ఉండాలని, ప్రయాణికుల భద్రత విషయంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, రద్దీని క్రమబద్ధీకరించడానికి అదనపు సిబ్బందిని వినియోగించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక రైళ్ల ఏర్పాటు, అడ్వాన్స్ బుకింగ్స్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.



మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో స్వగ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణికుల పాట్లు



భాగ్యనగరంలో బోసిపోయిన హైటెక్ సిటీ కూడలి



సూర్యాపేట జిల్లా కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల బారులు

సీఎంతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కొత్తగా తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ సభ్యులు విద్యాసాగర్, రాంబాబు నాయక్, నీలాదేవి, దేవయ్య, నర్సింహ తదితరులు శనివారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. తమపై నమ్మకంతో కీలకమైన బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

భారత్‌కు ఐరాస ప్రశంసలు

జెనీవా: వాతావరణ మార్పులపై భారత్-చైనా దేశాల అంకితభావాన్ని ఐక్యరాజ్య సమితి ప్రశంసించింది. ప్రపంచ దేశాలు విఫలమైన చోట, ఈ రెండు దేశాలు మార్గదర్శకంగా నిలిచాయని, ప్యారిస్ ఒప్పందానికి నాయకత్వం వహిస్తూ ముందుకు వెళ్తున్నాయని కొనియాడింది. 'ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పర్యావరణ మార్పులకు ఆఫ్రికా దేశాలు తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటున్నాయి. మిగతా వారికంటే ఈ దేశాలే బాధితులుగా ఉన్నాయి. భారత్-చైనా దృఢ సంకల్పం అభినందనీయం. ఈ యుద్ధాన్ని ఎదుర్కోలేకుంటే, వాతావరణ మార్పులను ఓడించడం అసాధ్యం' అని జీ77 వేడుకసందర్భంగా ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనా గట్టర్స్ వ్యాఖ్యానించారు. జీ77 దేశాలే ప్రధాన బాధితులు. చాలా మటుకు కరవు కాటకాలు తాండవిస్తున్నాయి. దీవుల్లో సముద్ర నీటిమట్టం పెరిగి హరికేన్ వంటి ఉత్పాతాలు ఏర్పడుతున్నాయి. ఈ విషయంలో ఇండియా-చైనాలు మార్గదర్శకులుగా నిలుస్తున్నాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితిలో జీ77 అతిపెద్ద అంతర్జాతీయ ఆర్గనైజేషన్. ఇది 1964 జూన్ 15 ఏర్పడింది. ప్రస్తుతం ఇందులో భారత్ సహా 134 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. కార్బన్ ఉద్గారాల ఉత్పత్తిలో ప్రపంచంలో మూడో స్థానంలో జీ 77 ఉంది. కాగా, పారిస్ ఒప్పందాన్ని అమెరికా నిర్ద్వందంగా వ్యతిరేకించింది. ఇది ఎంతమాత్రం తమకు ఆమోదయోగ్యం కాదంది. వాణిజ్యం, ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం చూపే ఒప్పందాన్ని స్వాగతించే ప్రసక్తే లేదని అగ్రరాజ్యం తేల్చిచెప్పిన సంగతి విదితమే.

వృద్ధతరం విలవిల..!

(మొదటిపేజీ తరువాయి)

మెరగవడంతో భర్తతో కలసి జంట జీవితం కొనసాగించాలన్న దృక్పథం చోటుచేసుకుంది. పిల్లల్ని కనడం అదనపు బాధ్యతగా భావించడం మొదలైంది. వీటితో పాటు పరిస్థితులు, వాతావరణం, పెరిగిన ఒత్తిడి, ఆరోగ్య సమస్యలు కూడా దేశంలో వృంధ్యత్వం పెరిగేందుకు కారణమయ్యాయి.

ఈ నేపథ్యంలో భారత్‌లో నిరాదరణకు గురవుతున్న వృద్ధుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. ఇటీవలె గ్లోబల్ ఏజ్ వాచ్ ఇండెక్స్ ప్రపంచ వ్యాప్తంగా 96దేశాల్లో వృద్ధుల సామాజిక పరిస్థితులపై అధ్యయనం నిర్వహించింది. వృద్ధులకు తగిన సామాజిక భద్రత నివ్వడంలో భారత్ 71వ స్థానంలో నిల్చింది. ఈ విషయంలో బ్రెజిల్ 31, చైనా 35, శ్రీలంక 36 స్థానాల్లో భారత్‌కంటే ముందున్నాయి. ఇప్పటికే భారత్‌లో 60ఏళ్ళు పైబడి ఒంటరిగా జీవిస్తున్న వృద్ధ తల్లిదండ్రులు 10.53కోట్లకు చేరారు. 2020నాటికి దేశ జనాభాలో వీరి సంఖ్య 12శాతం ఉంటుందని అంచనాలేస్తున్నారు. భవిష్యత్‌లో భారత్‌లో ఇదొక పెద్ద సమస్యగా మారనుంది. ఇలా ఒంటరిగా జీవిస్తున్న 60ఏళ్ళ పైబడ్డ వృద్ధ జంటల్లో 81శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో ఉంటే 19శాతం మంది పట్టణాలు, నగరాల్లో ఉంటున్నారు. గ్రామాల్లో ఉంటున్న ఈ వృద్ధుల్లో 43శాతం మంది ఎలాంటి ఆర్థిక ఆసరాకు నోచుకోవడం లేదు. పైగా వీరిలో 73శాతం మంది నిరక్షరాశ్యులుగా ఉన్నారు. కేవలం 11.5శాతం మందికే ప్రభుత్వం నుంచి సామాజిక భద్రతా పథకాలు అందు తున్నాయి. వీరిలో 73శాతం మంది గుండె సంబంధిత రోగాలతోనే చనిపోతున్నారు. ఇందులో 53శాతం మంది మంచంపై పడరానిపాట్లు పడ్డ అనంతరం మృత్యువుకు చేరువవుతున్నారు.



ఇప్పుడు భారత్‌కు ఒంటరి తనం కూడా ఓ పెద్ద సమస్యగా పరిణమిస్తోంది. ఇటీవలె భారత ఎన్నికల కమిషన్ మాజీ ముఖ్య ప్రణాళికాధికారి టిఎన్ శేషన్ భార్యతో సహా వృద్ధాశ్రమంలో చేరారు. ఆయన ఈ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓ కుదుపుతెచ్చిన పెద్దస్థాయి అధికారి. అప్పటివరకు భారతీయులకు ఎన్నికల నిర్వహణ సంఘం అనే ప్రత్యేక ప్రతిపత్తి కలిగిన సంస్థ ఉన్నట్లు కూడా పెద్దగా తెలీదు. దానికి ఇన్ని అధికారాలు ఉంటాయని సాక్షాత్తు ఆ సంఘంలోని ఉద్యోగులు, సిబ్బందికి కూడా అవగాహనలేదు. అలాంటి సమయంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శేషన్ ప్రజాస్వామ్య వ్యవస్థతో పాటు ఎన్నికల నిర్వహణలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. భారత రాష్ట్రపతి పదవికి కూడా ఆయన పోటీ చేశారు. ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థాయిలోనే ఉన్న శేషన్ దంపతులకు పిల్లల్లేరు. సమీప బంధువులెవరూ అందుబాటులో లేరు. దీంతో అదే వయసువారితో కలిసుండడం ద్వారా సామాజిక భద్రత ఏర్పడుతుందన్న లక్ష్యంతో ఆయన భార్యతో కలసి వృద్ధాశ్రమంలో చేరిపోయారు. ఇటీవలె ముంబైకు చెందిన ఓ వృద్ధజంట తమకు చనిపోయే అవకాశాన్ని కల్పించమంటూ భారత రాష్ట్రపతికి వినతిపత్రం పంపించింది. ముంబైకు చెందిన నారాయణ్‌లవాటే, ఐరావతి వృద్ధ దంపతులు ఇద్దరూ మంచి ఆరోగ్యంగా ఉన్నారు. ఎలాంటి అనారోగ్య, ఆర్థిక, సామాజిక సమస్యల్లేవు. ఇద్దరూ కూడా ప్రభుత్వోద్యోగాలు చేసి రిటైరయ్యారు. ఇద్దరికీ ప్రభుత్వం నుంచి పెన్షన్ వస్తోంది. కానీ వారికి సమీప బంధువులంటూ ఎవరూ లేరు. వారికి పిల్లలు పుట్టలేదు. వారి తోబుట్టువులు చనిపోయారు. దీంతో వీరిద్దరే ఉన్నారు. ఈ ఒంటరితనాన్ని వారు భరించలేక పోతున్నారు. మరింత వృద్ధులయ్యాక శారీరక, అనారోగ్య సమస్యలు మొదలైతే ఒకరికొకరు సేవ చేసుకునే అవకాశం కూడా ఉండదన్న భయం వారిని ఆవహించింది. అందుకే తమకు ఇక బతకాలని లేదు.. భగవంతుడు నిర్దేశించిన విద్యుక్త ధర్మాలన్నింటిని సక్రమంగా పూర్తి చేసినందున చట్టబద్ధంగా చనిపోయే అవకాశాన్ని తమకు కల్పించాలంటూ వారు భారత రాష్ట్రపతికి విన్నవించుకున్నారు. స్విట్జర్లాండ్‌లో ఇలా ఇష్టపూర్వకంగా చనిపోవాలనుకున్న వారి కోసం డిగ్నిటాస్ అనే సంస్థ ఉంది. అయితే స్విట్జర్లాండ్‌కు వెళ్లేందుకు ఆర్థిక స్తోమతున్నా వీరిద్దరికీ పాస్‌పోర్టులు లేకపోవడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు రాష్ట్రపతికి వివరించారు.

ఇలాంటి సంఘటనలు భారతీయ వృద్ధతరంలో ఏర్పడుతున్న భయాందోళనలకు అద్దంపడుతున్నాయి. ఉమ్మడి కుటుంబాలున్న రోజుల్లో వృద్ధతరానికి సామాజిక భద్రత ఉండేది. యువతరానికి దిశానిర్దేశంగా ఉండేవారు. ఉపాధి పేరిట పట్టణీకరణకు ఆకర్షితులు కావడం, చాలీచాలని జీతాలతో సరిపడని గదుల్లో కాలం వెళ్ళదీయాల్సి రావడం, అక్కడికి తల్లిదండ్రుల్ని తీసుకెళ్ళే స్తోమత, పరిస్థితులు లేకపోవడం, ఒకవేళ ఉన్నా అత్తాకోడళ్ళ మధ్య సఖ్యత లోపించడం, పిల్లల్ని కనేందుకు మహిళల్లో మక్కువ కొరవడ్డం వంటి అంశాలు ఈ పరిస్థితికి దారితీస్తున్నాయి. భవిష్యత్‌లో భారత్‌కు ఇదొక పెద్ద ప్రమాదసూచికయ్యే అవకాశముందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

ఎంఎస్ఇలు ఖాయిలా పడనీకండి

- బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించండి
- ముద్రా రుణ మేళాలు ఏర్పాటు చేయండి
- ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించండి
- జిల్లా కలెక్టర్లతో మంత్రి కేటీఆర్ వీడియోకాన్ఫరెన్స్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు (ఎంఎస్ఇ) ఖాయిలా పడకుండా వాటికున్న సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని పరిశ్రమ లశాఖ మంత్రి కేటీ రామారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా స్థాయిలో కూడా బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి పరిశ్రమలకు సకాలంలో రుణాలు ఇచ్చేలా చర్యలు తీసు కోవాలని సూచించారు. రుణాలు చెల్లింపుల్లో ఆలస్యమైతే వాటిని ఖాయిలా యూనిట్లుగా ప్రకటించకుండా బ్యాంకర్లతో మాట్లాడి వాటిని పునరుద్ధరించేవిధంగా కృషి చేయాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, గనులశాఖపై శనివారం జిల్లా కలెక్టర్లతో ఆయన వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ పరిశ్రమలు ఖాయిలా పడకుండా వాటిని ఆదుకునే అంశంపై గురువారం రాష్ట్రస్థాయి బ్యాంకర్లతో జరిపిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో కేటీఆర్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరం కనీసం రెండుసార్లు ముద్రా రుణాల మేళాలు నిర్వహించాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. గనుల శాఖపై శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్షించి తీసుకున్న నిర్ణయాలపై కలెక్టర్లతో చర్చించారు. అక్రమ మైనింగ్, అక్రమ ఇసుక రవాణాపై కలెక్టర్లు దృష్టి సారించి కఠినంగా వ్యవహ రించాలని కేటీఆర్ స్పష్టంచేశారు. ప్రభుత్వ విధానాలతో గత దశాబ్దకాలంగా గత ప్రభుత్వాల్లో వచ్చిన ఆదాయం కన్నా అనేక రెట్లు ప్రస్తుతం ప్రభుత్వ ఖజానాకు చేరుతుందని ఆయన చెప్పారు. సాధారణ ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం తాజాగా ఇ-సేవా కేంద్రాల ద్వారా ఇసుక కోసం నమోదు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని మంత్రి సూచించారు. ప్రభుత్వానికి ఆదాయం, ప్రజలకు అందుబాటులో ఇసుక అనే రెండు ప్రధాన అంశాలపై ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇప్పటికే గద్వాల, పెద్దపల్లి, మహబూబ్‌నగర్‌లాంటి జిల్లాల్లో ఇసుక రవాణాలో జిల్లాల కలెక్టర్లు అద్భుతమైన కార్యక్రమాలు చేపట్టారని, వాటిని ఇతర జిల్లాల కలెక్టర్లు అమలు చేయాలని కేటీఆర్ సూచించారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు రాష్ట్ర డీజీపీ ప్రత్యేకంగా మరోసారి సమావేశమవుతారని కలెక్టర్లకు ఆయన చెప్పారు. దీంతోపాటు ప్రతి జిల్లాలోని మినరల్ ఫౌండేషన్ గవర్నింగ్ కౌన్సిళ్ళను ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. డిఎంఎఫ్‌కు అందుబాటులో ఉన్న నిధులను ఖర్చు చేసేందుకు ప్రభుత్వం త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేస్తుందని, ఈ పనుల ద్వారా మైనింగ్ జరిగే ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చునని కేటీఆర్ చెప్పారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై కొరడా



- అక్రమాలకు పాల్పడితే పీడీ చట్టం
- నెలరోజుల్లోగా పేర్లు నమోదు చేసుకోండి
- ఉన్నతాధికారులతో మంత్రి కేటీఆర్ సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ : విదేశాలకు బతుకు దెరువుకోసం వెళ్ళేవారిని మోసం చేస్తున్న నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. నకిలీ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఎన్ఆర్ఐశాఖ మంత్రి కేటీ రామారావు అధికారులను ఆదేశించారు. ఎన్ఆర్ఐశాఖ పనితీరుపై హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డితో కలిసి శనివారం సమీక్షించారు.

గత వారం ఢిల్లీలో విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చర్చించిన అంశా లు, రాష్ట్రస్థాయిలో వాటిని అమలు చేసేందుకు తీసుకో వలసిన నిర్ణయాలపై ఈ సమావేశంలో సమీక్షించారు. అక్రమ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకు నేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కేటీ రామారావు అధికారులను కేటీఆర్ ఆదేశిం చారు. గల్ఫ్ దేశాలకు మహిళల అక్రమ రవాణాపై మరింత కఠినంగా వ్యవహ రించాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో మైనారిటీ సంక్షేమ, కార్మిక, ఎన్ఆర్ఐ, పోలీస్ శాఖలు ఉమ్మడి బృందాల ఏర్పాటుతో మహిళల అక్రమ రవాణాను నియంత్రిం చాలని కేటీఆర్ చెప్పారు. ఈ విషయంలో పోలీస్ శాఖ గత కొంతకాలంగా కఠినంగా వ్యవహ రిస్తూ మహిళలను రక్షిస్తున్నారని, పోలీసులు తీసుకుంటున్న చర్యల ను కేటీఆర్ అభినందించారు.

హోంమంత్రిత్వ శాఖ ఎమిగ్రేట్‌లో పేర్లు నమోదు చేసుకునేందుకు ఏజెంట్లకు నెల రోజుల సమయం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల రోజుల్లోగా నమోదు చేసుకోని వారందరినీ అక్రమ ఏజెంట్లుగా గుర్తిస్తామని ఆయన హెచ్చరించారు. అక్రమ ఏజెంట్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, ప్రభుత్వ హెచ్చరికలు ఖాతారు చేయకుండా పదేపదే వీసాల మోసాలకు పాల్పడే నకిలీ ఏజెంట్లపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని పోలీసులను మంత్రి ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ఐఆర్‌లు, వసల కార్మికుల కోసం చేపడుతున్న చర్యలను, ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని కేటీఆర్ సూచించారు.

సురక్షితంగా వెళ్ళండి, సుశిక్షితులై వెళ్ళండి అనే కేంద్ర ప్రభుత్వ విదేశాంగశాఖ నినాదానికి అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వ టామ్ కాం కంపెనీ ద్వారా చట్టపరంగా విదేశాలకు వెళ్ళాలన్నారు. దీంతోపాటు రాష్ట్రంలో ఉన్న రిజిస్టర్డ్ ఏజెంట్ల ద్వారానే వెళ్ళాలని మంత్రులు కోరారు. హైదరాబాద్‌లో విదేశీ భవన్‌కు ఫిబ్రవరి రెండోవారంలో శంకుస్థాపన చేయనున్నట్లు కేటీఆర్ తెలిపారు. దీనికి సంబంధించి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఎన్ఆర్ఐ శాఖాధికారులకు ఆదేశిం చారు. నకిలీ ఏజెంట్లపైన చర్యలు తీసుకుంటామని, ఇందుకు సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేస్తామని రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేది, ఎన్ఆర్ఐ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేటీఆర్ విదేశీ పర్యటన

- దావోస్ ఎకనమిక్ ఫోరంలో ప్రసంగం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు నేటినుంచి ఈనెల 14 నుంచి నాలుగు రోజులపాటు విదేశీ పర్యటనకు వెళ్ళనున్నారు. దావోస్ లో జరగనున్న ఎకన మిక్ ఫోరంలో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొనేం దుకు వెళ్ళనున్న మంత్రి రాష్ట్రానికి పెట్టు బడులు రాబట్టేందుకు వివిధ దేశాల్లో పర్యటి స్తారు. దక్షిణ కొరియా, డెన్మార్క్, దావోస్, యూఏఈలో మంత్రి పర్యటించి అక్కడి పారిశ్రా మిక వేత్తలతో సమావేశం అవుతారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం వివిధ కంపెనీలు, సంస్థలతో పలు ఒప్పందాలు చేసుకోనుంది.

విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై ఆధారాలుంటే కోర్టుకెళ్లండి

- జైలుకు వెళ్లినవారు నీతి గురించి మాట్లాడతారా
- మీడియాతో ఇష్టాగోష్టిలో కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: విద్యుత్ కొనుగోళ్ళలో అక్రమాలకు సంబంధించిన ఆధారాలు ఉంటే ప్రతిపక్షాలు కోర్టులో ఫిర్యాదు చేసుకోవచ్చునని పరిశ్ర మలశాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. జైలుకు వెళ్ళి వచ్చిన వారు కూడా నీతి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. జైలులో చిప్పకూడు తిన్నవారు కూడా అవినీతి గురించి మాట్లాడితే స్పం దించాల్సిన అవసరం తనకు లేదని ఆయన అన్నారు. శనివారం సచివాలయంలో మీడియాతో ఆయన కొద్దిసేపు ఇష్టాగోష్టిగా మాట్లా డారు. విద్యుత్ కొను గోళ్ళు, పంచాయతీరాజ్ చట్టం తదితర అంశాలపై ఆయన మాట్లాడారు.

ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా, సాగునీరు, పెట్టుబడి సాయం అందించే పథకాలతో ప్రతిపక్షాలు భయ పడుతున్నాయని ఆయన అన్నారు. ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోం దంటూ ప్రతిపక్షాలు అదేపనిగా ఆరోపణలు చేస్తున్నా యని కేటీఆర్ మండిపడ్డారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలను శాసనసభలో చర్చిద్దామంటే పారిపోతా రని, సభ బయట రచ్చ చేస్తారని ఆయన ధ్వజమెత్తారు. పంచాయతీరాజ్ చట్టంపై పూర్తి స్థాయిలో చర్చ జరుగుతోందని, స్థానిక సంస్థలను బలోపేతం చేసే విధంగా అధికారాలు, నిధులు బదలాయించేలా ముసాయిదా రూపొంది స్తున్నట్లు ఆయన చెప్పారు. మంత్రివర్గ ఉపసంఘం గత వారం రోజులుగా సమ గ్రంగా చర్చిస్తుందని, ప్రజలకు ప్రయోజనం కలిగే విధంగా చట్టాన్ని రూపొందించ నున్నట్లు కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు దేశ, విదేశీ సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు.

దేశం లోనే అతిపెద్ద ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తున్నా మని, దీనిద్వారా వేలాది మందికి ఉపాధి కలుగు తుందని మంత్రి చెప్పారు. పర్యావరణ అనుమతులు రాగానే ఫార్మాసిటీ పనులు ప్రారంభి స్తామన్నారు. పారిశ్రామికవేత్తలతో పెట్టుబడుల సమీకరణ, ఒప్పందాలు ఉంటాయన్నారు.



12గంటలు సరిపోతే తీర్మానాలు చేయండి

వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : రాష్ట్రంలోని రైతులకు 12 గంటల ఉచిత విద్యుత్ సరిపోతుందని అనుకుంటే గ్రామ పంచాయతీల వారిగా తీర్మాణం చేసి ఇవ్వాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. సభలో పాలకుర్తి శాసన సభ్యులు ఎర్రబెల్లి దయార్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నదని, ప్రస్తుతం 12 గంటలు సరి పోతుందని కాళేశ్వరం నీళ్లు వచ్చిన తర్వాత 24 గంటలు ఇవ్వాలని పేర్కొన్నారు. 24 గంటలు ఇవ్వడం వలన భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని దీన్ని దృష్టిలో పెట్టుకుని 12 గంటలు సరిపోతుందన్నారు. దీన్తై స్పం దించిన మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ 12 గంటలు సరిపోతుం దని రైతులు భావిస్తే గ్రామాల వారిగా తీర్మానాలు చేసి సంబంధిత ఎమ్మెల్యేలకు అందజేయా లన్నారు. భూగర్భ జలాలు తక్కువగా ఉన్నాయి.. 12 గంటలు సరిపోతుందని అనుకుంటే ఆయా గ్రామాలకు 12 గంటలు మాత్రమే సరఫరా చేస్తామని అన్నారు. సంబంధిత గ్రామాలు తీర్మానం చేసి ఎమ్మెల్యేలకు ఇస్తే వారు సబ్‌స్టేషన్ల వారిగా 12 గంటలు అవసరం ఉంటే ఆ మేరకే విద్యుత్ సరఫరా చేస్తారని స్పష్టం చేశారు.

క్షయ రోగులకు నెలకి రూ.500!

న్యూఢిల్లీ: 2025 నాటికి టీబీ వ్యాధిని నిర్మూలించాలని కేంద్రప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధంచేస్తోంది. టీబీ రోగులకు పౌష్టికాహారం, ప్రయాణ ఖర్చుల నిమిత్తం ప్రతినెలా ఆర్థిక సాయం అందించాలని యోచిస్తోంది. వచ్చే బడ్జెట్‌లో ఈమేరకు స్పష్టమైన విధివిధానాలను ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కేంద్ర వైద్యఆరోగ్య శాఖ సమాచారం ప్రకారం, వ్యాధి నయం అయ్యేవరకు టీబీ రోగులకు నెలకి రూ. 500 చొప్పున సాయం అందిస్తారు. రోగుల ఆర్థిక స్థితిగతులతో పనిలేకుండా ఈ మేరకు సహాయం అందిస్తారు. దాదాపు 25 లక్షల మంది లబ్ధిదారులున్నట్లు అంచనా వేస్తున్నారు.

ట్రంప్‌పై ఆఫ్రికన్లు ఫైర్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోటి దురుసు ప్రవర్తపై ఆఫ్రికా దేశాలు భగ్గుమన్నాయి. తమను మురికి, అశాంతికి నిలయాలుగా పేర్కొనడాన్ని తప్పుబట్టాయి. ట్రంప్ జాతివివక్ష, అవివేక కామెంట్లపై 55 ఆఫ్రికన్ దేశాల యూనియన్ తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఈ వ్యాఖ్యలకు ఆయన క్షమాపణలు చెప్పాలని సదరు దేశాలకు చెందిన ఐరాస ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. ఇవి ముమ్మాటికీ జాతి వివక్ష వ్యాఖ్యలేనని అత్యవసర సమావేశంలో సభ్యదేశాలు ఏకగ్రీవంగా పేర్కొన్నాయి.

మూడురోజులు.. ఐదు జిల్లాలు

- నాలుగు ప్రాజెక్టులు.. పది బహిరంగ సభలు
- మంత్రి హరీశ్ సుడిగాలి పర్యటనలు
- క్యాడర్‌లో నూతనోత్తేజం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అభివృద్ధి పనుల శంఖుస్థాపనల్లో పాల్గొంటూనే.. రాష్ట్రనీటిపారుదల శాఖా మంత్రి గత మూడురోజుల్లో పది బహిరంగసభల్లో పాల్గొని విపక్షాలపై పదునైన దాడిచేశారు. అధికారులను పనుల పేరుతో పరుగెత్తించడంతో పాటు సభల ద్వారా కార్యకర్తల్లో ఉత్సాహం కలిగించారు. ఉత్తేజభరిత ప్రసంగాలతో.. ఆకట్టుకున్నారు. ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగవచ్చన్న ఊహాగానాల నేపథ్యంలో మంత్రి హరీష్ పర్యటన ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పార్టీ క్యాడర్‌కు ఉత్సాహాన్నిచ్చింది. తన పర్యటన సందర్భంగా నిర్వహించిన సభలను ఎన్నికల ప్రచారసభలుగా మంత్రి వినియోగించుకున్నారని.. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు తరలివచ్చిన తీరు, వ్యక్తమైన ఉత్సాహం అన్నీ ఎన్నికల వాతావరణాన్ని తలపించాయని పార్టీ ముఖ్యులే చెబుతున్నారు. తన పర్యటన సందర్భంగా పలు నియోజకవర్గాల్లో నేతల మధ్య ఉన్న పొరపొచ్చాలను కూడా మంత్రి తొలగించే ప్రయత్నం చేశారు. గురువారం ఉదయం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొదలైన పర్యటన శనివారం వరంగల్‌తో ముగిసింది. మార్కెటింగ్, నీటిపారుదల శాఖల కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూనే, సభలను వినియోగించుకుని ప్రతిపక్షాలపై విరుచుకుపడిన తీరు టిఆర్ఎస్ క్యాడర్‌ను ఉత్తేజపరిచింది. కరెంట్ సరఫరా కాంగ్రెస్ హయాంలో ఎలా జరిగిందో.. టిఆర్ఎస్ హయాంలో ఎలా జరిగిందో రైతుల మధ్యకు వచ్చి అడిగితే తెలుస్తుందంటూ విపక్షాలను ప్రజల మధ్యే ఉండి కార్నర్ చేశారు. ప్రభుత్వ పథకాలను ఒక్కొక్కటిగా వివరిస్తూ.. ప్రజల నుండి వాటి తాలూకు స్పందనలను రాబట్టారు. కాంగ్రెస్ హయాంలో సాగునీటిరంగానికి జరిగిన అన్యాయం, ముఖ్యమంత్రి కెసిఆర్ ఆ నిర్లక్ష్యాన్ని సరిదిద్ది ప్రాజెక్టులు చేపట్టిన వైనం.. పనులను వెంటబడి చేస్తున్న పరిస్థితినీ కళ్ళకు కట్టారు. సిఎం కెసిఆర్‌ను నిండుమనసుతో ఆశీర్వదించాలని, బహిరంగసభలలో హరీష్ విజ్ఞప్తి చేయడం ఎన్నికల సభలను తలపించింది. పూర్వ వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి, పరకాల, డోర్నకల్, మహబూబాబాద్, వర్ధన్నపేట, వరంగల్ అర్బన్, వరంగల్‌రూరల్, ఖమ్మం జిల్లాలోని పాలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతిచోటా బోనాలు, బతుకమ్మలు. పీరీలు, డప్పులు, కోలాటాలతో జనం నీరాజనాలు పలికారు. ఊపిరిసలపని కార్యక్రమాల్లో బిజీబిజీగా ఉంటూనే అక్కడి నేతలను ప్రశంసల జల్లులో ముంచారు.

కాకతీయ ఆధునీకరణకు వెయ్యి కోట్లు

- మంత్రి హరీశ్‌రావు

వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : రాష్ట్రంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద కాకతీయ కాలువల అధునీకరణ పనుల కోసం వెయ్యి కోట్ల రూపాయలను ఖర్చుచేస్తున్నట్లు రాష్ట్ర భారీనీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో శ్రీరాంసాగర్ ఆయకట్టు చివరి భూములకు నీరు అందించాలనే లక్ష్యంతో కాలువల ఆధునీకరణ, లైనింగ్ పనులు చేపడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నందున గతపాలకుల హయాంలో నిర్లక్ష్యానికి గురైన శ్రీరాంసాగర్ కాలువలను రాష్ట్ర ప్రభుత్వం అభవృద్ధి చేసేందుకు పునరుజ్జీవన కార్యక్రమం చేపట్టిందన్నారు. శనివారం నాడు వరంగల్ రూరల్ జిల్లాలోని పర్వతగిరి మండలకేంద్రంలోని రూ.125 కోట్లతో చేపట్టిన ఎస్సారెస్పీ కాలువ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి , రోడ్డు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హరీష్‌రావు మాట్లాడుతూ వచ్చే వానకాలం లో రాష్ట్రంలోని చెరువులు, కుంటలను నింపి రెండు పంటలకు సాగునీరు అందిస్తామ న్నారు. కాళేశ్వరం తొలి ఫలితం వర్ధ న్నపేట నియోజక వర్గానికే చెందు తుందన్నారు. ప్రాజెక్టు నుంచి ఎల్ఎం డీకి అక్కడి నుంచి ఎస్సారెస్పీ ప్రధాన కాలువ ద్వారా



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం శ్రీహరి, మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల తదితరులు

వర్ధన్నపేట నియోజకవర్గంలోని భూములను తడపను న్నామన్నారు. ప్రాజెక్టు పూర్తయితే నియోజకవర్గాల్లోని 50 వేల ఎకరాలకు అదనంగా సాగునీరు అందుతుందన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు మొదటి దశ క్రింద 40 వేల ఎకరాలు, రెండవ దశలో మరో పది ఎకరాలకు సాగునీరు అందుతుం దన్నారు. కాకతీయ ప్రధాన కాలువ ఆధునీ కరణ కోసం చేపట్టాల్సిన నిధులను పర్వతగిరిలోని రిజర్వాయర్‌కు ప్రత్యేకంగా కేటా యించా మన్నారు. ఎల్లమ్మకుంట రిజర్వాయర్ సామ ర్థ్యాన్ని పెంచేందుకు రూ. 26 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి చెప్పారు. తమ ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో గిడ్డంగుల నిర్మాణాలు చేపట్టిందన్నారు.

4 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గిడ్డంగులు మాత్రమే గతంలో అందు బాటులో ఉండగా ప్రస్తుతం 18 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని కల్పించే గిడ్డంగులు నిర్మాణం చేశామన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ తాను పుట్టిన పర్వతగిరి మండలాన్ని రాష్ట్రంలో అభివృద్ధిలో రోల్ మోడల్‌గా దిద్దుతానని హామీ ఇచ్చారు. రూ.150 కోట్ల అంచనాతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశామని చెప్పారు. పర్వతగిరి మండల కేంద్రంలోని రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.18 కోట్లు కేటాయించిందని, కాలువలు, కట్టల అభివృద్ధికి మరో రూ.26 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ వరంగల్ అభివృద్ధి పట్ల రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసు కుంటుందని అన్నారు. రాష్ట్రరాజధాని హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరమైన వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణతో ముందుకు సాగుతుం దన్నారు. రహదారులు, ఐటీ పరిశ్రమలు, టెక్స్ టైల్ పార్క్, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆరూరి రమేష్, చల్లా ధర్మారెడ్డి, ప్రభుత్వ విప్ పల్ల రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ గద్దల పద్మ, కార్పొరేషన్ల ఛైర్మన్‌లు కన్నెబోయిన రాజయ్య యాదవ్, వాసుదేవరెడ్డి, గుండు సుధారాణి, మేయర్ నన్నపునేని నరేందర్, కుడా ఛైర్మన్ మర్రి యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆకేరు వాగుపై రూ. 9.50 కోట్లతో నిర్మించిన వంతెనను మంత్రి తుమ్మల, రెండున్నర కోట్లతో నిర్మించిన చెక్ డ్యాంను మంత్రి హరీష్‌రావులు ప్రారంభించారు. పది కోట్లతో నిర్మించనున్న చింతనెక్కొండ రోడ్డుకు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు.

న్యాయానికి న్యాయం కావాలి

న్యాయదేవత సుప్రీంకోర్టు గడపదాటి బైటికొచ్చింది. న్యాయం కోసం అన్వేషణ మొదలుపెట్టింది. నలుగురు సీనియర్ జడ్జీలు చేసిన ప్రకటన కేవలం ఆ నలుగురి వ్యక్తి గత సమస్య కాదు. అదొక ఉమ్మడి అంశం. ఏకమొత్తంగా న్యాయ వ్యవస్థలోని లొసుగులకు అద్దం పట్టే సమస్య. ప్రజాస్వామ్యపు నాలుగు కీలక స్థంభాల్లో ఒకటైన జ్యుడిషియరీ ఒక్కటే ఇంతవరకు ఎక్కడా లేని గుంభనాన్ని పాటిస్తూ రాగలిగింది. లోలోన ఎన్ని అపప్రథలున్నా పైకి మాత్రం నిశ్చల సంద్రంలా..నిష్కల్మష నదిలా..యావజ్జాతి సమస్యలను దిగమింగే గంభీర సాగరంలా కనిపిస్తూ వచ్చింది. ఒకవంక ప్రభుత్వానికి, న్యాయవ్యవస్థకు మధ్య పోరాటం..కేంద్ర ప్రభుత్వానికి ఆధిపత్య పోరాటమైతే న్యాయవ్యవస్థది అస్థిత్వ పోరాటం. అదలా నిరంతరంగా సాగుతున్నా సామాన్యుడు మాత్రం న్యాయవ్యవస్థ మీద నమ్మకాన్ని సడలించుకోలేదు. దిగువ స్థాయి కోర్టుల నుంచి రాష్ట్రస్థాయి కోర్టుల దాకా..సుప్రీంకోర్టు దాకా పేరుకుపోతున్న కేసుల సంఖ్యే ఇందుకు ఉదాహరణ. కింది కోర్టుల్లో అన్యాయం జరిగితే ఎవ్వరూ న్యాయవ్యవస్థ మీద తిరుగుబాటు చేసిన సందర్భాలు లేవు. పైకోర్టుకెళ్లి తమకు అన్యాయం జరిగిందని మొరపెట్టుకుంటారే తప్ప న్యాయవ్యవస్థ వైపు గాని, న్యాయమూర్తుల వైపు గాని వేలెత్తి చూపరు. ఇదీ సగటు భారతీయుడు భారతీయ న్యాయవ్యవస్థ పైన పెంచుకున్న నమ్మకం. భారతీయ న్యాయవ్యవస్థకే సుప్రీం అయిన సుప్రీంకోర్టులోనూ అంచెలవారీగా పోరాడి ఓడిపోతే ఆ తీర్పుకి ఔదల దాల్చడమే సగటు భారతీయుడికి తెలుసు. ఇదీ స్థూలంగా సార్వభౌమాధికార దేశ న్యాయవ్యవస్థ బలం!







ఆ నలుగురు జడ్జీలు సుప్రీంకోర్టులో పనిచేస్తున్న వారే. సీనియర్లే. చీఫ్ జస్టిస్‌తో సమానంగా పోటీపడదగ్గవారే. అంతటి స్థాయి ఉన్న జడ్జీలు తమకే న్యాయం చేయాలని అడగడంలో అర్థమేమిటి? వారంతా దేశ ప్రజలకు న్యాయం చేయాల్సిన స్థితిలో ఉన్నారు. దేశ ప్రజలు న్యాయం కోసం వారిదగ్గరకు వెళుతుంటారు. సుప్రీంకోర్టు జడ్జీగా వారికి ఎనలేని ఆత్మగౌరవం, ఆత్మస్థయిర్యం, ఆత్మాభిమానం ఉండాలి. అవన్నీ ఉంటేనే సగటు మనిషి సమస్య మీద దృష్టి పెట్టి న్యాయం చేయగలుగుతారు. కాని సుప్రీంకోర్టులో అవేవీ అందుబాటులో లేకుండా పోయాయని వారి మాటల్ని బట్టి అర్థమవుతున్నది. స్వతహాగా తమలో ఉన్న ఆత్మాభిమానం, ఆత్మగౌరవం, ఆత్మస్థయిర్యం సంక్షోభంలో పడ్డాయని వారు చెప్పినట్టుగా భావించాలి. దీన్ని వ్యక్తుల వ్యక్తిగత అభిప్రాయంగా కాకుండా వ్యవస్థకు సంబంధించిన అంశంగా స్వీకరిస్తేనే దీనికి సరైన పరిష్కారం దొరుకుతుంది. పాలనాపరంగా చీఫ్ జస్టిస్ తమను తృణీకరించి తమకు అప్పగించాల్సిన సున్నితమైన కేసులను కూడా పక్కదారి పట్టించి తమకన్నా జూనియర్లకు అప్పగిస్తున్నారన్నది వారి ప్రధాన అభియోగం. ఇందులోని సున్నితత్వాన్ని సానుకూల దృక్పథంతో అర్థం చేసుకోవచ్చు. ఆ నలుగురూ సూటిగా చెప్పకపోయినా..ఒక సీనియర్ జడ్జి తన వృత్తిపరంగా ఆత్మాభిమానానికి సంబంధించిన అంశంగా చూడటంలో తప్పు లేదు. ఒక జడ్జి అయినంత మాత్రాన నిరసన చెప్పే హక్కు లేదనడం భావ్యం కాదు. ఆమాటకొస్తే తీర్పుల్లోనే జడ్జీలు తమ నిరసన నోట్‌ని జతచేస్తుంటారు. ఎటొచ్చీ సంస్థాగతమైన అంశాలను అంతరంగికంగా పరిష్కరించుకోలేని దుస్థితిలో సుప్రీంకోర్టు ఉన్నదా అన్నది ఇక్కడ ప్రధానాంశం. ఆ పరిస్థితి లేనందునే తాము బైటపడాల్సి వచ్చిందన్నది నలుగురు జడ్జీల వాదన. ఇక్కడే సంస్థాగత సంక్షోభం ఏర్పడుతున్నది. ఇలా సంస్థాగత పరిధిలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించే ప్రత్యేక వ్యవస్థ లేకపోవడమే ఇక్కడి ప్రత్యేకత. ఒకవైపు ప్రభుత్వంతో పోరాడుతూ అస్థిత్వాన్ని నిలబెట్టుకుంటూ వస్తున్న సుప్రీంకోర్టు అంతర్గత అస్థిత్వ సమస్యని ఎదుర్కోవడమే విషాదం. పైపెచ్చు చీఫ్ జస్టిస్‌తో వచ్చిన విభేదాలను ఆయనతోనే పరిష్కరించుకోవాల్సి రావడం..అదీ ఆయన వ్యవహార శైలి మీదే ఆధారపడి ఉండటం మరీ విడ్డూరంగానే కనిపిస్తుంది. అయినా అదే మిగిలి ఉన్న ఏకైక మార్గం. అటార్నీ జనరల్ కూడా సోమవారానికి సమస్య అంతా చక్కబడుతుంది అని అన్నారంటే చీఫ్ జస్టిస్ చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి ముందడుగు వేస్తారన్న ఆశాభావం కనిపిస్తున్నది.

అయితే ఈ సమస్య పైకి కనిపిస్తున్నంత చిన్న సమస్యేమీ కాదు. ముందుగా చీఫ్ జస్టిస్ ఏకచత్రాధిపతా అన్న మీమాంసకు జవాబు దొరకాలి. ఆయన సీనియర్లలో ముందుండే వ్యక్తే తప్ప ఇతరత్రా ఎక్కువా కాదు..తక్కువా కాదన్నది ఆ నలుగురి వాదన. అది వారి వ్యక్తిగత వాదన కాదు. అధికారిక వాదనే. కాని దీనిమీద భిన్నాభిప్రాయాలున్నాయి. అందరిలో ఒకరిలా ఉంటే వ్యవస్థను నడపడమెలా అన్నది ఒక ప్రశ్న. జస్టిస్‌లలో చీఫ్ జస్టిస్ వేరన్నట్టు ఉండాలి కదా. అది ఒక హోదా కావాలి. అదొక బాధ్యత కావాలి. అలా కాకుండా కేవలం కొందరిలో ఒకడిగా ముందుండే వ్యక్తిలా అయితే వ్యవస్థ దెబ్బతింటుంది. ఒక నాయకుడు ఉండాలి. అతనికి విస్తృతాధికారాలుండాలి. బరువు బాధ్యతలుండాలి. పొరపాట్లకు నైతిక బాధ్యుడు ఆయనే కావాలి. ఆ ప్రక్రియలో జరిగే లోటుపాట్లకు ప్రశ్నించి సరిచేసే వ్యవస్థ ఉండాలి. డీజీపీ స్థాయి కలిగిన అధికారులు ఎంతమంది అయినా ఉండొచ్చు. కాని డీజీపీ ఒక్కరే. అలాగని ఆయన కేవలం పాలనా వ్యవహారాలు చూసే అధికారిగా మాత్రమే మిగిలిపోడు. అలాగే ఏదైనా ఒక రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి. ఆయనతో సరిసమానమైన సీనియర్ ఐఎఎస్ అధికారులు ఎంతమందైనా ఉండొచ్చు. కాని ప్రధాన కార్యదర్శి కాగానే ఆయన అధికారాలు మారిపోతాయి. ఐఎఎస్‌లు అందరూ ఆయనకు జవాబుదారీగా ఉంటారు. ఈ వ్యవస్థలు సజావుగానే నడవడం మనం చూస్తున్నాం. ఇంతమాత్రాన సుప్రీంకోర్టులో ఎప్పటినుంచో అమల్లో ఉన్న విధానాన్ని సమూలంగా మార్చాలని అనడం తొందరపాటే అవుతుంది. అసలు సమస్య అదొక్కటేనా లేక ఇందులో నిగూఢాలేమన్నా ఉన్నాయా అన్నది ప్రశ్న. లోతుల్లోకి వెళితే..బెంచ్‌ల ఏర్పాటు పెద్ద వివాదంగా కనిపిస్తున్నది. ఇందులో రాజకీయ ప్రమేయాలున్నట్టు ఆరోపణలున్నాయి. ఆ ఆరోపణల మీద విచారణలు..వాటి నిర్వహణ తీరుతెన్నులు కూడా వివాదాస్పదమవుతున్నాయి. కింది కోర్టు నుంచి రాష్ట్ర కోర్టుల దాకా..కోర్టు ఆవరణల్లో సామాన్యులు బెంచ్‌ల గురించి..ఏ బెంచ్‌కి ఏ కేసు వెళితే ఎలాంటి తీర్పు రావచ్చో మాట్లాడుకుంటుంటారు. అంటే జడ్జీల వ్యక్తిగత వ్యవహార శైలి మీద సామాన్యులు ఒక నిర్దిష్ట అభిప్రాయాలతో ఉన్నట్టు దీన్నిబట్టి అర్థమవుతున్నది. సుప్రీంకోర్టు కూడా దీనికి అతీతం కాదు.

పార్లమెంటు తన వ్యవహారాల్లో కోర్టుల జోక్యాన్ని ఎలా ఒప్పుకోవో..కోర్టులూ అంతే. ఇది జగద్విదితం. సుప్రీంకోర్టులో ప్రస్తుతం తలెత్తిన సంక్షోభం విషయంలో కేంద్ర ప్రభుత్వం అందుకే ఆచితూచి స్పందించింది. దీనికి రాజకీయ రంగులు పులిమే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ దశలో స్థూలంగా సుప్రీంకోర్టు నిగ్రహం పాటించి తమ సమస్యకు తామే పరిష్కారం కనుక్కుంటే న్యాయవ్యవస్థ తిరుగులేని శక్తిగా మళ్లీ నిలదొక్కుకుంటుంది. ఇందుకు అటు చీఫ్ జస్టిస్ నుంచి జడ్జీల దాకా ఆత్మవిమర్శతో ముందడుగేయాలి. వ్యక్తి స్వేచ్ఛ, వాక్స్వాతంత్ర్యం అందరికీ ఉన్నట్టు న్యాయాధికారులకూ ఉండాలి. అందులో భిన్నాభిప్రాయం అక్కర్లేదు. కాని అది స్వీయ లక్ష్మణరేఖగా ఉంటే న్యాయానికి శ్రేయస్కరం! జడ్జీలకు ఒక రక్షణ కవచం ఉంది. అది వారికి మంచి చేస్తుందా చెడు చేస్తుందా అంటే ఇదమిద్ధంగా చెప్పలేని స్థితి. సీపీఐ జాతీయ నాయకుడు రాజా జస్టిస్ చలమేశ్వర్‌ను కలవడం వివాదమైంది. అలాగే పీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ చీఫ్ జస్టిస్‌ని కలిసొచ్చారు. ఎవరైనా ఒక రాజకీయ నాయకుడు లేదా ప్రభుత్వాధికారి వ్యక్తిగతంగా కలిస్తే వారి సమగ్రత మీద నీలినీడలు పరుచుకుంటున్నాయి. అలాంటి లక్ష్మణరేఖలు ఉండకూడదు అన్న వాదనలూ అప్పుడప్పుడూ వినిపిస్తున్నాయి. ఎవరెన్ని చెప్పినా జ్యుడిషియరీ రాజకీయ చట్రంలోకి వెళ్లకూడదనేదే అత్యధికుల అభిప్రాయం. సీబీఐ లాంటి సంస్థల పనితీరు చూశాక ఎవ్వరైనా ఇలాగే ఆశిస్తారు. అందువల్ల న్యాయమూర్తులు వారికి వారే భిన్నంగా ఉండాల్సిన చారిత్రక అవసరం..చారిత్రక క్షణాలు ఇప్పుడే వచ్చాయి!

ఎన్నికల వ్యూహాల్లో సీఎంలు

ఇక తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే..కొత్త సంవత్సరం మొదటి వారంలో అనుకున్నట్టు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. ఏడాది తర్వాత గంటసేపు సమావేశం. నిస్సందేహంగా ఇద్దరికీ ఇది కీలకమే. ఏ రకంగా చూసినా చంద్రబాబు సౌకర్యవంతంగానే ఉన్నట్టు కనిపిస్తున్నారు. తన విన్నపాలకు, తన డిమాండ్లకు ప్రధాని మోడీ సానుకూలంగా స్పందించినా.. స్పందించకపోయినా అది అంతిమంగా చంద్రబాబుకే అనుకూలంగా మారే పరిస్థితి ఏర్పడింది. మోడీ కరుణించినా అది చట్టపరిధిలోనే జరిగిందన్న సత్యం ఎటూ ఉండనే ఉంది. అడిగింది ఇవ్వకపోతే నష్టపోయేది ప్రధాని మోడీ ఇమేజీయే. పోలవరం కూడా బీజేపీ నెత్తినే పడినట్టయింది. ఏపీ రాష్ట్ర ప్రజలు ఇంతకాలం అమరావతి హైడిజైన్ భవనాల మీద అంతగా ఆశలు పెట్టుకోలేదు గాని పోలవరం మాత్రం కాస్త అటో ఇటో చెప్పిన టైముకి అవుతుందని నమ్మారు. చంద్రబాబు చెబుతున్న విదేశీ డిజైన్ల భవనాల మీద ప్రజలకు అంతగా ఆసక్తి ఉన్నట్టు కనిపించడం లేదు. అవి అయినప్పటికి అవుతాయన్న ఆలోచనలో ఉన్నారు. కాని పోలవరం మాత్రం చంద్రబాబు చేతుల్లో కార్యరూపం దాలుస్తుందని నమ్మకం పెట్టుకున్నారు. తాజా పరిణామాల్లో బీజేపీ దాన్ని తన చేతుల్లోకి తీసుకున్నట్టయింది. దాంతో చంద్రబాబు పెద్దగా రాష్ట్ర ప్రజలకు చెప్పాల్సింది ఏమీ మిగల్లేదు. ప్రధాని మోడీని కలిశాక ఢిల్లీలో విలేకరుల సమావేశంలో ఆయన మాటల్లోనే ఇది అర్థమైంది. ప్రధానితో సమావేశం కాయా పండా అన్న మీమాంసలో ఉన్నవారు ఎటూ తేల్చుకోలేని రీతిలో ఆయన హావభావాలున్నాయి. పెద్దగా ఉత్సాహం లేదు. అలాగని నిరుత్సాహం పాలు ఎక్కువా లేదు. భారమంతా మోడీ మీద వదిలేసి ప్రశాంతంగా బైటికొచ్చినట్టు అనిపించింది. ఎన్నికల సీజన్ ముంచుకొస్తున్న తరుణంలో ఇక ఇప్పట్లో మళ్లీ ఇద్దరి భేటీ సాధ్యపడకపోవచ్చు. అందువల్ల మోడీ మేలుకోవాల్సిన అవసరాన్ని చంద్రబాబు గుర్తు చేశారు. ఎన్నికల సంవత్సరంలో హామీలు నెరవేర్చకపోతే కష్టమన్న సంగతి చెప్పి వచ్చేశారు. ఇక ఏమి చెప్పినా ఏమి చేసినా మోడీ చేతుల్లోనే ఉంది. ఈరకంగా ఇది చంద్రబాబుకి సక్సెస్ మీటింగే. ఇక అసెంబ్లీ ఎన్నికల విషయానికొస్తే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉన్న స్వతంత్రత, స్వేచ్ఛ చంద్రబాబుకి లేవు. ఎన్డీయేలో మిత్రపక్షంగా బీజేపీని కలుపుకొని పోవడం..బీజేపీతో కలిసి నడవడం అనివార్యం. అందుకే కేంద్రంతో సంబంధాలను బట్టే చంద్రబాబు భవిష్యత్ అడుగులు ఉంటాయి. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఇలాంటి జంజాటాలు లేవు. అందుకే ఆయన తన సొంత నిర్ణయాలతో వెళుతున్నారు. బీజేపీతో సహా ఆయనకు ఎవ్వరితోనూ శాశ్వత చుట్టరికాలు గాని శాశ్వత శత్రుత్వాలు గాని లేవు. ఇది పాలనలో ఆయనకు మరింత స్వేచ్ఛనిస్తున్నది. రైతులకు ఇరవై నాలగ్గంటలు ఉచిత కరెంట్ ఇచ్చినా..రైతులకు పెట్టుబడి రాయితీగా నగదు ఇచ్చినా..డబుల్ బెడ్‌రూం ఇళ్లు..కల్యాణలక్ష్మి నగదు సాయాన్ని పెంచినా..అన్నీ సర్వస్వతంత్ర నిర్ణయాలే. ఇలాంటి సంక్షేమ నిర్ణయాల విషయంలో చంద్రబాబుకీ అడ్డంకులు లేవు. అందుకే ఆయన నిరుద్యోగులకు పింఛన్ వంటి పథకాలకు పదును పెడుతున్నారు. ఎటొచ్చీ కేసీఆర్‌కు రాజకీయ జంజాటాలు కూడా లేవు. పైగా ఆయన ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దూకాలన్న ఆలోచనతో ఉన్నారు. ఎలాంటి భవబంధాలు లేని ఒక ప్రాంతీయ పార్టీ అధినేతగా ఆయన తనదైన దారిలో వెళ్లేందుకు ఎటువైపు నుంచీ ప్రతిబంధకాలు లేవు. అందుకే కేసీఆర్ సంక్షేమ కోణంలోను, రాజకీయంగాను ఇప్పటినుంచే ఎన్నికల సమరాంగణానికి సన్నద్ధమవుతున్నారు.

● వయ్యెస్సారెస్



ఎవరిదీ అడవి?

● నేడు మహాశ్వేతాదేవి జయంతి

అణగారిన వర్గాల గుండెచప్పుడు, అడవి బిడ్డల - హక్కుల కోసం గొంతెత్తిన సామాజిక ఉద్యమకారిణి, నవలా రచయిత్రి మహాశ్వేతాదేవి అడవిపై పరిమళించిన అక్షర కుసుమం. ఆదివాసీ, అణగారిన ప్రజలకోసం ఆమె తన కలాన్ని ఆయుధంగా మలచుకొని, వారి జీవితాలకు తన రచనలతో నిలువుటద్దం పట్టారు. 1926, జనవరి 14న బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో మధ్యతరగతి కుటుంబంలో ఆమె జన్మించారు. మహాశ్వేతా తన రచనలతో కేంద్ర సాహిత్య అకాడమీ (1979), జ్ఞానపీఠ్ (1996), రామన్ మెగసెసె (1997), పద్మ విభూషణ్ (2006) అవార్డు అందుకున్నారు. దేశ విభజన తర్వాత మహాశ్వేతా కలకత్తాలో స్థిరపడ్డారు.

అడవిని చూడండి. జల జల పారే సెలయేళ్ళు. మెరిసే ఎండ, అడవిలో సంతోషంతో ఎగిరే కృష్ణ జింకలను చూడండి. సెలయేళ్ళ దగ్గర వాగుల, వంకల, చెలమల దగ్గర పల్లె తల్లులు, పిల్లల్ని చంకనేసుకుని కుండలలో నీరు నింపుకు పోవడం, సూర్యుడు వంగి భూమిని చూస్తూ ఉండటం... రైతులు పొలాలు దున్నుతున్నపుడు అడవులే కాదు, కొండలు, గుట్టలు కూడా పచ్చదనంతో నవనవలాడుతూ ఉన్నప్పుడు, అక్కడ ఏమీ జరగదు! ఏమీ కాదు!! నువ్వు కలగననంతవరకు, కలగనడం ఎలాగో నీకు తెలియనంత వరకు అక్కడ ఏమీ జరగదు - అయితే రాజకీయ, పరిపాలనా వ్యవస్థలు రిమోట్ కంట్రోల్‌తో నీతో కలలు కనిపించే నీ మెదడు జీవకణాల్ని నాశనం చేస్తూనే ఉంటాయి. అయితే కొన్ని కలలు తప్పించుకుని బయట పడతాయి. అట్లా తప్పించుకుని బయటపడ్డ కలల వెంట నేనెపుడూ పరుగెత్తుతుంటాను. ఈ మానవాళి సజీవంగా కొనసాగాలంటే కలలు గనే హక్కు తప్పకుండా ఉండాలి. కానీ... పరిపాలనా వ్యవస్థ -కలలుగనే నీ హక్కును కూలగొడుతుంటే ఏమవుతుంది? వ్యక్తులు కూలిపోతారు. దేశాలు, మొత్తానికి ప్రపంచమే కూలిపోతుంది. కలలు కనడమన్నది మనందరి ప్రాథమిక హక్కు దీన్ని మనం కాపాడుకోవాలి! అనేవారు. బహుశా 1980 నుండి నేను నా పోరాటాన్ని - ఉధృతం చేశాను. గొంతు విప్పాను.

ఆదివాసులు, గిరిజనులు, భూముల్లేని గ్రామీణ పేద ప్రజలు, కూలీలు, నగరాల్లో ఫుట్‌పాత్ జీవులు ఇట్లా వారి పక్షాన సమస్యలపై నా దినచర్యగా ప్రతిస్పందించాను. భారతదేశంలో స్వాతంత్ర్యం ఎన్ని తప్పిదాలతో, ఎన్ని తప్పు నడకలతో ముందుకు వస్తుందో విప్పి చెప్పగలిగాను. మనమంతా కలలుగనేది మానవీయ విలువల కోసమేనంటూ- మహాశ్వేతాదేవి అక్టోబర్ 21, 2006న జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఓ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉపన్యాసం చేశారు.

మహాశ్వేతాదేవి రచనలు 90 శాతం గిరిజనుల జీవిత సంక్షోభాన్ని ఆవిష్కరించేవే. 1979 లో సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైన ఆమె చారిత్రక కాల్పనిక రచన అరణ్యేర్ అధికార్ (ఎవరిదీ అడవి) 19వ శతాబ్దంలో బ్రిటిష్ పాలనపై జరిగిన ఆదివాసీ ముండా తిరుగుబాటుకు నాయకత్వం వహించిన గిరిజన నాయకుడు బిర్సాముండా జీవితానికి, పోరాటానికి అద్దంపట్టేలా ఉంటుంది ఎవరిదీ అడవి. 1899 - 1900లో చోటానాగ్‌పూర్, రాంచీ ప్రాంతంలో జరిగిన గిరిజనోద్యమం (ఉల్‌గులాన్) ఆధారంగా రాసిన నవల ఇది తెలుగువారు కూడా విశేషంగా చదివారు.

1997లో విశాఖపట్నం వచ్చిన మహాశ్వేత విశాఖ మన్యంలో గొప్ప గిరిజన మన్యసీమ ఉద్యమం నడిపిన అల్లూరి సీతారామరాజు జీవితం ఆధారంగా ఆయన శతజయంతి (1997) సందర్భంలో నవల రాస్తానని చెప్పారు. విజయనగరం జిల్లాలోని పాచిపెంట మండలం మూలవలస ఆదివాసీ గూడేన్ని సందర్శించి అల్లూరి సీతారామరాజు (మన్యం వీరుడు) నవల రాస్తానని ప్రమాణం చేశారు. ఆదివాసీల అధ్యయనాల్లో భాగంగా మహాశ్వేతా తెలంగాణలోని గిరిజన పోరాటాలపై విస్తృత సమాచారం సేకరించారు. సామాజిక అణచివేతలపై తిరగబడ్డ ఘనమైన వారసత్వం కొమరంభీం వంటి ఆదివాసీ పోరాట యోధుల్లో ఉన్నట్లు ఆమె గ్రహించారు కూడా. అల్లూరి నవలా ప్రయత్నం నెరవేరుంటే తెలుగు ప్రాంతాల గిరిజనోద్యమానికి గొప్ప వెలుగు ప్రసరించేది. హఠాత్తుగా జులై 28, 2016న (కలకత్తా)లో కన్నుమూయడంతో అడవి నిర్ఘాంతపోయింది. అడవి రక్షణమీద, ఆదివాసీ హక్కుల పరిరక్షణ కొరకు, వారు రాజ్యాంగ ఫలాలు అందిపుచ్చుకునేలా నేటి పాలకులు కొంతైనా చేయగలిగితే అదే మహాశ్వేతకు నిజమైన నివాళి!

● గుమ్మడి లక్ష్మీనారాయణ, 9491318409

కొందరికి మోదం.. మరికొందరికి ఖేదం!

మన దేశంలోని ప్రభుత్వోద్యోగులు, అధ్యాపకులు, ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో పనిచేసే వారికి చాలా కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరవు భత్యం (డియర్‌నెస్ అలవెన్స్---డిఏ) చెల్లిస్తున్నాయి. ధరల సూచిని బట్టి మూడేసి నెలలకోసారి డిఏ పెంచుతూ ఉంటారు. వేతన సవరణ సంఘాలు (పే రివిజన్ కమిషన్--పీఆర్‌సీ) డిఏని మూలవేతనంతో కలిపేస్తూ సిఫార్సులు చేస్తాయి. మరో పీఆర్‌సీ వచ్చే లోగా మళ్ళీ డిఏలు కాలచక్రంలా తరుగుతూ ఉంటాయి. సౌదీ అరేబియాలో కరవుభత్యం లేదు కానీ, అక్కడ ద్రవ్యోల్బణం అలవెన్స్‌ని ప్రభుత్వం చెల్లిస్తోంది. డిఏ రేట్లు ధరల సూచికి తగినట్టుగా లేదని ఉద్యోగులు తరచూ ఫిర్యాదు చేస్తుంటారు. కరవు భత్యంతో సమానమైనదే ద్రవ్యోల్బణం. ఏ పేరు పెట్టినా, వ్యవస్థీకృత రంగానికి చెందిన వారికే ఇలాంటి సదుపాయాలు. ప్రైవేటురంగంలో వారికి ఇవి వర్తించవు. కరవు, ద్రవ్యోల్బణం కట్టకట్టుకుని ప్రైవేటు రంగంలో పనిచేసే శ్రామికుల నెత్తిన పడుతుంటాయి. ద్రవ్యోల్బణం పెరగడానికి బాధ్యత ప్రభుత్వాలదే. కరవు పేరు చెప్పి వ్యవస్థీకృత రంగంలో వారికి భత్యం, కరవు భారాన్ని తమపై రుద్దడం ఏమంత సబబని వ్యవస్థీకృత రంగం వారు ప్రశ్నిస్తుంటారు. కరవు కొందరికి మోదం, మరి కొందరికి ఖేదం అంటే ఇదే.

ఉత్తుత్తి సునామీతో పరుగోపరుగు!

కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్ అన్నది అన్ని సందర్భాల్లో వర్తించదు. ఇప్పుడంటే సెల్‌ఫోన్‌లు వచ్చాయి కానీ, గతంలో బంధువుల నుంచి సమాచారం కోసం ఉత్తరాల మీదే జనం ఆధారపడేవారు.తమకు రావల్సిన ఉత్తరంలేదా టెలిగ్రామ్ మరొకరికి వెళ్ళినా, వేరొకరి ఉత్తరం,టెలిగ్రామ్ మనకువచ్చినా ఆకాశంవిరిగి పడినంత గందరగోళంఅయ్యేది. ఆధునిక కాలంలో న్యూస్ చానల్స్ మధ్య పోటీ పెరగడం వల్ల వచ్చినదానిని సరిచూసుకోకుండా ప్రసారం చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తప్పుడు సమాచారం ప్రాణాలను బలిగొన్న సందర్భాలుకూడా ఉన్నాయి. అత్యంత ఆధునిక సమాచార వ్యవస్థ కలిగి ఉన్న అమెరికాలో కూడా ప్రజలకు తప్పుడు సమాచారంఅందుతోందంటే ఏమనుకోవాలి? ఒరేగావ్ ప్రాంతంలో సునామీ రాబోతోందన్న సమాచారాన్ని అక్కడి ప్రజలు అధికారులు అందించేసరికి అంతా హడలెత్తిపోయారు.అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా సునామీ కాటు తప్పదేమోనని భయపడ్డారు.సునామీ సృష్టించిన భీతావహ పరిస్థితులు స్మృతి పథంలోనే ఉన్నాయి.ఇంత హడావుడిచేసినతర్వాత ఏ అధికారులైతే హెచ్చరిక చేశారో,వారే సునామీ రాదు,కంగారు పడకండి అని విజ్ఞప్తి చేసేసరికి అంతా తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.



సినిమాలలో సినిమా

తెలుగు సినిమా అగ్ర రచయితలలో ఒకరైన పరుచూరి వేంకటేశ్వరరావు స్వతహాగా నాటక రంగంలో పేరుమోసిన రచయిత, నటులు, దర్శకులు. పాతికేళ్లుగా పరుచూరి రఘుబాబు నాటక పరిషత్తు నిర్వాహకులు కూడాను. ఆయన దగ్గర నేను ప్రేమించుకుందాం... రా, బావగారూ బాగున్నారా, ప్రేమంటే ఇదేరా సినిమాలకు సహకార దర్శకుడి హోదాలో స్క్రిప్టు ఫాలో అయ్యాను. మనసంతా నువ్వే, శ్రీరామ్, నేనున్నాను, ఆట, రెయిన్‌బో చిత్రాలకు దర్శకుడిగా స్క్రిప్టు ఫాలో అయ్యాను. ఈ తొమ్మిది సినిమాల ప్రయాణం నాకు తొమ్మిది వందల సినిమాల అనుభవం. ఇప్పుడు వస్తున్న చాలా సినిమాలు సారీ ఇప్పుడు పోతున్న చాలా సినిమాలు థియేటర్లలో చూస్తుంటే ఆయనతో మేం గడిపిన స్టోరీ సిట్టింగ్‌లు ఎక్కువ గుర్తొస్తున్నాయి. మేం ఫ్లాపులివ్వలేదని కాదు, కనీసం రచయిత, దర్శకుల శాఖల పనితీరుల్లో తప్పులు ఎంత తక్కువ ఉంటే, నిర్మాతలకి అంత ఎక్కువ శ్రేయస్సు అని. ఇది కూడా ఆయన చెప్పిందే. సినిమాల్లో ఇది సినిమా అని స్ఫురించేడైలాగులు రాయద్దనేవారు. అలా రాస్తే, ఆ డైలాగు నుంచి ప్రేక్షకుడు తెరతో డిస్కనెక్ట్ అవుతాడని, స్వర్గీయ ఇవివి గారు కొన్ని ఫ్లాపు సినిమాల్లో ఈ ప్రక్రియ వాడడం, దెబ్బతినడం నేను గమనించాను. ఈ సీన్లో నీకు డైలాగు లేదు, ఈ సినిమాలో నీ క్యారెక్టర్ ఇంతే, ఇలాంటివన్న మాట. ఈ మధ్య వచ్చిన అజ్ఞాతవాసి సినిమాలో హీరో చేత, క్రియేటివిటీ లోపించినప్పుడు పాత సీనే రిపీట్ చేయమన్నారు అనిపించడం బ్లండర్ అని నాకు థియేటర్‌లో అర్థమైంది. అలాగే, సినిమాల్లో కెళ్లాలనే ఆశావహుల జీవితాలలో ప్రేమ కథలు, భావోద్వేగాలు ఆడతాయి గానీ సినిమా నేపథ్యంలో జరిగే కథలు ప్రేక్షకులకి అంత ఎక్కువని ఆయన చెప్తారు. నిజంగానే, శివరంజని, సీతామహాలక్ష్మి, సితార, రంగీలా, ఇలాంటివి పెద్ద హిట్లు, నా రెయిన్‌బో, ఆర్తనాదం, నేనింతే, ఇలాంటివి పెద్ద ఫ్లాపులు. సినిమాకి సినిమాయే ఫ్లాపు ఫార్ములా అవ్వడం ఐరనీ ఆఫ్ లైఫ్ అనుకోవాలి అంతే. కల్చరల్ క్లాసిక్స్ ఎమోషన్‌తో మిక్స్ చేయచ్చు గానీ, యాక్షన్‌తో పొరపాటున కూడా మిక్స్ చేయొద్దని చెప్పారాయన. పౌర్ణమి వంటి చిత్రాలు. లవ్‌లో కామెడీ, త్యాగం వర్కవుట్ అయినట్టు సస్పెన్స్ థ్రిల్లర్ స్క్రీన్‌ప్లే వర్కవుట్ కాదని చెప్పేవారు. కొన్ని వందల సినిమాలు ఉదాహరణలుగా నిలుస్తాయి. అద్భుత రసం మీద అప్పుడప్పుడు ఆధారపడొచ్చు గానీ, అస్తమానూ అది కాసులు కురిపించవన్నారు కె.టి.కుంజుమెన్, ఏ.ఎమ్.రత్నం, జెంటిల్‌మేన్ శంకర్‌లు అట్టర్ ఫ్లాపులు చవిచూశారు. విజువల్‌గా మేటర్ కన్వే చేయగలిగిన అవకాశమున్న సన్నివేశాల్లో పనిగట్టుకుని మాటలు పెట్టదన్నారు. ఈ సంక్రాంతికే వచ్చిన జైసింహా చిత్రంలో క్లైమాక్స్ ఫైట్ తర్వాత హాస్పిటల్ సీన్‌లో హీరో బాలకృష్ణ కొడుకుని నయనతారకి ఇచ్చి వెళ్లే సీను ఎంత హత్తుకుందో, అదయ్యాక ప్రకాష్‌రాజ్ బైటకొచ్చి హీరోతో పేజీలకు పేజీలు డైలాగులు మాట్లాడుతుంటే విసుగనిపించింది. ముఖ్యంగా సెకండాఫ్‌లో ఎప్పుడూ స్క్రీన్‌ప్లేలు ప్రోగ్రెసివ్‌గా
త ర్వా త
ఏం టి



అనే ఉత్కంఠతోనే సాగాలని, పదే పదే వెనక్కెళ్లి జరిగిన విషయాల్ని చూపించడం, చెప్పినమాటల్నే మళ్లీ మళ్లీ పాత్రలతో చెప్పించడం వద్దని ఆయన చెప్పడం ఈ అయిదేళ్లలో ఎన్నో సినిమాల్లో నేను చూసినప్పుడల్లా గుర్తుచేసుకుంటున్నాను.

ఇవన్నీ ఆయన ఏ పుస్తకాలలో రిఫర్ చేసి కాకుండా నాటకాలు, ఆయన చూసిన, రాసిన సినిమాలు, వాటి ఫలితాలను బట్టి నేర్చుకున్నవే అని చెప్తుండేవారు. శిష్యా! ఈ కథని మనం పెద్ద బాగు చేయలేమోయ్, పాడు చేయకుండా, జాగ్రత్తగా తీయ్ అన్నారు నేనున్నాను సినిమాకి. నిజంగానే పదకొండు క్లైమాక్స్‌లు మార్చాం కాయితం మీద. చివరికి సేఫ్‌గా సినిమాలో ఉన్న క్లైమాక్స్‌కి ల్యాండ్ అయ్యాం. ఒక ఇన్సిడెంట్ చుట్టూ అల్లుకున్న కథలు ఎక్కువ సాగదియ్యకుండా అయిపోవాలని చెప్పారు. శ్రీరామ్ సినిమా అలాగే చేశాం. బీచ్‌లో పోలీస్ ఆఫీసర్‌ని కొడితే కథ మొదలౌతుంది. క్లైమాక్స్ దాకా ఆ పోలీస్ ఆఫీసర్, హీరో సినిమా నిడివి ఎంత క్రిస్ప్‌గా ఉంటే అంత సేఫ్. నిజంగానే నిర్మాత సేఫ్ అయిపోయారు. రెయిన్‌బోలో సినిమా బ్యాక్‌గ్రౌండ్ వద్దన్నారు. నేను వినలేదు. ఆట సినిమాలో హీరో, హీరోయిన్‌ని విలన్ ఇంటికి తేవద్దు అన్నారు. ఎమ్మెస్ రాజు గారు విన్లేదు. హీరో, హీరోయిన్ కలవాలని ప్రేక్షకుడు కోరుకున్న కథలే సూపర్‌హిట్ అంటారాయన. అందుకని హీరో, హీరోయిన్ ఒకే దగ్గర పెట్టద్దు సెకండాఫ్ లలో అనేవారు. పక్క పక్కనుంటే ఎడబాటుకి అవకాశం ఉండదుగా. దేవదాసు, మల్లీశ్వరి, మరోచరిత్ర,

ప్రేమఖైదీ, తొలిప్రేమ, ఖుషీ, మనసంతా నువ్వే, నువ్వేకావాలి, సఖి, ఇలా ఏ సూపర్ హిట్ లవ్‌స్టోరీ చూసినా హీరో, హీరోయిన్ పన్నెండో రీలు నుంచి విడిపోతారు. కలిసుండరు. నేరము శిక్ష అనే ఫార్ములా ఎప్పటికీ సూపర్ హిట్టే దుష్మన్, నేరము శిక్ష, ఖైదీ బాబాయి, సమరసింహారెడ్డి, ఆనంద్ ఇలా ఎన్నో సినిమాలు ఈ ఫార్ములాలో హిట్లు కొట్టాయి. పరుచూరి బ్రదర్స్‌లో పరుచూరి వేంకటేశ్వరరావు గారు స్క్రీన్‌ప్లే రచయిత, పరుచూరి గోపాలకృష్ణ మాటల రచయిత. కథలు ఇద్దరూ కలిసి అల్లుకునేవారు. ఈ మధ్య ముఖ్యంగా పదేళ్లలో ఏ తెలుగు సినిమా అయినా కథ, మాటలు, హీరోని ఇంప్రెస్ చేయడం అనే మూడు విషయాలమీదే ఆధారపడి ఉంది తప్ప, థియేటర్‌లో కూర్చున్న ప్రేక్షకుడిని ఎంగేజ్ చేసే స్క్రీన్‌ప్లే పూర్తిగా కొరవడింది. హిట్ సినిమాలలో కూడా. అలాంటి సినిమా చూసిన ప్రతిసారీ నాకు పరుచూరి వేంకటేశ్వరరావు గుర్తొస్తున్నారు.

స్క్రీన్‌ప్లే దర్శకుడి ఇంటిపేరు కాకుండా, రచయితలతో కూర్చుని దర్శకుడు ఎంత ఎక్కువ డిస్కస్ చేస్తే అంత మంచి ఎంగేజింగ్ స్క్రీన్ ప్లేలు రాయగలం. పాత్ర ఔచిత్యం అంటే బూతుమాట చాలామంది సినిమా వాళ్లకి ఈ రోజు. ముఖ్యంగా హీరోలకి, 2018 నుంచి సంక్రాంతి ఇచ్చిన పాఠాల్ని గుర్తుపెట్టుకుని, హీరోయే సినిమా అంతా స్లో మోషన్‌లో నడవకుండా, కామెడీ పంచులతో సహా అన్ని డైలాగులూ ఆయనే చెప్పేయకుండా హీరో ఇమేజ్‌ని డ్యామేజ్ చేయకుండా, ఆ పాత్రని ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండేలా చూసుకుంటూ కథని చెప్పే కథనాలు, చిత్రాను వాదాలు రావాలని, నా తర్వాతి సినిమాల్లో ఈ ఆర్టికల్‌లోని పాఠాలన్నీ ఆచరణలో చూస్తారని విన్నవిస్తూ, అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు--

గిరిజనాభివృద్ధిలో నిధులు మురుగు

● కేటాయింపులు రూ. 8165.87 కోట్లు... ఖర్చు రూ. 3624.95 కోట్లు

● శాఖల మధ్య సమన్వయ లోపమే అసలు కారణం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: గిరిజనాభివృద్ధి నిధులు ఖర్చు కావడం లేదు. అనేక శాఖలు ఖర్చు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. నిధుల వ్యయానికి ప్రణాళికలు రూపొందించలేక పోతున్నాయి. సకాలంలో ప్రణాళికలు సమర్పించి నిధులు ఖర్చు చేయడానికి చొరవ చూపాలని ప్రభుత్వం కోరినప్పటికీ అత్యధిక శాఖలు చెవిన పెట్టడంలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసే గిరిజన సలహా మండలి సమావేశానికి కూడా అత్యధిక శాఖలు హాజరుకాని పరిస్థితి నెలకొంది. దీంతో వార్షిక బడ్జెట్‌లో కేటాయించిన నిధులు మురిగిపోయే పరిస్థితి నెలకొంది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ తంతు జరుగుతునే ఉంది. ఏటేటా భారీగా నిధులు కేటాయించడం, సగానికి పైగా నిధులు మురిగిపోవడం సర్వసాధారణం అయింది. గిరిజన సంక్షేమ నిధులను ఖర్చు చేసే బాధ్యతలను దాదాపు 42 ప్రభుత్వ శాఖలకు అప్పగించడమే నిధులు మురిగిపోవడానికి ప్రధాన కారణం అని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. ఒకే శాఖ ద్వారా నిధులు ఖర్చు చేయడం సాంకేతికంగా సాధ్యం కాదని భావించి అభివృద్ధి పనులను వివిధ శాఖలను అప్పగిస్తున్నారు.

శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో అనేక శాఖలు గిరిజనాభివృద్ధి పథకాల అమలుపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నాయి. మొత్తంగా 42 శాఖలకు గాను 28 శాఖలు కేటాయింపుల్లో 44.39 శాతానికంటే తక్కువగా నిధులు ఖర్చు చేశాయని వెల్లడించారు. రాష్ట్ర నిధులతో పాటుగా కేంద్ర నిధులు, వివిధ సంస్థల నుండి వచ్చే నిధులు కూడా సక్రమంగా ఖర్చు చేయలేని పరిస్థితి కొనసాగుతుందని ఉన్నతాధికారులు తెలిపారు. భద్రాచలం, ఉట్నూరు, ఏటూరునాగారం, మన్ననూరు ఐటిడిఏల పరిధిలో కూడా ఆశించిన మేరకు ప్రగతిని చూడలేక పోతున్నామని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో నిధులు కేటాయిస్తే అక్టోబర్ వరకు నిధుల వ్యయానికి సంబంధించి ప్రణాళికలు అందచేయని ప్రభుత్వ శాఖలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటి శాఖలను గుర్తించి ప్రణాళికలు అందచేసి నిధులు ఖర్చు చేయాలని కోరినప్పటికీ ఆశించిన మేరకు స్పందన రావడం లేదని గిరిజన మంత్రిత్వ శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం గిరిజనాభివృద్ధికి 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ. 8165.87 కోట్లు కేటాయించింది. అందులో ఇప్పటి వరకు 56.4 శాతం నిధులు ఖర్చు చేశారు. విడుదలైన నిధుల్లో 44.39 శాతం (రూ. 3624.95 కోట్లు) ఖర్చు చేశారు. గ్రామీణ నీటి సరఫరాకు రూ. 520.69 కోట్లు కేటాయించగా రూ. 56.09 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. గృహ నిర్మాణాల కోసం కేటాయించిన రూ. 415.87 కోట్లలో రూ. 115.44 కోట్లు వ్యయం చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖకు రూ. 140.84 కోట్లు కేటాయిస్తే డిసెంబర్ చివరి నాటికి రూ. 38.84 కోట్లు మాత్రమే ఖర్చయినట్టుగా పేర్కొన్నారు. పాఠశాల విద్యకు రూ. 88.03 కోట్లు కేటాయించగా రూ. 34.08 కోట్లు ఖర్చు చేశారని అధికారులు తెలిపారు. దాదాపు సగానికి పైగా నిధులు ఇంకా విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. నిధులు ఖర్చు చేయడానికి కేవలం మూడు మాసాల సమయం మాత్రమే ఉంది. మార్చి మాసాంతంలోగా నిధులు ఖర్చు కాని పక్షంలో ప్రభుత్వం ఆశించిన మేరకు గిరిజనాభివృద్ధిని సాధించడం సాధ్యం కాదు. ఫలితం రాబట్టే విధంగా ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ రూపొందించుకోవడంలో వివిధ శాఖలు ఆసక్తి కనబర్చని పరిస్థితిలో గిరిజన నిధులు మురిగిపోబోతున్నాయి. దాదాపు 42 ప్రభుత్వ శాఖల పరిధిలో నిధులు వ్యయం చేయవలసి ఉంటుంది. విద్య, వైద్యం, కల్యాణలక్ష్మి, గృహ నిర్మాణం, తాగునీటి సరఫరా, విద్యుత్ పంపిణీ రంగాల్లో ఆశించిన మేరకు నిధులు ఖర్చు కావడం లేదని ప్రభుత్వం గుర్తించింది. ఈ రంగాల్లోనే అధికంగా నిధులు ఖర్చు కావలసి ఉందని ఆశించింది.

గిరిజన మహిళలు, బాలబాలికలకు పౌష్టికాహారం అందించే బాధ్యతను మహిళా శిశు సంక్షేమ శాఖకు అప్పగించారు. ఇప్పటి వరకు కేటాయింపుల్లో ఈ శాఖ 27 శాతానికి మించి ఖర్చు చేయలేక పోయింది. గ్రామీణ నీటి సరఫరా శాఖ కూడా మరింతగా నిధులు ఖర్చు చేయవలసి ఉంది. వ్యవసాయానికి మాత్రం ఇప్పటి వరకు రూ. 443 కోట్లు ఖర్చయినట్టు అధికారులు పేర్కొంటున్నారు. వయోజన విద్య, ప్రజారోగ్యం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగాలతో పాటు పౌరసరఫరాల పరిధిలో నిధుల వ్యయం కొంత వరకు మెరుగ్గా ఉందన్నారు. నిర్దిష్టకాల వ్యవధిలో నిధులు వ్యయం కావాలని ప్రభుత్వం కోరినప్పటికీ తండాలు, గూడాల్లో వివిధ శాఖలు పనులు చేయడానికి ఆసక్తి కనబర్చలేకపోతున్నాయి. శాఖాపరమైన కార్యక్రమాల అమలులోనే అధిక సమయం కేటాయించబడుతున్నందున గిరిజన ప్రాంతాలలో నిధులు ఖర్చు చేయలేకపోతున్నట్లు పేర్కొంటున్నాయి. తండాలు, గూడాలకు రోడ్లు వేయడానికి రూ. 517 కోట్లు కేటాయించగా ఇప్పటి వరకు సగం నిధులు కూడా వ్యయం చేయలేకపోయారు. చెంచు ఆవాసాలకు బీటీ రోడ్లు వేయాలనే ప్రభుత్వ నిర్ణయం ఆచరణకు నోచుకోవడం లేదు.

సీపీ బాట దళ కమాండర్ అరెస్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సీపీఐ(ఎంఎల్) సీపీ బాట డిప్యూటీ దళ కమాండర్ జోగి భద్రయ్య అలియాస్ సుభాష్ ఇల్లందు మండలం కొమరారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా పట్టుబడ్డాడు. సుభాష్ వద్దనుంచి ఒక రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన సుభాష్‌ను భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ఇల్లందు డీఎస్పీ ప్రకావరావు, గుండాల సీఐ గోపీ, ఎస్సై ప్రవీణ్‌లు శనివారం మీడియా ముందు హాజరుపర్చారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హైఅలర్ట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో హెచ్చరికల నేపథ్యంలో జనవరి 26 రిపబ్లిక్ డే వేడుకల సందర్భాన్ని పురస్కరించుకుని శంషాబాద్ ఎయిర్ పోర్టులో భద్రతను అప్రమత్తం చేశారు. డాగ్, బాంబుస్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించారు. ఎయిర్‌పోర్టులో అణువణువు క్షుణ్ణంగా తనిఖీలు జరిపారు. రిపబ్లిక్ డే లక్ష్యంగా ఉగ్రమూకలు ఎయిర్‌పోర్టులను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడే అవకాశం ఉందని కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో తాజా హెచ్చరికలను రాష్ట్రప్రభుత్వాలకు అందజేసింది. ఈ క్రమంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో శనివారం బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలను చేపట్టారు.

మరో డ్రంక్ అండ్ డ్రైవ్ డెత్

● ఫుట్‌పాత్‌ను ఢీకొన్న కారు...ఒకరు మృతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : భాగ్యనగరంలో మరో డ్రంక్ అండ్ డ్రైవ్ ఘటన చోటు చేసుకుంది. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 78లో శనివారం తెల్లవారుజామున అతి వేగంతో ఓ కారు చెట్టును ఢీకొనడంతో ఒకరు మరణించగా.. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన వివేక్‌రాజ్, పృథ్వీరాజ్, చెన్నకేశవలతో పాటు బాసర ఆలయ ఉద్యోగి విశ్వజిత్‌లు శుక్రవారం రాత్రి మణికొండలో మద్యం సేవించి రాత్రి 2 గంటల ప్రాంతంలో వివేక్ అతి వేగంగా కారును నడిపాడు. దీంతో వాహనం అదుపు తప్పి ఫుట్‌పాత్‌ను తాకి పల్టీలు కొట్టి పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో విశ్వజిత్ (33) తీవ్రంగా గాయపడి కారులో ఇరుక్కుపోయాడు. స్థానికులు విశ్వజిత్‌ను అపోలో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటనలో స్వల్ప గాయాలైన చెన్నకేశవ్, వివేక్‌లను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సీట్ బెల్ట్ పెట్టుకోవడం బెలూన్‌లు తెరచుకోవడంతో పృథ్వీరాజ్‌కు ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డాడు. జరిగిన ఘటనపై జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైలు పట్టాలపై టెక్కీ మృతదేహం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉప్పల్ చిలుకనగర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. సికింద్రాబాద్ జేమ్స్ స్ట్రీట్ రైలు పట్టాలపై సదరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనపర్చుకుని పోస్టు మార్టంకు పంపారు. బీటెక్ చదివిన కృష్ణవర్ధన్ (24) ఉప్పల్‌లో ఓ ప్రైవేటు ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నాడని, స్నేహితుల మధ్య ఆర్థిక వివాదాలు హత్యకు దారి తీసి ఉంటాయని కృష్ణవర్ధన్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. సొంత స్నేహితులే హత్య చేసి ఉంటారని వారు ఆరోపణలు గుప్పిస్తున్నారు. రాత్రి 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన కృష్ణవర్ధన్ శవమై కనిపించడం పలు అనుమానాలను రేకెత్తిస్తోంది.

దానం ఇంటి వద్ద ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

ఎనిమిది రోజుల కిందట మాజీ మంత్రి కాంగ్రెస్ నేత దానం నాగేందర్ ఇంటి వద్ద ఆత్మహత్యాయత్నం చేసుకున్న సీత నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. వారి ఆందోళనకు మహిళాసంఘాలు మద్దతు పలికాయి. దానం నాగేందర్ ఇంట్లో మూడేళ్ల క్రితం చనిపోయిన గిరిప్రసాద్ భార్యే సీత. గిరిప్రసాద్ కుటుంబాన్ని ఆదుకుంటానని దానం నాగేందర్ అప్పట్లో హామీనిచ్చారు. కానీ, మూడేళ్లుగా దానం ఇంటి చుట్టూ సీత తిరుగుతున్నా పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను దానం నాగేందర్ ఖండించారు.

ఏటీఎం దొంగల ముఠా అరెస్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని వివిధ ఏటీఎంల నుంచి ఏసీలు దొంగిలిస్తున్న ముఠా గుట్టును కాచిగూడ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.15 లక్షల విలువ చేసే 75 ఏసీలు (విత్ కంప్రెషర్స్‌తో) పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక ఆటో, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఆయా కమిషనరేట్ల పరిధిలోని 23 పోలీ స్స్టేషన్ల (కాచిగూడ, నల్లకుంట, సైదాబాద్, మలక్‌పేట, చాదర్‌ఘాట్, అంబర్‌పేట, లాలాగూడ, తుకారాంగేట్, నారాయణగూడ, సైఫాబాద్, రాంగోపాల్‌పేట, రైయిన్ బజార్, మీర్‌చౌక్, ఛత్రినాక, చాంద్రాయణగుట్ట, కాంచన్‌బాగ్, సంతోష్‌నగర్, మాదన్నపేట, మైలార్‌దేవ్‌పల్లి, సరూర్‌నగర్, బాలాపూర్, మల్కాజ్‌గిరి, ఉప్పల్) పరిధిలోని 41 ఏటీఎం సెంటర్ల నుంచి 80 ఏసీలను దొంగిలించారు. నిందితులు మొహమ్మద్ అఫ్సాన్ రహమాన్ అలిమాస్ ఫైసల్(18) కీలక నిందితుడు కాగా, సయ్యద్ అక్రమ్ (20), మొహమ్మద్ అదిల్(19), మొహమ్మద్ ఇస్మాయిల్(21), మొహమ్మద్ వజీద్ ఖాన్(20)లతో కలిసి ఏటీఎంలలో ఏసీలను దొంగిలించి ఉడాయించేవారు.

మళ్లీ డ్రగ్స్ కలకలం

● 46 కిలోల మాండ్రాక్స్ స్వాధీనం ● విలువ రూ. 50 కోట్లు పైమాటే

● మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ టూ చెన్నై ● ముగ్గురు అరెస్టు... కారు సీజ్ ● రాజేంద్రనగర్‌లో కిలో జీహెచ్‌బీ స్వాధీనం



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ పద్మజ. (ఇన్‌సెట్) స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ ప్యాకెట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మరో డ్రగ్స్ ముఠా గుట్టు రట్టయింది. సంగారెడ్డి టోల్‌ప్లాజా వద్ద భారీ ఎత్తున డ్రగ్స్ తరలిస్తున్న ముగ్గురిని డీఆర్ఐ అధికారులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 46 కిలోల మాండ్రాక్స్ డ్రగ్స్‌ను, కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ. 50 కోట్లు చేస్తుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. నిందితులు మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వస్తుండగా పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. మహారాష్ట్రలోని ఓ కంపెనీలో ఈ డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు తేలిందని వెల్లడించారు. హైదరాబాద్ మీదుగా చెన్నైకి తరలించేందుకు నిందితులు ప్రణాళిక చేశారని తెలిపారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోకూడా డ్రగ్స్ ముఠాల కోసం పోలీసులు సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ముగ్గురు నిందితులను డీఆర్ఐ అధికారులు విచారిస్తున్నారు. ఈ నెల 11న మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద భారీగా మత్తు పదార్థాలు పట్టుబడ్డ సంగతి విదితమే. అతి ఖరీదైన కొకైన్ డ్రగ్స్‌ను స్వాధీనపర్చుకున్నారు. వాటి విలువ బహిరంగ మార్కెట్లో రూ.3 కోట్ల వరకు ఉంటుందని అధికారులు స్పష్టం చేసిన సంగతి విదితమే.

రాజేంద్రనగర్‌లో కిలో జీహెచ్‌బీ స్వాధీనం

హైదరాబాద్ నగరానికి మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న ఎనిమిది మంది ముఠా సభ్యులను రాజేంద్ర నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారు కడప, అనంతపురం జిల్లాలకు చెందిన వారుగా గుర్తించారు. నిందితుల నుంచి రూ.20 లక్షల విలువైన కిలో జీహెచ్‌బీ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం జిల్లా యల్లనూరుకు చెందిన దాసరి బాబు ఈ డ్రగ్స్ కేసులో కీలక సూత్రధారి అని శంషాబాద్ డీసీపీ పద్మజా వెల్లడించారు. నిందితుడు దాసరి బాబుపై గతంలో తాడిపత్రిలో ఓ వర్గంపై బాంబులు వేసిన కేసు, కడపలో ఎర్రచందనం స్మగ్లింగ్ కేసు, రద్దయిన పెద్ద నోట్ల చలామణి, పలు చోరీ కేసులు ఉన్నాయని తెలిపారు. కడప నుంచి డ్రగ్స్‌ను నిందితుడు బెంగళూరుకు ఎక్కువగా సరఫరా చేసేవాడని పోలీసులు చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్‌కు డ్రగ్స్‌ను తరలిస్తూ పోలీసులకు దొరికిపోయాడు. విశ్వసనీయ సమాచారంతో దాసరి బాబును అదుపులోకి తీసుకున్నామని, వీరి వెనుక ఇంకా ఎవరున్నారనే విషయంపై లోతుగా దర్యాప్తు జరుపుతున్నామని శంషాబాద్ డీసీపీ పద్మజా తెలిపారు. ఎక్కువగా బెంగళూరుకే డ్రగ్స్‌ను సరఫరా చేసే దాసరిబాబు ఈసారి రూటు మార్చి హైదరాబాద్‌లో పబ్‌లు, క్లబ్‌లకు సరఫరా చేయడం ద్వారా మరింతగా అక్రమార్జన పొందవచ్చని భావించాడని, ఆ క్రమంలో పక్కా పథకం వేశాడు.

ప్రేమ జంటపై ఛేజింగ్ దాడి

● బయటపడిన దంపతులు... కారు డ్రైవర్ మృతి



ప్రేమ జంట షహెలా, సుమన్. గాయపడిన తరుణ్

ఇల్లెందు, ప్రభ న్యూస్: పెద్దలను ఎదిరించి రెండు రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న హిందూ, ముస్లిం మతాలకు చెందిన ఓ జంట ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డుప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ప్రేమ జంటతో పాటు మరో ముగ్గిరికి తీవ్రగాయాలు కాగా ఒకరు మృతిచెందిన సంఘటన శనివారం ఖమ్మం సమీపంలోని గోపాలపురం వద్ద చోటు చేసుకుంది. దోనెంబర్ బస్తీకి చెందిన శ్రీపతి సుమన్, డిగ్రీ చదువుతున్న షహెలాలు ప్రేమించుకుని రెండు రోజుల క్రితం పెద్దలను కాదని వివాహం చేసుకున్నారు. పెద్దల నుంచి ప్రాణభయం ఉందని షహెలా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో వీరు ఇరువురితో పాటు మరో నలుగురు స్నేహితులతో కలిసి ఖమ్మం మార్గంలో వెళుతుండగా షహెలా కుటుంబ సభ్యులు వారిని వెంటాడినట్లు తెలిసింది. వీరి నుంచి తప్పించుకునేందుకు డ్రైవర్ కారును అతివేగంగా నడపడంతో ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా షహెలా, సుమన్‌లతో పాటు మరో ముగ్గిరికి తీవ్రగాయాలయ్యాయి. తరుణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు మెరుగైన వైద్యంకోసం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హిందూ మతానికి చెందిన సుమన్, ముస్లిం మతానికి చెందిన షహెలాను ప్రేమించి పోలీసుల సమక్షంలోనే పెళ్ళి చేసుకుంటే షహెలా కుటుంబ సభ్యులు వీరిని కార్లలో వెంబడించి దాడి చేయాలని చూడడంతో పాటు వారి వాహనాన్ని ఢీ కొట్టించి వారిని భయభ్రాంతులు చేయడంతో పాటు ఒకరి మృతికి కారణమయ్యారని బీజేపీ పట్టణ అధ్యక్షులు కొల్లి సంజీవరెడ్డి, జిల్లా నాయకులు రాంచందర్ నాయక్, బిందె కుటుంబారావు తదితరులు విమర్శించారు.

త్వరలో కోదండరాం కొత్త పార్టీ?

● ఫిబ్రవరిలో టీజేఏసీ విస్తృత భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటి చైర్మన్ కోదండరామ్ రాజకీయ పార్టీ పెట్టేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు. ఫిబ్రవరిలో నూతన పార్టీ పేరును ప్రకటించే యోచనలో కోదండరామ్, టీజేఏసీ నేతలు ఉన్నారు. నూతన పార్టీ పేరును 'తెలంగాణ జన సమితి లేదా సకుల జనుల పార్టీ'తో పాటు మారో రెండు పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఫిబ్రవరి 3 లేదా 4న టీజేఏసీ రాష్ట్ర కమిటి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో రైతాంగ సమస్యలపై చర్చించాలని నిర్ణయం తీసుకున్నప్పటికి.. ప్రధానంగా నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావంపైనే చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. శనివారం నాంపల్లిలోని టీజేఏసీ కార్యాలయంలో కోదండరామ్ అధ్యక్షతన టీజేఏసీ నేతలు సమావేశం అయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, ఉద్యమ నాయకులపై తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, రైతు అధ్యయన యాత్రల పురోగతిపైన, టీజేఏసీ నేత గోపాలశర్మ అరెస్టుకు సంబంధించిన అంశంపైన చర్చించారు. టీజేఏసీ చేపట్టిన యాత్రలతో ప్రజల నుంచి స్పందన లభించిందని చర్చకు వచ్చింది. మిగిలిపోయిన యాత్రలను ఈ నెల 20 వరకు పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. 22 నుంచి 30 వరకు పాత 10 జిల్లాల పరిధిలో రైతు అధ్యయన యాత్రలో తేలిన అంశాలపైచర్చించేందుకు సదస్సులు నిర్వహించనున్నారు. ఈ సదస్సులు పూర్తయ్యాక టీజేఏసీ భవిష్యత్ కార్యాచరణపై ప్రణాళిక ఉంటుందని టీజేఏసీ నేతు ఒకరు చెప్పారు. రైతంగా సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై ఫిబ్రవరి మొదటి వారంలో జరిగే సమావేశాల్లో చర్చిస్తామని కోదండరామ్ తెలిపారు.

అడ్వకేట్‌గానే విజయవాడకు వెళ్లారు..

టీజేఏసీ నేత, న్యాయవాది గోపాలశర్మ తన వృత్తి ధర్మం మేరకే విజయవాడకు వెళ్లారని టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వృత్తిలో భాగంగా ఒక కంపెనీకి సలహాదారుగా ఉన్నాడని, క్లయింట్ తరపున మాట్లాడటం న్యాయవాది బాధ్యత అని ఆయన తెలిపారు. వృత్తి ధర్మాన్ని నేరంగా చూపుతూ అధికార పార్టీకి చెందిన వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. క్లయింట్ తరపున వెళ్లిన వారిని దోషులుగా చిత్రీకరించడం సరికాదన్నారు.

ముంబై ఏటీఎస్‌కు చిక్కిన నక్సల్స్

● పట్టుబడ్డ వారు కరీంనగర్, నల్లగొండవాసులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గత కొద్ది రోజులుగా తెలంగాణ రాష్ట్ర పోలీసులు వెదుకుతున్న మావోయిస్టులు ఏడుగురు ముంబై యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఎటిఎస్) సిబ్బందికి పట్టుబడ్డారు. పట్టుబడ్డ వారిలో ముగ్గురు నలొండ జిల్లాకు చెందిన వారు కాదా మరో నలుగురు కరీంనగర్ జిల్లాకు చెందిన వారున్నారని ఎటిఎస్ అధికారులు తెలిపారు. ముంబైలోని కళ్యాణ్ రైల్వే స్టేషన్‌లో ఒక మావోయిస్టు సంచరిస్తున్నట్లు ఎటిఎస్ అధికారులకు సమాచారం అందింది. వెంటనే అక్కడకు వెళ్ళిన ఎటిఎస్ సిబ్బంది సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తే మావోయిస్టు ఇన్‌ఫార్మర్ అని తేలింది.

అతడిని మరింత లోతుగా విచారించగా కామరాజ నగర్, రమాబాయి అంబేద్కర్‌నగర్, విక్రోలి తదితర ప్రాంతాల్లో ఉన్నారన్న సమాచారాన్ని వెల్లడించాడు. దీంతో ప్రత్యేక బృందాలు పక్కా ప్రణాళికతో దాడులు నిర్వహించగా నల్గొండ, కరీంనగర్ జిల్లాలకు చెందిన వారు పట్టుబడ్డారు. కొద్ది రోజుల క్రితం మావోయిస్టు నేతలు మహారాష్ట్ర, గుజరాత్‌ను గోల్డన్ కారిడార్‌గా ప్రకటించినందున ఆ ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు విప్లవ సాహిత్యంతో ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు వెల్లడైందని ఎటిఎస్ పేర్కొంది. వీరంతా పారిశ్రామిక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఉద్యమానికి పునాదులు వేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. కర్మాగారాలలో పని చేసే కార్మికులను మావోయిస్టు సిద్ధాంతాల పట్ల ఆకర్షితులను చేసేందుకు వీరు ప్రయత్నిస్తున్నారని గుర్తించామని వివరించారు. వీరు గతంలో తెలంగాణలో మావోయిస్టు ఉద్యమంలో చురుగ్గా పాల్గొని ఉంటారని ఎటిఎస్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అరెస్టు చేసిన వారి పేర్లను వెల్లడించని ఎటిఎస్ అధికారులు విషయాన్ని తెలంగాణ పోలీసు అధికారులకు సమాచారమిచ్చారు.

మేడారంలో దారుణ హత్య



ఏటూర్‌నాగారం, ప్రభన్యూస్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా, తాడ్వాయి మండలంలోని మేడారంలో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. వరంగల్ జిల్లా, ధర్మసాగర్ మండలానికి చెందిన పుసపల్లి ప్రసాద్ (24) అనే వ్యక్తి మేడారంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహించడానికి శివ అనే వ్యక్తితో కలిసి మూడు రోజుల క్రితం మేడారం వచ్చారు. శనివారం రాత్రి 8 గంటలకు గుర్తుతెలియని ముగ్గురు దుండగులు ముఖానికి ప్రసాద్‌పై కత్తితో దాడికి పాల్పడి జంపన్నవాగు సమీపంలో శవాన్ని పడవేశారు. సంఘటనస్థలంలో హత్యచేసిన కత్తి, పర్సు వదిలి వెళ్లారు. డీఎస్పీ రాఘవేందర్‌రెడ్డి, సీఐ బాలాజీ, ఎస్సై కరుణాకర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఏటూర్‌నాగారం ఆసుపత్రికి తరలించారు.

తెలంగాణ ఉద్యమానికి ఆద్యుడు చెన్నారెడ్డి

● హోంమంత్రి నాయిని నరసింహారెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ఉద్యమంలో చెన్నారెడ్డి కీలక పాత్ర పోషించారని రాష్ట్ర హోం మంత్రి నాయిని నరసింహారెడ్డి అన్నారు. నాటి తరం నాయకుల్లో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పైనే తెలంగాణ కోసం పోరాటం చేయడమంటే తేలికైన విషయం కాదన్నారు. హైదరాబాద్‌కు వచ్చిన ఇందిరాగాంధీ తెలంగాణ ఉద్యమాన్ని సమర్థిస్తూ అన్యాయం జరిగిన మాట వాస్తమేనని అంగీకరించే పరిస్థితిని తీసుకొచ్చారని నాయిని గుర్తు చేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు, విద్యార్థులను ముందుండి నడిపించారని, ఉద్యమాన్ని పతాకస్థాయికి తీసుకెళ్లారని ఆయన వివరించారు. తెలంగాణ ఉద్యమాన్ని చెన్నారెడ్డి ఏనాడు బలహీనపర్చలేదన్నారు. చెన్నారెడ్డి స్ఫూర్తితోనే 2001లో మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ ప్రారంభించారని నర్సింహారెడ్డి వివరించారు. కరీంనగర్‌లో సోనియాగాంధీ ఇచ్చిన హామీ మేరకే తెలంగాణ ఏర్పాటైందని తెలిపారు. అయితే కొన్ని సందర్భాల్లో తెలంగాణ తేస్తామని తాము కూడా అనుకోలేదన్నారు. చెన్నారెడ్డి స్ఫూర్తితోనే రాజకీయాలకు అతీతంగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో మండలి మాజీ చైర్మన్ చక్రపాణి, మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి, టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, మాజీ మంత్రులు గీతారెడ్డి, డీకే అరుణ, శశిధర్‌రెడ్డి, వి. హనుమంతరావు, గూడూరు నారాయణరెడ్డి, డీకే సమరసింహారెడ్డి, రాజ్యసభ సభ్యులు టి. సుబ్బిరామిరెడ్డి, డి. శ్రీనివాస్, వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.



మర్రి చెన్నారెడ్డి శత జయంతి ఉత్సవాలలో పాల్గొన్న మాజీ గవర్నర్ రోశయ్య, పాండిచ్చేరి సీఎం నారాయణస్వామి. నివాళులు అర్పిస్తున్న శాసన సభ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీ దత్తాత్రేయ తదితరులు

ప్రజా నాయకుడు చెన్నారెడ్డి: రోశయ్య

మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి తెలంగాణలో నెంబర్ వన్ నాయకుడని వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారని వారు పేర్కొన్నారు. ఏపీలో తెలంగాణను విలీనం చేయడం వల్ల ఇబ్బందులు వస్తాయని ముందే చెప్పారని వారు పేర్కొన్నారు. శనివారం మాజీ సీఎం చెన్నారెడ్డి శతజయంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహించి కార్యక్రమానికి పాండిచ్చేరి సీఎం నారాయణస్వామి, మాజీ గవర్నర్ రోశయ్య, హోం శాఖ మంత్రి నాయిని నరసింహారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ తదితర నేతలు హాజరయ్యారు. అంతకు ముందు ఇందిరాపార్కు వద్ద ఉన్న చెన్నారెడ్డి సమాధికి, విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాండిచ్చెరి సీఎం నారాయణస్వామి, మాజీ గవర్నర్ రోశయ్య మాట్లాడుతూ చెన్నారెడ్డి ప్రజా నాయకుడని, నిత్యం ప్రజల అభివృద్ధి కోసం పరితపించేవారన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు సీఎంగా పదవి బాధ్యతలు నిర్వహించి దేశవ్యాప్తంగా మంచి నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. 31 ఏళ్ల వయసులోనే ఎంపీగా ఎన్నికయ్యారని, 5 రాష్ట్రాలకు గవర్నర్‌గా సేవలు అందించడమే కాకుండా కాంగ్రెస్ పార్టీలో కీలకనేతగా ఉన్నారన్నారు. చెన్నారెడ్డి సీఎంగా ఉన్న సమయంలోనే 1980లో బీసీ వర్గాలకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు, మండల కమిషన్‌కు సిఫారస్ చేశారని చెప్పారు.

Andhraprabha business 2018
బిజినెస్

బడ్జెట్ ప్రాధాన్యాలు కోకొల్లలు!



- 2018 - 19 బడ్జెట్ పై నీతి ఆయోగ్ సమీక్ష
- హాజరైన ప్రధాన మంత్రి మోడీ, మంత్రులు, జైట్లీ, గడ్కరీ, రాధా మోహన్‌సింగ్



న్యూఢిల్లీ: దేశం ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారాలను ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంటుకు సమర్పించనున్న కొత్త (2018-19) బడ్జెట్‌లో చూపనున్నట్టు ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో దుర్భర పరిస్థితులు, ఉపాధి కల్పన కార్యక్రమాలు చురుకుగా సాగకపోవడం, ప్రైవేటు పెట్టుబడులు మొదలైన సమస్యలకు బడ్జెట్‌లో పరిష్కారాలు సూచించవచ్చు.

దేశం ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలపై ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సీనియర్ మంత్రులతోనూ, ఆర్థిక శాస్త్రవేత్తలు, వివిధ రంగాల నిపుణులతోనూ చర్చలు జరిపారు.

ప్రణాళికా సంఘం స్థానే పనిచేస్తున్న నీతి ఆయోగ్ ఈ చర్చను ఏర్పాటు చేసింది. ఈ చర్చల వివరాలను నీతిఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ మీడియాకు తెలియజేస్తూ... వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పెంచడానికీ, వ్యవసాయ పెట్టుబడులు తగ్గించడానికి నిపుణులు పలు సూచనలు చేశారని చెప్పారు. వ్యవసాయోత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించాలని నిపుణులు సూచించారు.

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కొత్తగా మూలధనాన్ని చేర్చాలనీ, అదే సందర్భంలో కొన్ని సంస్కరణలు కూడా ప్రవేశపెట్టాలనీ, కొన్ని సందర్భాల్లో రుణాల మంజూరు విషయంలో తప్పుడు నిర్ణయాలు జరుగుతున్నాయి. గత వారం ప్రభుత్వం పార్లమెంటుకు ఈ అంశంపై వివరణ ఇస్తూ, ప్రభుత్వరంగ బ్యాంకులకు మూలధనం సమకూర్చడానికి రూ. 80 వేల కోట్ల విలువైన బాండ్లు విడుదల చేయాలని నిర్ణయించినట్టు పేర్కొంది. బ్యాంకులను పటిష్ఠం చేయడానికి 2.11 ట్రిలియన్‌ల రూపాయిలు వెచ్చించాలన్నది ప్రభుత్వ సంకల్పం. అలా చేస్తే, ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించేందుకు వీలవుతుంది. వచ్చే బడ్జెట్‌లో దీర్ఘకాలిక మైన వ్యవస్థాగతమైన సంస్కరణలు ఉండాలని నిపుణులు సూచించారు.

ఉపాధి కల్పన కార్యక్రమాల పర్యవేక్షణకు ఒక కొత్త విధానాన్ని నీతిఆయోగ్ త్వరలోనే ప్రకటించగలదని రాజీవ్‌కుమార్ చెప్పారు. ఇందుకు సంబంధించిన తాజా సమాచారాన్ని సేకరించేందుకు, దానిని క్షుణ్ణంగా పరిశీలించేందుకు టాస్క్‌ఫోర్స్‌ని నీతిఆయోగ్ ఏర్పాటు చేయగలదని రాజీవ్ కుమార్ చెప్పారు. ఉద్యోగ సమాచారం కళ్ళుచెదిరేరీతిలో ఉంది. ప్రజలు ఊహించిన దానికన్న మెరుగైన పరిస్థితి ఉపాధికల్పన రంగంలో ఉందని రాజీవ్‌కుమార్ చెప్పారు. దేశంలో చదువుకున్న యువతకు ఉపాధి కల్పన 20 శాతం పైన ఉందని ఆయన చెప్పారు. పటిష్ఠమైన ఎగుమతుల విధానాన్ని కూడా ఈ సమావేశంలో చర్చించారు. ఎగుమతులకు వీలైన రంగాల్లో అవకాశాలను పుష్కలంగా ఉపయోగించుకోవడానికి చర్యలు తీసుకోవల్సిన అవసరం గురించి చర్చించారు.

వ్యవస్థీకృత సంస్కరణలతో కుదుపు వచ్చిన తర్వాత భవిష్యత్‌కు ఉపయోగపడే కొత్త ఆర్థికవిధానం కల్పనకు సంప్రదింపులు జరగాలన్నది ప్రభుత్వ ఆలోచన. సూక్ష్మ ఆర్థిక విధానం, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, అనుసంధానం, ఉపాధి, తయారీరంగం, ఎగుమతులు, ఆరోగ్య, విద్యా పథకాలకు 2018-19 బడ్జెట్ లో ప్రాధాన్యం లభించవచ్చు. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య సంఘటన (ఎన్‌డీఏ) ప్రభుత్వంలో 2019 ఎన్నికల ముందు ఇదే పూర్తి స్థాయి బడ్జెట్. ఈ సమావేశంలో ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ, వ్యవసాయ మంత్రి రాధామోహన్ సింగ్, వివిధ శాఖల కార్యదర్శులు హాజరయ్యారు.

2017 సెప్టెంబర్‌తో అంతమైన ఆరు నెలల్లో ఆర్థిక వ్యవస్థ ఆరు శాతం విస్తృతమైనట్టు కేంద్ర గణాంక శాఖ కార్యాలయం తెలిపింది. 2018 ఆర్థిక సంవత్సరంలో అది 6.5 శాతానికి విస్తృతం కావచ్చని కూడా పేర్కొంది. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ వల్ల కొన్ని ఒడిదుడుకులు ఎదురైనా, క్రమంగా వృద్ధి రేటు పెరుగుతోంది.

ఆదాయం పన్ను శ్లాబ్ పెంపు?

కొత్త బడ్జెట్‌లో ఆదాయం పన్ను మినహాయింపు పరిమితిని రెండున్నర లక్షల నుంచి మూడు లక్షలకు పెంచే అవకాశం ఉంది. వేతన జీవులకు, ముఖ్యంగా, మధ్యతరగతి వర్గాలకు దీని వల్లఎంతో ఉపయోగం ఉంటుంది. దీని వల్ల ప్రభుత్వ రాబడి తగ్గుతుంది. మధ్యతరగతికి ఊరట కలిగించాలని నిపుణులు ప్రభుత్వానికి సూచించారు.

కార్పొరేట్ పన్ను తగ్గిస్తారా?

కార్పొరేట్ పన్ను తగ్గించాలని కార్పొరేట్ వర్గాలు చాలా కాలంగా కోరుతున్నాయి. వస్తు, సేవా పన్ను (జీఎస్‌టీ) పై కార్పొరేట్ వర్గాలు వివరణలు కోరుతున్నాయి. కార్పొరేట్ పన్ను తగ్గించడం సాధ్యం కాకపోవచ్చు నేమోననిపిస్తోంది. తయారీ, ఎగుమతుల రంగాలకు ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల వ్యయాన్ని నియంత్రించడం కోసం ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టనున్నట్టు ఇటీవల ప్రకటించింది. దేశంలో తాజా పరిణామాల నేపథ్యంలో ఇది చాలా ముఖ్యమైన చర్య.


అమెరికాలో ఇటీవల కార్పొరేట్ పన్ను తగ్గించిన దృష్ట్యా, మన దేశంలో కార్పొరేట్ పన్ను వ్యవస్థ ఎలా ఉంటుందోనన్న ఆత్రుత ఆ వర్గాల్లో ఉంది. పెట్టుబడులను ఆకర్షించడానికి కార్పొరేట్ పన్ను తగ్గిస్తారా? యథాతథంగా కొనసాగిస్తారా అనేది చూడాల్సి ఉంది.

> **షేర్లపై పన్ను?**
>
> షేర్లపై పన్ను విధించే అవకాశం ఉంది. అన్ని వర్గాలకూ సంతృప్తి కలిగించే బడ్జెట్‌ని ఈసారి తీసుకుని వస్తామని ప్రభుత్వం గత బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించినప్పటికీ, అది సమస్యాత్మకమే అవుతుంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుజేస్తున్న గంగానది ప్రక్షాళన, స్వచ్ఛ భారత్ వంటి పథకాలకు నిధులు కేటాయించడం ప్రభుత్వానికి సమస్యే అవుతుంది.

బడ్జెట్‌లో చేర్చాలని కోరారు. ప్రజాకర్షణ పథకాలకు నిధులు వెచ్చిస్తే దేశంలో తీవ్ర పరిణామాలు ఏర్పడతాయని నీతి ఆయోగ్ హెచ్చరించింది. జనాకర్షణ పథకాలు ఇప్పటికే ప్రభుత్వానికి పెను భారమయ్యాయి. బడ్జెట్‌లో ఆర్థిక లోటు 3.2 శాతాన్ని ప్రభుత్వం పూడ్చాల్సి ఉంది. ఇది చాలా కష్టమే. రానున్న సంవత్సరాలకు మార్గదర్శకాలను బడ్జెట్‌లో ప్రభుత్వం పొందుపర్చవచ్చు.

వాణిజ్య వర్గాల లాబీయింగ్

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల తేదీ దగ్గర పడుతుండటంతో వాణిజ్య వర్గాలు ఆర్థిక మంత్రిత్వ శాఖతో లాబీయింగ్ చేయడం మొదలు పెట్టాయి. మ్యూచువల్ ఫండ్స్, బీమా, తయారీరంగం తదితర రంగాలకు చెందిన వారు తమ ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు అందజేశారు. వాటిని కొత్త బడ్జెట్‌లో చేర్చాలని కోరారు.



వాగ్దానాల అమలు కత్తిమీద సామే

జీఎస్‌టీని ప్రవేశపెట్టిన తర్వాత ఆర్థిక వ్యవస్థ నిర్వహణ కత్తిమీద సాముగానే తయారైంది. వాగ్దానాల అమలు అంత సులభం కాదు. బ్యాంకుల్లో మొండిబకాయిలు వసూళ్ళు అంతంత మాత్రంగా ఉండటంతో బ్యాంకుల మూలధనం కోసం లక్షల కోట్ల రూపాయిలు సమకూర్చాల్సి వస్తోంది. గుజరాత్ ఎన్నికల్లో అధికార పార్టీ (బీజేపీ) గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతినడం ఆ ప్రాంతాల్లో పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో తెలియజేస్తోంది. ఉపాధి కల్పన కార్యక్రమం మందకొడిగా సాగుతోంది. జీఎస్‌టీ వల్ల చిన్న వ్యాపారస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్న వాగ్దానాన్ని ప్రభుత్వం నిలబెట్టుకోవల్సి ఉంది.

ఆదాయాన్ని సమకూర్చుకోవడం ఒక్కటే సమస్యకాదనీ, దానిని ప్రభుత్వం ఎలా ఖర్చు చేస్తుందో చూడాల్సి ఉందని క్రిసిల్ రేటింగ్ సంస్థ ప్రధాన ఆర్థికవేత్త డికె దోషి అన్నారు.

కొత్త బడ్జెట్‌లో మౌలిక సదుపాయాలు, గ్రామీణ ఆర్థిక భారం మొదలైన అంశాలకు ప్రాధాన్యం లభించవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రధాన ఆర్థిక వేత్త అభీక్ బారువా అన్నారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న బ్యాంకుల శాఖలనూ, ఏటీఎంలనూ తగ్గించుకోవల్సిందిగా ప్రభుత్వం ఆదేశించవచ్చని ఆయన అన్నారు.

ద్రవ్యలోటును పూరించడం ప్రభుత్వానికి సవాలేనని ఆనంద్ రాఠీ సెక్యూరిటీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుజన్ హజ్రా అన్నారు.


2015 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ని ప్రవేశపెడుతూ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కార్పొరేట్ పన్ను 30 నుంచి 25 శాతానికి తగ్గిస్తామన్న వాగ్దానం చేశారు. నేటికీ ఆ హామీ నెరవేర్చలేదు. గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆర్థికమంత్రిపై పారిశ్రామికవర్గాలు ఒత్తిడి తెస్తున్నాయి. ఇవన్నీ తట్టుకుని ముందుకు సాగడం జైట్లీకి క్లిష్టసమస్య.

చైనా బ్లాక్‌లిస్ట్‌లో 9 మిలియన్ల డిఫాల్టర్లు

బీజింగ్: రుణాలు ఎగ్గొట్టిన 9.59 మిలియన్లకు పైగా వ్యక్తులను చైనా కోర్టులు బ్లాక్ లిస్ట్‌లో ఉంచాయి. 2017 సంవత్సరాంతానికి వారికి చెందిన 27.7 బిలియన్ల డాలర్ల మేర డిపాజిట్లను కోర్టులు స్తంభింపజేశాయని చైనాకు చెందిన సుప్రీం పీపుల్స్ కోర్టు(ఎస్‌పీసీ) శనివారం ప్రకటించింది. గతేడాది చివరకు ఎగవేతదారులను 9.36 మిలియన్ విమాన టికెట్లు, 3.67 మిలియన్ స్పీడ్ రైలు టికెట్లకు మించి కొనుగోలు చేయకుండా నిలువరించినట్టు తెలిపింది. ఎగవేతదారుల ఐడీ కార్డు సమాచారం, పాస్‌పోర్టులు ఆధారంగా వారిని టికెట్లు కొనుగోలు చేయడంలో ఎయిర్‌లైన్స్, రైల్వే కంపెనీలకు ఎస్‌పీసీ సహకరించింది. అంతేకాక రుణాలు, క్రెడిట్ కార్డు కోసం ఎగవేతదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను తిరస్కరించడంలో బ్యాంకులతో కలిసి ఎస్‌పీసీ పనిచేసిందని ప్రభుత్వ వార్తా సంస్థ జిన్‌హువా నివేదించింది. కోర్టులు దేశవ్యాప్తంగా ఎగవేతదారులకు చెందిన మొత్తం 180 మిలియన్ యువాన్(27.7 బిలియన్ డాలర్లు)కు పైగా డిపాజిట్లను స్తంభింపజేశాయని ఎస్‌పీసీ వెల్లడించింది. బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ప్రజలను కార్పొరేట్ ప్రతినిధులు లేదా ఎగ్జిక్యూటివ్‌ల సేవలందించడం నుంచి కూడా నిలువరించారు.

అమేజాన్‌లో షాపర్స్ స్టాప్ బ్రాండ్‌లు

- రూ.179.26 కోట్ల ఈక్విటీలు కేటాయించిన షాపర్స్ స్టాప్




న్యూఢిల్లీ: రిటైల్ చైన్ సంస్థ షాపర్స్ స్టాప్, ప్రముఖ ఆన్‌లైన్ సేల్స్ సంస్థ అమేజాన్‌కు రూ.179.26 కోట్ల ఈక్విటీ షేర్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. శుక్రవారం షాపర్స్ స్టాప్ ప్రైవేట్ ప్లేస్‌మెంట్ కమిటీ సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా అమేజాన్.కామ్ ఇన్వెస్ట్‌మెంట్ విభాగం ఎన్వీ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ ఎల్‌ఎల్‌సీకు రూ.179.26 కోట్ల ఈక్విటీ షేర్లను ఇస్తున్నట్లు తెలిపింది. బీఎస్‌ఈకి వివరాలను ఫైలింగ్ చేస్తూ.. తాము 43,95,925 ఈక్విటీ షేర్లను జారీ చేశామని షాపర్స్ స్టాప్ పేర్కొంది. ఒక్కో ఈక్విటీ షేర్ ధర రూ.407.78 నిర్ణయించింది. కాగా షాపర్స్ స్టాప్ గత సెప్టెంబర్‌లో అమేజాన్.కామ్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ ఎల్‌ఎల్‌సీతో ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీని ప్రకారం షాపర్స్ స్టాప్ అమేజాన్ మార్కెట్ ప్లేస్‌లో ప్రత్యేక ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను కలిగి ఉంటుంది. నిర్ణీత పరిమితులకు లోబడి 2016 నుంచి ఈ రెండు కంపెనీలు భాగస్వామ్యాన్ని కలిగిఉన్నాయి. దీని ప్రకారం షాపర్ స్టాప్ ఉత్పత్తులు కొన్నింటికే అమేజాన్‌లో చోటు దొరికింది. ఈ నేపథ్యంలో షాపర్ స్టాప్ అమేజాన్‌లో తన బ్రాండ్ల సంఖ్యను పెంచుకోవడానికి తాజాగా ఈక్విటీ షేర్లను అమేజాన్‌కు కేటాయించింది. మొత్తం 400 కేటగిరీల్లోని ఉత్పత్తులు అమేజాన్‌లో వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయి.

ఏడు వారాల గరిష్ఠానికి బంగారం



న్యూఢిల్లీ: దేశీయ బులియన్ మార్కెట్‌లో శనివారం బంగారం ధర ఏడువారాల అత్యధిక స్థాయికి చేరింది. 99.5శాతం శుద్ధమైన బంగారం 10 గ్రాములకు రూ.100 పెరిగి రూ.30,750 వద్ద ముగిసింది. స్థానిక నగల తయారీదారులనుంచి బంగారానికి డిమాండ్ పెరగటం, అటు విదేశాల్లో కూడా బంగారం వినియోగదారులు కొనుగోళ్లకు కెగపడటం ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. మరోపక్క నాణేల తయారీకి, పారిశ్రామికదారుల నుంచి వెండికి డిమాండ్ పెరగటంతో వెండి కూడా కిలోకు రూ.100 పెరిగింది. కిలో వెండి రూ.39,900వద్ద ముగిసింది. విదేశీ మధుపరులు బంగారం బాండ్ల కోసం ఎగడ్డారు. శుక్రవారం న్యూయార్క్‌లో బంగారం ధర 1.17శాతం పెరిగింది ఔన్సు బంగారం ధర 1,337.40 అమెరికా డాలర్లు పలుకగా, వెండి ఔన్సు ధర 1.44 శాతం పెరిగి 17.21 అమెరికన్ డాలర్లు పలికింది. కాగా ఢిల్లీలో 99.9శాతం శుద్ధమైన 10 గ్రాముల ధర రూ.30,600 పలుకగా, 99.5శాతం శుద్ధమైన బంగారం ధర రూ.30,750 పలికింది. గత ఏడాది నవంబర్ 18 ఈ స్థాయి ధరలు నమోదయ్యాయి. కాగా ఈ విలువైన లోహం గత రెండురోజుల్లో రూ.175 లాభపడింది. సావరిన్ గోల్డ్ 8 గ్రాముల బార్ ధరలో ఎటువంటి మార్పు చోటుచేసుకోలేదు. దాని ధర రూ.24,700తో స్థిరంగా ఉంది. వెండి కూడా రూ.100పెరిగి కిలో వెండి రూ.39,900 పలికింది. వీక్లి బేస్డ్ డెలివరీలో వెండి రూ.40 పెరిగి రూ.39,120 పలికింది. 100 వెండి నాణేలను కొనుగోలుదార్లు రూ.74000 కొని రూ.75,000 అమ్మారు.


ఆంధ్రా బ్యాంక్ మాజీ డైరెక్టర్ అరెస్ట్



న్యూఢిల్లీ: రుణాల జారీకి సంబంధించిన మోసం కేసులో ఆంధ్రాబ్యాంక్‌కు చెందిన అధికారిని ఈడీ శనివారం అరెస్టు చేసింది. ఈ కేసులో ఇది రెండవ అరెస్టు. గత నవంబర్‌లో ఇదే కేసులో ఢిల్లీకి చెందిన వ్యాపార వేత్త గగన్ ధావన్‌ను ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.. ఈ మేరకు వివరాలను ఈడీ అధికారులు మీడియాకు వెల్లడించారు. బోగస్ సంస్థల పేర రూ.5వేల కోట్లకు పైగా రుణాలు తీసుకోవడానికి ఆంధ్రా బ్యాంక్ డైరెక్టర్‌గా ఉన్న అనూప్ గార్గ్ సహకరించాడని ఈడీ పేర్కొంది. అంతేకాక సదరు కంపెనీలు మనీ లాండరింగ్(హవాలా) కు పాల్పడి బ్యాంకును మోసం చేశారని ఈడీ దర్యాప్తులో తేల్చింది. ఈ కేసులో గుజరాత్‌కు చెందిన ఫార్మా కంపెనీ ప్రమేయం కూడా ఉందని పేర్కొంది. ఇందుకు ఆంధ్ర బ్యాంక్ మాజీ డైరెక్టర్ అనూప్ గార్గ్ సహాయం చేశాడని ఈడీ పేర్కొంటూ.. ఆయనను శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు వెల్లడించింది. గార్గ్‌ను హవాలా నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) కింద అరెస్టుచేశామని త్వరలో ప్రత్యేక కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఈడీ వెల్లడించింది. ఈకేసులో నిందితుడిగా గార్గ్‌ను అటు ఈడీ, సీబీఐ పేర్కొన్నాయి. సీబీఐ ఎఫ్ఐఆర్‌ను ఆధారంచేసుకొని ఈడీ గార్గ్‌పై మనీ లాండరింగ్ కేసును నమోదు చేసింది. బ్యాంకు రుణాలను సందేసారా బ్రదర్స్‌కు ఇప్పించటంలో సహాయం చేసిన ఆంధ్ర బ్యాంక్ డైరెక్టర్ గార్గ్ కు ప్రతిఫలంగా 2008-09 కాలంలో ఆ సంస్థ రూ.1.52 కోట్ల నగదును చెల్లించినట్లు 2011లో ఇన్‌కంట్యాక్స్ శాఖ గుర్తించింది. సందేసారా బ్రదర్స్ నెలకొల్పిన పలు బినామీ కంపెనీల ఖాతాల నుంచి గార్గ్‌కు చెల్లింపులు జరిగాయని ఐటీ శాఖ తెలిపింది. గార్గ్ లెక్కల్లో చూపని కోట్లకొద్దీ ధనాన్ని కోల్‌కతా బేస్డ్ షెల్(నకిలీ) కంపెనీలకు మళ్లించాడు. ఇందుకు కోల్‌కతా లోని క్యాష్/చెక్ ఎంట్రీ ఆపరేటర్లను ఉపయోగించుకున్నాడని ఈడీ పేర్కొంది.

నాణేల తయారీ తిరిగి షురూ.. మింట్లు ఒకే షిఫ్ట్ పనిచేస్తాయి

- తాజా ఆదేశాలు జారీ



కోల్‌కతా: నాణేల తయారీని ఆపేస్తున్నట్లు ఇటీవల ప్రకటించిన ప్రభుత్వం, శనివారం ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు ప్రకటించింది. దేశంలో ఉన్న నాలుగు నాణేల ఉత్పత్తి కేంద్రాల్లో తిరిగి తయారీ ప్రకియను చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే సెక్యూరిటీ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎస్‌పీఎంసీఐఎల్)ను కేంద్రం ఆదేశించింది. ఎస్‌పీఎంసీఐఎల్ ఆధ్వర్యంలో కోల్‌కతా, ముంబై, నియిడా, హైదరాబాద్‌లోని మింట్లు పనిచేస్తున్నాయి. రోజుకు రెండు షిఫ్ట్‌లు పనిచేసే ఈ మింట్లను ఇకనుంచి ఒక షిఫ్ట్‌కే పరిమితం చేయాలని కేంద్రం ఆదేశించింది. 'శుక్రవారం నుంచి నాణేల తయారీ ప్రారంభించాము. అన్ని డినామినేషన్లతో కూడిన నాణేలను తయారుచేయాలని ప్రభుత్వం మమ్మల్ని కోరింది' అని కోల్‌కతా మింట్ ఉద్యోగుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బిజన్ దేవ్ శనివారం మీడియకు తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) 2017-18 ఆర్థిక సంవత్సరంలో 7,712 మిలియన్ల నాణేలు తయారీకి ఆర్డర్ ఇవ్వగా, ఇప్పటివరకు 5,900 మిలియన్ నాణేలను ఉత్పత్తి జరిగింది. మిగతా నాణేల ఉత్పత్తిని వచ్చే రెండు నెలల్లో పూర్తి చేస్తామని మింటింగ్ కంపెనీలు అంటున్నాయి. తయారైన నాణేలు, కరెన్సీని ఆర్బీఐ మార్కెట్లో పంపిణీ చేస్తుంది. అయితే, మార్కెట్లో నాణేల చలామణి విపరీతంగా పెరిగిపోవటం, మరోపక్క ఇప్పటికే ఉత్పత్తి అయిన నాణేలు కుప్పలుగా మింట్లలో పేరుకుపోవడంతో వీటి ఉత్పత్తిని నిలిపివేయాలని జనవరి 9న ఆర్బీఐ నిర్ణయించి ఎస్‌పీఎంసీఐఎల్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎస్‌పీఎంసీఐఎల్ దేశంలోని నాలుగు మింట్ కంపెనీలకు ప్రభుత్వ ఉత్తర్వులను తెలుపుతూ నాణేల ఉత్పత్తిని, పంపిణీని తక్షణమే ఆపేయాలని ఆదేశించింది. మింట్లలో పనిచేసే కార్మికులు బ్యాంక్ నోట్ల ముద్రణచేస్తూ ఓవర్‌టైం చేయకుండా సాధారణ పనిగంటలకే పరిమితం కావాలని సూచించింది.

మింట్ కార్మికుల వ్యతిరేకతతో దిగొచ్చిన ప్రభుత్వం

ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిం చిన మింట్ల కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ ఆదేశాలు తమ జీతాలపై తీవ్ర ప్రభావంను చూపుతాయని కార్మికులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ప్రతినిధులు, కార్మిక నేతల చర్చలు జరిగాయి. ఫలితంగా ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని తిరిగి మింట్లలో నాణేల ఉత్పత్తి ప్రారంభానికి ఒప్పుకుంది. అంతకు ముందు నాణేల ఉత్పత్తి ప్రక్రియను నాణేల చలామణి, నిల్వ సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని చేయాలని ఆర్బీఐ పేర్కొంది. ఇప్పటికే భారీగా నాణేలు ఉత్పత్తి చేయగా వాటిని బ్యాంకులు, ఆర్బీఐలలో నిల్వచేయడానికి వీలులేకపోవడంతో ఉత్పత్తిని నిలిపివేయాలని సూచించింది. ఈ ఆదేశాలు వెలువడే సమయానికి తయారీ ప్రక్రియ పూర్తిచేసుకొని 2,528 మిలియన్ల నాణేలు మింట్లలో చలామణికి సిద్ధంగా ఉన్నాయి అయితే వాటిని ఆర్బీఐ పంపిణీకోసం తీసుకోలేదు.

సంక్షోభ విద్యుత్ ప్రాజెక్టులపై జైట్లీ సమీక్ష

- లెండర్స్, సీనియర్ అధికారులతో భేటీ

న్యూఢిల్లీ: దేశంలో కొన్ని విద్యుత్ ప్రాజెక్టులు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. శనివారం, జైట్లీ సీనియర్ అధికారులు, రుణ సంస్థల ప్రతినిధులతో కలసి సమీక్షను నిర్వహించారు. దేశంలో కొన్ని విద్యుత్ ప్రాజెక్టులు ఆర్థికసమస్యలతో ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని వీటిలో టాటా పవర్, గుజరాత్‌లో అదాని గ్రూప్ ఉన్నాయని తెలిపారు. ఈ అత్యున్నత అధికార సమావేశంలో పాల్గొన్న అధికారుల్లో ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి నృపేంద్ర మిశ్రా, విద్యుత్ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ తదితరులు ఉన్నారు. గతేడాది ఆర్థిక సంక్షోభం లో చిక్కుకున్న టాటా పవర్ తన ముంద్రా పవర్ ప్రాజెక్టు(4000 మెగావాట్ల సామర్థ్యం)లో 51శాతం వాటాలను గుజరాత్‌కు ఇచ్చేందుకు సంసిద్ధమైంది. గుజరాత్ ఈ ప్రాజెక్టు నుంచే విద్యుత్‌ను పొందుతున్న విషయం తెలిసిందే.. మరోవైపు అదానీ గ్రూప్ గుజరాత్‌లో విద్యుత్ టారిఫ్‌ను అత్యధికంగా నిర్ణయించింది. అయితే ఈ ఆరోపణను ఆ కంపెనీ తిరస్కరిస్తూ.. గత నాలుగేళ్లుగా యూనిట్‌కు రూ.2.65 అమ్ముతున్నామని పేర్కొంది. టాటా పవర్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించే ముంద్రా ప్రాజెక్ట్ విషయంలో టాటా పవర్ సంస్థ గుజరాత్ ఉర్జా వికాస్ నిగం లిమిటెడ్‌కు ఒక లేఖ రాస్తూ ఈ ప్రాజెక్టులో తాము 49 శాతంను ఉంచుకుంటామని తెలిపింది. ఈ లేఖ ప్రతులను ప్రధాని ప్రిన్సిపల్ కార్యదర్శికి, విద్యుత్ మంత్రిత్వ శాఖ కార్యదర్శులకు కూడా పంపింది. కోస్టల్ గుజరాత్ పవర్ లిమిటెడ్(సీజీపీఎల్), సీఈవో కృష్ణకుమార్ శర్మ దీనిపై స్పందిస్తూ.. ముంద్రా రూ.6,457 కోట్ల నష్టాలను మూటకట్టుకుందని తెలిపారు. దీని పెయిడప్ ఈక్విటీ విలువ రూ.6,083 కోట్లుగా ఉందని ఆయన చెప్పారు. కంపెనీ రుణాలు రూ.10,159 కోట్లుగా ఉన్నాయని... రుణదాతలు ఇప్పటికే కొత్తగా ఇచ్చే ఆర్థిక సహాయాన్ని నిలిపివేశాయని చెప్పారు. టాటాపవర్ సంస్థ గుజరాత్‌లో ముంద్రా ప్రాజెక్టును రూ.2.26 కోట్ల బిడ్‌తో 2006 ఫిబ్రవరిలో దక్కించుకుంది. ఇక్కడ విద్యుదుత్పత్తికోసం ఇండోనేసియాలో తనకున్న బొగ్గు గనుల నుంచి బొగ్గును తెప్పించుకొని వినియోగించాలని భావించింది.

ఐడిఎఫ్‌సి బ్యాంక్, క్యాపిటల్ ఫస్ట్ విలీనం


ముంబై: ఐడిఎఫ్‌సి బ్యాంక్, క్యాపిటల్ ఫస్ట్ విలీనానికి సంబంధిత బోర్డులనుంచి అనుమతులు వచ్చాయని ఇరు కంపెనీలు శనివారం ప్రకటించాయి. క్యాపిటల్ ఫస్ట్ అనేది ఆర్థిక లావాదేవీలు నిర్వహించే బ్యాంకేతర కంపెనీ. ఈ ఒప్పందంలో భాగంగా ఐడిఎఫ్‌సి బ్యాంక్, క్యాపిటల్ ఫస్ట్ షేర్ల జారీ నిష్పత్తి 139:10 గా ఉండనుంది. ఈ మేరకు ఐడిఎఫ్‌సి బ్యాంక్ ఎండి, సీఈవో రాజీవ్‌లాల్ ఒక ప్రకటన చేస్తూ.. ఈ విలీనంతో తమ బ్యాంకు ప్రపంచ స్థాయి బ్యాంకుగా రూపు దిద్దుకుంటుందన్నారు. క్యాపిటల్ ఫస్ట్ తన రిటైల్ లెండింగ్ శాఖ దాని రుణాల ఖాతా రూ.22,974 కోట్లు(సెప్టెంబర్ 2017నాటికి), 30లక్షలమంది ఖాతాదారులు, దేశంలో ఉన్నా 228 ప్రాంతాల్లో ఉన్న పంపిణీ వ్యవస్థ ఈ విలీనంలో భాగమవుతోంది. ఈ సంస్థ గత ఐదేళ్లుగా అస్థులు, నిర్వహణ (ఎయుఎం) కింద సిఎజిఆర్ 27 శాతం వృద్ధిని నమోదు చేసుకుంది. కాగా లాభాలు 40 శాతం నమోదు చేసుకుంది. ఏటా మొత్తం ఎన్‌పిఏ(నిరర్థక ఆస్తులు లేదా మొండిబకాయిలు) విలువ మొత్తం విలువలో పెరుగుదల 1.63 శాతం ఉండగా, నికర విలువలో పెరుగుదల ఒక శాతంగా ఉంది. విలీన అనంతరం సంయుక్త కంపెనీ విలువ ఎయుఎం రూ.88,000 కోట్లుగా ఉంటుంది.

జీజేఈపీసీ నార్త్ రీజియన్ చైర్మన్‌గా అశోక్ సేథ్

న్యూఢిల్లీ: జెమ్, జెవర్లీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (జీజేఈపీసీ) ఉత్తర ప్రాంతంకు కొత్త చైర్మన్‌గా అశోక్ సేథ్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించింది. ఈ ఉత్తర ప్రాంతంలో ఢిల్లీ ఎన్‌సీటీ, హర్యానా, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరా ఖండ్, జమ్ము, కశ్మీర్‌లున్నాయి. జీజేఈపీసీని 1966లో వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ నెలకొల్పింది. దేశంలో వజ్రాలు, ఆభరణాల ఎగుమతుల అభివృద్ధికి ఈ సంస్థ పాటుపడుతుంది.

రిఫైనరీల సామర్థ్యం రెట్టింపునకు 300 బిలియన్ డాలర్లు అవసరం

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి



భువనేశ్వర్: భారత్ తన చమురు శుద్ధి సామర్థ్యాన్ని వచ్చే రెట్టింపు చేయాలంటే 300 బిలియన్ డాలర్ల పెట్టుబడి అవసమవుతుందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. శనివారం ప్రధాన్ భువనేశ్వర్‌లో 22వ పెట్రోరసాయనాల శుద్ధి సాంకేతికత సదస్సును ప్రారంభించారు. 'ప్రస్తుతం దేశం చమురు శుద్ధి సామర్థ్యం 247 మిలియన్ టన్నులుందని మరోవైపు పెట్రో రసాయనాలకు డిమాండ్ రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతున్నది. 2040 నాటికి ఈ డిమాండ్ 600 మిలియన్ టన్నులకు చేరుతుంది. ఈ డిమాండ్‌ను సంతృప్తి పరిచేందుకు వచ్చే పదేళ్లలో ఈ రంగంలో 300 బిలియన్ డాలర్ల పెట్టుబడి చేయాల్సి ఉంది ' అని ప్రధాన్ తన ప్రసంగంలో తెలిపారు. దేశం అనేక ఏళ్లుగా కృషిచేసి ఈ రంగాన్ని శక్తివంతంగా తీర్చిదిద్దన్నారు. 142 మిలియన్ టన్నుల సామర్థ్యంతో పాత ప్లాంట్ల స్థానంలో నిర్మిస్తున్న బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు దేశంలో ఇప్పటికే చివరి దశలో ఉన్నాయని మంత్రి తెలిపారు. 69 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యమున్న గ్రీన్ ఫీల్డ్ (ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రారంభించే కొత్త కర్మాగారాలు) ప్రాజెక్టులను త్వరలో ప్రారంభించనున్నామన్నారు. రాజస్థాన్‌లోని బార్మెర్ రిఫైనరీ ఏడాదికి 9మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగివుండగా, వెస్ట్‌కోస్ట్ రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్స్ 60 మిలియన్ టన్నుల సామర్థ్యంను కలిగిఉందని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. 600 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సాధించడానికి ఏడాదికి 20 మిలియన్ టన్నులకు పైగా సామర్థ్యాన్ని ప్రస్తుత ఉత్పత్తికి జోడించాల్సింటుందని మంత్రి చెప్పారు. ' దేశం ఈ లక్ష్యం సాధిస్తుందని నాకు పూర్తి విశ్వాసం ముంది. ఇందుకు పెట్రో రసాయనాల రంగంలో 300 బిలియన్ డాలర్ల పెట్టబడి అవసరముంటుంది. దీనిపై వెనుకడుగు వేసే ప్రసక్తి రాదు' అని మంత్రి అన్నారు. ఈ రంగంను మరింత శక్తివంతంగా మార్చడానికి ప్రభుత్వం పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సి ఉందంటూ.. ప్రస్తుతమున్న ఆర్ అండ్ డీ ప్రక్రియ సంతృప్తికరంగా లేదని మంత్రి పరోక్షంగా సూచించారు. చమురు శుద్ధి రంగానికి అటోమేషన్, డిజిటైజేషన్, రోబోటిక్స్, విద్యుత్ వాహనాలు, కృత్రిమ మేధస్సు వంటి అవసరాలు దినదినానికి పెరుగుతున్నప్పటికి... మనదేశంలో ఈ రంగం మానవ మేధస్సు, శిక్షణ పొందిన మానవ వనరులతో ముందుకు దూసుకుపోతున్నదని మంత్రి ప్రశంసించారు. 'నేను మానవ మేధస్సు, ఉన్నత శిక్షణ పొందిన మానవ వనరులను విశ్వసిసున్నాను' అని మంత్రి అన్నారు. ఈ సదస్సులో పాలుపంచుకున్న జపాన్ రాయబారి కింజో హిరామట్సు మాట్లాడుతూ.. తమ దేశం భారత్‌లో వ్యాపార బంధాలను మరింత పటిష్టం చేసుకోవాలని భావిస్తున్నదని చెప్పారు. తమ దేశం భారత్‌లో ద్రవ సహజ వాయువు(ఎల్‌ఎన్‌జీ) రంగంలో 10 బిలియన్ డాలర్లను పెట్టుబడి పెట్టనున్నట్లుగా తెలిపారు. ముఖ్యంగా ఒడిశా, జపాన్‌ల మధ్య సహకారం మరింత బలోపేతం చేసుకుంటామన్నారు. మూడు రోజులు జరగనున్న ఈ సదస్సులో భారత్, విదేశాలనుంచి వచ్చిన 900 మంది పరిశ్రమ నిపుణులు హాజరు అవుతున్నారు. ఈ సదస్సును పెట్రోలియం, సహజవాయవు మంత్రిత్వ శాఖకు చెందిన సెంటర్ ఫర్ హై టెక్నాలజీ(సీహెచ్‌టీ), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ డౌన్‌స్ట్రీమ్ హైడ్రో కార్బన్' సదస్సు థీమ్‌గా నిర్ణయించారు.

స్టాంపులు-రిజిస్ట్రేషన్లశాఖ ఐజీగా వాకాటి కరుణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రెవెన్యూ శాఖలో భారీ సంస్కరణల దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ప్రజలతో నేరుగా సంబంధాలు కల్గి ఉండి సర్కారీ ఖజానాకు ఆదాయం తెచ్చే స్టాంపులు-రిజిస్ట్రేషన్ శాఖలో ఇప్పటికే మూకుమ్మడి బదలీలతో ప్రకంపనలు సృష్టించిన ప్రభుత్వం తాజాగా ఈ శాఖ ఐజీ(ఇన్స్‌స్పెక్టర్ జనరల్)గా వాకాటి కరుణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె భూ రికార్డుల ప్రక్షాళనలో కీలక బాధ్యతలను సమర్ధవంతంగా పోషించారు. ఆమె ఇప్పటికే భూ పరిపాలనా శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలను నిర్వహిస్తుండగా తాజాగా స్టాపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. కార్మిక శాఖ కార్యదర్శిగా ఉన్న నదీం అహ్మద్ ఇప్పటివరకు ఐజీగా ఇంచార్జి బాధ్యతలు నిర్వహించారు. వాకాటి కరుణకు పూర్ది అదనపు బాధ్యతలను కట్టబెట్టడంతో తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా పూర్తి స్థాయి ఐజీని నియమించినట్లయింది.

నా ఆరోపణలు తప్పయితే జైల్లో పెట్టండి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అధికార టీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి స్వరం పెంచారు. విద్యుత్ కొనుగోలులో జరిగిన అక్రమాలను నిరూపించడానికి గన్‌పార్కు వద్ద వేచి చూశామని, టీఆర్ఎస్ నేతలు ఎందుకు రాలేదో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. 'రేవంత్‌రెడ్డి చిన్న రవ్వంతవు అన్నారు. కానీ నీ కొంపను తగులబెట్టడానికి ఒక నిప్పు రవ్వచాలు' అంటూ ఆయన హెచ్చరించారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. తప్పుడు ఆరోపణలు చేస్తే జైల్లో పెడుతామని అసెంబ్లీలో సీఎం కేసీఆర్ చెప్పారని, ఒక వేళ తనవి తప్పుడు ఆరోపణలని తేలితే అరెస్టు చేసి జైల్లో పెట్టొచ్చని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. విద్యుత్ కోతలు లేకపోవడానికి సోనియాగాంధీ నిర్ణయమే కారణమని, తెలంగాణకు 53.8 శాతం విద్యుత్ కేటాయింపులు జరిగాయన్నారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై ఇద్దరి మీదనే కేసులు (ఎఫ్ఐఆర్) నమోదయినట్లు ఎంపీ బాల్క సుమన్ ఒప్పుకున్నారని ఆయన వివరించారు. అంటే సీఎం చంద్రశేఖర్‌రావు తప్పుచేసినట్లే కదా..? అంటూ రేవంత్‌రెడ్డి నిలదీశారు. జెన్‌కో ఉత్పత్తిని తగ్గించి ప్రైవేట్ సంస్థల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేసి ప్రజలపై ప్రభుత్వం భారం వేస్తోందన్నారు.

'త్రిఆర్'పై నెరవేరని లక్ష్యం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస విద్యా సామర్థ్యాలు పెంచడం కోసం పాఠశాల విద్యా శాఖ చేపట్టిన త్రి ఆర్ కార్యక్రమం అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయింది. చదవడం, రాయడం, అర్థమెటిక్‌పై చేపట్టిన త్రి ఆర్ పథకాన్ని 60 రోజులపాటు నిర్వహించారు. డిసెంబర్‌లో ఆయా విద్యార్థులకు పరీక్షలను సైతం నిర్వహించారు.త్రిఆర్ కార్యక్రమం ఎలా అమలు జరిగిందనేదానిపై పాఠశాల విద్య సంచాలకులు సమీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించిన నివేదికను ఈ నెల 22న ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉంది.

60 రోజులపాటు కొనసాగిన కార్యక్రమం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 3 నుంచి 10వ తరగతి వారికి కనీసం తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో చదవడం, రాయడం సరిగా రావడం లేదని, అదేవిధంగా గణితంలో లెక్కలను అర్థం చేసుకొని వాటిని సాధించడం(అర్థమెటిక్)లో వాటిలో అభివృద్ధి జరగాలనే ఉద్దేశంతో పాఠశాల విద్యాశాఖ త్రి ఆర్‌ను ప్రారంభించింది. త్రి ఆర్‌ను 60 రోజులపాటు కొనసాగించాలని నిర్ణయించింది. ఆగస్టులో ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని డిసెంబర్‌లో ముగించారు. మొత్తంగా 60 రోజులపాటు నిర్వహించారు. విద్యార్థులకు రాయడం, చదవడం ప్రత్యేకంగా నేర్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమాన్ని ముగించి డిసెంబర్‌లో ఆయా విద్యార్థులకు పరీక్షలను సైతం నిర్వహించారు. త్రి ఆర్‌ను అమలు చేయడం కోసం ప్రత్యేకంగా టీమ్‌లను ఏర్పాటు చేశారు. అందులో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులే ఉన్నారు. వారు జిల్లాల్లో కొన్ని పాఠశాలలకు వెళ్లి త్రి ఆర్ ఎలా అమలు జరుగుతుందో పర్యవేక్షించాల్సి ఉంటుంది.

త్రి ఆర్‌పై తనిఖీలు

త్రి ఆర్ కార్యక్రమం ఎలా జరిగిదనే దానిపై తనిఖీలు చేయడానికి పాఠశాల విద్యా శాఖ ప్రత్యేకంగా రీసోర్స్ పర్సన్లను నియమించింది. రీసోర్స్ పర్సన్లు జనవరి 3 నుంచి 9 వరకు త్రిఆర్ అమలు జరిగిన ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించారు. వాటిలో చాలా వరకు ప్రైమరీ పాఠశాలల్లో త్రి ఆర్ సక్రమంగా అమలు జరగలేదని తేలింది. త్రి ఆర్‌ను ఆయా పాఠశాల ఉపాధ్యాయులు అమలు చేయడంలో విఫలమయ్యారని వారి పరిశీలనలో తేలింది. కొందరు ఉపాధ్యాయులు అయితే మొదటి దశలో త్రి ఆర్‌ను అమలు చేసినప్పటికీ రెండో దశలో వాటి గురించి పట్టించుకోలేదు. దీంతో ఆయా విద్యార్థులు దీనిని పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో వారిలో అభివృద్ధి కనిపించలేదు. ఇటువంటి పాఠశాలలే ఎక్కువగా ఉన్నట్టు రీసోర్స్ పర్సన్ల పరిశీలనలో బహిర్గతం అయింది. తెలుగులో రాయడం చాలా మంది రావడం లేదు, ఒత్తులు ఎక్కువగా ఉన్న తెలుగు పదాలను చదవడం కూడా స్పష్టంగా రావడం లేదనేది రీసోర్స్ పర్సన్ల పరిశీలనలో తేలింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1800 స్కూల్స్‌కి పైగా పరిశీలన చేసినట్టు తెలిసింది.

చర్యలకు సిఫారసులు

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసిన త్రి ఆర్‌పై సరిగా స్పందించని ఉపాధ్యాయులపై రీసోర్స్ పర్సన్లు సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారులకు చర్యలకై సిఫారసులు చేసినట్టు తెలిసింది.

అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ

- ఆక్రమణదారులకు రిజిస్ట్రేషన్
- కలెక్టర్‌కు ఆదేశాలు
- 90 వేలకు పైగా అసైన్డ్ భూములు క్రమబద్ధీకరించే అవకాశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నిరుపేదలు కూడా రైతులుగా ఎదిగి, వ్యవసాయంతో ఉపాధి పొందేలా తెలంగాణ సర్కార్ వినూత్న ప్రకటనకు సిద్ధమవుతోంది. సుమారు 90వేల ఎకరాలకుపైగా అసైన్డ్ భూముల్లో కబ్జాలను క్రమబద్ధీకరించేందుకు సర్కార్ చురుగ్గా కదులుతోంది. ఈ మేరకు భూమిలేని పేదలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూముల్లో పాగా వేసినవారికి, ఆక్రమణదారులకు, కొనుగోలుదారులకు అవే భూములను క్రమబద్ధీకరించేందులా చట్టసవరణకు సిద్ధమవుతున్నది. మొత్తం భూమితో కలుపుకుని 5 ఎకరాల మెట్ట, 2.5 ఎకరాల తరి పొలాలకు మించకుండా ఉండే వారికి క్రమబద్ధీకరించేందుకు సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. గతంలో కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ భూ రికార్డుల ప్రక్షాళనతో అధికారులు బిజీగా ఉండటంతో కొంత జాప్యం నెలకొంది. తాజాగా దీనిపై సర్కార్ దృష్టి పెట్టడంతో ఫిబ్రవరిలో క్రమబద్ధీకరణ జరిగే అవకాశముంది. తెలంగాణ అసైన్డ్ ల్యాండ్(ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) పీఓటి చట్టం-1977లోని సెక్షన్ 4ప్రకారం క్రమబద్ధీకరించేందుకు ప్రయత్నాలు ఆరంభించింది. రికార్డుల శుద్దీకరణ, నవీకరణలో భాగంగా వెలుగులోకి వచ్చిన పేదలకు చెందిన అసైన్డ్ భూముల ఆక్రమణలపై ఉదారంగా వ్యవహరించనుంది.

ఈ మేరకు కలెక్టర్లు ఆదేశాలను జారీ చేసింది. ఆక్రమణదారుల్లో బీపీఎల్ కుటుంబాలు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ కులాలవారీగా లెక్కలు తీస్తూ వారి సామాజిక హోదాను గణిస్తున్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 22,63,139ఎకరాల అసైన్డ్‌భూమి 15.83లక్షల మంది వద్ద ఉంది. 1,85,101 ఎకరాలతో అసిఫాబాద్ మొదటి స్థానంలో ఉండగా, భద్రాద్రి కొత్తగూడెంలో 1,66,557 ఎకరాలు, నల్గొండలో 1,38,686ఎకరాలు, కామారెడ్డిలో 1,33,157 ఎకరాల అసైన్డ్‌భూములు ఉన్నాయని గుర్తించారు. అయితే బీసీ సామాజిక వర్గంలో 6లక్షల 33 వేల451 మందికి 8లక్షల 14వేల 8ఎకరాలు పంపిణీ అయినట్లుగా తేల్చారు. ఎస్సీలకు 5,75,497ఎకరాలు, ఎస్టీలు 6,72,959 ఎకరాలు, ఓసీలు 1,46,102 ఎకరాలు, మైనార్టీలకు 54565 ఎకరాలను పంపిణీ చేసినట్లుగా రికార్డులు ధ్రువీకరిస్తున్నాయి.

దేశంలోనే అత్యధికంగా భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వ భూములు పంచిన జాబితాలో ఇరు తెలుగు రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో 50లక్షల ఎకరాలు పేదలకు పంపిణీ చేశారు. ఇది దేశం మొత్తంలో పంపిణీ అయిన భూముల్లో దాదాపు 28శాతంగా ఉందని లెక్కలు ధ్రువీకరిస్తున్నాయి. సీలింగ్ మిగులు భూములు, భూదాన్ భూములు, వివిధ పథకాల కింద కొనుగోలు చేసి పంచిన భూములను కలుపుకుంటే ఈ లెక్క 60 లక్షల ఎకరాల పైమాటే. అయితే పేదలకుపంపిణీచేసినవ్యవసాయ, ఇంటిస్థలాల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు ఉమ్మడి రాష్ట్రంలో 1977లో అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టం(పీఓటి 77) నుఅమలులోకి తెచ్చింది.

అన్యాక్రాంతం ఎలా...

రాష్ట్రవ్యాప్తంగా 22,63,139 ఎకరాల భూమిని పేదలకు ఆయా ప్రభుత్వాలు అసైన్ చేశాయి. 15.83 లక్షల మంది నిరుపేదలకు వీటిని పంపిణీ చేసినా అవి వారి చేతిలో లేవని తాజాగా ప్రభుత్వం గుర్తించింది. సమాచారం మేరకు 90,063 ఎకరాల అసైన్డ్ భూములు ఇతరుల చేతుల్లోకి చేరినట్లుగా గుర్తించారు. పట్టా ఒకరి పేరుతో ఉండగా పొజిషన్‌లో మరొకరు ఉండటం, కొందరి భూములు నాలుగైదు చేతులు మారడం, కొందరి భూములు వివాదాల్లో ఉండటం, కోర్టు పరిధిల్లో పేరుకుపోవడం వంటి సమస్యలు నెలకొన్నాయి. వీటిని పీఓటి చట్టం ప్రకారం ఏకపక్షంగా రద్దు చేసే అవకాశం ప్రభుత్వానికి ఉంది. అయితే చట్టాలను మార్చి ఎవరికీ ఇబ్బంది లేని రీతిలో సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. పొజిషన్‌లో ఎన్నేళ్లుగా ఉంటున్నారు...ఆయా భూముల్లో పాగా వేసిన వారి ఆర్థిక సామాజిక స్థితిగతుల ఆధారంగా కొంత వెసులుబాటు దిశగా కార్యాచరణ సాగుతున్నట్లు తెలిసింది. ఇందుకుగానూ భారీగా పెనాల్టీ విధించి క్రమబద్ధీకరించే అవకాశం కూడా పరిశీలనలో ఉందని రెవెన్యూ అధికారులు వెల్లడించారు.


చట్టంలో ఏముంది..?

ఈ చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం 1977కు ముందుకానీ, తర్వాత కానీ ప్రభుత్వంఇచ్చిన భూములను బదలాయింపు చేయకూడదు. అసైన్డ్‌భూమిని అమ్మినా, దానం చేసినా, కుదువబెట్టినా, కౌలుకుఇచ్చినా, ఇతర భూములకు బదులుగా మార్చుకున్నా బదలాయింపు కిందకే రానుందని పేర్కొంది. తరతరాలు వాడుకోవడంతప్ప విక్రయించేందుకు వీలు లేదు. బదలాయిస్తే చెల్లకపోగా శిక్షార్హం కూడానని చట్టం చెబుతోంది.

- చట్టానికివిరుద్ధంగా బదలాయింపు జరిగితే తహశీల్దార్ కానీ, కలెక్టర్ నియమించిన అధికారి కానీ విచారణ జరిపి ఉత్తర్వులు జారీ చేయాలి.
- చట్టాన్ని ఉల్లంఘించి భూమిని కొనుగోలు చేసిన వ్యక్తినుంచి స్వాధీనంచేసుకోవాలి.
- మొదటఅసైన్డ్ పొందిన వ్యక్తి ఇంకా నిరుపేద అయితే అతనికే అప్పగించాలి. రెండో సారి అయితే అప్పగించాల్సిన అవసరం లేదు.
- నోటిఫై ప్రాంతాల్లో అయితే అసైనీకి ఇవ్వాల్సిన పనిలేదు.
- అసైన్డ్‌భూమి నిరుపేద కొనుగోలు చేస్తే ఆ కొనుగోలు చేసిన వ్యక్తికే అసైన్డ్‌చేయాలి. అసైన్డ్‌భూమితో కలుపుకుని అతనికి ఐదెకరాల మెట్ట, రెండున్నర ఎకరాల తరికి మించరాదు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

గవర్నర్ నరసింహన్‌కు తెదేపా నేతల వినతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తమ పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డిపై తప్పుడు కేసులు బనాయించి అక్రమంగా జైలులో పెట్టారని తెలుగుదేశం పార్టీ తెలంగాణ నాయకులు రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌కు ఫిర్యాదు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో మృతి చెందిన విద్యార్థిని పరామర్శించేందుకు వెళితే అనేక సెక్షన్లతో బెయిల్ రాకుండా నిర్బంధించేందుకు తప్పుడు కేసులు పెట్టారని వారు ఆరోపించారు. ఆ పార్టీ అధ్యక్షుడు ఎల్.రమణ నేతృత్వంలో పార్టీ నేతలు శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఈ మేరకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులుఉ మోత్కుపల్లి నర్సింహులు, రావుల చంద్రశేఖరరెడ్డి, జాతీయ అధికార ప్రతినిధి ఇ.పెద్దిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు నన్నూరి నర్సిరెడ్డి, సామ భూపాల్‌రెడ్డి, ఎంపీ గరికపాటి మోహన్‌రావు తదితరులు గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్‌రావు కక్షసాధింపు చర్యతోనే ప్రతాప్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టించారని తెదేపా నేతలు ఆ వినతిపత్రంలో గవర్నర్ దృష్టికి తెచ్చారు. ఒక కేసులో బెయిల్‌పై విడుదలైన ప్రతాప్‌రెడ్డిని మళ్ళీ హత్యాయత్నం కేసులో ఇరికించి నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారని తెదేపా నేతలు ఆరోపించారు. ముఖ్యమంత్రిపై పోటీ చేసినందున వంటేరుపై కక్షసాధింపునకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. సొంత నియోజకవర్గానికి చెందిన ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే పరామర్శించడం తప్పుగా భావించి ఆంక్షలు పెట్టడం ఎంతవరకు సమంజసమని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కులు, మానవ హక్కులు కాలరాసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు.తెరాస అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులపై నిర్బంధకాండ కొనసాగుతోందని తెదేపా నేతలు ఆందోళన వ్యక్తంచేశారు. 16 మంది యూనివర్సిటీ విద్యార్థులపై అనేక సెక్షన్ల కింద కేసులు పెట్టారని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు.

మంద కృష్ణ, వంటేరును పరామర్శించిన తెదేపా నేతలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణమాదిగను తెదేపా నాయకులు శనివారం చంచల్‌గూడ జైలులో పరామర్శించారు. ఈ ఇద్దరు నాయకులు గత వారం రోజులుగా జ్యుడిషియల్ రిమాండ్‌తో జైలులో ఉన్నారు. తెదేపా తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ, పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి ఇ.పెద్దిరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి శోభారాణి, మైనారిటీ సెల్ అధ్యక్షులు తాజుద్దీన్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

తిరుమలలో అంతరాష్ట్ర దొంగ అరెస్ట్

తిరుమల, ప్రభ న్యూస్: తిరుమలలో అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు టూటౌన్ సిఐ వెంకటరవి శనివారం విలేకరుల ఈ వివరాలు వెల్లడించారు. తిరుమల, తిరుపతి, చిరుచానూరు తదితర ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని శనివారం అరెస్ట్ చేశామన్నారు. నేరస్తుడిని విచారించగా గుంటూరు జిల్లా ఎడ్లపాడుకు చెందిన కోటేశ్వరరావు కుమారుడు మందలపు రాజు అలియాస్ శివ అని విచారణలో తేలిందన్నారు. అయితే మందలపు రాజు గత కొంతకాలంగో పోలీసుల కళ్ళుగప్పి తిరుమలలో తాళాలు వేసిన గదులు, రద్దీ ఉన్న ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడే వాడన్నారు. ఈ మేరకు ముద్దాయి వద్ద నుంచి 10 ల్యాప్‌టాప్‌లు, 400 గ్రాముల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి, లక్ష రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ సుమారు రూ.17.50 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ మేరకు మందలపు రాజుపై కేసు నమోదు రిమాండ్‌కు తరలించామన్నారు.

తెలంగాణ కాశ్మీరానికి కొత్త శోభ

- అడవుల జిల్లాలో పర్యాటక కేంద్రాల అభివృద్ధికి చర్యలు
- రూ. 104 కోట్లతో ప్రణాళికలు
- జలపాతాలను సందర్శించిన మంత్రి జోగురామన్న, రాష్ట్ర ఉన్నతాధికరాలు



ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : దట్టమైన అడవులు .. గలగలపారే సెలయేళ్లు .. మైళ్లకొద్ది విస్తరించిన గుట్టలు .. గలగలపారే జలపాతాలు..చూపరులను ఆనందాన్ని పంచే ఆదిలాబాద్ ప్రకృతి అందాలు కాశ్మీరాన్ని తలపిస్తాయి. తెలంగాణ కాశ్మీరంగా పేరొందిన ఆదిలాబాద్ జిల్లాను పర్యాటక రంగంలో అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ప్రతీ రోజు పర్యాటకులతో సందడిగా ఉండే జిల్లాలోని జలపాతాలను మరింత అభివృద్ధికి నిర్ణయించింది. రూ. 104 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధమైంది. ఈ నిధుల్లో రాష్ట్రప్రభుత్వం 20 శాతం నిధులు కేటాయించనుండగా కేంద్ర ప్రభుత్వం 80 శాతం నిధులు ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ విషయాన్ని రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖా మంత్రి జోగు రామన్న వెల్లడించారు. శనివారం ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల, పొచ్చర, గాయత్రి జలపాతాలను ఎంపీ నగేష్, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ , రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పికె ఝా, పర్యాటకశాఖాధికారులతో కలిసి సందర్శించారు. జలపాతాల అందాలను చూసి మైమరిచిపోయిన ప్రజాప్రతినిధులు, అధికారులు జలపాతాలను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తే రాష్ట్రంలోనే అతిపెద్ద పర్యాటక కేంద్రంగా ఆదిలాబాద్ జిల్లాను తీర్చిదిద్దవచ్చని అభిప్రాయపడ్డారు. వేలాది అడుగుల పై నుంచి గలగల దూకే కుంటాల జలపాతాన్ని సందర్శించిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, అధికారుల బృందం కుంటాల అందాలను చూసి సంబరపడిపోయారు. అక్కడి ప్రకృతిని చూసి ఆకర్శితులయ్యారు. కుంటాల జలపాతానికి అభివృద్ధి కోసం తీసుకోబోయే చర్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ జిల్లాలోని జలపాతాలను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రూ.104 కోట్లతో తయారుచేసిన ప్రణాళికలు కేంద్రప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని , త్వరలోనే వాటికి మంజూరు చేసేందుకు కేంద్ర పర్యాటక శాఖా మంత్రి అంగీకరించారని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే రూ. 10కోట్లు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని , కేంద్ర నిధులు వచ్చే వరకు రాష్ట్రప్రభుత్వ నిధులతో కుంటాల జలపాతం అభివృద్ధి పనులు చేపడుతామని మంత్రి పేర్కొన్నారు. కుంటాల జలపాతం వద్ద పర్యాటకుల ఇబ్బందులు తొలగించేందుకు అవసరమైన వంతెనల నిర్మాణం చేపట్టాలని మంత్రి నిర్ణయించారు. కుంటాల జలపాతానికి వచ్చే వారికి ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు నీటి ప్రవాహాన్ని తగ్గించేవిధంగా వీలునుబట్టి పరివాహక ప్రాంతంలో చెక్‌డ్యాంలు నిర్మించాలని అందుకు అవసరమైన డిజైన్‌లను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట ఆదిలాబాద్ డిఎఫ్ఓప్రభాకర్, నిర్మల్ డిఎఫ్ఓ దామోదర్‌రెడ్డి, డిసిసిబి చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి, ఆదిలాబాద్ ఎఫ్‌డీవో చంద్రశేఖర్ రావ్, ఉట్నూర్ ఎఫ్‌డిఓ విజయ్‌కుమార్, టిఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ గౌడ్, తదితరులున్నారు.

ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. ఖాళీ పోస్టుల భర్తీ కోసం వెంటనే నోటిఫికేషన్లు జారీ చేయాలని శనివారం జరిగిన నిరుద్యోగ జేఏసీ సమావేశం డిమాండ్ చేసింది. జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ అధ్యక్షతన బీసీ భవన్‌లో సమావేశం జరిగింది. సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సమావేశంలో గుజ్జ కృష్ణ, డాక్టర్ ర్యాగ అరుణ్, మన్నె వెంకటేష్, జి రమేష్, సి రాజేందర్, రాంబాబు, జి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత మూడున్నరేళ్లుగా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా రాష్ట్రంలోని 14 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆర్ కృష్ణయ్య మండి పడ్డారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసే వరకు పోరాటం కొనసాగించాలని నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు ఇంటికో ఉద్యోగం ఇస్తామని ప్రచారం చేసిన టిఆర్ఎస్ ఇప్పుడు ఉద్యోగాలు ఇవ్వకుండా తిరిగి ఎన్నికలకు వస్తే నిరుద్యోగులు నిలదీయాలని స్పష్టం చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ ఖైదీల శుభ్రత..పరిశుభ్రత

గార్డెనింగ్, టాయ్‌లెట్లను క్లీన్ చేయిస్తున్న అధికారులు


హైదరాబాద్, ఆంధ్రప్రభ : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో శిక్ష పడి జైలుకు వెళ్తున్న వారిలో చాలా మంది తిరిగి ఆ తరహా తప్పు చేసేందుకు సాహసించడం లేదు. కారణం జైలు శిక్షపడినందుకు కాదు, జైలులో శిక్షాకాలంలో చేసే పనులకు భయపడి తాగి వాహనం నడపడానికి జంకుతున్నారు. సేవించిన మద్యం మోతాదును బట్టి నిబంధనల మేరకు కోర్టులు జైలు శిక్షలు వేస్తున్నాయి. ఇందులో ఒక రోజు నుంచి 10 రోజుల వరకు శిక్ష విధిస్తున్నాయి. ఒక రోజు శిక్ష అనుభవించే వారు ఉదయం జైలుకు వెళ్ళి సాయంత్రం విడుదలవుతున్నారు. రెండు రోజుల నుంచి 10 రోజులు శిక్షకు గురైన వారు జైలులో పాకీ పని చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. సాధారణంగా జైళ్ళలో టాయిలెట్లు శుభ్రం చేయడం, గదులను శుభ్రం చేయడం, గార్డెనింగ్ పని కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించేందుకు వెసులు బాటు లేదు. ఈ పనులన్నింటినీ నేరం రుజువై శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు కేటాయిస్తుంటారు. చంచల్‌గూడ జైలుకు నిత్యం 10 నుంచి 15 మంది రెండు రోజుల నుంచి వారం రోజుల శిక్ష పడ్డవారు వస్తుండగా, చర్లపల్లి జైలుకు వారంలో మూడు రోజులు 20 మంది ఖైదీలు వస్తున్నారు. వీరందరితో జైలు అధికారులు గార్డెనింగ్ పనులతో పాటు బ్యారక్‌లలోని టాయిలెట్లను శుభ్రం చేయిస్తున్నారు. దీంతో మద్యం సేవించి జైలుకు వెళ్ళిన వారు మరోసారి తప్పు చేసేందుకు జంకుతున్నారు. నిబంధనల ప్రకారం నేరం చేసి శిక్ష ఖరారైన ఖైదీలతో మాత్రమే వారిష్టానుసారం ఇలాంటి పనులను చేయించాలి. ఇందుకోసం కొంత పారితోషికం ఇవ్వాలి. గార్డెనింగ్, కుకింగ్, సర్వింగ్, వాషింగ్ పనులు చేసే వారికి కూడా ఈ పారితోషికాన్ని ఇస్తుంటారు.ఇలా సంపాదించిన మొత్తాలను సదరు ఖైదీ శిక్షాకాలం పూర్తి చేసుకుని బయటకు వెళ్ళే సమయంలో అందిస్తుంటారు. కానీ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో శిక్ష పడ్డ వారితో గార్డెనింగ్ పనులను చేయించడం చర్చనీయాంశంగా మారింది. జైలుకు వచ్చిన వారిని కూర్చోబెట్టి భోజనం పెట్టడానికి జైలు నిబంధనలు ఒప్పుకోవని, శిక్షపడ్డ ఖైదీకి ఏదో ఒకపని అప్పగించాలి కాబట్టి కొన్ని సందర్భాలలో గదులను శుభ్రం చేయడం, టాయిలెట్లను కడిగించడం, గార్డెనింగ్ తదితర పనులను చేయిస్తుంటామని, అయితే ఇవి ఆ ఖైదీలుండే గదుల వరకే పరిమితమని అధికారులు చెప్పారు.

'పాస్ పుస్తకాలు ఇవ్వండి'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మహబూబ్‌నగర్ జిల్లా, మక్తల్ మండలం కర్ని గ్రామంలోని సర్వే నంబర్ 531 లో 9.38 ఎకరాల భూమి పేర్ల మార్పిడి (మ్యుటేషన్) వ్యవహారంలో పిటిషనర్లు ఆన్‌లైన్ ద్వారా (టీటీఎంయూ 02 1600 705040 మరియు టీటీఎంయూ 021600705039) తేది. 17. 4.2016న సమర్పించిన దరఖాస్తులను చట్ట ప్రకారం వీలైనంత త్వరగా పరిష్కరించాలని హైకోర్టు మక్తల్ ఆర్డీవో ను ఆదేశించింది. అలాగే రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమిని పిటిషనర్లకు మార్పిడి(మ్యుటేషన్) చేయాలని, వారికి పట్టాదారు పాసుపుస్తకాలు కూడా జారీ చేయాలని కూడా హైకోర్టు స్పష్టం చేసింది. తమ తీర్పు ప్రతి అందిన 8నుంచి 10 వారాల్లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని హైకోర్టు తేల్చి చెప్పింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్ ఇటీవల ఈ మేరకు తీర్పును వెలువరించారు.

భాజపాలో 'నాగం' కలకలం

పార్టీ అంతర్గత పరిణామాలపై రాష్ట్ర అధ్యక్షుడి నజర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మాజీ మంత్రి....పార్టీ జాతీయ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం భాజపాలో కలకలం రేపుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్ఠం చేయాలని భావిస్తున్న తరుణంలో నాగం వ్యవహారం ప్రస్తుతం భాజపాలో హాట్‌టాపిక్‌గా మారింది. కొంతకాలంగా ఆయన పార్టీ వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు.తన సేవలను సక్రమంగా వినియోగించుకోవడంలోగానీ...పార్టీ కార్యక్రమాల్లో ఆశించిన స్థాయిలో తనకు సముచిత స్థానం దక్కడం లేదన్న ఆగ్రహంతో ఉన్నారు. పైగా తెరాసను టార్గెట్‌గా చేసుకుని కేసీఆర్‌పై పెద్దఎత్తున విమర్శలు చేయాలని భావించిన పలు సందర్భాల్లో సొంత పార్టీ నేతల నుంచి తగు సహకారంలభించడం లేదన్న ఆవేదన ఆయనలో పలు సందర్భాల్లో వ్యక్తమైంది.

పైగా పార్టీలోని పలువురు నాయకులు తెరాసకు అనుకూలంగా పనిచేస్తున్నారని...దీంతో ప్రజా సమస్యలపై ధైర్యంగా పోరాటం చేయ లేకపోతున్నామని ఏకంగా మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి మరీ ఆయన తన అంసతృప్తిని వెళ్ళగక్కిన విషయం తెలిసిందే. పరిస్థితులు ఇలాగే ఉంటే ఇక ఎంతో కాలం పార్టీలో ఇమడలేనని....త్వరలోనే తమ అభిమానులు,అనుచరులు...నియోజకవర్గం నేతలతో సమావేశం ఏర్పాటు చేసి తగు నిర్ణయం తీసుకుంటానని నాగం స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో నాగం వ్యవహారాన్ని భాజపా రాష్ట్ర నాయకత్వం నిశితంగా గమనిస్తోంది. ఆయన వేరే పార్టీలో చేరాలని నిర్ణయించుకున్న తరువాతనే భాజపా ఆరోపణలు చేశారా? లేక మరో ఇతర కారణాలుఏమైనా ఉన్నాయా? అన్న అంశంపై ఆరా తీస్తోంది. ఈ నేపథ్యంలోనే పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె. లక్ష్మణ్ నాగం చేసిన వ్యాఖ్యలపై పార్టీ కోర్‌కమిటీలో చర్చించిన తరువాతనే ఒక నిర్ణయానికి రావాలన్న అభిప్రాయానికి వచ్చారు. ఒక వేళ నాగం పార్టీని వీడాలని భావిస్తే...ఆయనతో పాటు వెళ్ళే వారు ఎవరెవరు? తదితర అంశాలపై కూడా దృష్టిసారించినట్లుగా తెలుస్తోంది.

కాగా ఇటీవలనే మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పార్టీకీ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగి వారం రోజులు కాకముందే నాగం పార్టీనేతల పనితీరుపై బహిరంగంగానే తీవ్ర అసంతృప్తిని వెళ్ళగక్కారు. ఇలా వరస ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో పార్టీలో అంతర్గతంగా నెలకొన్న పరిస్తితులపై కూడా రాష్ట్ర అగ్రనేతలు ఆరాతీసే పనిలో నిమగ్నమయ్యారు. పైగా ఈ నెల చివరి వారంలోగానీ లేదా ఫిబ్రవరి మొదటి వారంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా తెలంగాణ రాష్ట్రానికి వస్తున్నారు. ఇలాంటి తరుణంలో పార్టీలో జరుగుతున్న పరిణామాలు రాష్ట్ర అగ్రనేతలను కలవరానికి గురి చేస్తున్నాయి. నాయకులంతా సమిష్టి కృషితో పనిచేస్తూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా రాష్ట్రంలో పార్టీ పతాకాన్ని ఎగరవేయాలన్న ఏకైక లక్ష్యంతో పార్టీ అధిష్టానం పలు రకాల వ్యూహాలను సిద్దం చేస్తోంది. ఇందులో భాగంగానే అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు సిద్ధమవుతున్నారు.

కోడి పందాల వద్ద మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ నిఘా



అమరావతి, ఆంధ్రప్రభ: కోస్తాలో కోడి పందేల నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కోడి పందేలు నిర్వహించుకోవచ్చంటూ నిర్వాహకులు చెపుతుండగా, హైకోర్టు తీర్పు మేరకు నడుచుకుంటామని పోలీసు, రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. కోడి పందేల ముసుగులో జరిగే చట్ట వ్యతిరేక చర్యలకు అడ్డుకట్ట వేయాలంటూ రాష్ట్ర డీజీపీ డాక్టర్ ఎం.మాలకొండయ్య, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాల ఎస్పీలు పోలీసు, రెవిన్యూ అధికారులతో కలిసి తనిఖీ బృందాలు ఏర్పాటు చేశారు. కోడి పందేల బరుల సమీపంలో మద్యం అమ్మకాలు జరిపితే దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తామంటూ ఎక్సైజు ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. విచారణలో మద్యం సరఫరా చేసినట్లు తేలితే సంబంధిత షాపుల లైసెన్స్‌లు రద్దు చేసేందుకు కూడా వెనుకాడేది లేదంటూ వీరంటున్నారు. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 110 వరకు కోడి పందేల నిర్వహణకు పెద్ద బరులు ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు చెపుతున్నారు. ఆయా బరుల వద్ద ఏర్పాటు చేసిన షామియానాలు తొలగించడంతో పాటు బందోబస్తు ఏర్పాటు చేశారు. కోడి పందేలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో సెక్షన్ 144 విధిస్తూ పోలీసు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు రైతులను అదుపులోకి తీసుకోవద్దంటూ బీజేపీ నేత రఘురామ కృష్ణంరాజు దాఖలు చేసిన పిటీషన్‌పై సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలకు విరుద్ధంగా పోలీసు అధికారులు వ్యవహరిస్తున్నారంటూ చెపుతున్నారు. కోళ్లను అదుపులోకి తీసుకోవడం, రైతులను అరెస్టు చేయవద్దని చెప్పడమంటే కోడి పందేలు నిర్వహించుకోవచ్చని కాదని అధికారులు అంటున్నారు. ఇళ్లల్లో ఉంచిన కోళ్లకు మాత్రమే ఇది వర్తిస్తుంది తప్ప బరుల వద్దకు తెస్తే కత్తులు కట్టినా, కట్టకపోయినా స్వాధీనం చేసుకొని అరెస్టు చేస్తామంటూ హెచ్చరిస్తున్నారు. కోళ్లకు కత్తుల కట్టేవారిపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. అనేక మందిని అదుపులోకి తీసుకున్నారు. ఒక్క పశ్చిమ గోదావరి జిల్లాలోనే ఏడొందల మందికి పైగా కేసులు నమోదు చేశారు. కోడి పందేలు నిర్వహించేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీసు పికెట్లు పెడుతున్నారు. సంయుక్త బృందాలతో తనిఖీలు నిర్వహించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో వీడియో కెమెరాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గస్తీ బృందాలు బాడీ ఓన్ కెమెరాలతో విధులు నిర్వహించాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే కోడి పందేల బరులను తొలగించేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలను ప్రజాప్రతినిధులు అడ్డుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయంగా వస్తున్న కోడి పందేల నిర్వహణను అడ్డుకోవడం సమంజసం కాదని, చట్ట విరుద్ధంగా నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయంలో కృష్ణాజిల్లా పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ విజయవాడ జాయింట్ పోలీసు కమిషనర్ బి.వి.రమణ కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. అయితే తాము చట్ట ప్రకారమే వ్యవహరిస్తున్నామంటూ పోలీసులు స్పష్టం చేయడంతో ఆయన అనుచరులతో కలిసి బరుల సమీపం నుంచి వెళ్లిపోయారు. పశ్చిమ గోదావరి జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. డింకీ పందేలు నిర్వహించినా ఉపేక్షించమంటూ పశ్చిమ గోదావరి ఎస్పీ ఎం.రవిప్రకాష్ స్పష్టం చేశారు. సుప్రీం ఆదేశాల మేరకు హైకోర్టులో సవరణ పిటీషన్ దాఖలు చేసి అనుమతులు తెచ్చుకోవడంపై ఆశాభావంతో ఉన్నారు.

ఎక్సైజు నిఘా

కోడి పందేలు నిర్వహించేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలపై ఎక్సైజు అధికారులు నిఘా పెట్టారు. పందేల నిర్వహణకు సమీపంలో బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు జోరుగా సాగించడం ఆనవాయితీ. దీనిని దృష్టిలో ఉంచుకొని బెల్టు షాపులు ఏర్పాటు చేయకుండా నిలువరించాలంటూ ఆ శాఖ కమిషనర్ డాక్టర్ పి.లక్ష్మీ నరసింహం ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఎక్సైజు టీములు రంగంలోకి దిగాయి.

కోడి పందాలు షురూ!

• నోట్ల కొరతపై ముందు నుంచే ప్రణాళిక • ఆంధ్రా అంతా పందెంరాయుళ్ళ కోలహలం • మిన్నంటిన సంక్రాంతి సంబురాలు



కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: సంక్రాంతి అంటేనే సంబరాల పండుగ. సంస్కృతి, సంప్రదాయాల మేళవింపుకిది సమయం. కొత్తబట్టలు, అత్తారిల్లు, బావామరదళ్ళ సరసాలు, గొబ్బెమ్మలు, గంగిరెద్దు, హరిదాసులు, పిండివంటలు, భోగిపళ్ళు.. ఇలా ఎన్నిరకాల సంప్రదాయాలున్నా సంక్రాంతి అంటే మొదటిగా గుర్తొచ్చేది కోడిపందాలే. దాదాపు రెండుమాసాల ముందు నుంచి ఈసారి కోడిపందాలకు అనుమతులుంటాయా లేదా.. మన ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారా.. తేరా.. పోలీసుల్ని పందాల జోలికి రాకుండా నిలువరిస్తారా.. లేదా.. అన్న చర్చలే ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో మొదలౌతాయి. గోదావరి జిల్లాలు కోడిపందాలకు మెట్టినిల్లు లాంటిది. ఈ జిల్లాల్లోని భీమవరం, ఐ పోలవరం, ముమ్మిడివరం, పిఠా పురం, ఆకివీడు, ఉండి, నర్సాపురం, రామచంద్రాపురం, కత్తిప ూడి వంటి ప్రాంతాలు కోడిపందాల్తో మారుమ్రోగిపోతాయి. గోదావరి జిల్లాలే కాదు.. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు కూడా పలుచోట్ల కోడిపందాలు జరుగు తాయి. ఈ సారి కోడిపందాలకు అనుమతులిచ్చే అవకాశాల్లేవని ప్రభుత్వం లేదా అధికారులు ప్రకటించిన వెంటనే అసలు ఈసారి సంక్రాంతి పండుగ రాదన్నంత ఆందోళన ఆంధ్రుల్లో కలుగుతుంది. ఎలాగైనా పందాలకు అనుమతులు సాధించాల్సిందే. ఒక్కో సందర్భంలో ప్రజాప్రతినిధులకు ఇది తలకు మించిన భారంగా మారుతుంది. వచ్చే ఎన్నికలకు, కోడిపందాలకు లింక్‌పెట్టిన సందర్భాలు క ూడా అనేకం ఉన్నాయి. అసలు కోడిపందాలకే అనుమతులు తేలేని మీరు మమ్మల్ని ఓట్లెలా అడుగుతారంటూ మొహమ్మీదే కడిగేసిన రోజులున్నాయి. కోడిపందాలకు, ఆంధ్రులకు మధ్యనున్న అవినా భావ సంబంధం అలాంటిది. సంక్రాంతి మూడ్రోజులు కోడి పందాలాడా ల్సిందే. ఆడకపోతే అసలు సంక్రాంతేలేదు. ఎలాగైతేనే ఈసారి సంక్రాంతి వచ్చేసింది. సంక్రాంతికి ముందే కోడిపందాలపై భారత సర్వోన్నత న్యాయ స్థానం తీర్పు కూడా వెలువరించింది. గతేడాదిలాగే వ్యవహరించండంటూ సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. అయితే ఇవి పందాలు నిర్వహించుకోవచ్చో లేదో స్పష్టంగా తేల్చలేదు. దీంతో అటు పోలీసులు ఇటు పందెంరాయుళ్ళు ఎవరికి వారు ఈ తీర్పును తమకనుకూలంగా అన్వయించేసుకుంటున్నారు. పందాల బరిల వైపు వెళ్ళకండి.. కోళ్ళను బంధించొద్దు.. గ్రామీణులపై దాడులు చేయొద్దంటూ పోలీసులకు సుప్రీం హుకుం జారీ చేయ డంతో ఇక నిస్సందేహంగా, ఉత్సాహంగా బరిలోదిగేందుకు పందెంరాయుళ్ళు సిద్ధమౌతున్నారు. ఇప్పటికే బరులుకట్టేశారు. ఆసక్తిపరులందరికీ ఆహ్వానాలు పంపేశారు. లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌ల్లో రూమ్‌లు బుక్ చేసేశారు. పండుగ మూడ్రోజులు పందాల కోసం సుదూర ప్రాంతాల్నుంచొచ్చే వారి కోసం వంటమనుష్యుల్ని సిద్ధం చేసేశారు. ఇక ఆదివారం తెల్లారడమే తరువాయి.. పందాలకు రంగం సిద్ధమైపోయింది. కోళ్ళకు కత్తులు రెడీ చేశారు. బరిలో దింపేందుకు పెంచుతున్న కోళ్ళను దువ్వడం మొదలెట్టేశారు.

ప్రతి ఏటా ఈ పందాల్ని జరగనిచ్చేది లేదంటూ ప్రభుత్వం ప్రకటించడం, చివరకు పందాలు యధావిధిగా జరగడం ఓ ప్రహసనంగా మారింది. ఇటీవల జంతు ప్రేమికులమంటూ పందాలకు వ్యతిరేకంగా కొందరు న్యాయస్థానాల్ని ఆశ్రయిస్తున్నారు. పందాల్ని జీవహింసంటూ వారు వ్యతిరేకిస్తున్నారు. రాన్రాను వీరి వాదన కూడా బలప డుతోంది. అయితే వారికంటే సంప్రదాయం పేరిట పందాలాడేవారి మాటే పైచేయిగా మారుతోంది.

గతేడాది రాష్ట్రంలో సుమారు ఐదొందల కోట్లు పందాల పేరిట చేతులు మారినట్లు అంచనా. ఇందులో ఒక్క గోదావరి జిల్లాల్లోనే మూడొందల కోట్ల విలువైన పందాలు జరిగాయి. ఒక్క పశ్చిమగోదావరిలోనే రెండొందల కోట్లకు పైగా పందాలు కాసేశారు.

అంతకుముందేడాదైతే ఏకంగా ఓ సినిమా థియేటర్‌కు రైస్‌మిల్‌కు మధ్య పందెం పెట్టేశారు. కేవలం రెండుమూడు నిమిషాల వ్యవధిలో తేలిపోయే ఫలితానికి లక్షల్లో పందాలు కాయడం పరిపాటిగా మారింది. వాస్తవానికి గతేడాది పందెంరాయుళ్ళకు పెద్దనోట్ల రద్దు అంశం కాస్త అడ్డంకిగా తయారైంది. ఈ సారి ఆ ప్రభావం నుంచి గట్టెక్క డంతో ఈ ఏడాది కూడా పందాలు గట్టిగానే జరుగుతాయని అంచనాలేస్తున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలుండడంతో ఇప్పు డు రాజకీయ నాయకులు కూడా పందాలపై దృష్టిపెట్టారు. ఈసారి గోదావరి జిల్లాల్లో పందాలు నాలుగొందల కోట్లకు పైబడతాయని ఓ అంచనా. రాష్ట్ర వ్యాప్తంగా ఇవి ఆరొందలకోట్లకు పైచిలుకు జరుగుతాయని భావిస్తున్నారు.

కాలు దువ్వుతున్న పాకిస్థాన్ కోడి



పిఠాపురం, ప్రభ న్యూస్: ఇండియా-పాకిస్థాన్ .. ఈ దాయాదుల మధ్య పోటీ అయినా.. పోరు అయినా రసవత్తరమే.. ప్రపంచం మొత్తం ఉత్కంఠగా చూసే సందర్భమే. రోమాలు నిక్కబొడుచుకుని మరీ ప్రేక్షకులు వీక్షిస్తారు.. పందేలు కడతారు. చివరి క్షణం వరకూ ఆ ఉద్వేగాన్ని.. ఉత్కంఠని అనుభవిస్తారు. క్రికెట్.. హాకీ.. బాక్సింగ్ వంటి క్రీడల్లోనే కాదు.. తెలుగువారి పెద్ద పండగలో భాగమైన కోడి పందేలలోనూ ఈ కాంబినేషన్ కనిపిస్తోంది. అవును ఈ సంక్రాంతి బరిలో ఇండియా-పాకిస్థాన్ బ్రీడ్ కోడి పుంజులు తలబడపోతున్నాయి. ఆ కిక్కును ఎంజాయ్ చేయడానికి ఉభయ గోదావరి జిల్లాల కోడి పందెం రాయుళ్లు సిద్ధపడిపోతున్నారు. కోర్టు అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు. అదే జరిగితే ఈ ఏడాది పండగలో గోదావరి పుంజులతో పాకిస్థాన్ ఫైటర్ అసీల్ తలపడబోతోంది. పాకిస్థాన్‌కు చెందిన పందెం కోడి అసీల్. ఇది చూడటానికే చాలా భయం కొలిపేలా వుంటుంది. దాని ముఖం.. కళ్లు.. కాళ్లు.. చివరికి శరీరం సైతం నల్లని రంగుతో వుంటుంది. బలిష్టమైన కాళ్లు దాని ప్రత్యేకత. అయితే ఇతర రంగుల్లో కూడా అసిల్ కోడిపుంజులు వుంటాయి. నల్లని రంగు బ్రీడ్‌ను మాత్రం ఫైటర్లుగా అభివృద్ధి చేస్తున్నారు. ఇది బరిలోకి దిగితే ప్రత్యర్థి పుంజు దాని రూపానికి సంగం భయపడిపోతాయని పందెం రాయుళ్లు చెబుతున్నారు. దాని ఎత్తును బట్టి ధర పలుక ుతోంది. సాధారణ పుంజు ధర సుమారు రూ.15వేలు పలికితే.. పందెం కోసం ప్రత్యేకంగా సిద్ధం చేసిన కోడిపుంజు దగ్గర దగ్గరగా అక్షరాలా.. రూ.లక్ష వరకూ వుందంటే వీటి ప్రత్యేకతను అర్థం చేసుకోవచ్చు. భీమవరం, తాడేపల్లిగూడెం, కోనసీమ తదితర ప్రాంతాల్లో వీటిని కోడిపుంజుల పెంపకం దారులు తీసుకువెళ్తున్నారు. తద్వారా వాటి బ్రీడ్‌ను అభివృద్ధి చేస్తున్నారు.

తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం సమీపంలో ఆరోగ్య లక్ష్మి పౌల్ట్రీ యజమాని దుర్గా సుభాష్ తన కోళ్ల ఫారమ్‌లో అసీల్ బ్రీడ్‌ను అభివృద్ధి చేస్తున్నాడు. పాకిస్థాన్ నుంచి కోడి గుడ్లను దిగుమతి చేసుకుని తన పౌల్ట్రీలో కోడి పిల్లలను తయారు చేస్తున్నాడు. ఒక్కో గుడ్డు రూ.3వేల నుంచి 5వేలు ఖరీదుకు పాకిస్తాన్ నుంచి దిగుమతి చేసుకున్నట్లు ఆయన చెప్పాడు. మాంసం కోసం అయితే ఈ పుంజు ధర రూ.15వేలు వుంటుందని అదే పందెం కోసం సిద్ధం చేసిన పుంజు ఎత్తు, బలాన్ని బట్టి రూ.లక్ష వరకూ పలుకుతుందని సుభాష్ తెలిపాడు. తన దగ్గర వున్న పుంజుతో దేశీయ కోళ్లను క్రాస్ బ్రీడ్ చేసి కోడిపిల్లలను సిద్ధం చేస్తున్నాడు. వాటిని అనంతపురం, ఖమ్మం, భీమవరం, కోనసీమ, పాలకొల్లు, తదితర ప్రాంతాలతో పాటూ ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి చేస్తున్నాడు. అలాగే తన కోళ్ల ఫారమ్‌లోనూ వాటిని ప్రత్యేకంగా పెంచుతున్నాడు. అయితే తన ఫారమ్‌లో పందెం కోళ్లను సిద్ధం చేయడం లేదని పందెం రాయుళ్ల తన దగ్గర పిల్లల్ని తీసుకువెళ్లి తమ ఫారాల్లో వాటిని పందెం కోసం ప్రత్యేకంగా పెంచుతున్నారని సుభాష్ తెలిపాడు. ఇప్పటికే జూన్‌లోనే భీమవరం, ఐ భీమవరం, తాడేపల్లి గూడెం, ఏలూరు తదితర ప్రాంతాల నుంచి రైతులు ఈ కోడిపల్లలను కొనుగోలు చేసి పందెం కోళ్లుగా తయారు చేశారని అతను తెలిపాడు. ఈ ప్రకారం ఈ సంక్రాంతి బరిలో అసీల్ బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎ

ఈనాటివి కావు



కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: కోడిపందాలంటే ఏదో గోదావరి జిల్లాల్లో ప ుట్టినది మాత్రమేనని అనుకోవద్దు. ఇదేదో తెలుగువారి సంప్ర దాయంగానే భావించొద్దు. కోడిపందాలకు సుదీర్ఘ చరిత్రుంది. ఆరువేల సంవ త్సరాలకు పూర్వమే కోడిపందాలు జరిగినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. పురాతన గ్రీస్ రాజ్యంలో థెమిస్టోప్లస్ కాలంలో కూడా కోడిపందాలాడినట్లు చరిత్ర చెబుతోంది. భారత్‌తో పాటు చైనా, పెర్షియా తూర్పుదేశాల్లో ఈ క్రీడ అప్పట్లోనే ప్రాచుర్యం పొందింది. మొహంజుదారో రాజ్య అధికారిక పక్షిగా కోడిపుంజుండేదని ఇటీవలచరిత్రకారులు గుర్తించారు. దీంతో అప్పట్లో కూడా కోడిపందాలకు ప్రోత్సాహం ఉండేదని భావిస్తున్నారు. క్రీస్తుపూర్వం 2500 నుంచి 2100మధ్యకాలంలో హరప్పా నాగరిక వ్యవస్థలో కూడా కోడిపందాలు జరిగినట్లు తెలుస్తోంది. భారత సారస్వత కాలం నుంచి కోడిపందాలున్నాయి. కేతన కవి నుంచి నారాయణ కవి వరకు కోడిపందాల్ని పలు విధాలుగా అభివర్ణించారు. ఈపందాల కోసం ప్రత్యేకంగా కుక్కుటశాస్త్రం కూడా రాశారు. వాస్తవానికి ఈ కోడి ప్రపంచాన్ని చుట్టేసింది. కింగ్ హెన్రీ కాలంలో బ్రిటీషియులు కోడిపందాలపై ఎక్కువ మక్కువ చూపించారు. వాస్తవానికి రోమన్‌సామ్రాజ్యం నుంచి ఈ పందాలు బ్రిటన్‌కు చేరాయి. ఆంగ్లేయులైతే కొంతకాలం పాటు దీన్ని అధికారిక క్రీడగా పరిగణించారు. కోడిపందాలపై శిక్షణాశిబిరాల్ని కూడా ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు బ్రిటన్ తో సహాపలు దేశాల్లో కోడిపందాలపై పూర్తిస్థాయి నిషేధం ఉంది. క్యూబాలో ఇప్పటికీ నవంబర్ నుంచి ఏప్రిల్ మధ్యకాలంలో కోడిపందాల్ని ఆడతారు. అక్కడ కూడా దీన్నొక సంప్రదాయంగా భావిస్తున్నారు. మెక్సికో లోని కొన్ని ప్రాంతాల్లో దీన్ని అధికారికంగా అనుమతిస్తున్నారు. పెరూలో కోడిపందాల కోసం ప్రత్యేకంగా మైదానాలుంటాయి. బ్రెజిల్‌లో 1934నుంచి దీనిపై నిషేదం ఉన్నప్పటికీ యధావిధిగా జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం నిషేదం అమలుకు పెద్దగా పట్టుబట్టంలేదు. దక్షిణాసియా దేశాల్లో ఒకప్పుడు కోడిపందాలు విస్తృతంగా ఆడేవారు. ఇందుకోసం ఇతర దేశాల్నుంచికూడా కోడిపుంజల్నిరప్పించేవారు. అయితే బర్డ్‌ఫ్లూ వ్యాప్తితో ఇలా విదేశీ పుంజుల రాకకు అడ్డుకట్టేశారు. అప్పట్నుంచి స్థానికకోళ్ళతోనే వీటిని నిర్వహిస్తున్నారు. ఇండోనేషియాలో ఒకప్పుడు ఇదొక సంప్రదాయక్రీడ. అయితే కొన్ని ప్రాంతాల్లో దీన్ని నిషేదించారు. కానీ బాలి వంటి ప్రాంతాల్లో ఇది యదేచ్ఛగా జరుగుతోంది. జపాన్‌లో కోడిపందాలకు ప్రోత్సాహముంది. పాకిస్థాన్‌లో కూడా దీన్ని జూదంగా ప్రభుత్వం ప్రకటించినా కట్టడికి ప్రయత్నాలు జరగడంలేదు. పిలిప్పిన్స్‌లో సబాంగ్ పేరిట నిర్వహించే కోడిపందాలకు అనధికార అనుమతులున్నాయి. ఇక స్పెయిన్‌లో అయితే ప్రభుత్వమే ప్రత్యేకంగా బరులు కట్టి పందాలు ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ చూసేందుకొచ్చేవార్నుంచి కూడా ప్రభుత్వం టికెట్లు వసూలుచేస్తోంది. ఫ్రాన్స్‌లో ఒకప్పుడు దీన్ని నిషేదించారు. కానీ సంప్రదాయ క్రీడ పేరిట కోడిపందాల్తో పాటు ఎద్దుల పందాలక్కూడా తిరిగి అనుమతులిచ్చారు. ఇక థాయ్‌లాండ్‌లోఅయితే విదేశీ పర్యాటకుల్ని ఆకర్షించేందుకు ప్రభుత్వమే పందాలెడుతోంది.

కోన సీమలో కోళ్ల పందేలకు సై




రాజమహేంద్రవరం, ప్రభ న్యూస్: గోదావరి జిల్లాలు కోడిపందాలకు పెట్టింది పేరు. అయితే కోర్టుతీర్పులు.. అధికారుల హెచ్చరికలు.. పోలీసుల అరెస్ట్‌ల నేపథ్యంలో ఈ కోడిపందాలు జరుగుతాయా లేదా అనేది తొలుత కొంత సందిగ్ధం ఏర్పడినప్పటికీ ఉభయగోదావరి జిల్లాల్లో సంక్రాంతి మూడురోజులు కోడిపందాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధంచేస్తున్నారు. ఎందుకీ మీ డౌటేంటండి? ఈ పండక్కి మాకాడ పెందాలు జరుగుతాయా? లేదా ? అనేకదండి. బలేవోరండే బాబూ. ఇక్కడ పెందాలు లేకపోతే మేంతలెత్తుకు తిరగలేమండి. అన్నీ సిద్ధంసేసేసామండి. మొన్నామధ్య మేము, మా పక్కోరూళ్ళూం ఈ పెందేల యవ్వారం తేల్చేందుకు మా ఎమ్మెల్యేదగ్గరికెళ్ళి గట్టిగానే అడిగేమండి. ఏంటండి ఎమ్మెల్యేగోరు ఈయేడు పందేలు ఉండవంటున్నారేంటండి పోలీసోళ్ళు. ఇలాగైతే చుట్టాలు, పట్టాలదగ్గర మనవూరు పరువేమైపోతుందండి? ఉప్పటికే ఇదేశాల్లో ఉండే అల్లుళ్ళి పిలిసేసాం. వారన్నీ సద్దుకుని వచ్చేత్తున్నారు. అలాగే మొన్న మనూరు సూటింగ్‌కు ఒచ్చిన సినిమాయేక్టర్లు ఈ పండక్కి మనూర్లో జరిగే పెందాలు సూణ్ణానికి రమ్మని రాజుగోరు, మేమంతా పిలిసేమండి. అలాగే ఎమెరికాలో ఉండే మునుసబుగోరి చిన్నమనవడు, మావూరి పెసిడెంట్ పెదకొడుకు ఆల్ల జతగాళ్ళతో కలిసి పండగలో కోడిపెందేలు సూడ్డానికి వత్తున్నారు. యాబైరోజులకితమే ఆళ్ళు ఇమానం టిక్కెట్లు కొనేసుకున్నారండి. ఇలాగ గోదారి జిల్లాలతో సుట్టరికాలున్నవోళ్ళంతా ఇక్కడికొత్తానికి పెత్యేక యేర్పాట్లన్నీ సేసేసుకున్నారండి. ఇలాంటప్పుడు పెందాలు లేకపోతే కొంపలంటుకుపోతాయండోయ్.. అని విశయాన్ని ఆయనొద్దుంచేసాం. దీనికి ఆయనేమన్నారంటే అదంతా మామోలే.. ఆ మూడ్రోజులు నేను దగ్గరుండి కోడిపందాలు యవ్వారం సూసుకుంటానన్నారు. అంతేకాదండోయ్.. మొన్న మా పాంతంలో జన్‌బూమికొచ్చిన మంత్రిగోరిని కూడా కలిసాం. మేమంతా ఎలితే ఏదో రోడ్డుకోసమో, కల్యాణమండపమో అడిగితామనున్నారాయన. కానీ మేమంతా ఈ కోడిపెందాల మాటేంటని సూటిగా అడిగేసాం. ఒరే బాబూ ఆ మూడ్రోజులు జాగత్తగా తంతునడపండి. ఆ తర్వాత ఏంజరిగినా నా బాధ్యత కాదని చెప్పేసారు. దీంతో మాకు ధీమా వచ్చేసింది. సంకురాత్రి మూడ్రోజులు రాజుగారి కొబ్బరితోటలో ఈ పెందాలు జరపడానికి అంతా సిద్ధంసేసేసాం. అయినప్పటికీ దూరపోళ్ళు పోన్‌లుచేసి పెందాలున్నాయా లేదా అని డౌటనుమానం పడుతున్నారు. ఏంటో తేల్చమని మళ్ళీ ఇయ్యాల ఎమ్మెల్యేగోరి ఇంటికెళ్ళి మా కుర్రోళ్ళంతా కూసంతగట్టిగానే అడిగేసేరు. ఒరే బాబూ.. మేమంతా ఆ పనిలోనే ఉన్నాం. నిన్న జన్మభూమి కార్యక్రమానికి జిల్లాకొచ్చిన ముఖ్యమంత్రి చెవిలో కూడా ఈ విషయం చెప్పాం. మనం కోడిపందాలు ఆడనీయకుండా పట్టుపడితే దగ్గరకొస్తున్న ఎన్నికల్లో మనాటలను గోదారోళ్ళు సాగనివ్వరని స్పష్టంచేసాం.. ఇక మీరు ధైర్యంగా వెళ్ళి మీపనిలో ఉండండి అని ఇంకోసారి ఆమీలిచ్చేసారు.

లైటింగోళ్లు, టెంటోళ్లు ఇప్పుడా ఏర్పాటుల్లోనే ఉన్నారు.

ఇంత చెప్పినా మీరు పందాలపై అనుమానపడితే మేమేం పుసుక్కున పీలైపోతామండి. ఎందుచేతైనా కోడిపెందాలు ఆగిపోయాయనుకోండి.. మళ్లీ టిప్పు మా పేంత ఎమ్మెల్యేగోరు మవ్వుల్ని వోట్లడక్కర్లేదండి ఆళ్ళను మా గేవాల్లో అడుగెట్టనీయం.. నోరిప్పనీయం.. కడిగిపారేత్తాం.. వొక్కమాటలో సెప్పాలంటే మా పొలంలో రెండోపంటకు నీరివ్వలేకపోయినా పర్లేదు కానీ ఆ మూడ్రోజులు కోడిపెందాలు అడ్డుకుంటే మేత్రం.. ఆళ్ళ పని మటాసేనండి. పోలీసోల్లు నెలరోజులుముందే కోడికి కత్తుకు కట్టేవోలిని అరెస్టులు సేత్తారండి ఐనా ఇవాగిపోవండి. అవసరమైతే కోడికి ఆ కత్తి కట్టే పని మా పెద్దరాజుగోరి అబ్బాయే సేత్తారండి. ముఖ్యంగా కోనసీమలోనండి.. కొన్ని గేమాలంటాయండి. పేర్లెందుకుగానండి ఆ ఊల్లో పెందెం జర్గలేదనుకోండి పెద్దరాజుగోర్కి మాచెడ్డ కోపమొత్తాదండి. ఆయన తలెత్తుకోలేరండోయ్.. ఓరంతా కోట్టలకు పడగలెత్తినోళ్లండి బాబూ. ఆల్లముందు ఎమ్మెల్యేగోరు, మంతిరిగోరూ కూడా బలాదూరండీ. వాల్లు గానీ పెస్టేజ్ పీలయ్యారనుకోండి.. ఎవర్కో మూడినట్టేనండీ. అందుకేనండీ ఈ కోడిపెందాలకు ఎవరూ అడ్డుసెప్పరండి.

విలేజ్ మాల్స్ పేరుతో కొత్తరకం దోపిడీ

చంద్రగిరి నియోజకవర్గం పాదయాత్రలో జగన్



తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: అన్నిరకాలుగా రాష్ట్రాన్ని అవినీతిమయం చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం విలేజ్ మాల్స్ పేరుతో గ్రామాలను కొత్తరకంగా దోచుకోడానికి సిద్ధమవుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. చిత్తూరు జిల్లాలో కొనసాగిస్తున్న ప్రజా సంకల్ప పాదయాత్రలో భాగంగా 61వ రోజైన శనివారం జగన్ చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని రామచంద్రాపురంలో పర్యటించారు. ఉదయం కుప్పంబాదూరులో ప్రారంభించిన పాదయాత్రను ఒదద్దుకాలవ, సూరావారిపల్లె క్రాస్, బలిజపల్లె, పివిపురం, రామిరెడ్డిపల్లె, గంగిరెడ్డిపల్లె, కమ్మకండ్రిగ మీదుగా కొనసాగించి మండల కేంద్రమైన రామచంద్రాపురం చేరుకున్నారు. అక్కడ శాసనసభ్యుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన బ హిరంగసభలో జగన్ మాట్లాడుతూ సమాజంలోని అన్నివర్గాలను, అన్ని కులాలను ఏదోవిధంగా ఎప్పటికప్పుడు మోసం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ముఖ్యంగా ఇచ్చిన మాటపై నిలబపడే చిత్తశుద్ధి ఆయనలో కనిపించిందని విమర్శించారు. అన్నిటిని మించి తనను తొలిసారిగా శాసనసభ్యుడిగా చేసి రాజకీయ జీవితాన్ని ప్ర సాదించిన చంద్రగిరి నియోజకవర్గాన్ని కూడా చ ంద్రబాబు మోసం చేశారని ఆరోపించారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రగిరికి మంజూరు చేసిన వంద పడకల ఆసుపత్రిని కూడా నిర్లక్ష్యం చేయడం ద్వారా చంద్రబాబు తన జన్మస్థలంపై ఎంత చిత్తశుద్ధి చూపుతున్నారో అర్థమవుతుందన్నారు. రాష్ట్రాన్ని స్వర్గసీమగా మార్చేస్తానని నిరంతరం చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వస్థలమైన చంద్రగిరి నియోజకవర్గంలోని 138 పంచాయతీల్లో ఇప్పటికే 70 శాతం పల్లెలు మంచినీటి కోసం ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయన్నారు. విద్యుత్ చార్జీలను పెంచడం నుంచి జన్మభూమి కమిటీల పేరుతో గ్రామాలను దోచుకోవడం ద్వారా అంచెలంచెలుగా రాష్ట్రానికి అవినీతి కూపంగా మార్చేస్తున్నారని జగన్ అన్నారు. కొత్తగా విలేజ్ మాల్స్ పేరుతో గ్రామాల ప్రజల ను దోచుకోడానికి కార్పొరేట్ రంగానికి అవకాశం కల్పిస్తున్నారన్నారు. ఆ మాల్స్ ఏర్పాటు చేస్తే గ్రామాలలో ఉన్న చిన్న చిన్న వ్యాపారాలు కూడా సర్వనాశనమై పోతున్నాయన్నారు. భగవంతుని దయవల్ల వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో తమ ప్ర భుత్వం అధికారంలోకి వస్తే 45 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ పింఛన్లు ఇస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు నిర్మించి ఇస్తామని, విద్య, వైద్యాన్ని ఉచితంగా అందరికీ అందుబాటులో తీసుకువస్తామన్నారు. ఆపై లక్ష్మీనగర్, నడవలూరు, పాత కందుల వారిపల్లి వరకు దాదాపు 14 కిలోమీటర్ల దూరం కొనసాగించారు.

విశాఖ-అనంత మధ్య ఆంధ్రావ్యాలీ

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



తిరుపతి, ప్రభ న్యూస్‌బ్యూరో: దేశ, విదేశాలకు చెందిన ఐటీ కంపెనీల హబ్‌లను, టవర్‌లను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రాన్ని అమెరికాలోని సిలికాన్ వ్యాలీ తరహాలో ఆంధ్రా వ్యాలీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. కుటుంబసభ్యులతో స్వగ్రామమైన నారావారిపల్లెలో సంక్రాంతి పండగ సంబరాలు జరుపుకోవాడానికి శనివారం ఇక్కడకు చేరుకున్న చంద్రబాబు రేణిగుంట రైల్వేస్టేషన్ రోడ్డులో 200 మందికి ఉపాధి కల్పించేజోహో ఐటీ కంపెనీని ప్రారంభించారు. ఆపై కరకంబాడి-తిరుపతి రహదారి ఉపాధ్యాయనగర్ వద్ద 413 మందికి ఉపాధి కల్పిస్తున్న 7 సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ కంపెనీల డిజిగ్నేటెడ్ ఐటీ హబ్‌ను ప్రారంభించారు. ముందుగా జోహో కంపెనీ ఆవరణలో, తర్వాత ఐటీ హబ్ కంపెనీల ప్రతినిధులతో కొత్తగా స్టార్టప్ కంపెనీల యాజమన్యాలతో సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గా మొదటి ఐటీ కంపెనీ ఇక్కడ ఏర్పాటు చేయాలనే విషయంలో పలురకాల ఆలోచించి హైదరాబాద్‌లోసైబర్ టవర్స్‌ను నిర్మించామన్నారు. ఆనాటి తన కృషి ఫలితంగానే మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు హైదరాబాద్‌కు తరలివచ్చాయన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని ఐటీ రంగంలో ప్రతి నలుగురు భారతీయులలో ఒకరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారున్నారన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకునినవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉజ్వల భవిష్యతుత్తు కోసం చేపట్టిన పారిశ్రామికాభివృద్ధిలో కూడా ఐటీ పరిశ్రమలకు పెద్దపీట వేసామన్నారు. అటు బెంగుళూరు, ఇటు చెన్నైలకు మధ్యలో ఉన్న తిరుపతి ప్రాంతాన్ని ఐట్ హబ్‌గా చేయాలని నిర్ణయించామన్నారు. ఈ క్రమంలోని పలు ఎల క్ట్రానిక్ మేనుఫ్యాక్చరింగ్ కంపెనీలు, ఐటీ ఆధారిత కంపెనీలు వస్తున్నాయన్నారు. భవిష్యత్తులో విశాఖపట్టణం, అమరావతి, తిరుపతి, అనంతపురం ప్రాంతాలను పూర్తిస్థాయి ఐటీ హబ్‌లు తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానన్నారు. అదేవిధంగా వివిధ జాతీయ అంత ర్జాతీయ స్థాయి ఐటీ కంపెనీలతో ఈ నాలుగు జిల్లాల్లో ఐటీ టవర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. తద్వారా అమెరికాలోని సిలికాన్ వ్యాలీ తరహాలో రాష్ట్రాన్ని ఐటీహ బ్‌లతో ఆంధ్రా వ్యాలీగా తీర్చిదిద్దాలని సంకల్పించానని తెలిపారు. ముఖ్యంగా పెద్ద, చిన్న కంపెనీలతో పాలు కొత్తగా రంగంలో ప్రవేశించే స్టార్టప్ కంపెనీలను కూడా ప్రోత్సహించడంద్వారా మూడు విభాగాలతో ఎకో సిస్టమ్ ను నిర్మిస్తున్నామన్నారు.

కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు

(మొదటిపేజీ తరువాయి)

భూ పరిపాలనా డైరెక్టర్‌గా ఉన్న వాకాటి కరుణకు రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దేశ చరిత్రలో తెలంగాణలో మాత్రమే సమగ్ర భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టామని ఆయన అభిప్రాయపడ్డారు. దేశానికే ఇది ఆదర్శంగా నిల్చిందన్నారు. ఈ ప్రక్షాళన ద్వారా మొత్తం భష్మి వివరాలను సేకరించి ప్రభుత్వం సిద్దంగా పెట్టుకుందని, ఈ వివరాలోనే నూతన పాస్ పుస్తకాలు జారీ చేస్తామని చెప్పారు. ఇవే వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టి ధరణి పేరుతో కోర్ బ్యాంకింగ్ తరహా విధానం అమలు చేయనున్నామన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహించిన సమగ్ర భూ రికార్డుల ప్రక్షాళనద్వారా వెల్లడైన ఫలితాలను ఆయన ఈ సందర్భంగా



విశ్లేషించారు.

-1,12,077 చదరపు కిలోమీటర్ల రాష్ట్ర భూభాగం

-2.80 కోట్ల ఎకరాల భూభాగం

-1.42కోట్ల ఎకరాల వివాదరహిత వ్యవసాయ భూమి

-17.89లక్షల ఎకరాల భూమి వివిధన్యాపరమైన, చిక్కుల్లోని భూమి

-11.95లక్షల ఎకరాల రైతుల వద్ద ఉన్న వ్యవసాయేతర భూమి

-84.00లక్షల ఎకాల చెరువులు, కుంటలు, కాలువలు, రైల్వేలైన్, సబ్‌స్టేషన్లు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ ఆస్తుల కింది భూములు, కోర్టు కేసుల్లోని అటవీ భూములు

24 లక్షల ఎకరాల నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని నివాస ప్రాంతాలు, వివాదాలు లేని అటవీభూములు

కోర్ బ్యాంకింగ్ తరహాలో ధరణి నిర్వహణ..

ప్రతీ ఎకరం భూభాగం వివరాలు పొందుపరుస్తూ ఎప్పటికప్పుడు చోటు చేసుకునే మార్పులను కూడా నమోదు చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం భూ రికార్డుల వెబ్‌సైట్‌ను ధరణి పేరుతో కోర్ బ్యాంకింగ్ తరహాలో రికార్డులు నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడిం చారు. ఇందుకు ప్రత్యేకంగా ఐటీ విభాగాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. రిజిస్ట్రేషన్ వివరాలు, పేరు మార్పిడి వివరాలు అదే రోజు ఈ ధరణిలో నమోదు అవుతాయని, మండల కార్యాలయంనుంచి మొదలుకొని రాష్ట్ర స్థాయిలో అన్ని చోట్లా ఈ వెబ్‌సైట్ నుంచే వివరాలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. విదేశాల్లో ఉన్నవాళ్లుకూడా ధరణి ద్వారా అందే సమాచారంతో క్రయ, విక్రయాలు జరుపుకోవచ్చన్నారు.

పార్ట్ ఏ విజయవంతం...త్వరలో పార్ట్ బి...

వంద రోజులపాటు నిర్వహించిన భూ రికార్డుల ప్రక్షాళన పార్ట్ ఎ విజయవంతమైందని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లోని దాదాపు 90 శాతానికిపైగా భూముల విషయంలో స్పష్టత వచ్చిందన్నారు. ఏ భూమికి ఎవరు యజమానో తేలింద న్నారు. ఈ వివరాల ఆధారంగానే కొత్త పాస్ పుస్తకాల జారీ, పంట పెట్టుబడి మద్దతు పథఖం అమలు చేస్తామన్నారు. కోర్టు కేసులు, ఇతర వివాదాలు, అభ్యంతరాలు కల్గిన భూములను పార్ట్ బిలో పరిష్కరిస్తామన్నారు. ఇందుకు వీలుగా ప్రభుత్వం కొన్ని విధాన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందన్నారు. త్వరలో ఇందుకు అనువుగా క్యాబినెట్ సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. అనంతరం పార్ట్‌బి ప్రక్షాళన నిర్వహిస్తామని పేర్కొన్నారు. పార్ట్‌ఎ తో వెల్లడైన 71 లక్షల వ్యవసాయ ఖాతాలకు కొత్త పాస్ పుస్తకాలు ఇస్తామని వెల్లడించారు.

అవినీతి, నకిలీలు, ఇబ్బంది తొలగించడమే లక్ష్యం...

భూముల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు, భూ రికార్డుల నిర్వహణలో నూటికి నూరు శాతం పారదర్శకత సాధించడం, అవినీతిని నిరోధించడం, నకిలీ పాస్‌పుస్తకాలను అరికట్టడం లాంటి లక్ష్యాలతో సంస్కరణలు తెస్తున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సందర్భంగా వెల్లడించారు. రైతులు, ఇతరులు తరచూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పాలి.. కేవలం ఒకసారి మాత్రమే రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లిరావాలి. పాస్ పుస్తకం వారి ఇంటికే కొరియర్ ద్వారా చేరాలి. ఒక్క రోజులో పని పూర్త వ్వాలి. అవినీతికి ఆస్కారం లేకుండా రిజిస్ట్రేష న్లవిధానం ఉండాలి.. నకిలీ పాస్‌పుస్త కాలు, ఇతర డాక్యుమెంట్లు సృష్టించడం పారిపాటిగా మారింది. వీటి ద్వారా రుణాలు పొంది ప్రభుత్వాన్ని కూడా మోసం చేసిన దాఖలాలున్నాయి. ఇకపైఅలా వీలు కాదు. భూ రికార్డుల నిర్వహణ మొత్తం ప్రభుత్వం కట్టు దిట్టంగా చేస్తుంది. అందేకు ఈ సంస్కరణలు తెచ్చాం. ప్రతీ విషయం ధరణిలో నమోదవుతుంది అని సీఎం కేసీఆర్ స్పష్టం చేవారు.

ప్రతిపాదిత నూతన రిజిస్ట్రేషన్ విధానం...

-అమ్మేవారు, కొనుగోలు చేసేవారు పరస్పర అంగీకారానికి వచ్చిన తర్వాత సబ్ రిజిస్ట్రార్‌ను అపాయిట్మెంట్ అడగాలి(పాస్ పోర్టులు, వాహన రిజిస్ట్రేషన్ల తరహాలో స్లాట్ బుకింగ్)

-భూమి విక్రయానికి సంబంధించిన డాక్యుమెంట్ తయారు చేసేందుకు లైసెన్సుడు డాక్యుమెంట్ రైటర్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉంటారు. వారు రుసుము తీసుకుని రాసిన కాగితాలను అనుమతిస్తారు

-క్రయవిక్రయదారులు స్వయంగా రుసుకున్నడాక్యుమెంట్లనూ అంగీకరిస్తారు. దీనికోసం సంబంధిత ఫారాలు, టెంప్లేట్స్ అందుబాటులో ఉంచుతారు

-స్లాట్ సమయానికి అమ్మకందారు, కొనుగోలు దారు పాస్ పుస్తకాలతో సబ్ రిజిస్ట్రార్ ఎదుట హాజరవ్వాలి

-బయోమెట్రిక్ విధానంలో ఇద్దరి వేలిముద్రలు, ఫోటోలు, సంతకాలు తీసుకుంటారు.

-ఎంత భూమిని అమ్ముతున్నారో అంత భూమిని విక్రయదారు పాస్ పుస్తకం నుంచి సబ్ రిజిస్ట్రార్ తొలగిస్తారు. కొనుగోలుదారుకు ఇదివరకే పాస్‌పుస్తకం ఉంటే అందులో నమోదు చేస్తారు. సబ్ రిజిస్ట్రార్ సంతకం చేసి ముద్ర వేస్తారు

-భూమిని కొత్తగా కొంటున్నవారయితే కొత్తపాస్ పుస్తకం జారీ చేస్తారు. అందులో కొనుగోలు చేసిన భూమి వివరాలను నమోదు చేస్తారు

-ఇద్దరి పాస్ పుస్తకాలను అదే రోజు ఎమ్మార్వోకు పంపి, భూ యజమాని కాలమ్‌లో అమ్మినవారి పేరు తొలగించి కొనుగోలుదారు పేరును చేర్చి మ్యుటేషన్ పూర్తి చేస్తారు

-వివరాలను ఎమ్మార్వో కార్యాలయం లోని భూమి రికార్డుల్లో నమోదు చేస్తారు

-ఎమ్మార్వో కార్యాలయంలోని ఐటీ అధికారికి వివరాలు పంపి, వాటిని వెబ్‌సైట్‌లో ఎంటర్ చేస్తారు

-వెబ్ సైట్ లో నమో దైన వివ రాలు కొనుగోలు చేసిన వారికి, విక్రయించిన వారికి వెంటనే ఎస్సెమ్మెస్ వెళుతుంది

-పాస్ పుస్తకాలను ఇప్పటి వలె ఆర్డీవోకు పంపాల్సిన అవసరం లేదు. పేరు మార్పిడి (మ్యుటేషన్) బాధ్యత పూర్తిగా ఎమ్మార్వోదే

-మ్యుటేషన్ తర్వాత ఎమ్మార్వో కార్యా లయం ముద్ర వేసి, ఎమ్మార్వో సంతకం చేస్తారు. పాస్ పుస్తకాలను అదే రోజు తిరిగి సబ్ రిజి స్ట్రార్‌కు పంపి స్తారు

-ఎమ్మా ర్వోనుంచి తనకు అందిన పాస్ పుస్తకాలను సబ్ రిజిస్ట్రార్ కొరియర్ ద్వారా అమ్మినవారికి, కొన్న వారికి పంపిస్తారు. కొన్నవాళ్లకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ కూడా పంపుతారు

-సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డిస్పాచ్ అయిన వెంటనే ఇద్దరికీ ఎస్సెమ్మెస్ వస్తుంది

-రైతులకిచ్చే పాస్ పుస్తకంలో ఖాతా నెంబర్‌తోపాటు పాస్ పుస్తకం యూనిక్ కోడు, గ్రామం కోడ్, మండలం కోడ్, యజమాని ఆధార్ నెంబర్లు ఉంటాయి.

ఎమ్మార్వోలకు సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు...

రైతులు, ఇతరులకు అందుబాటులో ఉండేలా ప్రతీ మండల రెవెన్యూ కార్యాలయంలో ఆస్తుల రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని సీఎం కేసీఆర్ గతంలోనే నిర్ణయం తీసుకున్నారు. మొత్తం 584 రెవెన్యూ మండలాల్లో 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలున్నాయి. వాటిని 141 మండలాల పరిధికి కొనసాగిస్తూనే మిగతా443 చోట్ల ఎమ్మార్వోలకు సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. ఎమ్మార్వోలు తామిచ్చిన అపాయింట్‌మెంట్ తేదీలకనుగుణంగా శని, ఆదివారాలు, ఇతర సెలవులు మినహా వారానికి ఐదు రోజులు ఉదయంసమయంలో రిజిస్ట్రేషన్ బాధ్యతలు నిర్వహిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ఎమ్మార్వోలు హాజరుకాకపోతే ఆ బాధ్యతలను డిప్యూటీ తహశీల్దార్‌లకు అప్పగిస్తారు.

పట్టదారులే ప్రామాణికం

- కౌలుదారులకు హక్కులు కల్పించడం సాధ్యం కాదు
- పెట్టుబడి మద్దతులోనూ వారికి సహాయం చేయలేం
- రెవెన్యూ అధికారులకు స్పష్టం చేసిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో వ్యవసాయ భూముల రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం అత్యంత పారదర్శకంగా జరిగిందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అధికార యంత్రాంగాన్ని అభినందించారు. నిర్దేశిత గడువులోగా గత ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి ఈ కార్య క్రమాన్ని పూర్తిచేయడం శుభ పరిణామమని వ్యాఖ్యా నించారు. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి ప్రతిష్టాత్మకమైన పెట్టుబడి రాయితీ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవా లన్నారు. పట్టాదారుల హక్కులకు ఎక్కడా భంగం కలుగకుం డా చూడాలని, ఎక్కడైనా లోటుపాట్లు జరిగి ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలని సూచించారు. చట్టంలో ఉన్న నిబంధనల ప్రకారం పట్టాదారులే ప్రావాణికమని స్పష్టం చేశారు. కౌలు రైతులకు అధికారికంగా ఎలాంటి హక్కులను కల్పించడం ప్రభుత్వానికి సాధ్యం కాదన్నారు. పెట్టుబడి మద్ధతు పథకంలోనూ వారికి ఎలాంటి సహాయం అందించలేమని స్పష్టం చేశారు. శనివారం ప్రగతి భవన్‌లో ఈ అంశంపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం కొంతమంది అధికారుల సందేహాలను ముఖ్యమంత్రి నివృత్తి చేశారు. ప్రస్తుతం పట్టాదారుల హక్కులను పరిరక్షించడానికి మాత్రమే ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. కౌలు రైతుల చట్టం అత్యంత కఠినమైనదని, దాన్ని అమలు చేస్తే తెలంగాణాలో అత్యధికంగా ఉన్న చిన్న, సన్నకారు రైతుల హక్కులకు భంగం వాటిల్లుతుందని అన్నారు. ఎన్ని కష్టాలొచ్చినా బరిస్తారు కానీ, రైతులు తమ భూములు అమ్ముకోవడానికి ఇష్టపడరని పేర్కొన్నారు. తరతరాలుగా అనుభవిస్తూ వస్తున్న భూముల కోసం ఆత్మహత్యలు చేసుకున్న దాఖలాలు అనేకంగా ఉన్నాయన్నారు. ఆ కోవకు చెందిన 56లక్షల రైతు కుటుంబాల మనోభావాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పట్టదారులకు ఖరీదైన, నాణ్యమైన పాసు పుస్తకాలను ఈ నెలాఖరు నుంచి పంపిణీ చేయాలని ఆదేశించారు. పట్టాదారు పాసు పుస్తకాలపై ప్రభుత్వ లోగో తప్ప ఎలాంటి బొమ్మలు ముద్రించకూడదని చెప్పినట్లు సమాచారం.



తుదినిర్ణయం రైతన్నదే..!

(మొదటిపేజీ తరువాయి)

అవసరం మేరకు విరమించుకోవాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తోంది. గ్రామ సభల్లో తీర్మాణం చేసి ప్రభుత్వానికి పంపిస్తే ఆయా ప్రాంతాల్లో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఫీడర్లను వేరుచేసి 12 నుంచి 18 గంటలు మాత్రమే ఇవ్వాలని సీఎం కేసీఆర్ సూచనప్రాయ నిర్ణయం తీసుకున్నారు.

అయితే, రాజకీయ కోణంలో ఒత్తిడి పెరుగుతోందా? అన్న అంశంపై స్థానిక ఎమ్మెల్యేల ద్వారా ఆరా తీస్తున్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకుని దిద్దుబాటు చర్యలు మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నారు. బోరుబావుల వద్ద ఆటోస్టార్టర్ల తొలగింపు ప్రభుత్వ యంత్రాంగానికి అసాధ్యంగా మారడంతో ఒక అడుగు వెనక్కి వేయక తప్పడంలేదు. కొన్ని ప్రాంతాల్లో బోర్లలో నీరులేక నిరంతర విద్యుత్ సరఫరాతో మోటార్లు కాలిపోతున్నాయి. అదే సమయంలో భూగర్భ జలాల పరిరక్షణకు పెనుముప్పు పొంచివుంది. ఏ కోణంతో చూసినా 24 గంటల విద్యుత్ సరఫరాపై గ్రామస్థాయిలో సరాసరిగా 50శాతం రైతుల్లో వ్యతిరేకత కనిపిస్తోంది. ఇదే విషయాన్ని తాజాగా శనివారం వరంగల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు హరీష్‌రావు, తుమ్మల నాగేశ్వరరావుల సమక్షంలో అధికార పార్టీకి మద్ధతిస్తున్న ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు రైతులకు 24 గంటల విద్యుత్ అవసరం లేదని బహిరంగంగానే స్పష్టం చేశారు. అందుకు మంత్రి బదులిస్తూ గ్రామసభల్లో తీర్మాణం చేసి ప్రభుత్వానికి పంపిస్తే అవసరం లేని ప్రాంతాల్లో నిలిపివేస్తామని ప్రకంచారు.

గతంలో సాగు నీరందక నష్టం

రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా ఉన్న 23.60 లక్షల వ్యవసాయ పంపుసెట్ల వద్ద రైతులు యేటా రూ.35వేల కోట్ల పెట్టుబడి పెట్టి రకరకాల సాంకేతిక కారణాల వల్ల నష్టపోతున్నారు. నగలు తాకట్టు పెట్టి పంటలు సాగు చేస్తే పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితులు గతంలో నెలకొన్నాయి. ఈ దుస్థితి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించడానికే 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని సీఎం కేసీఆర్ ఇటీవలే ప్రకటించారు. తద్వారా నిరాదరణకు గురైన అనుబంధ రంగాలు కూడా బలపడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కానీ నిరంతరం విద్యుత్ సరఫరా కావడంతో బోరు బావుల వద్ద ప్రతికూల పరిస్థితులు నెలకొంటున్నాయి. కరీంనగర్ జిల్లాలో 3.33 లక్షల పంపుసెట్లతో 90శాతం బోరుబావుల పైనే వ్యవసాయ రంగం ఆధారపడి ఉంది.

ఉచిత విద్యుత్ భారం రూ.5,384 కోట్లు


రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ అమలు చేయడానికి ప్రస్తుతం ప్రభుత్వం ప్రతియేటా రూ.4,777 కోట్ల నిధులు ఖర్చు చేస్తోంది. ప్రస్తుతం 24 గంటలపాటు ఇవ్వాలన్న నిర్ణయం ద్వారా ఈ మొత్తం రూ.5,384 కోట్లకు పెరుగుతోంది. అధికారులు తెలిపిన సమాచారం మేరకు ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య, సాయంత్రం 5 నుంచి 7 గంటల మధ్య విద్యుత్ వినియోగం అత్యధికంగా ఉంటోంది.

విపక్షాల దుమ్ము దులుపుదాం

- విద్యుత్, ఇసుక వివాదాలపై తెరాస

హైదరాబాద్, ఆంధ్రప్రభ: విద్యుత్, ఇసుక వివాదాలపై అసెంబ్లీలోనే విపక్షం దుమ్ముదులపాలని, లెక్కలతో.. చరిత్ర, ఆధారాలతో ఎండగట్టాలని టిఆర్ఎస్ నిర్ణ యించింది. ఈ నెలలోనే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇందుకు సంబంధించి 23,24తేదీలను పరిశీలిస్తోంది. పంచాయతీరాజ్ చట్టం ఆమోదం కోసం అసెంబ్లీని రెండురోజుల పాటు సమావేశపరచాలని ఇప్పటికే నిర్ణయించిన ప్రభుత్వం త్వరగా సమావేశపరిచి అసెంబ్లీ వేదికగా ఇటీవల కాలంలో స్వరంపెంచిన విపక్షాలపై విరుచుకుపడాలని నిర్ణయించింది. 24గంటల విద్యుత్ అంశంపై దేశమంతా ప్రశంసిస్తుంటే రాష్ట్రంలోని ప్రతిపక్షాలు మాత్రం ఈ క్రెడిట్ ప్రభుత్వానికి రాకూడదన్న దుగ్ధతో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయని ప్రభుత్వం మండిపడుతోంది. కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డితో పాటు పలువురు నేతలు చేస్తున్న విమర్శలపై ఆగ్రహంగా ఉన్న టిఆర్ఎస్ అసెంబ్లీ వేదికగా.. కాంగ్రెస్‌ను ఇరుకునబెట్టే వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది. పార్టీకి సంబం ధించిన పలువురు నేతలు ఈ వ్యవహారంపై సరిగా కౌంటర్ ఇవ్వలేకపోయారని భావిస్తున్న పార్టీ ముఖ్యులు.. అసెంబ్లీని వేదికగా చేసుకుని విద్యుత్ అంశంపై విపక్షాలు చేస్తున్న ప్రచారమంతా తిప్పికొట్టి ఆత్మరక్షణలో పడేయాలని భావిస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రి కెసిఆరే రంగంలోకి దిగి.. లెక్కలు, ఎలా విద్యుత్ సమస్యను అధిగమించిందీ చెప్పే అవకాశం ఉంది. విద్యుత్ రంగంలో ఆదినుండీ ప్రభుత్వ కృషికి ప్రజల్లో మంచి మార్కులే పడగా, ఇటీవల 24గంటల ఉచితవిద్యుత్‌ను వివాదం చేసే యత్నం చేయడంపై ఆగ్రహంగా ఉంది. మరో వైపు ఇసుక అంశంలోనూ ప్రభుత్వాన్ని బదనాం చేసే యత్నాలను సీరియస్‌గా పరిగణిస్తోంది. ఇసుకకు సంబంధించి గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను సరిచేసి పారదర్శక పాలసీని టిఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిందని, ప్రభుత్వ చర్యల వల్లే గతంలో రూ.100కోట్లు కూడా లేని ఆదాయం రూ.వేయికోట్లకు పైగా పెరిగిందని టిఆర్ఎస్‌వర్గాలు చెబుతున్నాయి. రెండు అంశాలపైనా.. అసెంబ్లీలో స్ట్రాంగ్ కౌంటర్ ఇవ్వాలని యోచిస్తోంది. శాసనసభలో విపక్షాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రత్యేక వ్యూహాన్ని రూపొందిస్తోంది. అసెంబ్లీ ఉండగా.. మరో వేదికగా చర్చించాల్సిన అవసరం ఏం ఉందని టిఆర్ఎస్ పెద్దలు అభిప్రాయ పడుతున్నారు. ఈ విషయంలో నేతలు సవాల్ చేసే ముందు ఆచితూచి వ్యవహరించాలని పార్టీ నేతలు సూచిస్తున్నారు.

తాజాగా జరిగే అసెంబ్లీ సమావేశాల్లో విపక్షాన్ని ఇరుకునబెట్టి.. పంచాయతీరాజ్ చట్టాన్ని ఆమోదించి.. అదే వేడిలో గ్రామపంచాయతీ ఎన్నికలకు వెళ్ళే అంశాన్ని టిఆర్ఎస్ అధిష్టానం పరిశీలిస్తోంది. బడ్జెట్ సమా వేశాలకు ముందు పంచాయతీపోరుకు వెళ్ళాలా.. బడ్జెట్ సమావేశాల తర్వాత వెళ్ళాలా అన్నదానిపై చర్చలు చేస్తోంది. ప్రభుత్వం ఏర్పడి దాదాపు నాలుగేళ్ళు కావొస్తుండగా, ఇప్పటికీ ఏ ఎన్నిక జరిగినా పార్టీ జైత్రయాత్ర కొనసాగుతోంది. శనివారం వెల్లడైన ఎంపిటిసి ఉప ఎన్నికల ఫలితాలలోనూ టిఆర్ఎస్ హవా కనిపించింది. 16స్థానాల్లో పది ఎంపిటిసి స్థానాలను కైవసం చేసుకుంది. విపక్షాలకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా.. ప్రజల మనోభావాలకు అను గుణంగా కార్యకలాపాలు నిర్వహించుకుంటూ వెళ్ళాలని టిఆర్ఎస్ వ్యూహం రూపొందించుకుంటోంది.



బుద్ధగయ: బోధి వృక్షం క్రింద బౌద్ధ సన్యాసులతో ప్రార్థనలు జరిపిస్తున్న బౌద్ధ గురువు దలైలామా

మేడారం జాతరకు రాహుల్?

- టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రయత్నం సఫలం
- పర్యటన తేదీపై గోప్యత పాటిస్తున్న కాంగ్రెస్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణలో అతిపెద్ద జాతరగా మేడారంలో నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. గిరిజన సంప్రదాయాలతో జరుపుకునే ఈ పండుగకు అన్ని వర్గాల ప్రజలు భక్తి శ్రద్ధలతో వెళ్లి మొక్కులు తీర్చుకుంటారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు నాలుగు రోజుల పాటు జరిగే మేడారం జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, చత్తీష్‌ఘడ్, కర్నాటక తదితర రాష్ట్రాల నుంచి దాదాప ు కోటిన్నరకు పైగా జానాభా వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ జాతరను రెండేళ్లకొకసారి నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా జాతర ఖర్చుకు రూ. 80 కోట్లను కేటాయించిన విషయం తెసిందే. జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి.. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయడమే కాకుండా.. కేంద్ర మంత్రులను కూడా ఆహ్వానించారు. ఈ జాతరకు రాహుల్‌గాంధీని రప్పించడం వల్ల గిరిజనులను కాంగ్రెస్ వైపు తిప్పు కోవడానికి అవకాశం ఉంటుందనే ఆ పార్టీ నేతలు భావించారు. టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీ పెద్దలకు వివరించారు. రాహుల్‌ను ఒప్పించే బాధ్యతను ఏఐసీసీ ఎస్సీ సెల్ ఛైర్మన్ కొప్పుల రాజుకు అప్పచెప్పినట్లు తెలిసింది. తెలంగాణలో రెండేళ్ళకొకసారి నిర్వహించే మేడారం జాతరకు వెళ్లడం వల్ల పార్టీకి లాభం ఉంటుందనే విషయాన్ని రాహుల్‌కు వివరించగా.. ఆయన కూడా సమ్మతించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ఉత్తమ్ ప్రయత్నాలు పలించనట్లుగా ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే ఈ నాలుగు రోజుల్లో ఎప్పుడొస్తారనే విషయంపై గోప్యతగా ఉండాలని సూచించినట్లు తెలిసింది. ఎందుకంటే నిత్యం లక్షల మంది జనం వచ్చే అవకాశం ఉండటంతో.. రాహుల్‌గాంధీని చూసేందుకు ఎక్కువగా ప్రజలు వచ్చే అవకాశం ఉందని, దీంతో తొక్కిసలాటకు దారి తీసే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. అందు కని ముందుగానే పర్యటన వివరాలు చెప్పకుండా కాంగ్రెస్ నేతలు గోప్యత పాటించనున్నారు. రాష్ట్రంలో దళిత, గిరిజన , బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవ సభ వరంగల్ జిల్లాలో పెద్ద బహిరంగ సభను నిర్వహించాలని అనుకున్నారు. ప్రజలు మేడారం జాతరకు వెళ్లడం, ఆ జిల్లాలో సభ నిర్వహిస్తే ఎలా ఉంటుందనే దానిపైన కాంగ్రెస్ నేతలు పునరాలోచన చేస్తున్నట్లుగా తెలిసింది. తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువైన ఉస్మానియా యూనివర్సిటిలోనూ విద్యార్థులతో ఒక భారీ బహిరంగ సభను నిర్వహించాలని కూడా టీ కాంగ్రెస్ నేతలు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. వరంగల్‌లో బహిరంగ సభ ఉంటే.. ఆ తర్వాతనే ఓయూలో కూడా విద్యార్థులతో సభ ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

బుద్వేల్ ఐటీ క్లస్టర్ భూసేకరణపై ప్రభుత్వానికి నివేదిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఐటి క్లస్టర్‌కు సేకరించే భూములకు నష్టపరిహారం చెల్లించే అంశంపై కసరత్తు ప్రారంభించింది. నగర శివార్లలోని రాజేంద్రనగర్ మండలంలో దాదాపు 300 ఎకరాల్లో ఐటి క్లస్టర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనికి అవసరమైన భూమిని గుర్తించి సేకరించాలని రెవెన్యూశాఖను ఆదేశించింది. ఇక్కడి భూములకు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ధర ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. దీనికి సంబంధించి ఇతర సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. మండల పరిధిలోని కిస్మత్‌పూర్, హిమాయత్‌సాగర్, బుద్వేల్, ప్రేమావతిపేట గ్రామాల్లో 300 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది. మాదాపూర్, గచ్చిబౌలిలో ఐటి ప్రాజెక్టులలో బహుళజాతి సంస్థలు ఇప్పటికే పూర్తిస్థాయిలో ఆఫీస్ స్పేస్‌ను ఉపయోగించుకుంటున్నాయి. ఐటి ప్రాజెక్టుల విస్తరణలో భాగంగా టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభించగా, ఇప్పుడు రాజేంద్రనగర్ ప్రాంతంలో ఐటి క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధంచేసింది. రాజేంద్రనగర్ ఐటి క్లస్టర్‌లో తమ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే అనేక కంపెనీలు సంసిద్ధత వ్యక్తంచేశాయి. ప్రభుత్వం గుర్తించిన భూములను సేకరించేబాధ్యత జిల్లా కలెక్టర్‌కు అప్పగించగా, దానిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ఐటి ముఖ్య కార్యదర్శి, హెచ్ఎండిఎ, టిఎస్-ఐసిసి కమీషనర్లకు అప్పగించింది. అయితే ఈ ప్రాంతంలో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ధర రూ.35 నుంచి 40 లక్షలు ఉండగా, మార్కెట్ ధర రూ.5 కోట్లు ఉన్నట్లు కలెక్టర్ నివేదిక తెలిపింది. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ధరను నిర్ణయించి రైతులకు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకోనుంది. ఈ ఐటి క్లస్టర్ పూర్తయితే దాదాపు లక్షా 25వేల మందికి ఉపాధి కలుగుతుందని ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు ప్రకటించిన విషయం తెలిసిందే.

ప్రైమరీ స్కూల్ టీచర్స్ సెలవులపై ఆంక్షలు

- స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడి ద్వారా ఎంఈవోకు పంపాలి
- ఉత్తర్వులిచ్చిన పాఠశాల విద్యా సంచాలకులు
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు
- ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు తీసుకునే క్యాజువల్ సెలవులపై పాఠశాల విద్యా శాఖ ఆంక్షలు విధించింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు సెలవు కావాలంటే ఆయా ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడి ద్వారా పంపించాలని పాఠశాల విద్య సంచాలకులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. వెంటనే ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

పాఠశాల విద్య సంచాకులు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుల సెలవులపై ఇచ్చిన ఉత్తర్వులు వింతగానూ, ప్రభుత్వ సాధారణ నిబంధనలకు విరుద్ధంగానూ ఉన్నాయని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి విమర్శించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు సెలవు మంజూరు చేసే అధికారం ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఉంటుందని అన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాల వారికి అయితేనే ఎంఈవోకు సెలవు గురించి సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని గతంలో జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టంగా ఉందని పేర్కొన్నారు. కానీ ఇప్పుడు ఉపాధ్యాయుల గౌరవాన్ని తగ్గించే ఇటువంటి చర్యల కంటే పర్యవేక్షణా వ్యవస్థను మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల



ఉపాధ్యాయుల సెలవులపై పాఠశాల విద్య సంచాలకులు ఇచ్చిన ఉత్తర్వులు పనికిరాని ఉత్తర్వులు అని పిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి అన్నారు. ఈ ఉత్తర్వుల ద్వారా ఉపాధ్యాయుల పనిగంటలు వృధా కావడం తప్ప ఏమి ఉపయోగం లేదన్నారు. ఇటువంటి ఉత్తర్వులు విద్యారంగ అభివృద్ధికి ఉపయోగపడకపోగా నిర్వీర్యం చేస్తాయని మండిపడ్డారు. వెంటనే ఉత్తర్వులను ఉపసంహారించాలని డిమాండ్ చేశారు.

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుల సెలవులపై పాఠశాల విద్య సంచాలకులు తీసుకొచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ టీచర్స్ యూనియన్(టిటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టపల్లి రాధాకృష్ణారావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా ఉత్తర్వులు ఉండాలి తప్ప వారికి ఇబ్బంది కలిగించే విధంగా ఉండరాదని అన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు సెలవు మంజూరు విషయంలో ఇప్పటికే ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా పాఠశాల విద్య సంచాలకులు తీసుకొచ్చిన ఉత్తర్వులను ఉపసంహారించుకోవాలని పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు మారెడ్డి అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం చెన్నయ్య డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు సెలవు మంజూరు చేసే అధికారం ప్రధానోపాధ్యాయులకు ఉందని దానిని కాదని కొత్తగా ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుల సెలవులపై పాఠశాల విద్య సంచాలకులు ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహారించుకోవాలని తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్(టిటిఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ రఘునందన్ డిమాండ్ చేశారు.

ఎడారిలో హిమపాతం



అల్జీరియా: ఎర్రటి ఎండతో నిప్పులుకక్కే సహారా ఎడారి ఒక్కసారిగా చల్లబడింది. ఉష్ణమండల వాతావరణం కాస్త శీతల మండలంగా మారిపోయింది. అగ్ని గోళంగా ఉండే ఆఫ్రికా ఎడారిని మంచుదుప్పటిని కప్పేసింది. హఠాత్తుగా మండే ఎండలకు బదులు చల్లని ఆహ్లాదకరమైన వాతావరణం ఉండటం సందర్శకులను కట్టిపడేస్తోంది. మొక్కలు కూడా పెరగనీ వాతావరణం లేని ఆ ప్రాంతంలో ఇసుకపై కురుస్తున్న మంచుబిందువులు తలతలా మెరుస్తూ వెంటనే మాయమౌతున్నాయి. 92 లక్షల చదరపు కిలోమీటర్లున్న సహారా ఎడారిలోని రమనీయమైన దృశ్యాలను చూసేందుకు అల్జీరియా నగరంలోని ఐయిన్ సెఫ్రా ప్రజలు క్యూకట్టారు. మైనసులోకి వెళ్లిన ఉష్ణోగ్రతలతో అందాలను తమ కెమెరాల్లో బంధిస్తూ.. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో దాదాపు 15 ఇంచుమేర మంచు ఇసుకను కప్పేయడంతో అసలది సహారా ఎడారే లేక అట్లాంటిక్ లోని శీతల ప్రాంతమా అన్న సందేహం కలుగుతోంది. సహారా ఎడారిలో ఇలా మంచుదుప్పటి కప్పుకోవడం నలభై ఏళ్లలో ఇది మూడోసారి. ఐయిన్ సెఫ్రా ప్రాంతంలో 2016 డిసెంబర్‌లోనూ ఇలాగే మంచుకురిసింది. అంతకు ముందు 1979 లో మాత్రమే ఇలాంటి వాతావరణం నెలకొనడంతో సందర్శకుల తాకిడి పెరిగిపోయింది. భూమిపై అత్యంత ఉష్ణోగ్రత ఉండే సహారా ఎడారి లాంటి ప్రాంతం ఒక్కసారిగా మంచుమేటలను కప్పుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అయితే ఎడారిని కప్పేస్తున్న ఈ మంచు క్షణాల్లో కరిగిపోయి మళ్లీ మళ్లీ దర్శనమివ్వడం అందర్నీ అబ్బురపరుస్తోంది. ప్రస్తుతం ఈశాన్య అమెరికాలో మంచు తుఫాన్ నెలకొనడంతో అట్లాంటిక్ మీదుగా ఆ ప్రభావం ఆఫ్రికాపై పడినట్లు నిపుణులు చెబుతున్నారు. గ్లోబల్ వార్మింగ్ ప్రభావం కూడా ఇలాంటి ఘటనలకు కారణం కావచ్చని అంచనా వేస్తున్నారు.

అందని ద్రాక్ష..డిజిటల్ విప్లవం

పేదరికంలో గ్రామీణ భారతం



న్యూఢిల్లీ: ఆధార్ కార్డు, నోట్ల రద్దు, టెలికామ్‌రంగంలో అనూహ్యమైన మార్పులకు దీప స్తంభాల్లా దేశమంతటా కనిపించే మొబైల్ టవర్లు.. ఇవన్నీ కూడా కేంద్రం ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటున్న డిజిటల్ విప్లవానికి నిదర్శనాలు. కానీ ఈ విప్లవం తాలూకు ఫలాలు ఇప్పటిదాకా గ్రామీణ భారతానికి అందకపోవడం అత్యంత దురదృష్టకరం.

స్తంభాలు, తీగెలున్నా.. కరెంటు సున్నా



కరెంటు ఇచ్చినందుకు గుర్తుగా అక్కడక్కడా స్తంభాలు, తీగెలు కనిపిస్తుంటాయి. కానీ వాస్తవానికి ఇప్పటికీ అనేక గ్రామాలు విద్యుత్ వెలుగులకు నోచుకోలేదు. చుట్టు దట్టమైన అడవితో 19వ శతాబ్దపు జీవనశైలితో గ్రామస్తులు కనిపిస్తుంటారు. ఏనుగులు గ్రామాల్లోకి రావడం సర్వసాధారణమైన విషయం.

రోడ్డు అంటే తెలుసా మీకు?



నిజానికి జిల్లా ప్రధాన కేంద్రం నుంచి ఆరంభమయ్యే ప్రయాణం మానవ నాగరికతకు అద్దంపట్టే అద్భుతమైన రహదారులను కనులముందు ఉంచుతుంది. కొద్ది దూరం వెళ్లేసరికి రహదారి దారి తప్పుతుంది. అతుకుల బొతుకుల తారు రోడ్లు తగులుతుంది. నదులన్నీ కలిసేది సముద్రంలోకి అన్న చందంగా జిల్లా ప్రధాన కేంద్రం వద్ద ప్రారంభమైన అద్భుతమైన రోడ్లు కాస్త చివరకు మట్టి రోడ్లలో కలుస్తుంది. అలాంటి రోడ్లపై ప్రయాణించే వాహనాలు గ్రామీణ భారతపు దుమ్ము లేపుతుంటాయి. ఇక్కడి పరిస్థితి చూస్తే ఏదో ఒక రోడ్లు ఉండికదా అనిపించాల్సిందే.

ఎందుకంటే ఇంకా చాలా గ్రామాలకు రోడ్లను దాఖలాలు లేవు.

ఇంకా నయం.. రూ.50,రూ.20 నోట్లు రద్దు చేయలేదు..!





ఇక్కడి గ్రామాల ప్రజలు తరతరాలుగా పేదరికంతో సహవాసం చేస్తున్నారు. అదే ఒక విధంగా వారిపై నోట్ల రద్దు ప్రభావం లేకుండా చేసింది. రూ.500, రూ. 2,000 నోట్లు ఎలా ఉంటాయో తెలియని వారికి నోట్ల రద్దు అంటే ఏం తెలుస్తుంది అని స్థానికంగా విద్యాధికుడైన ఒక యువకుడు అన్నాడు. ప్రభుత్వం వారిని చల్లగా చూసింది. అందుకే రూ.50, రూ.20 నోట్లను రద్దు చేయలేదు. ఆ దేవుడి దయవల్ల ఇక్కడ జీవితాలు చాలా బాగున్నాయని వ్యంగ్యంగా అతడు అంటుంటే అందులో అంతుపట్టని వ్యవస్థపై తీవ్ర ఆగ్రహం కనిపించింది.

ఏదిక్కులేనివారికి వలసలే దిక్కు

మొబైల్ సిగ్నల్ ఇవ్వడానికి హలో పాయింట్ ఎటూ ఉండి కాబట్టి ఇక్కడి యువత అధునాతన సమాజంవైపు ఆశగా చూస్తున్నారు. తమ గ్రామాల్లో దానిని అందిపుచ్చుకోవడం అసాధ్యం కాబట్టి అస్తిత్వం కోల్పోతున్నా కానీ పట్టణాలు, నగరాలకు వలస వెళుతున్నారు. హోటళ్లు, ఫ్యాక్టరీలు, భవన నిర్మాణాల్లో కూలీలుగా స్థిరపడుతున్నారు. ఆ విధంగా డిజిటల్ విప్లవానికి దగ్గరవుతున్నారు.

పచ్చని అడవి తోడుంటే...

ఒక్కటి మాత్రం నిజం. కేంద్రం చెబుతున్న డిజిటల్ విప్లవం సంగతి పక్కన పెడితే.. తీగెలు తెగిన కరెంటు స్తంభాలకు

అల్లుకున్న తేనె పట్టు ఇక్కడి జీవ వైవిధ్యాన్ని ప్రదర్శిస్తున్నది. దట్టంగా వ్యాపించిన అడవి, జీవధారగా జలంతో జాలువారుతున్న సెలయేళ్లు, కాల్వలు, పెద్దపెద్ద చెట్లు, పోడు వ్యవసాయంలో పుట్టుకొచ్చిన పంటలు అంతంతమాత్రపు దిగుబడి అందించినా కానీ ఇక్కడి ప్రజలు నిరాశ చెందడంలేదు. అలవాటైన పేదరికం, కంటి చూపు మేర కానరాని డిజిటల్ ప్లవం తమ జీవితాల్లో పెను మార్పులు తీసుకువస్తాయని

మహా ప్రసాదం.. మొబైల్ సిగ్నల్



ఇంతటి దురవస్థకు ఒడిశా రాష్ట్రంలోని గ్రామాలు అద్దం పడుతున్నాయి. అక్కడ ఒకానొక గ్రామంలో కొంత దూరం నడిస్తే హలో పాయింట్ అని రాసి ఉన్న ఒక బోర్డు కనిపిస్తుంది. అది చూపిన వైపునకు వెళితే తప్ప మీ సెల్‌ఫోన్‌కు సిగ్నల్ అందదు. సదరు గ్రామం ఉన్న రెవెన్యూ డివిజన్‌లో ఒక్కటంటే ఒక్క పెట్రోల్‌బంకు కనిపించదు. అంతటి ఘనత వహించిన ఆ రెవెన్యూ డివిజన్ 1980 దశకంలో ఆకలి చావులకు పెట్టింది పేరు. అభివృద్ధి పనులు కోసం నిధులను ఖర్చు చేయాలని అధికారులు చాలాకాలం పాటు ఆసక్తి చూపలేదు.. వారు ఊహించడంలేదు. ఉన్నదాంతో సర్దుపోదామనే వారి జీవనశైలి, ప్రభుత్వ పథకాల కోసం పట్టుబట్టని నైజం గ్రామీణులను శాంతస్వభావులుగా ఉంచుతున్నాయి. డిజిటల్ విప్లవపు ఫలాలు తమకు అందడంలేదని ఆక్రోశం వారిలో మచ్చుకైనా కనిపించడంలేదు. ఎందుకంటే వారు తమ జీవితాన్ని ఎప్పుడూ ఒక పరుగు పందెంలా భావించరు.

తీసుకువచ్చారు. కంటి ముందు కనిపిస్తున్న పేదరికపు కరాళ నృత్యాన్ని చూసి దాతలు కరిగిపోయేవారు. తోచినంత ఇచ్చేవారని ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉన్న అక్కడి ప్రజలు గతాన్ని గుర్తు చేసుకుంటారు.

ముసాయిదాపై చర్చ జరపాల్సిందే

- నిపుణులు, పార్టీల అభిప్రాయాలను సేకరించాలి
- నాలుగేళ్లలో పంచాయతీరాజ్ వ్యవస్థను తెరాస

భ్రష్టు పట్టించింది: భాజపా శాసనసభానాయకుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: నూతన పంచాయతీరాజ్ చట్టం ముసాయిదాను అన్ని గ్రామసభల్లో చర్చించాలని భాజపా శాసనసభాపక్షనాయకుడు జి. కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల, జిల్లా పరిషత్ సభ్యులతో పాటు అందరి అభిప్రాయాలను స్వీకరించాలని సూచించారు. స్థానిక సంస్థలకు మరిన్ని నిధులు...విధులు కల్పించే విధంగా అవసరమైన నిపుణులు, వివిధ రాజకీయ పార్టీలతో సమగ్రంగా చర్చించిన తరువాతనే రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని తయారు చేయాలన్నారు. అంతే తప్ప అసెంబ్లీలో సంఖ్యాబలం ఉందన్న అహంతో తెరాస ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. శనివారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, నాలుగేళ్లలో ఏనాడు పంచాయతీరాజ్ వ్యవస్థను పట్టించుకోని ముఖ్యమంత్రి కేసీఆర్....ఇప్పుడు హడావిడిగా చట్టం చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సుధాకర్ శర్మ, కృష్ణసాగర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఇప్పటికైనా జ్ఞానోదయం కలిగింది

తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేని వారికి తమ ప్రభుత్వంలో అధిక ప్రాధాన్యత లభిస్తోందన్న విషయాన్ని తెరాస ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నేతలకు ఇప్పటికైనా జ్ఞానోదయమైందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రెండు రోజుల క్రితం హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు.

మందకృష్ణ పంటేరులను ప్రభుత్వం వేధిస్తోంది....

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, తెదేపా రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డిపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

మజ్లిస్ చేతిలో తెరాస కీలుబొమ్మ

ఒకవైపు అక్బరుద్దీన్...మరోవైపు అసదుద్దీన్ పెట్టుకుని వారి కనుసన్నల్లో తెరాస పాలన కొనసాగుతోందని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆ పార్టీ ఏనాడు తెలంగాణకు అనుకూలంగా లేదని...అలాంటప్పటికీ కేసీఆర్ ఆ పార్టీతో ఎందుకు జతకట్టారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

యువతికి ప్రాణదానం

న్యూఢిల్లీ: ప్రమాదవశాత్తు కాలువలో పడి కొట్టుకుపోతున్న యువతిని 55వ బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ జవాన్ రక్షించాడు. భావన ప్రాంతంలో శనివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. మునాక్ కెనాల్‌లో పడిపోయిన 18 ఏళ్ల యువతిని, సమీప ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న జవాన్ గమనించాడు. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. వెంటనే సహచర జవాన్లను అప్రమత్తం చేసిన కానిస్టేబుల్ ప్రమోద్‌కుమార్ చౌహాన్ నీటిలోకి దూకి బాలికను కాపాడాడు. ఆమెకు సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌లో ప్రథమచికిత్స అందించి, సదరు యువతిని నరేలాకు చెందిన లక్ష్మీగా గుర్తించినట్లు సీనియర్ అధికారి వెల్లడించారు.

బ్రిటన్ షాడో కేబినెట్‌లోకి ప్రీత్‌కౌర్

లండన్: బ్రిటన్‌కు చెందిన తొలి సిక్కు మహిళా ఎంపీ ప్రీత్‌కౌర్ గిల్ షాడో కేబినెట్‌కు ఎంపికయ్యారు. ప్రతిపక్ష లేబర్ పార్టీ నాయకుడు జెరెమీ కార్బిన్ నేతృత్వంలో షాడో కేబినెట్ ఏర్పాటైంది. ప్రభుత్వ మంత్రివర్గానికి సాపేక్షంగా విపక్షషాడో కేబినెట్ పనిచేస్తుంది. అధికారపార్టీ నిర్ణయాలు, పాలసీలను అధ్యయనం చేస్తూ ప్రభుత్వం చేస్తున్న తప్పొప్పులను ఎత్తిచూపే ప్రయత్నం చేస్తుంది. 44 ఏళ్ల గిల్ బర్మింగ్‌హామ్ ఎడ్జ్‌బాస్టన్ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. గతేడాది జూలైలో బ్రిటీష్ పార్లమెంటులోని హోంశాఖ సెలక్ట్ కమిటీకి ఎన్నికయ్యారు.

చట్టం చేసినా..రాష్ట్రపతికి పంపాల్సిందే!

- పంచాయతీరాజ్ కొత్త చట్టంపై న్యాయ నిపుణుల అభిప్రాయం
- రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లాలు
- బడ్జెట్ సమావేశాల్లో బిల్లు?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పంచాయతీరాజ్ కొత్త చట్టం రూపకల్పన ప్రక్రియ సుదీర్ఘంగా సాగే ప్రమాదం కనిపిస్తోంది. సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీలు మరింత బాధ్యతాయుతంగా, జవాబుదారితనంతో పనిచేసేలా ప్రభుత్వం కొత్త చట్టం తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం తమ కసరత్తు ముమ్మరం చేసింది.

పంచాయతీరాజ్ చట్టంలో తీసుకురావలసిన మార్పులపై న్యాయపరమైన చిక్కులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని న్యాయ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌తో ప్రభుత్వం మంతనాలు జరుపుతోంది. పంచాయతీరాజ్ చట్టానికి సంబంధించి ఢిల్లీలో కొందరు న్యాయ కోవిదులతో పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు మంతనాలు జరిపి చట్టాన్ని రూపొందించే పనిలో నిమగ్నమై ఉన్నట్లు తెలుస్తోంది. పంచాయతీరాజ్ చట్టానికి రూపకల్పన చేసి ఈ అసెంబ్లీలో ప్రవేశపెట్టినా చట్ట సవరణకు మాత్రం రాష్ట్రపతికి పంపించవలసిందేనని న్యాయకోవిదులు తెగేసి చెప్పినట్లు సమాచారం. దీంతో పంచాయతీరాజ్ చట్ట రూపకల్పన ఇప్పట్లో సాధ్యమయ్యే అవకాశం లేదని ప్రచారం జరుగుతోంది. ఈ నూతన చట్ట సవరణ రాజ్యాంగానికి సంబంధించిన అంశాలతో ముడిపడి ఉన్నందున రాష్ట్రపతి ఆమోదానికి పంపాలా? అవసరం లేదా? అనే విషయంలో ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది.

వాస్తవానికి ఈ నూతన చట్టానికి సంబంధించిన ముసాయిదా బిల్లును గత ఏడాది చివరిలోనే ఉభయ సభల్లో ప్రవేశపెట్టాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఇందుకోసం ఉభయ సభలను ప్రోరోగ్ కూడా చేయలేదు. ఈ బిల్లు రూపకల్పనలో అనేక అంశాలు ముడిపడి ఉండడంతో అది సాధ్యం కాలేదు. ముసాయిదా బిల్లు రూపకల్పన సమయంలో ఎప్పటికప్పుడు అనేక కొత్త అంశాలు తెరపైకి వస్తుండడంతో నూతన చట్టంపై ఎలా ముందుకు వెళ్లాలన్న అంశంపై ప్రభుత్వం ఎటూ తేల్చుకోలేకపోతున్నట్లు సమాచారం. స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వాలని, విధులు బదలాయించాలని అప్పట్లో కేంద్ర ప్రభుత్వం 73, 74 రాజ్యాంగ సవరణను తీసుకువచ్చింది. 1994వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ చట్టం సవరించినప్పుడు ఈ చట్టాన్ని రాష్ట్రపతి ఆమోదం నిమిత్తం పంపారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత కొత్తం చట్టం అప్పట్లో అమల్లోకి వచ్చింది. రాష్ట్రంలో అధికారం చేపట్టిన తెరాస ప్రభుత్వం మొదట్లోనే పంచాయతీరాజ్ చట్టానికి సవరణ తీసుకువస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు కొత్త చట్టంచేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని కూడా రాష్ట్రపతి ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపవలసి ఉంటుందని అలా కాకుండా శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టి చట్టాన్ని సవరిస్తే అది న్యాయస్థానాల్లో నిలిచే అవకాశం లేదని తద్వారా ప్రభుత్వం అప్రదిష్టపాలు కావలసి వస్తుందని న్యాయకోవిదులు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో పంచాయతీరాజ్ చట్టసవరణపై ఏ విధంగా ముందుకు వెళ్లాలన్న అంశంపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది.



ముసాయిదా బిల్లును న్యాయశాఖ ఇప్పటికే రూపొందించింది. పలు దఫాలు ఉన్నతాధికారులు సీఎం కేసీఆర్‌తో వరుస మంతనాలు జరిపారు. ఈ సందర్భంగా కొత్త అంశాలు తెరపైకి రావడంతో ఆయన మరింత స్పష్టత కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. కొత్త చట్టం రాజ్యాంగంతో ముడిపడి ఉన్నందున అందుకు విరుద్ధంగా బిల్లును సిద్ధం చేయరాదన్న ఉద్దేశంతో ప్రతి అంశాన్ని పూర్తిస్థాయిలో సమీక్షించాలని సీఎం ఆదేశించినట్లు తెలుస్తోంది. నూతన చట్టం తప్పనిసరిగా ఆమోదం పొందవలసి వస్తేప్రధానమంత్రి సమయం తీసుకుని తద్వారా రాష్ట్రపతి ఈ బిల్లుకు ఆమోదం తెలిపేలా ఢిల్లీ కేంద్రంగా పావులు కదపాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు. ఇదిలా ఉండగా పంచాయతీరాజ్ చట్ట సవరణ అంశానికి సంబంధించిన బిల్లును అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరిచి ప్రవేశపెట్టాలని భావించినా తాజా పరిణామాల నేపథ్యంలో ఈ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి లేదా మార్చిలో జరిగే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఈ నూతన చట్ట సవరణకు సంబంధించిన అంశాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

అఖిల పక్షాన్ని పిలవండి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం నిధి కుక్క తోక ఉంకరన్నట్లుగా నాగే ఉన్న దని మండలిలో విపక్షనేత షబ్బీర్‌అలీ విమర్శించారు. అనేక విషయాల్లో న్యాయ స్థానాలు చివాట్లు పెట్టినా ప్రభుత్వం లోని పెద్దల బుద్ధి మారడంలేదని ఆయన దుయ్యబట్టారు. పంచాయతీ రాజ్ చట్టం రూపకల్పనలో విపక్షాలను ఎందుకు పిలవడం లేదని ఆయన ప్రశ్నించారు. శనివారం ఆయన అసెంబ్లీ ఆవరణలో పీసీసీ ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. కీలకమైన పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు తెచ్చి అసెంబ్లీలో ప్రవేశపెట్టే ముందు అఖిలపక్షంతో సంప్రదింపులు జరిపి సూచనలు తీసుకునే అవసరం ఉందన్నారు. గత నాలుగేళ్లుగా పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆయన విమర్శించారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో అవినీతి అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు చర్చకు వస్తే.. తాను చర్చకు రావడానికి సిద్ధంగా ఉన్నట్లు షబ్బీర్‌అలీ తెలిపారు. ఎంపీ సుమన్, ఎమ్మెల్యేలతో చర్చించే స్థాయి తనది కాదన్నారు. తమ పార్టీ నేతలు చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పకుండా టీఆర్ఎస్ ప్రభుత్వం పారిపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. మిగులు విద్యుత్ ఘనత గత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలో చేస్తున్న మార్పులు వ్యక్తిగత ప్రయోజనాల కోసమే చేస్తున్నట్లుగా ఉందని పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ పార్టీలో తెలంగాణ ఉద్యమ బ్యాచ్ (యూటీ బ్యాచ్), బంగారు తెలంగాణ బ్యాచ్ (బీటీ బ్యాచ్) మధ్య గొడవలు ప్రారంభమయ్యాయని ఆయన ఎద్దేవా చేశారు.

పెట్టుబడి మద్దతు, పంచాయతీరాజ్ చట్టంపై

సీఎంకు నివేదికలు

- ప్రగతి భవన్‌లో వేర్వేరుగా సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘాలు
- కీలక అంశాలపై సమాలోచనలు
- రెండు, మూడు రోజుల్లో మద్దతు పథకానికి మార్గదర్శకాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: త్వరలో అమల్లోకి రానున్న పంట పెట్టుబడి మద్దతు పథకం, నూతన పంచాయతీరాజ్ చట్టం రూపకల్పనకు సంబంధించి ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘాలు శనివారం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావును కలిసి నివేదికలు సమర్పించాయి. పెట్టుబడి మద్దతు పథకానికి సంబంధించి మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన గల ఐదుగురు సభ్యులతో కూడిన ఉపసంఘం, పంచాయతీరాజ్ చట్టం నిబంధనల రూపకల్పనకు సంబంధించి మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన గల ఏడుగురు సభ్యులతో కూడిన ఉపసంఘం ప్రగతి భవన్‌లో సీఎంతో వేర్వేరుగా సమావేశమయ్యాయి. సుమారు అరగంట పాటు చర్చించి ఈ రెండు ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలకు సంబంధించి సిఫారసులు అందజేశారు. నివేదికల్లో పొందుపరచిన అంశాలపై అర్థగంటకు పైగా చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు ఈటెల రాజేందర్, మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్, తుమ్మల నాగేశ్వరరావు, ఇంద్రకరణ్‌రెడ్డిలతో సీఎం సమాలోచనలు జరిపారు. రెండు, మూడు రోజులపాటు సీఎం కార్యాలయ ఉన్నతాధికారుల ద్వారా ఈ రెండు నివేదికలపై అధ్యయనం చేయించి తుదిరూపు ఇవ్వనున్నట్లు కేసీఆర్ హామీ ఇచ్చారు. త్వరలోనే పెట్టుబడి మద్దతు పథకానికి సంబంధించి మార్గదర్శకాలు వెలువరించేందుకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే నూతన పంచాయతీరాజ్ చట్టంలో చేర్చాల్సిన అంశాలపై కూడా ప్రభుత్వం ముసాయిదాను రూపొందించనుంది. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ చట్టంపై చర్చించి సభ ఆమోదం పొందనున్నారు.

గ్రామ స్వరాజ్యం..పల్లె ప్రగతి ధ్యేయంగా

- సీఎం కేసీఆర్‌కు పంచాయతీరాజ్ నూతన చట్టం ముసాయిదా అందజేత
- సిటిజన్ చార్టర్‌తో ప్రజలకు హక్కులు
- సర్పంచ్‌లకు కార్యనిర్వాహణ అధికారాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గ్రామ స్వరాజ్యం, పల్లె ప్రగతి లక్ష్యంగా సర్పంచ్‌లకు కార్యనిర్వాహణ బాధ్యతలను అప్పగిస్తూ, ప్రజలకు పౌర హక్కులను వర్తింపజేస్తూ నూతన పంచాయతీరాజ్ చట్టం ముసాయిదా సిద్ధమైంది. పల్లెల అభివృద్ధితోనే దేశాభివృద్ధి, సమాజ వికాసం ముడిపడి ఉందని, పల్లెలే అభివృద్ధికి పట్టుకొమ్మలనే నానుడికి వాస్తవరూపం ఇచ్చేలా సిద్ధం చేసిన నూతన చట్టం ముసాయిదాను పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి నేతృత్వంలోని క్యాబినెట్ సబ్ కమిటీ 5 రోజుల విస్తృత కసరత్తు అనంతరం శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేసింది. మూస పద్ధతులను వీడి అధునాతనమైన, గ్రామాల సర్వతోముఖ భివృద్ధికి దోహదపడేలా చట్టాన్ని రూపొందించాలని ఈ నెల 5వ తేదీన జరిగిన సమావేశంలో సీఎం పరిశీలించిన అనంతరం ఈ నెల రెండో వారంలో రెండు రోజులపాటు శాసనసభను సమావేశపరచి చర్చించనున్నారు. మార్పులు, చేర్పుల తర్వాత కొత్త చట్టం అమలులోకి తేనున్నారు. అయితే ఈ చట్టం ముసాయిదాలో పదో తరగతి ఉత్తీర్ణత, పరిక్ష



సీఎం కేసీఆర్‌కు పంచాయతీరాజ్ నూతన చట్టం ముసాయిదాను అందజేసే ముందు జూపల్లి అధ్యక్షతలోని కేబినెట్ సబ్ కమిటీ చర్చలు

పద్దతిలో సర్పంచ్ ఎన్నిక అనే అంశాలపై ఎటువంటి చర్చ రాలేదని తెలిసింది. ముసాయిదాలో ఈ అంశాలపై ఎటువంటి ప్రస్తావనా లేదని, అసెంబ్లీలో చర్చలోనే దీనిపై కీలక నిర్ణయం తీసుకోనున్నారని తెలిసింది. వరుసగా రెండు పర్యాయాలు రిజర్వేషన్లను మార్చకుండా కొనసాగించే పద్ధతితోపాటు సర్పంచ్‌లకు పూర్తి కార్యనిర్వాహణాధికారాలను కట్టబెట్టేలా ఈ చట్టం ముసాయిదాలో పొందుపర్చారు. ప్రజలకు సిటిజన్ చార్టర్‌ద్వారా పౌర హక్కు లను కల్పించాలని నిర్ణయించారు. గడువులోగా సమస్యను పరిష్కరించని పక్షంలో జరిమానా విధించేలా మసా యిదాలో నిబంధనలను చేర్చారు. ఈ మేరకు కీలక అంశాల్లో పౌరులకు ప్రత్యేక హక్కులను అమలులోకి తేవాలని చట్టం ముసాయిదాలో పేర్కొన్నట్లుగా తెలిసింది. గ్రామాల రూపురేఖలు మారుస్తూ, గ్రామ స్వరాజ్యం, పారదర్శకతను పెంచేలా చట్టం ముసాయిదాలో అనేక జాగ్రత్తలు తీసుకున్నా రు. పంచాయతీల బలోపేతానికి అనేక సవరణలను ప్రతిపాదించారు. తద్వారా సర్పంచ్‌లు, పాలక వర్గాల సభ్యులకు జవాబుదారీతనం , నిధుల వినియోగంలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లా పరిషత్, మండల పరిషత్‌లతోపాటు అమలు చేస్తున్నట్లుగా ముగ్గురు కో ఆప్షన్ సభ్యులను నియమించుకోవాలని నిర్ణయించారు.

సర్పంచ్‌ల్లపై కలెక్టర్ తీసుకునే క్రమశిక్షణ చర్యలపై సర్పంచ్‌లకు అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తద్వారా క్రమశిక్షణ చర్యలకు గురైన సర్పంచ్‌కు అప్పిలేట్ అథారిటీగా ట్రిబ్యునల్ ఉండనుంది. ఇప్పటివరకు సర్పంచ్‌లపై కలెక్టర్లు చర్యలు తీసుకుంటే అప్పిలేట్ అథారిటీగా ప్రభుత్వం తరఫున పంచాయతీరాజ్ శాఖ మంత్రి వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా చట్టానికి లోబడి ప్రజలెవరైనా వ్యవహరించకపోతే జరిమానా విధించే హక్కును కూడా సర్పంచ్ నేతృత్వంలోని పాలకమండలికి కట్టబెట్టే విషయాన్ని కూడా ముసాయిదాలో చేర్చారు. రహదారులపై చెత్త వేయడం, ఇంట్లోని నీటిని వీధుల్లోకి వదలడం, రహదారులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వంటి 22 అంశాల్లో నిబంధనలు ఉల్లంఘించేవారికి పంచాయతీ పాలకవర్గమే జరిమానా విధించేవెసులుబాటును కల్పించారు. పంచాయతీల ఆడిటింగ్ కాలపరిమితి తగ్గించే చర్యలను చట్టంలో పొందుపర్చారు. నిధుల వ్యయం, పన్నుల వసూళ్లు వంటివన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలనే నిబంధనను చట్టంలో చేర్చారు. సక్రమంగా విధులు నిర్వహించని కార్యదర్శులను సరెండర్ చేసే అధికారాన్ని పాలక వర్గానికి కట్టబెడుతూ ముసాయిదాలో నిబంధన విధించారు.

రంగంలోకి బార్ కౌన్సిల్

బాహ్య జోక్యం అవసరంలేదు: జస్టిస్ కురియన్ జోసఫ్

● వివాద పరిష్కారం దిశగా రంగంలోకి బీసీఐ ● ముందుగా సుప్రీం 23మంది జడ్జిలతో చర్చలు● ఆ తర్వాత వివాదంలోని ఆ 5గురితో మంతనాలు ● నేటి నుంచి బీసీఐ చర్చల పర్వం ●అంతర్గతంగానే సమస్యలకు పరిష్కారం: బీసీఐ చైర్మన్ ● సుప్రీం వ్యవహారాన్ని రాజకీయం చేయొద్దని హితవు ● చర్చలకు సిద్ధమని సుప్రీం బార్ అసోసియేషన్ ప్రకటన



న్యూఢిల్లీ,ఆంధ్రప్రభ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సీనియర్ న్యాయమూర్తుల మధ్య నెలకొన్న వివాదానికి ముగింపు పలికేందుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) రంగంలోకి దిగింది. న్యూఢిల్లీలో సమావేశమైన బార్ కౌన్సిల్.. ఏడుగురు సభ్యులతో ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం ముందుగా వివాదంలో లేని సుప్రీంకోర్టు 23 మంది న్యాయమూర్తులతో సమావేశమైన చర్చలు జరపనుంది. ఆ తర్వాత సుప్రీం పాలనా వ్యవహారాలపై ఆరోపణలు చేసిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ లోకూర్,జస్టిస్ కురియన్ జోసఫ్‌లతో చర్చించి.. చివరగా ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో సమావేశం కావాలని నిర్ణయించింది. భేధాభిప్రాయాలను సాధ్యమైనంత త్వరలో సమిసిపోయేలా ఏడుగురు సభ్యుల బృందం చర్చలు జరుపుతుందని బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా తెలిపారు.తమ సమస్యను అంతర్గతంగానే పరిష్కరించుకుంటామని.. మీడియా ముందుకు వచ్చి..వ్యవస్థను బలహీనం చేయాలనుకోవడం లేదని వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థ వ్యవహారాలపై రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ అంశాన్ని రాజకీయం చేయవచ్చని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని వమ్ముకాకుండా తాము నిరంతరం ప్రయత్నిస్తు న్నామని చెప్పారు.

అందరితో చర్చలు జరుపుతాం



సుప్రీంకోర్టు జడ్జిల మధ్య నెల కొన్న అభిప్రాయబేదాలపై తాము దృష్టిపెట్టినట్లు సుప్రీకోర్టు బార్ అసోసియేషన్ స్పష్టం చేసింది. సుప్రీం బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ మీడియా మాట్లాడుతూ ''నలుగురు జడ్జిలు పేర్కొ న్నట్లు ఏమైనా అభిప్రాయభే దాలు ఉండే వాటిని తక్షణం పరిష్కరించేందు కు ప్రయత్నిస్తాం. సుప్రీంకోర్టు విశ్వసనీయతను పరిరక్షించేందు కు ఇది తప్పనిసరి చర్యగా అసోసియేషన్ అభిప్రా య పడింది. మొదట ప్రధాన న్యాయమూర్తిని కలిసి ఆయన వా అభిప్రాయంతో ఏకీభవిస్తే.. ఇతర జడ్జిలను కూ డా కలిసి చర్చలు జరుపుతాం'' అని వికాస్ సింగ్ తెలిపారు.

సీజేఐ నివాసంలో పీఎంవో అధికారి

సుప్రీంకోర్టు వ్యవహారాన్ని చక్కదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. సీజేఐపై తిరుగుబాటు చేసిన నలుగురు న్యాయమూర్తుల వ్యవహారంతో పాటు వివాదం మరింత ముదరకుండా చూసేందుకుపీఎంవో ప్రిన్సి పల్ సెక్రటరీ నృపేంద్ర మిశ్రా.. సుప్రీంకోర్టును చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా ఇంటికి వెళ్లారు. సీజేఐతో నృపేంద్ర సుప్రీంకోర్టు తాజా వ్యవహారంపై చర్చలు జరిపినట్లు సమాచారం. అయితే తమ భేటీ వ్యక్తిగతమేనని మిశ్రా చెప్పడం గమనార్హం.



త్వరలోనే జడ్జిల్లో ఐక్యత

నలుగురు సీనియర్ జడ్జిలు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తిపై ఆరోపణ లు చేయడాన్ని నిశితంగా పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం న్యాయమూర్తుల మధ్య వచ్చిన భేదాభిప్రాయాలను తొలగించేందుకు అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ను రంగంలోకి దించింది. ఇప్పటికే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిక్ దీపక్ మిశ్రాతో పాటు.. నలుగురు న్యాయమూర్తులు జాస్తి చలమేశ్వర్, రంజన్ గొగోయ్, మదన్ లోకూర్, కురియన్ జోసఫ్ లతో కూడా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ''సోమవారం ఉదయం నాటికి సుప్రీంకోర్టు న్యాయమూ ర్తులంతా ఐక్యంగా ఉంటారు.న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలగకుండా న్యాయమూర్తులంతా ఐక్యంగా ఉంటారని విశ్వసిసున్నా. జడ్జిలు జ్ఞానం, రాజనీతి, అనుభవం గలవారు.. ఈ వ్యవహారాన్ని వారు మరింత తీవ్రం కానివ్వబోరని ఆశిస్తున్నాం''.. అని అటార్నీ జనరల్ చెప్పారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా తనపై ఆరోపణలు చేసిన నలుగురు న్యాయమూర్తులతో నేడు సమావేశం కావచ్చని న్యాయవర్గాల సమాచారం.



సుప్రీంలో సంక్షోభం లేదు

సుప్రీంకోర్టు పాలనా వ్యవహారాలు సరిగ్గా జరగడం లేదంటూ మీడియా సమావేశం నిర్వహించిన నలుగురు న్యాయమూ ర్తుల్లో ఒకరైన రంజన్ గొగోయ్ మరోసారి స్పందించారు. సుప్రీంకోర్టులో ఎలాంటి సంక్షోభం లేదని స్పష్టం చేశారు. మీడియా సమా వేశం నిర్వహించడం క్రమశిక్షణ ఉల్లం ఘణా అని పాత్రికేయులు ప్రశ్నించగా ఆయన సమాధానం దాటవేశారు.

న్యాయ వ్యవస్థ ప్రయోజనాల కోసమే: జస్టిస్ కురియన్ జోసఫ్



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి కేసులను ఎంపిక చేసిన న్యాయ మూర్తు లకే ఇస్తున్నారని.. సర్వోన్నత న్యాయస్థానంలో పాలన సరిగ్గా లేదని ఆరోపణలు చేసిన వారిలో ఒకరైన జస్టిస్ కురియన్ జోసఫ్ స్పందించారు. న్యాయవ్యవస్థ ప్రయోజనాలను కాపాడేందుకు అలా ప్రవర్తించాల్సి వచ్చిందని... ఇందులో వెలుపలి జోక్యం అవసరంలేదని స్పష్టం చేశారు సుప్రీం వివాదా నికి త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. క్రమశిక్షణను ఉల్లం ఘించినట్లు వస్తున్న వార్తలను జోసఫ్ ఖండించారు. మేము న్యాయ వ్యవస్థ, న్యాయం వైపు నిలబడ్డాం. శనివారం మీడి యా సమావేశంలో అదే వివరించాం. అంతకంటే మరొకటి లేదు.

రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి:డీఎంకే

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆరోపణలు చేసిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు వివాదాన్ని తమలో తామే చర్చలద్వారా పరిష్కరించుకోకుంటే రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని డీఎంకే విజ్ఞప్తి చేసింది. ఒకవేళ జడ్జిలు ఈ వ్యవహారాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోలేకపోతే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తప్పనిసరి జోక్యం చేసుకోవాలి. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు రాష్ట్రపతి అవసరమైన చర్యలు చేపట్టాలి.అని డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్ స్పష్టం చేశారు.

న్యాయవ్యవస్థను చెవిటి, మూగదానిగా మార్చే ప్రయత్నాలే : శివసేన

సుప్రీంకోర్టు పాలనా వ్యవహారాలు సరిగ్గాలేవని తిరుగుబాటు చేసిన నలుగురు న్యాయమూర్తులను శివసేన అధినేత ఉద్ధవ్ థాక్రే ప్రసంశించారు. నలుగురు న్యాయమూ ర్తులు కోర్టులోని వ్యవహారాలను బయటపెట్టడంతో న్యాయ వ్యవస్థను చెవిటి,మూగ దానిగా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అర్థమౌతోందని అని థాక్రే చెప్పుకొచ్చారు.

ప్రత్యేక దూతనెందుకు పంపారు: కాంగ్రెస్ ఫైర్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై నలుగురు సీనియర్ న్యాయమూర్తులు చేసిన ఆరోపణ నేపథ్యంలో ప్రధాని కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ నృపేంద్ర మిశ్రాను సీజేఐ నివాసానికి పంపడాన్ని కాంగ్రెస్ పార్టీ ఆక్షేపించింది. నృపేంద్రను ప్రధాన న్యాయమూర్తి నివాసానికి ఎందుకు పంపారో చెప్పాలంటూ కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్ దీఫ్ సూర్జేవాలా ప్రధాని మోడీ ని ప్రశ్నించారు

కేంద్ర మంత్రులూ గొంతువిప్పండి
భాజపా సీనియర్ నేత యశ్వంత్ సిన్హా

స్వపక్షంలో విపక్ష పాత్ర పోషిస్తున్న భాజపా సీనియర్ నేత యశ్వంత్ సిన్హా మరోసారి కేంద్రంపై ధ్వజమెత్తారు. ప్రస్తుత స్థితి ఎమర్జెన్సీ తలపిస్తుందన్నారు. పార్లమెంటు తన విధానాల్లో రాజీపడితే సుప్రీంకోర్టు సరైన దిశలో పయనించదని, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని సిన్హా వ్యాఖ్యానించారు.

ప్రజాస్వామ్యానికి ముప్పు ఉందన్న నలుగురు జడ్జీల వ్యాఖ్యలు సీరియస్‌గా తీసుకోవాలన్నారు. కేబినెట్ మంత్రులు కూడా మీడి యా ముందుకు రావాలన్నారు. భయం గుప్పిట్లో పనిచేస్తు న్న కేబినెట్ మంత్రులు భయాన్ని పక్కనపెట్టి నోరు విప్పాలన్నారు.

హెలికాప్టర్ గల్లంతు

5గురి మృతదేహాలు లభ్యం

ముంబై: ఓఎన్జీసీ ఉద్యోగులు ప్రయాణిస్తున్న పవన్ హాన్స్ హెలికాప్టర్ ప్రమాదానికి గురైందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో మరణించినవారిలో 5గురి మృత దేహాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఓఎన్జీసీ అధికారులు ప్రతిరోజూ అరేబియా సముద్రంలో చమురు అన్వేషణకు వెళుతుం టారు. వీరంతా ముంబై నార్త్ ఫీల్డ్‌కు చేరాల్సి ఉండగా మార్గమధ్యలో హెలికాప్టర్ గల్లంతైంది. ఈ ఘటనలో మరణించినవారి 5గురి మృత దేహాలు లభ్యంకాగా మిగతా వారికోసం గాలిస్తున్నామని అధికా రులు తెలియజేశారు. కేంద్ర పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

కార్తీ, చిదంబరం ఇంట్లో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం కార్యాలయాలపై శనివారం ఈడీ అధికారులు దాడులు నిర్వహించారు. ఎయిర్‌సెల్ - మాక్సిస్ మనీలాండరిం గ్ కేసులో భాగంగా ఢిల్లీ, చెన్నై ప్రాంతాల్లోని కార్తీ కార్యాలయా లపై అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. ఐఎన్‌ఎక్స్ మీడియా సంస్థలో విదేశీ పెట్టుబడులకు అనుమతి ఇచ్చిన కేసులో ఈ నెల 16న విచారణకు హాజరు కావాలని కార్తీ చిదంబరానికి ఈడీ గురువారం సమన్లు పంపింది. ఈ కేసు విచారణలో భాగంగా ఈడీ ఎదుట హాజరుకావాలని కార్తీ చిదంబరానికి సమన్లు జారీ చేసిన రెండో రోజే దాడులు జరిగాయి. 2009లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న చిదంబరం తన అధికారాలను దుర్వినియోగం చేసి ఐఎన్‌ఎక్స్ మీడియా అనే సంస్థ విదేశీ పెట్టుబడులు పొందేందుకు అనుమతి ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో కార్తీ చిదంబరం, మీడియా డైరెక్టర్ పీటర్ ముఖర్జీ, ఇంద్రాణి ముఖర్జీపై ఈడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో కార్తీ చిదంబరంపై లుక్ ఔట్ నోటీసు కూడా జారీ అయింది. శనివారం ఈడీ ఢిల్లీ, చెన్నైలో సోదాలు జరిపింది. కార్తి చిదంబరానికి చెందిన 6ప్రాంతాల్లో ఈడీ సోదాలు చేసింది. గత నెలలోనూ ఇదేవిధంగా చిదంబరం బంధువుల ఇళ్లపై ఈడీ దాడులు ఏకకాలంలో దాడి చేసిన సంగతి విదితమే.

ఈడీకి ఏమీ దొరకలేదు: చిదంబరం

శనివారం ఈడీ దాడులు నేపథ్యంలో చిదంబరం మీడియా తో మాట్లాడుతూ ఈడీ తన నివాసంలో ఏమీ దొరకలేదన్నారు. అయితే ఈడీ సోదాలు చేయడం మనసాపం కలిగించిందన్నారు. తన కుమారుడు కార్తీ చిదంబరం దాఖలు చేసిన కేసులో సుప్రీం నోటీసులిచ్చిం దని తెలిపారు. ఈ కేసులపై తదుపరి విచారణ 30న జరుగుతుంద న్నారు. షెడ్యూల్డ్ క్రైమ్‌కు సంబంధించి సిబీఐ తన కుమారుడిపై ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లాన న్నారు. ఈడీ అధికార పరిధిని ప్రశ్నిస్తూ తన కుమారుడిపై విచారణ చేసే అధికార పరిధి ఈడీకి లేదన్నారు.



ఈ బంధం దృఢమైనది

నేటి నుంచి ఇజ్రాయెల్ ప్రధాని పర్యటన



ఫైల్ ఫోటో

న్యూఢిల్లీ: మూడు మతాల పుణ్య క్షేత్రమైన జెరూసలెంను ఇజ్రాయిల్ రాజధానిగా అధికారికంగా గుర్తిస్తున్నట్టు అమెరికా అధ్యక్షు డు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన ప్రకటన ప్రపంచ వ్యాప్తంగా ప్రకంపనాలను సృష్టించిం ది.మన దేశం మొదటి నుంచి తటస్థ దేశంగా ఉంటూ వచ్చినా మాజీ ప్రధాని వాజ్‌పేయి హయాంలోనూ,మళ్ళీ ఇప్పుడు ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ హయాంలోనూ ఇజ్రాయెల్‌తో దౌత్య బంధాన్ని పటిష్ఠం చేసుకునేందుకు ప్రయత్నాలు విస్తృతం కావడం కాకతాళీయం కాకపోవచ్చు. కాంగ్రెస్ వారికన్నా, కమల నాథులు ఇజ్రాయెల్‌తో మైత్రికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారన్నది జనాభిప్రాయం.ఇజ్రాయెల్ ప్రధాని బెంజి మన్ నెతన్యాహూ నాలుగు రోజుల పాటు మన దేశంలో జరపనున్న పర్యటనకు విశేషమైన ప్రాధాన్యం ఉంది.ఆయన పర్యటన సందర్భంగా ఇజ్రాయెల్‌తో మన దేశం ఎటువంటి ఒప్పందాలను చేసుకుంటుందోనని యావత్ ప్రపంచం ఎదురు చూస్తోంది. ముఖ్యంగా, జెరూసలెంను ఇజ్రాయెల్ రాజధానిగా అమెరికా గుర్తించడాన్ని వ్యతిరేకిస్తూ ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి భారత్ మద్దతు ఇచ్చి కొద్ది రోజులైనా కాకముందే ఢిల్లీ పర్యటనకు రావడం నెతన్యాహూకు కూడా ఇబ్బంది కరమే. జెరూసలెంను అమెరికా గుర్తించే తీర్మానాన్ని అన్ని దేశాలతో పాటు మన దేశం కూడా వ్యతిరే కించడం వల్ల ఇరుదేశాల మధ్య సంబంధాలు ఉద్రిక్తతకు గురి అయ్యే అవకాశాలు తక్కువ. అన్నింటికన్నా ఇజ్రాయెల్‌తో అతి ముఖ్యమైన రాఫెల్ ఒప్పందాన్ని మన దేశం రద్దుచేసుకోవడం ఆర్థికంగా ఇజ్రాయెల్‌కు రాబడి నష్టం కలిగించే చర్యే. అయినప్పటికీ నెతన్యాహూ మన దేశంలో పర్యటించేందుకు రావడం చెప్పుకోదగిన విషయమే. అయితే,ఈ ఒప్పందం విలువ 50 కోట్ల డాలర్లే కనుక,ఇంత చిన్న విషయానికి భారత్ వంటి పెద్ద ప్రజాస్వామిక దేశంతో సంబంధాలు తెగతెంపులుచేసుకోవడం మంచిది కాదని ఆయన భావించి ఉండవచ్చు.ఈ ఒప్పందం నిరోధక క్షిపణులను తయారు చేయ డానికి ఉద్దేశించింది. ఇందుకు కారణాలను మన దేశం వెల్లడించలేదు.అయితే,ఇజ్రాయెల్‌కి చెందిన క్షిపణుల తయారీ సంస్థ మాత్రం తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేసింది.రాఫెల్ ఒప్పందాన్ని పునరుద్ధరించేందుకు నెతన్యాహూ ప్రస్తుత పర్యటనలో ప్రయత్నాలు సాగించవచ్చు.సాంకేతిక పరిజ్ఞానం బదిలీ విషయంలో మన దేశం నిర్దిష్టమైన విధివిధానాలను అనుసరిస్తోంది.మైన్ స్వీపర్ నౌకల ఒప్పందం నిలిచిపోవడానికి కూడా ఇదే కారణం. ఇజ్రాయెల్‌తో సంబంధాలను పెంచుకోవడాన్ని మన దేశంలో వామపక్షాలు మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అయితే, ఇప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వం వామపక్షాలనే కాదు,కాంగ్రెస్ అభ్యంతరాలను పట్టించుకునేందుకు సిద్ధంగా లేదు.ఇజ్రాయెల్‌తో సంబం ధాలు పెంచుకోవడానికి బీజేపీ నాయకులు తొలి ప్రాధాన్యం ఇవ్వడం గమనా ర్హం. పదిహేనేళ్ళ క్రితం అప్పటి ఇజ్రాయెల్ ప్రధాని ఏరియల్ షరాన్ మన దేశంలో పర్యటిం చారు.అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్నది వాజ్‌పేయి నేతృత్వంలోని బీజేపీ ప్రభు త్వమే. ఇప్పుడూ బీజేపీ ప్రభుత్వం కావడం గమనార్హం. ఆనాటి ఉపప్రధాని ఎల్‌కె అద్వానీ ఇజ్రాయెల్‌లో పర్యటిం చడంపై దేశంలో ప్రతిపక్షాలు తీవ్ర నిరసన తెలిపాయి. నెతన్యాహూ తన పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో కూడా పర్యటించనున్నారు. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్,జపాన్, ప్రధాని షింజే అబేలు కూడాగుజరాత్‌లో పర్యటించారు. ఈసారి నెతన్యా హూ పర్యటనలో కూడా వ్యవసాయం, పర్యాటకం, రక్షణ, సాగునీరు,ఇంధన తదితర రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉంది. ఇజ్రాయెల్‌తో మైత్రికి పాలస్తీనా వివాదానికీ ముడిపెట్టడం సమంజసం కాదని మన దేశం చాలా కాలం క్రితమే ఇజ్రాయెల్‌కి స్పష్టం చేసింది. గాజా ప్రాంతంలో వివాదం ఇజ్రాయెల్,పాల స్తీనాలకు సంబంధించిన సమస్య. మూడేళ్ళ క్రితం ఆనాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఇజ్రాయెల్ పర్యటనతో పాటు పాలస్తీనాలో కూడా పర్యటించి భారత్‌కు రెండు దేశాలూ సమానమేనని స్పష్టం చేశారు. అలాగే, ఇజ్రాయెల్ కూడా పాలస్తీనా విషయంలో భారత్ నుంచి మద్దతు లభిస్తుందని ఆశించడంలేదు.అయినప్పటికీ,భారత్ వంటి పెద్ద దేశంతో సఖ్యతతో ఉండటమే మంచిదని ఆయన భావిస్తున్నారు. ఇజ్రాయెల్ ప్రధానిగా ఆయన నాల్గవ పర్యాయం వ్యవహరిస్తున్నారు. అమెరికా జెరూసలెం విషయంలో నిర్ణయాన్ని ప్రకటించిన తర్వాత ఇజ్రాయెల్‌కు మరింత మంది శత్రువులు తయారయ్యారు. అంతర్జాతీ యంగా ఒంటరి అయింది. ఈ తరుణంలో భారత్‌తో సత్సంబం ధాలు కలిగి ఉండటమే ఇజ్రాయెల్‌కు ప్రయోజన కరం.పాక్‌లో ఇజ్రాయెల్ రాయబారి వలిద్ అబూ వలీ ముంబాయి దాడుల సూత్రధారి సయీద్‌తో ఇస్లామాబాద్‌లో జరిగిన ఒక సభలో వేదిక పంచుకోవడం భారత్‌కి ప్రతికూల అంశమని ఇజ్రాయెల్ గుర్తించింది. అందుకే,అతడిని వెనక్కి పిలిపించిం ది.అలాగే, కాశ్మీర్ విషయంలో భారత్‌కి వ్యతిరేకమైన వైఖరిని తీసుకునేందుకు ఇజ్రాయెల్ సిద్ధంగా లేదు.ఇజ్రా యెల్ మాజీ అధ్యక్షుడు షిమోన్ పెరేజ్ మన దేశాన్ని,మన నాయకులనూ ఎక్కువ గౌరవించేవారు. జాతిపిత మహాత్మా గాంధీని ప్రవక్తగా ఆయన అభివర్ణించారంటే మన దేశం పట్ల ఇజ్రాయెల్ నాయకులకు ఎంత గౌరవం ఉందో స్పష్టం అవుతోంది. భారత్‌లో వివిధ రంగాల్లో ఏడు కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు ఇజ్రాయెల్ సంసిద్ధంగా ఉంది.2016-17 ఆర్థిక సంవత్సరంలో భారత్, ఇజ్రాయెల్‌ల మధ్య రెండు వందల కోట్ల వాణిజ్యం జరిగింది. రక్షణ రంగంలో అత్యంత ఆధునిక ఆయుధాలు, ముఖ్యంగా ఉగ్రవాదులను ఎదుర్కొనేందుకు అవసరమైన ఆయుధాలు ఇజ్రాయెల్ వద్ద ఉన్నాయి.వీటి కోసం మన దేశం చాలా కాలంగా సంప్రదింపులు జరుపు తోంది. వ్యవసాయ రంగంలో కూడా ఇజ్రాయెల్ పురోగతి సాధించింది. ఆంధ్రప్రదేశ్ నారా చంద్రబా బునాయుడు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన స్వంత నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా కుప్పంలో ఇజ్రాయెల తరహా వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

శృంగార ట్రంప్: పోర్న్ స్టార్‌కు లక్షా 30వేల డాలర్లు



వాషింగ్టన్: ఒకానొక పోర్న్ స్టార్‌తో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒకప్పటి లైంగిక సంబంధం తాజాగా పెనుదుమారం రేపుతున్నది. అమెరికా అధ్యక్షఎన్నికల సందర్భంగా లైంగిక సంబంధం బహిర్గతపరచకుండా ఉండటానికి సదరు పోర్న్ స్టార్‌తో ట్రంప్ వ్యక్తిగత న్యాయవాది నెలకు లక్షా 30 వేల డాలర్లు ఇచ్చేలా ఒక ఒప్పందం చేసుకున్నారని వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. అయితే అదంతా అవాస్తమని వైట్ హౌస్ ఒక ప్రకటనలో పేర్కొంది. పోర్న్ సినిమాల్లో స్టోమీ డేనియల్స్‌గా పిలిచే స్టీఫెనీ క్లిఫోర్డ్‌ను ట్రంప్ 2006లో ఒక గోల్ఫ్ కార్యక్రమంలో కలుసుకున్నారు. ఏడాది ముందే ఆయనకు మెలానియాతో వివాహమైంది. కానీ 2016 ఎన్నికల సందర్భంగా ట్రంప్‌తో తనకు గల వ్యవహారాన్ని ఏబీసీ న్యూస్ వేదికగా వెల్లడించాలని క్లిఫోర్డ్‌భావించింది. ఈ విషయం తెలుసుకున్న ట్రంప్ వ్యక్తిగత న్యాయవాది మెఖేల్ కోహెన్ ఆమె నోరు ఎత్తకుండా ఉండటానికి నెలకు లక్షా 30 వేల డాలర్లు ఇచ్చేలా క్లిఫోర్డ్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారని వాల్‌స్ట్రీట్ జర్నల్ తెలిపింది. అయితే ఇదే కథనం ఎన్నికలకు ముందు రాగా అప్పట్లోనే అది ఖండనకు గురైందని, మళ్ళీ అదే కథనాన్ని ప్రచురించారని వైట్‌హౌస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

కర్నాటకలో రాహుల్ ప్రచారం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కర్నాటకలో పార్టీ ఎన్నికల తొలి విడత ప్రచారాన్ని ఫిబ్రవరి 10వ తేదీన ప్రారంభిస్తారు. రాహుల్ గాంధీ వచ్చే నెల 10 నుంచి 12వ తేదీ దాకా కర్నాటకలో తొలి విడత ఎన్నికల ప్రచారం సాగిస్తారని కర్నాటక కాంగ్రెస్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జి.పరమేశ్వర శనివారం తెలిపారు. ఆయన బెంగళూరు నుంచి ప్రచారాన్ని ప్రారంభించి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో పర్యటిస్తారని, రైతులు, విద్యార్థులు, మేధావులను ఉద్దేశించి ప్రసంగిస్తారని విలేకరులతో పరమేశ్వర అన్నారు. కర్నాటక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, సన్నాహకాలపై రాహుల్ గాంధీ అధ్యక్షతన సమీక్షా సమావేశానికి హాజరయ్యేందుకు పరమేశ్వర ఇక్కడకు వచ్చారు. అనంతరం రాహుల్ పర్యటన వివరాలను ఆయన వెల్లడించారు.

భోగీ దెబ్బకు రైళ్లు, విమానాలు రద్దు

చెన్నయ్: నగరంలో శనివారం తెల్లవారుజామున ప్రజలు వేసిన భోగీ మంటల నుంచి వచ్చిన పొగ విమానాలు, రైళ్ళ రాకపోకలపై ప్రభావం చూపింది. పొగ కారణంగా అన్ని రకాల రైళ్ళు సగటును 30 నుంచి 40 నిముషాలు ఆలస్యంగా చేరుకున్నాయని దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. ఉదయం నాలుగు గంటలకు బయలుదేరాల్సిన 40కి పైగా అంతర్జాతీయ, దేశీయ విమాన సర్వీసులను రద్దు చేసినట్టు విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఉదయం దాదాపు 9.30 గంటలకు విమాన సర్వీసులను పునరుద్ధరించినట్టు చెప్పారు. షార్జా, దోహాకు వెళ్లాల్సిన రెండు విమానాలను రద్దు చేశారు. దట్టమైన పొగతో ఏమి కనిపించని కారణంగా రాకపోకలు సాగించాల్సిన 42కు పైగా విమాన సేవలు మూడున్నర నుంచి నాలుగు గంటలు ఆలస్యంగా నడిచాయి.

పాక్ ప్రధానికి హైకోర్టు నోటీసులు

లాహోర్: న్యాయవ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అభియోగంపై పాకిస్తాన్ ప్రధానమంత్రి షహీద్ ఖాఖన్ అబ్బాసీకి లాహోర్ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పనామా పత్రాలపై తీర్పును ఆయన ఒక చెత్త ముక్కగా పేర్కొన్నారని డాన్ న్యూస్ శనివారం ఉటంకించింది. ప్రధాని వ్యాఖ్యలపై అడ్వకేట్ అజర్ సిద్ధిఖీ లాహోర్ హైకోర్టులో ఒకపిటిషన్ దాఖలు చేశారు. తీర్పుపై అబ్బాసీ వ్యాఖ్యలు కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సులో గవర్నర్ జర్నీ

పుదుచ్చేరి: పొదుపు చర్యల్లో భాగం అన్నట్టుగా పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ శనివారం ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. పొరుగున ఉన్న తమిళనాడు రాష్ట్రంలోని విల్లుపురం జిల్లాలోని థాళుతలి గ్రామంలో సృష్టి ఫౌండేషన్ అనే ఎన్‌జీవో నిర్వహిస్తున్న వ్యవసాయ ప్రాజెక్టును గవర్నర్ సందర్శించారని అధికార వర్గాలు వెల్లడించాయి. మామూలుగా అయితే గవర్నర్ పర్యటనకు ఎంతలేదన్నా 20 కార్లు అవసరమవుతాయి. తాజా పర్యటనలో బేడీతో పాటుగా రాజ్ నివాస్ అధికారులు, బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామస్థాయి కార్యకర్తలు, ఒక ఐఎఎస్ అధికారులు ఉన్నారు.

పద్మావత్‌కు యూపీ ఓకే

న్యూఢిల్లీ/ముంబాయి: ఉత్తరప్రదేశ్‌లో పద్మావత్ చిత్ర విడుదలను తాను ఆపేదిలేదని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం శనివారం స్పష్టం చేసింది. సెన్సార్ బోర్డు పద్మావత్‌కు ఆమోదం తెలిపినందున ఆ చిత్రం విడుదలపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని యూపీ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా కేవలం పద్మావతిని పద్మావత్ అని మార్చినంత మాత్రాన ఆ చిత్రం విడుదలకు అనుమతించరాదని కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే అన్నారు. రాజపుత్రులను అవమానపరిచే సన్నివేశాలను తొలగించేంతవరకు విడుదల చేయరాదని మంత్రి తెలిపారు. ఈ మేరకు కేంద్ర సెన్సార్ బోర్డు ఛైర్మన్ ప్రసూన్ జోషిని త్వరలో కలుస్తానని ఆయన చెప్పారు. దీపికా పదుకొనె, రణవీర్ సింగ్, షాహిద్ కపూర్ ప్రధాన తారాగణంగా సంజయ్ లీలా బన్సాలీ దర్శకత్వంలో రూపొందిన పద్మావత్ ఈ నెల 25న విడుదల కానుంది.

కారాగారంలో శశికళ కన్నడ పాఠాలు

బెంగళూరు: ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు సంబంధించి కారాగారవాసం అనుభవిస్తున్న అన్నాడిఎంకే నాయకురాలు వి.కె.శశికళ ప్రస్తుతం కన్నడ భాషను నేర్చుకుంటున్నారు. పరప్పన్న అగ్రహారలోని కేంద్రీయ కారాగారం వద్ద వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా అధికారులు నిర్వహిస్తున్న కన్నడ భాషా తరగతులకు శశికళ హాజరువుతున్నారని కారాగార వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆమె వర్ణమాల, ఉచ్చారణ, కనీస పఠనా సామర్థ్యాన్ని అలవరచుకుంటున్నారు. అంతేకాక కంప్యూటర్ సైన్స్ ప్రాథమిక పాఠాలను కూడా శశికళ అభ్యసిస్తున్నారు. మౌఖిక పరీక్షలప్పుడు మౌనంగా ఉంటున్న ఆమె రాత పరీక్షలో మాత్రం చక్కగా రాణిస్తున్నారని వారు తెలిపారు.

పడవ బోల్తా: ఆరుగురు విద్యార్థులు మృతి

ముంబై: మహారాష్ట్రలోని దహాను సముద్రతీరంలో పెను విషాదం నెలకొంది. సముద్రంలో విద్యార్థులు పయనిస్తున్న పడవ బోల్తా పడిన ఘటనలో ఆరుగురు విద్యార్థులు మృతి చెందారు. విద్యార్థులతో వెళుతున్న పడవ సముద్రతీరానికి రెండు నాటికల్ మైళ్ల దూరంలో బోల్తా పడిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో పడవలో సుమారు 40మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వీరిలో ఆరుగురు విద్యార్థులు మృతి చెందారు. 32మంది విద్యార్థులను సురక్షితంగా కాపాడామన్నారు. గల్లంతైన మిగతా విద్యార్థుల కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు జరుపుతున్నాయని నౌకాదళ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 5మంది రెజ్లర్ల దుర్మరణం

ముంబై: మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 5మంది రెజ్లర్లు ప్రాణాలు కోల్పోయారు. కుస్తీ పోటీలో పాల్గొని తిరుగు పయనంలో కడేగావ్, సాంగ్లీ రహదారి వద్ద వీరు పయనిస్తున్న వాహనం ప్రమాదానికి గురవటంతో వీరు మృతి చెందారు. ప్రమాదంలో ఐదుమంది మృతి చెందగా మరో ఐదుగురుకి తీవ్ర గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. శనివారం మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాలో వాంగి గ్రామం వద్ద ఈ ప్రమాదం జరిగిందన్నారు. రెజ్లరులు ప్రయాణిస్తున్న వాహనం, ట్రాక్టరు ఢీకొనడంతో ప్రమాదం సంభవించిందన్నారు. ప్రమాద సమయంలో వాహనంలో విజయ్ పాటిల్ (రాంపూర్), శుభామ్ ఘర్జీ (సోహోలీ, సంగ్లీ), సౌరభ్ మనే (మల్ఖెద్, కరాడ్), ఆకాష్ దేశాయ్ (కలే, సతారా), అవినాష్‌గైక్వాడ్ (షిరాలా, సాంగ్లి), వీరితోపాటు డ్రైవర్ రంజిత్ ధన్వాడే ఉన్నారు. గాయపడినవారికి మిరాజ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు.

క్రీడాప్రభ



అశ్విన్ సంబరం



స్టార్‌స్పోర్ట్స్ 1లో ఉదయం 6 గం. నుంచి

అవకాశం వదలొద్దు!

- ఆసీస్‌తో భారత్ మ్యాచ్ నేడు
- అండర్ 19 ప్రపంచకప్

టీమ్‌ఇండియాలో చోటు సంపాదించేందుకు యువకులకు అవకాశం... ఐసీసీ అండర్ 19 ప్రపంచకప్ రూపంలో పలకరిస్తోంది. ఇప్పటికే మూడుసార్లు ప్రపంచ కప్ గెలిచిన భారత్... ఈ టోర్నీలో అత్యంత విజయవంతమైన జట్టుగా రికార్డు నెలకొల్పింది. పృథ్వీ షా సారథ్యంలోని యువకులు అండర్19 ప్రపంచకప్ గెలిచి సీనియర్ సెలెక్టర్ల తలుపులు తట్టేందుకు సమాయత్తమువుతున్నారు. యువరాజ్ సింగ్, విరాట్ కోహ్లి, మహ్మద్ కైఫ్ వలే టీమ్‌ఇండియాలో స్థానం సంపాదించాలని తహతహలాడుతున్నారు. ప్రపంచకప్ వంటి భారీ టోర్నీలో సత్తా చాటితే భవిష్యత్ బంగారు బాటే. ఆ విషయాన్ని గతంలో అనేక మంది యువకులు రుజువు చేశారు. ఈ సువర్ణావకాశాన్ని షా బృందం వృథా చేయకూడదు. ప్రపంచ కప్‌లో భారత్‌ను విజేతగా నిలపడమే కాకుండా తన భవితకు పునాది వేసుకోవాలి. మాజీ సారథిరాహుల్ ద్రవిడ్ మార్గదర్శనంలో మేటి ఆటగాళ్లుగా తయారైన భారత యువకులు ఆదివారం తమ తొలి పోరులో మరో విజయవంతమైన మేటి జట్టును ఢీకొనబోతున్నారు. హోరాహోరీగా సాగే మొదటి పోరులో గెలిచి పృథ్వీ షా బృందం టోర్నీని ఘనంగా ఆరంభిస్తుందా? చూడాల్సిందే!

మౌంట్ మాంగనీ

భారత యువ జట్టు ఆశావహ దృక్పథంతో ప్రపంచకప్‌లో అడుగుపెట్టింది. రాహుల్ ద్రవిడ్ మార్గదర్శిగా ఉన్న అండర్ 19 జట్టులో ప్రతిభకు లోటులేదు. టోర్నీ ఆరంభానికి చాలా రోజులు ముందే న్యూజిలాండ్‌లో అడుగుపెట్టి.. పరిస్థితులకు అలవాటు పడి వార్మప్ మ్యాచ్‌లలో సత్తా చాటిన భారత యువ జట్టు సమరోత్సాహంతో ఉంది. ఆసీస్ నుంచి ఎదురయ్యే సవాలును ఎదుర్కోవడానికి షా బృందం సంసిద్ధంగా ఉంది. భారత్ చివరి సారిగా 2014లో ప్రపంచకప్‌ను వశం చేసుకుంది. అండర్ 19 జట్టుతో పాటు భారత్ ఏ జట్టుకు స్ఫూర్తినిస్తున్న ద్రవిడ్.. ఆటగాళ్లపై వ్యక్తిగతంగా దృష్టి పెట్టడం కాకుండా జట్లను తీర్చిదిద్దడంపై నిమగ్నమయ్యాడు. ఐతే భారత జట్టు బ్యాటింగ్‌కు పృథ్వీ షానే ప్రధానమంటే అతిశయోక్తి కాదు. దేశవాళీలో ముంబై తరఫున పరుగుల వరద పారించిన షాతో పాటు భారత బ్యాటింగ్‌లో మరికొందరు ఆటగాళ్లూ కీలకమే. బౌలింగ్ విభాగంలోనూ భారత్ యువజట్టులో ప్రతిభకు కొదవు లేదు. బ్యాటింగ్‌లో షాతో పాటు హిమాన్షు రాణా, శుభ్‌మన్ గిల్, అనుకూల్ రాయ్, అభిషేక్ శర్మ కీలకం కానున్నారు. బౌలింగ్‌లో పేసర్ ఇషాన్ పోరెల్, శివమ్ మావి, కమలేశ్ నగర్‌కోటి ప్రధాన పాత్ర పోషిస్తారు.



పృథ్వీ షా

దేశవాళీ క్రికెట్‌లో గత ఏడాది పరుగుల సునామీ సృష్టించిన ముంబై కుర్రాడు పృథ్వీషాకు అండర్ 19 ప్రపంచకప్‌లో భారత జట్టును నడిపించే అవకాశం వెతుక్కుంటూ వచ్చింది. షాను చిన్న నాటి నుంచే క్రికెట్ పండితులు సచిన్‌తో పోలుస్తూ వస్తున్నారు. ఇటీవలే ముంబై రంజీ జట్టులో చోటు దక్కించుకున్న షా... ఐదు మ్యాచ్‌లలో మూడు సెంచరీలతో సత్తా చాటాడు. రంజీ ట్రోఫీ, దులీప్ ట్రోఫీ అరంగేట్రంలో సెంచరీ సాధించిన ఘనతను షా దక్కించుకున్నాడు. ప్రపంచకప్‌లో అతను రాణిస్తే భారత్ యువ జట్టుకు తిరుగుండదు.




కమలేశ్ నగర్‌కోటి

భారత యువజట్టు పేస్ దళానికి నేతృత్వం వహించే కమలేశ్... రెండో లిస్ట్ ఏ మ్యాచ్‌లో హ్యాట్రిక్ సాధించి వెలుగులోకి వచ్చాడు. రాజస్థాన్‌కు చెందిన నగర్‌కోటి.. నాటి నుంచి అండర్ 19 జట్టు పేస్ విభాగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాడు. రివర్స్ స్వింగ్‌తో పాటు చెప్పుకోదగ్గ పేస్‌తో బంతుల్ని సంధించగల కమలేశ్... జట్టుకు అమూల్యమైన ఆటగాడు. ఇంగ్లండ్‌లో టెస్టు సిరీస్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు పడగొట్టాడు.



అభిషేక్ శర్మ

అమృత్‌సర్‌కు చెందిన 17 ఏళ్ల అభిషేక్.. జట్టులో అత్యంత అనుభవశాలి. ఆసియా కప్‌లో అండర్ 19 జట్టుకు సారథ్యం వహించాడు. అభిషేక్ వైవిధ్యం కలిగిన ఎడమచేతి వాటం ఆటగాడు. ఎడమ చేతి వాటం స్పిన్ బౌలింగ్ చేస్తాడు. 2016లో అండర్ 16 విజయ్ మర్చంట్ ట్రోఫీలో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నిలిచాడు. 2017లో అతణ్ని పంజాబ్ జట్టులో చేర్చారు. అండర్ 19 జట్టు ఇంగ్లండ్ పర్యటనలో శర్మ నాలుగు మ్యాచ్‌లలో 98 పరుగులు సాధించి... 7 వికెట్లు పడగొట్టాడు.



శుభ్‌మన్ గిల్

యువ జట్టు బ్యాటింగ్‌లో గిల్ ఎంతో కీలకం. షా మాదిరిగానే గత ఏడాదే పంజాబ్ రంజీ జట్టులో చోటు సంపాదించాడు. నైపుణ్యం కలిగిన బ్యాట్స్‌మన్‌గా రాణా తనదైన ముద్ర వేశాడు. ఐతే ఇంగ్లండ్‌తో సిరీస్‌లో 4 ఇన్నింగ్స్‌లో 93 సగటుతో 278 పరుగులు సాధించాడు.



హిమాన్షు రాణా

కుడి చేతి వాటం బ్యాట్స్ మన్ రాణా.. షాకు తోడుగా భారత్ ఇన్నింగ్స్‌ను ఆరంభిస్తాడు. రాణా ఇప్పటికే హర్యానా తరఫున ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడాడు. 15 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలో ఏకంగా 792 పరుగులు సాధించాడు.



అనుకూల్ రాయ్

జార్ఖండ్‌కు చెందిన ఎడమ చేతి వాటం స్లో బౌలర్ అనుకూల్... జట్టులో కీలకం అవుతాడు. ఆల్‌రౌండ్ ప్రతిభ గల రాయ్ ఇంగ్లండ్ పర్యటనలో 4 మ్యాచ్‌లలో 10 వికెట్లు తీశాడు. బ్యాటింగ్‌లో కూడా రాణించాడు.



ఇషాన్ పోరెల్

బెంగాల్ పేసర్ ఇషాన్.... జట్టులో అత్యంత అనుభవం ఉన్న ఆటగాడు. రంజీ ట్రోఫీ అరంగేట్రంలోనే ఐదు మ్యాచ్‌ల్లో 13 వికెట్లు కూల్చి అందరి దృష్టిని ఆకర్షించాడు.



శివమ్ మావి

దక్షిణాఫ్రికా పేసర్ డేల్ స్టెయిన్‌ను ఆరాధించే శివమ్ జట్టు తురుపు ముక్క. కుడిచేతి వాటం మీడియం పేసర్ మావికి... దిగువ వరుసలో బ్యాటింగ్ చేయగల సత్తా ఉంది.



స్పిన్ తిరిగింది!



- వికెట్ల బోణీ కొట్టింది అశ్వినే
- తొలి రోజు పేసర్లకు దక్కింది ఒక్కటే
- దక్షిణాఫ్రికా 269-6

అంచనాలు తారుమారయ్యాయి.. ఊహలు తలకిందులయ్యాయి. సెంచూరియన్ పిచ్‌పై విపరీతమైన వేగం.. బౌన్స్ ఉంటుంది... పేసర్లు చెలరేగుతారనుకుంటే... మొదటి రోజు వికెట్ చిత్రంగా స్పందించింది. ఆడుతోంది... దక్షిణాఫ్రికాలోనా ఉపఖండంలోనా అన్న సందేహం వచ్చేలా వికెట్ ఉంది. రెండో టెస్టుకు తపిస్తారనుకున్న టీమ్‌ఇండియా స్పిన్నర్ అశ్విన్ (3-90) తన మాయాజాలంతో ఓపెనర్లను తిప్పేశాడు. డి కాక్‌ను డకౌట్ చేశాడు. కేప్‌టౌన్లో వలే కాకుండా ఇక్కడ వికెట్ల బోణీ కొట్టింది.. పేసర్లు కాదు.. స్పిన్నర్. మొదటి రోజు పేసర్లకు దక్కింది ఒక్కటే వికెట్. అదీ.. ఇషాంత్ శర్మకు. చిత్రంగా వికెట్ల మధ్య పరుగు తీయడంలో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ తడబడ్డారు. ఇద్దరు రనౌట్‌గా వెనుదిరిగారు. శనివాం ం తొలి రోజు ఆతిథ్య జట్టు పూర్తిగా ఆడినా బ్యాట్స్‌మెన్ జోరు కనిపించలేదు. చేసిన స్కోరు... 6 వికెట్లకు 269. మర్‌క్రమ్(94)కు తృటిలో సెంచరీ చేజారింది. ఆమ్లా (82) అర్ధసెంచరీతో రాణించాడు. మొత్తానికి ఊహకందని పిచ్‌పైసెంచూరియన్ టెస్టు అత్యంత ఆసక్తికరంగా మారింది!

సెంచూరియన్

టీమ్‌ఇండియాకే ఆశ్చర్యపోయేలా ఉన్న సెంచూరియన్ వికెట్ తొలి రోజు శనివారం పేసర్లకు ఏ మాత్రం సహకరించలేదు. దీంతో ఇషాంత్ (1-32) మినహా భారత పేసర్లు ఎంతగా శ్రమించినా వికెట్ దక్కలేదు. టాస్ గెలిచి దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ఎంచుకుంది. భారత్ పేస్ దాడిని బుమ్రా ఆరంభించాడు. బౌలర్లు ఉపఖండంలోని పరిస్థితుల్లో బౌలింగ్ చేస్తున్న భావన కలిగింది. 2018 సెంచూరియన్ పిచ్ 2010 నాటి ఈడెన్ వికెట్లా మారింది. పిచ్ నుంచి పేసర్లకు తోడ్పాటు లభించలేదు. వికెట్‌పై పచ్చిక లేకపోవడంతో కెప్టెన్ కోహ్లి 20వ ఓవర్‌లోనే స్పిన్నర్ అశ్విన్‌ను బౌలింగ్‌కు దించాడు. అశ్విన్ కూడా వెంటనే వికెట్ పడగొట్టలేక పోయాడు. లంచ్‌కు ముందు దక్షిణాఫ్రికా వికెట్ ఇవ్వలేదు. లంచ్ తర్వాత 30వ ఓవర్లో అశ్విన్ దక్షిణాఫ్రికాను తొలి దెబ్బ తీశాడు. ఎల్గర్ (31)ను పెవిలియన్ దారిపట్టించాడు. మరో వైపు వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలించడంతో మర్‌క్రమ్ (94, 150 బంతుల్లో, 15 ఫోర్లు) క్రీజులో నిలదొక్కుకొని సెంచరీ దిశగా అడుగులు వేశాడు. మరోసారి అశ్విన్ తన స్పిన్ మాయతో మర్‌క్రమ్‌ను ఔట్ చేశాడు. పార్థివ్ క్యాచ్ పట్టడంతో అతను వెనుదిరిగాడు. రెండు సార్లు లభించిన జీవనదానాలను సద్వినియోగం చేసుకొని ఆమ్లా (82, రనౌట్, 153 బంతుల్లో, 14 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించాడు. టీ విరామానికి ముందు రెండు వికెట్లే కూలాయి. అనంతరం డివిలియర్స్‌ను ఇషాంత్ పెవిలియన్ దారిపట్టించాడు. నాటకీయ సంఘటనల మధ్య ఆమ్లా రనౌట్ అయ్యాడు. వెంటనే డి కాక్‌ను అశ్విన్ వెనక్కి పంపాడు. ఫిలాండర్ కూడా రనౌట్‌గా వెనుదిరిగాడు. ధావన్, సాహా, భువనేశ్వర్ స్థానంలో రాహుల్, పార్థివ్ పటేల్, ఇషాంత్ తుది జట్టులోకి వచ్చారు.

స్కోరు బోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: ఎల్గర్ (సి) విజయ్ (బి) అశ్విన్ 31, మర్‌క్రమ్ (సి) పటేల్ (బి) అశ్విన్ 94, ఆమ్లా రనౌట్ (పాండ్య) 82, డివిలియర్స్ (బి) ఇషాంత్ 20, డు ప్లెసిస్ బ్యాటింగ్ 25 డి కాక్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 0, ఫిలాండర్ రనౌట్ (పటేల్-పాండ్య) 0, మహరాజ్ బ్యాటింగ్ 10, ఎక్స్‌ట్రాలు 7, **మొత్తం:** (90 ఓవర్లలో 6 వికెట్లకు) **269**

వికెట్ల పతనం: 1-85, 2-148, 3-199, 4-246, 5-250, 6-251.

బౌలింగ్: బుమ్రా 18-4-58-0, షమి 11-2-46-0, ఇషాంత్ 16-3-32-1, పాండ్య 14-4-37-0, అశ్విన్ 31-8-90-3.

పాక్‌కు అఫ్గాన్ షాక్

వాంగరీ (న్యూజిలాండ్): ఐసీసీ అండర్ 19 ప్రపంచ కప్ ఆరంభ పోరులో అఫ్గానిస్తాన్ శనివారం పాకిస్థాన్‌కు షాకిచ్చింది. దార్విష్ రసూలి (76 నాటౌట్, 78 బంతుల్లో, 4 ఫోర్లు, 2 సిక్స్) అజేయంగా అర్ధసెంచరీ చేయడంతో అఫ్గాన్ 5 వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన పాక్.. 47.4 ఓవర్లలో 188 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ రోహైల్ నజీర్ (81, 105 బంతుల్లో, 9 ఫోర్లు) ఒక్కడే రాణించాడు. అనంతరం అఫ్గాన్ 47.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఇంకా 15 బంతులుండగానే 194 పరుగులు చేసి గెలిచింది.

రామ్‌కుమార్ ముందంజ

మెల్‌బోర్న్: భారత టెన్నిస్ స్టార్ రామ్‌కుమార్ రామనాథన్... ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయర్స్‌లో ముందంజ వేశాడు. శనివారం అతను రెండో రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన గ్లెబ్ సఖరోవ్‌ను 6-4, 7-6(12)తో ఓడించాడు. 28వ సీడ్ రామ్‌కుమార్ ఏస్‌తో మ్యాచ్‌ను ముగించి మూడో రౌండ్‌కు చేరుకున్నాడు.

ఇదిగో వస్తున్నా...!

సిడ్నీ ఇంటర్నేషనల్ విజేత కెర్బర్

సిడ్నీ: ప్రపంచ మాజీ నెంబర్ వన్ యాంజెలిక్ కెర్బర్(జర్మనీ) సిడ్నీ ఇంటర్నేషనల్‌లో విజేతగా నిలిచి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రత్యర్థులకు హెచ్చరిక చేసింది. శనివారం జరిగిన ఫైనల్లో కెర్బర్ 6-4, 6-4తో వరుస సెట్లలో ఆష్లీబార్టీపై గెలిచింది. 2018లో పూర్వ వైభవాన్ని తిరిగి తెచ్చుకోవాలనుకుంటున్న కెర్బర్... రెండు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను గెలుచుకుంది. 2016లో ఆస్ట్రేలియన్ ఓపెన్, యుఎస్ ఓపెన్ విజేత కెర్బర్ ప్రస్తుతం ప్రపంచ 22వ ర్యాంకులో ఉంది. 2017 నిరాశజనకంగా గడిచిన ఆమె.. ఈ ఏడాది సెరెనా విలియమ్స్ గైర్హాజరీలో మరోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌పై కన్నేసింది.





నాకు హెచ్‌సీఏ సభ్యత్వం ఉంది

- కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు
- హెచ్‌సీఏ అధికారికంగా టోర్నమెంట్లను నిర్వహించాలి
- భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజారుద్దీన్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో తనకు సభ్యత్వం ఉందని, తన సభ్యత్వంపై కొందరు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ తెలిపారు. కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం ఆయన సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తాను ఏ అసోసియేషన్లో కొనసాగినా హెచ్‌సీఏలో సభ్యత్వం పొందే అవకాశం ఉందన్నారు. తాను తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగడం లేదని స్పష్టం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తన సభ్యత్వంపై అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుత పరిణామాలు, హెచ్‌సీఏలో జరిగిన అవకతవకలపై బీసీసీఐకి త్వరలో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తాను ఉత్తర ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తానన్న వార్తల పట్ల స్పందించారు. తాను పక్కా హైదరాబాదీనని, దేశంలో హైదరాబాద్‌కు పేరు తెచ్చేందుకే ఇన్నిరోజులు క్రికెట్ ఆడానని స్పష్టం చేశారు. ఇక హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేక్ తనపై చేస్తున్న ఆరోపణలు తీవ్ర ఆవేదనకు గురిచేశాయన్నారు. వీటిపై చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నట్లు స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన హెచ్‌సీఏ సర్వసభ్య సమావేశానికి ఆహ్వానం అందడం వల్లనే హాజరయ్యానని తెలిపారు. కొంతమంది వ్యక్తిగత స్వార్థం కోసం టోర్నమెంట్లు నిర్వహించడం కూడా సరికాదన్నారు. ప్రభుత్వం అధికారికంగా టోర్నమెంట్లు నిర్వహిస్తే ఎంతో మంది క్రీడాకారుల ప్రతిభ వెలుగులోనికి వస్తుందన్నారు. వ్యక్తుల పేర్ల మీద టోర్నమెంట్లు నిర్వహించడం కూడా తప్పేనని వ్యాఖ్యానించారు. నిరుపేద క్రీడాకారులను ప్రోత్సహించేందుకు హెచ్‌సీఏ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని అజారుద్దీన్ స్పష్టం చేశారు. క్రీడా నైపుణ్య సహాయం కోసం ఎదురుచూసే నిరుపేద క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని భారత మాజీ కెప్టెన్ అజారుద్దీన్ స్పష్టం చేశారు. అటువంటి క్రీడాకారులకు తన ప్రోత్సాహం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.





హైదరాబాద్‌లోనే సంక్రాంతి!

గత ఏడాది సంక్రాంతికి.. కుటుంబమంతా బెంగళూరుకి వెళ్లి పండుగ జరుపుకున్నాము. కానీ ఈ ఏడాది సైరా నరసింహారెడ్డి షూటింగ్ జరుగుతుండటం వలన ఎక్కడికీ వెళ్లటం లేదు. హైదరాబాద్‌లోనే ఫ్యామిలీతో సంక్రాంతి జరుపుకోబోతున్నాను.

-చిరంజీవి



కుటుంబంతోనే పండుగ

సంక్రాంతికి ఎక్కడికీ వెళ్లటంలేదు. హైదరాబాద్‌లోనే కుటుంబమంతా కలిసి పండుగని జరుపుకోవాలనుకుంటున్నాం. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.

-నాగార్జున



14 చుక్కలు
2 వరుసలు
2 వచ్చే వరకు

కోను. త్రివేణి
శ్రీపురం
నెల్లూరు







21 చుక్కలు
3 వచ్చే వరకు
చుక్క విడిచి చుక్క



గోకవరపు సుహాసిని
ముత్యాలమ్మ గుడి
మచిలీపట్నం



27 చుక్కలు
1 వచ్చే వరకు
చుక్క విడిచి చుక్క



నటుడు పృథ్వీ

పండగంటే జీవితంలో సంతోషాన్ని పోగేసుకునే ఓ సందర్భం. పండగలు లేకుంటే జీవితం నిస్సారమైపోతుంది. ఒక రోజు జరిగే పండగే మనకంత ఉత్సాహాన్ని పంచితే...మూడు రోజుల సంబరాలతో ఆనందం మూడింతలైనట్లే. ఇదే సంక్రాంతి ప్రత్యేకత. భోగి, మకర సంక్రాంతి, కనుమ... ఏడాదిలో ఈ మూడు రోజుల ప్రత్యేకతలను ఆస్వాదించని వారుండరు. సంక్రాంతి వస్తే చిన్న పిల్లలమై పోతామని చెబుతున్నారు హాస్య నటుడు పృథ్వీ. ఏ ఊళ్లో ఉన్నా...పండగనాటికి ఊరికెళ్లి పండగ జరుపుకుంటానని అంటున్నారు. సంక్రాంతి పండగకు సంబంధించిన జ్ఞాపకాలను, తన కెరీర్ విశేషాలను ఆయన ఆంధ్రప్రభ లైఫ్‌తో పంచుకున్నారు ...ఆ విశేషాలు ఆయన మాటల్లోనే-

సంక్రాంతికి ఘటోత్కచుడిలా మారిపోతా...

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెం నేను పుట్టిన ఊరు. మా ఉభయ గోదావరి జిల్లాల్లో సంక్రాంతి పండగను గొప్పగా జరుపుకుంటారు. ముంగిళ్లలో ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగి రెద్దులు, కోడిపందేలు, కమ్మని వంటకాలు...ఇలా ఆ మూడు రోజులు ఉత్సాహంగా సాగిపోతాయి. సంక్రాంతి అనగానే నాకు బాల్యం గుర్తొస్తుంది. ప్రతి సంక్రాంతికి మూడు జతల కొత్త బట్టలు కుట్టించేవారు. ఎక్కువగా ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. అంతా కలిసి ఒక చోట పండగ జరుపుకునేవాళ్లం. బంధువుల రాకపోకలతో సందడిగా ఉండేది. వారు తిరిగి వెళ్లేప్పుడు మా పిల్లలందరికీ ఐదు, పదీ రూపాయలు... ఉంచమని ఇచ్చేవారు. మేము బొమ్మలు కొనుక్కునేందుకు ఖర్చులకు ఆ డబ్బులు వాడుకునేవాళ్లం.

ఊరెళితే...వద్దన్నా ఫ్లెక్సీలతో స్వాగతం...

ఇప్పటికీ నేను షూటింగ్ ఎక్కడ చేస్తున్నా...పండగ సమయంలో ఊరెళ్తాను. ఏడాదిలో నేను సొంతూరుకు వెళ్లే రెండు మూడు సందర్భాల్లో సంక్రాంతి ఒకటి. ఇప్పుడందరూ పుట్టిన ఊరిని వదిలి ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసుకుంటున్నవారే. వాళ్లంతా పండక్కి ఊరికి వస్తారు. బంధువులు, స్నేహితులు అంతా కలుసుకుంటాం. నన్ను పేరున్న నటుడిగా ప్రత్యేకంగా చూడవద్దని మా వాళ్లకు చెబుతుంటాను. అయినా ఫ్లెక్సీలు, బ్యానర్లు లాంటివి పెడుతుంటారు. పండక్కి చేసే బొబ్బట్లంటే నాకు చాలా ఇష్టం. ఈ మూడు రోజులు ఆహార నియమాలన్నీ పక్కన పెట్టి శుభ్రంగా నచ్చినవన్నీ తినేస్తాను. మాయాబజార్‌లో ఘటోత్కచుడిలా కూర్చొని లాగించడమే. సినిమాల్లోకి రాకముందు ఒకసారి సంక్రాంతికి మాఊరినుండి హైదరాబాద్ సరదాగా వచ్చాను. అప్పుడు ఎన్టీఆర్‌ను కలిసే అవకాశం కలిగింది. అదొక మధుర జ్ఞాపకం.

ఆ రెండు సినిమాలు కెరీర్‌కి మలుపులు...

రైతు కుటుంబంలో పుట్టిన నాకు చిన్నప్పటి నుంచి కళలంటే ఇష్టం. ముఖ్యంగా అభినయం అంటే మక్కువ. పాఠశాల, కళాశాల సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనేవాడిని. మా అమ్మ ప్రోత్సాహం బాగా ఉండేది. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పీజీ పూర్తి చేశాను. క్రికెట్ కూడా బాగా ఆడేవాడిని. రంజీస్థాయి ఎంపిక వరకు వెళ్లాను. అయితే నటనపైనే ఆసక్తి ఉండేది. అలా చెన్నై వెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టాను. నటుడు ప్రభాకర్ రెడ్డి చాలా సహాయం చేశారు. వేషాల కోసం పగలంతా తిరుగుతూ రాత్రి ఉద్యోగం చేశాను. అలా ఈవీవీ గారి ఆ ఒక్కటి అడక్కు సినిమాలో తొలి అవకాశం వచ్చింది. బ్యాంక్ మేనేజర్ పాత్ర. బాగా నటించాననే పేరొచ్చింది కానీ ఆ ప్రభావం అవకాశాల మీద చూపించలేదు. ఫలితంగా మళ్లీ నిరుత్సాహమే మిగిలింది. దర్శకులు కృష్ణవంశీ మా ఊరి వాడే. 2002లో ఆయన దర్శకత్వం వహించిన ఖడ్గం నాకు అసలైన గుర్తింపునిచ్చింది. ఆ చిత్రంలో థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ ఇక్కడ... అనే డైలాగ్ నా నట జీవితాన్ని మార్చేసింది. దాదాపు 30 సినిమాలు ఈ ఒక్క డైలాగ్ ప్రభావంతో దక్కాయి. నాకు ఖడ్గం లాంటి బ్రేక్ ఇచ్చిన మరో సినిమా లౌక్యం. ఇందులో నేను పోషించిన బాయిలింగ్ స్టార్ బబ్లూ పాత్ర నన్ను స్టార్‌ను చేసింది. ఈ పాత్రను రాసిన శ్రీధర్ సీపాన, అవకాశం ఇచ్చిన శ్రీవాస్‌కు ఎప్పటికీ కృతజ్ఞతలు చెప్పుకుంటాను. ఈ సినిమా తర్వాత తీరికలేకుండా అయిపోయాను.

లక్ష్యం మార్చుకోలేదు...

నేను చిత్ర పరిశ్రమకు వచ్చి పాతికేళ్లవుతోంది. దాదాపు 200 చిత్రాల్లో నటించాను. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లను చూశాను. రెండు మూడు సార్లు...ఇక ఇక్కడ ఉండలేమని ఊరెళ్లిపోదామని అనుకున్న సందర్భాలున్నాయి. ఓపిగ్గా ప్రయత్నిస్తేనే ఏ లక్ష్యానికైనా చేరుకుంటాం. నా జీవితమే అందుకు ఓ ఉదాహరణ. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసినా...నా ఆసక్తి, ఇష్టం అంతా నటనే. లక్ష్యాన్ని మార్చుకోలేదు. సమయం బాగా లేనప్పుడు వెండితెర నుంచి బుల్లితెరకు వెళ్లినా దారి మారలేదు. శ్రీభాగవతంలో ఇంద్రుడి పాత్రలో నటించాను. ఈ సీరియల్ వల్లే ఓ రకంగా ఇండస్ట్రీలో ఉండగలిగాను. మనకు దక్కేది దక్కుతుందని నా విశ్వాసం. అదృష్టం కంటే శ్రమను ఎక్కువ నమ్ముతాను. పృథ్వీ సెట్‌లో ఉంటే బాగుంటుంది... పిలవండి అనే దర్శకులు చాలా మంది ఉన్నారు. అందరితో మంచిగా ఉండటం, ప్రతి ఒక్కరినీ గౌరవించడం నా అలవాటు. నటుడిగా డబ్బుని డిమాండ్ చేసింది ఎప్పుడూ లేదు. నటన నేను ఆనందించే విషయం. ఈ ఆనందానికి డబ్బుతో వెలకట్టలేను. క్రికెట్ కూడా నాకు ఆనందాన్ని ఇచ్చే అంశమే. ఇండస్ట్రీలో క్రికెట్ ఆడుతున్నప్పుడు నన్ను ఎంపికచేయడం లేదు. అందరూ హీరోలే ఆడుతున్నారు. ఈసారి పట్టుబట్టి మ్యాచ్‌లో ఆడాలి.

ప్రజాసేవకోసమే...రాజకీయాలు

స్వతహాగా ఎన్టీఆర్ అభిమానిని అయినా...చిరంజీవి గారిని ఆదర్శంగా తీసుకుంటాను. ఒక్కడై వచ్చి ఆయన చిత్ర పరిశ్రమలో సముద్రంలా ఎదిగారు. మెగాస్టార్ స్ఫూర్తితో ఎంతోమంది యువకులు పరిశ్రమకు వచ్చారు. చిరంజీవి గారు ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు అందులో చేరాను. అప్పగించిన బాధ్యతలు శ్రమించి నిర్వహించాను. ఆయన కాంగ్రెస్‌లో చేరినప్పుడు అంతా బయటకొచ్చాం. ప్రస్తుతం వైఎస్ఆర్‌సీపీలో పనిచేస్తున్నాను. వచ్చే సాధారణ ఎన్నికలకు ఏ పార్టీలో చేరుతాననేది చెబుతాను. నాకు రాజకీయ లక్ష్యాలంటూ ఏమీ లేవు. ప్రజలకు మంచి చేసే నాయకుడు ఎవరుంటే వాళ్ల పక్కన నిలబడతాను. పదవి ఉంటే ఎక్కువ సేవ చేయవచ్చనేది నిజమే కానీ...నాకు పదవిపై ఆశలు లేవు. మంచి నాయకుడు గెలిచేలా ప్రచార సారథ్య బాధ్యతలు స్వీకరిస్తాను. నేను రాజకీయ పార్టీలో ఉండటం నా అవకాశాల మీద ప్రభావం చూపించలేదు. చూపించదు కూడా. ఒక నటుడిని తొక్కేయడం అనేది గతంలో జరిగిందేమో కానీ ఇప్పుడా పరిస్థితులు లేవు. పరిశ్రమ ఒక సముద్రం. మన బిందెడు నీళ్లు ఎక్కడైనా దొరుకుతాయి.

✍ రమేష్ గోపిశెట్టి



ఎగిరే పతంగి...ఓ మానసిక థెరపీ!

సంక్రాంతి వచ్చిందంటే పిల్లల ఆనందానికి అంతు ఉండదు. గాలిపటాలు. ..ఆకాశంలో ఎగురుతుంటే...వారి మొహాల్లోని ఆనందాన్ని ఉత్సాహాన్ని ఉత్కంఠతని విజయగర్వాన్ని చూసి తీరాల్సిందే. ఇప్పుడు హైదరాబాద్‌లోనూ కైట్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ఆకాశంలో ఎగిరే గాలిపటాలు ఆనందాన్నే కాదు...మానసిక ఆరోగ్యాన్నీ ఇస్తాయంటున్నారు నిపుణులు. శాస్త్రీయంగా రుజువైన ఆ వివరాలు మీకోసం-

♦ చలికాలం సాధారణంగా ఎవరికైనా శారీరక వ్యాయామం తక్కువగానే ఉంటుంది. అందుకే సంక్రాంతి నాడు ఎగరేసే గాలిపటాలతో...ఒక్కసారిగా శరీరంలో చురుకుదనం పెరుగుతుంది. గాలిపటాలు ఎలాగూ...విశాలమైన ప్రదేశాల్లో మైదానాల్లో ఎగురవేస్తారు. గాలికి ఎదురీదుతూ, పరుగులు తీస్తూ గాలిపటం ఎగురవేయటం...గుండెకు మంచి వ్యాయామం.

♦ గాలిపటాలు ఆరుబయటే ఎగురవేయాలి కనుక..అది పచ్చికైనా, సముద్రపు ఒడ్డయినా, పార్కయినా..ఎక్కడ ఎగురవేసినా ప్రకృతికి దగ్గరగా వెళ్లే అవకాశం ఉంటుంది. ఇది ఆందోళనను, డిప్రెషన్‌ని తగ్గిస్తుందని మానసిక ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. చలికాలంలో మానసిక స్థితి సరిగ్గా ఉండకపోవటం, మూడ్ డిజార్డర్లు ఎక్కువగా ఉండటం తెలిసిన విషయమే.

♦ ధ్యానం అంటే ఒక విషయంమీద ఏకాగ్రతని పెట్టటం...అయితే గాలిపటాలను ఎగురవేయటం కూడా ఒక రకంగా ధ్యానమే. ఒక్క దారం కొసని పట్టుకుని... ఆకాశంలో గాలివాటుగా ఎగిరే గాలిపటాన్ని నియంత్రించడమంటే...మనసు శరీరాలు ఏకమై.. అందులో మమేకం కావాల్సిందే. దీనివలన ఎన్నో ఆరోగ్య లాభాలు ఉంటాయని తెలుస్తోంది. డిప్రెషన్, ఆందోళనలు తగ్గడమే కాకుండా...మెదడులో జ్ఞాపకశక్తి, నేర్చుకునే ప్రక్రియ, భావోద్వేగాలతో సంబంధం ఉన్న భాగం ప్రభావితం అవుతుందని, అందులో మంచి మార్పులు కలుగుతాయని తెలుస్తోంది

♦ గాలిపటం ఎగురవేస్తూ...నీలాకాశంలోకి చూడటం వలన కంటి ఆరోగ్యానికి సైతం మంచిదని తెలుస్తోంది. సూర్యుని కాంతి వలన కంటికి హాని కలుగుతుందని పెద్దలు అంటున్నా....కంటి కండరాలు, నరాలకు వ్యాయామం జరిగి మేలు కలుగుతుందని, దీని వలన కళ్లలో అలసట తగ్గి కంటి వ్యాధి మయోపియా రాకుండా ఉంటుందని తెలుస్తోంది.

♦ గాలి పటాలు ఎగుర వేసేటప్పుడు పైకి ...కంటికి ఎదురుగా, కిందకు...ఇలా మూడురకాలుగా మెడను మార్చాల్సి ఉంటుంది. దీనివలన మెడ కండరాలకు మంచి వ్యాయామం జరుగుతుంది. మెడ కదలికలు మృదువుగా మారతాయి. ఎముకలు శక్తిమంతమవుతాయి. మెడ నొప్పులను నివారించవచ్చు.

♦ గాలిపటం ఎగురవేయటంలో... ఒత్తిడిని తగ్గించే గుణముంది. ఆకాశంలోకి తదేకంగా చూడటంతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కూడా మానసిక నిపుణులు అంటారు. అంతేకాదు...గాలిపటాన్ని ఎగురవేసే ప్రక్రియలో సృజనాత్మకతకు ప్రాధాన్యత ఉన్న కుడి మెదడు ఎక్కువగా పనిచేస్తుందట. ఏకాగ్రత, ప్రణాళిక, సమన్వయం, సమస్యలను పరిష్కరించే శక్తి...ఇన్ని విషయాలు మిళితమైతే కానీ...గాలిపటం గాలిలో సవ్యంగా ఎగరదనేది నిపుణుల మాట.



గోదాదేవి ప్రణయ ప్రతిపత్తి, పూర్వ జన్మ సంస్కారం వల్ల హరిని పొందిందని తెలుస్తుంది. దైవమైన రంగనాథుని తన నాథునిగా పొందాలన్న పట్టుదల గోదాదేవి సమున్నత భక్తి తత్వాన్ని తెలుపుతుంది. 'యతో హరిస్తతో లక్ష్మి' (ఎక్కడ హరి ఉంటాడో అక్కడ లక్ష్మి కూడా ఉంటుంది). గోదాదేవి భూదేవ్యంశగా, భగవంతుని తండ్రిగా, ప్రియునికి ప్రేయసిగా తపించటమే మధుర భక్తి.

చింతన

పరమ పావనం గోదా కళ్యాణం

భోగి పండుగ ప్రత్యేకం

శ్రీరంగనాథుని భర్తగా భావించుకున్న గోదాదేవిని ఆయన వివాహమాడిన పుణ్యదినం భోగిగా భావిస్తారు. భోగి, సంక్రాంతి సందర్భంగా ఆ ఘట్టాన్ని స్మరించుకోవడం ఎంతైనా సముచితం.

గోదాదేవి రంగనాథుని (కృష్ణుణ్ణే) తన ప్రయునిగా భావించేది. కృష్ణుని ధ్యాసతో ఆమె గడిపిన నిద్రలేని రాత్రులు ఎన్నో. శ్రీకృష్ణుని దివ్య మంగళ స్వరూపం, మరులు గొలిపే మురళీ గాన మాధుర్యం ఆమె ఊహల్లో కళ్ళకు కట్టినట్టుగా కనిపించేది. కన్నులు తెరిచినా మూసినా శ్రీకృష్ణుడే. ఈ రూపంతోనే కదా ఐదు లక్షల ఇళ్లలోని ఇరవై అయిదు లక్షల పెళ్లికాని పిల్లలను మోహ పెట్టావు కదా అంటూ ఆ మురళీలోలుని రూపాన్ని ధ్యానిస్తూ రాత్రులు గడిపేది. ఆయనతో విరహం రోజు రోజుకు ఎక్కువవుతుండడం వల్ల విరహాన్ని భరించలేని స్థితి వచ్చింది. తండ్రి విష్ణు చిత్తుడు లౌకిక వ్యవహారాల్లో పూర్తిగా అమాయకుడు. తన కూతురు చేసే ఆరాధనామయ తపస్సు ఆయనకు కొత్తగా కనబడింది. కించిత్ ఆందోళనకు గురయ్యాడు కూడా. నేరుగా వెళ్లి విల్లిపుత్తూరులోని వటపత్ర శాయికి ఈ విషయం మొరపెట్టుకున్నాడు. 'అయ్యా! మా అమ్మాయికేదో కొత్త జబ్బు పట్టుకున్నట్టుంది' అని తన బాధను వ్యక్తం చేశాడు. అప్పుడు విష్ణువు 'నేను వరాహావతారంలో ఉండగా భూదేవి అయిన నీ కుమార్తె నా గానాన్ని గురించి వింది. నా గాన ప్రియత్వానికి కరిగి నన్ను ప్రసన్నం చేసుకునేందుకు సంకీర్తనకు మించిన ఉపాయం లేదని తెలిసికొని నా పై పాటలు పాడుతోంది. ఇంతకు మించి ఆమె చేసే తప్పేమీ లేదు. నీకు అంతా మేలే జరుగుతుంది. శ్రీరంగేశుని సేవించటానికి నీ కుమార్తెను తోడ్కొని శ్రీరంగం వెళ్లి రండ'ని ఆనతిచ్చాడు. మహా ప్రసాదం స్వామీ! అంటూ విష్ణుచిత్తుడు ఒక బంగారు పల్లకిలో గోదాదేవిని కూర్చుండబెట్టి పరివారం, భాగవతులతో కలిసి శ్రీరంగంలోనికి ప్రవేశించాడు.

అక్కడ చల్ల గాలులు స్వాగతం పలికాయి. స్వామి వారిని దర్శించి, మైమరచి స్తోత్రం చేశారు తండ్రీకూతుళ్లు. శ్రీరంగనాథుని చూపు గోదాదేవి దివ్య సౌందర్యాన్ని చూస్తోంది. ఆమె పట్ల ప్రేమతో ఆమెను తన అంతఃపురానికి రప్పించుకుని మాయా గోదను విష్ణుచిత్తుల వారి వద్ద ఉంచాడు. విష్ణుచిత్తులవారు పరివారంతో గుడి బయటకు వచ్చి మాయా గోదాదేవిని పల్లకిలో కూర్చుండబెట్టుకుని వచ్చి విడిది గృహం వద్ద పల్లకి తెర తీసి చూస్తే మాయా గోద మాయమైంది. కుమార్తె కనపడడం లేదంటూ విష్ణు చిత్తుడు బావురుమంటూ గోల గోల చేశాడు.

శ్రీరంగనాథుడు తన కుమార్తెను దాచేసుకున్నాడని, అతనిని బ్రహ్మాది దేవతలు కూడా ఏమీ చేయలేరని, అటువంటిది బక్క బ్రాహ్మణుడిని నేనేమి చేయగలను అని దుఃఖిస్తూ శ్రీరంగమంతా తిరిగి అందరికీ చెప్పి రచ్చ రచ్చ చేసి చివరకు శ్రీరంగనాథుని నిలదీశాడు. నా కూతురుని ఎక్కడ దాచావు అని అడిగాడు. అందుకు ఆయన 'ముది మది తప్పితో ముని ముఖ్యా' (ముసలితనంలో మతి పోయిందా)! నీ కుమార్తెను నీ ఇంట్లోనే పెట్టుకుని ఇక్కడికి వచ్చి గోల చేస్తావా. పో, పొయ్యి నీ విడిది ఇంట్లో చూసుకో అన్నాడు. దానితో విష్ణుచిత్తుడు స్థిమితపడి, అయ్యా! చల్లని మాట చెప్పావు అని విడిదికి రాగానే గోదాదేవి ఎదురొచ్చి నమస్కరించింది. అప్పటికి ప్రాణాలు తేరుకున్నాయి విష్ణుచిత్తునికి. తరువాత రంగనాథుడు పిల్లనడగడానికి బ్రహ్మ, మహేశ్వరులను, సరస్వతి పార్వతులను విష్ణు చిత్తుని వద్దకు పంపాడు. గోదాదేవిని రంగనాథునికిచ్చి వివాహం చేయడానికి విష్ణుచిత్తుడు మ హదానందంగా ఒప్పుకున్నాడు.


అయితే పెళ్ళి ఇక్కడ చేస్తే కూతురిని మోసుకువచ్చి చేశాడంటారు. అందువల్ల రంగనాథుడే స్వయంగా విల్లిపుత్తూరులోని తన ఇంటికి రావాలని పట్టు పట్టాడు. విష్ణుచిత్తుడు స్వామిపై చూపినది కేవలం పరిచితుడైన ప్రభువు దగ్గర భృత్యుడు చూపించే సేవ్య సేవక భావం తప్ప అంతకంటె భిన్నంగా ఏదీ కనబడదు. గోదాదేవి ప్రేమ అనన్యం. ప్రతి దినం అతని వియోగంతో తపించింది. ద్రావిడ భాషలో పాశురాలు పాడింది. ఈ జన్మంలో ఆమె రంగనాథుని విగ్రహం చూసింది. అతని గుణాలు విందే కాని రూపం చూడలేదు. భావనా ప్రపంచంలో ఆమె శిలా విగ్రహాన్ని కూడా చలింపజేసి వలచి, వలపించుకున్నది. గోదాదేవి ప్రణయ ప్రతిపత్తి, పూర్వ జన్మ సంస్కారం వల్ల హరిని పొందిందని తెలుస్తుంది. దైవమైన రంగనాథుని తన నాథునిగా పొందాలన్న పట్టుదల గోదాదేవి సమున్నత భక్తి తత్వాన్ని తెలుపుతుంది. 'యతో హరిస్తతో లక్ష్మి' (ఎక్కడ హరి ఉంటాడో అక్కడ లక్ష్మి కూడా ఉంటుంది).

గోదాదేవి భూదేవ్యంశగా, భగవంతుని తండ్రిగా, ప్రియునికి ప్రేయసిగా తపించటమే మధుర భక్తి. ఎట్టకేలకు శ్రీరంగనాథుడు అంగరంగ వైభవంగా విల్లిపుత్తూరు విచ్చేశారు. ఆయనకు షోడశోపచారాలు సమర్పించి, మధుపర్కాలు బహూకరించారు. విష్ణుచిత్తులవారు తన భార్యతో కలిసి ఆయన కాళ్లు కడిగి గోదాదేవితో పాణిగ్రహణం జరిపించారు. రంగనాథుడు గోదాదేవి గళంలో మంగళ సూత్రం కట్టాడు. శ్రీరంగనాథుడు గోదాదేవిని సంతోషంగా శ్రీరంగానికి తీసుకుపోయి కావేరీ తీరంలో ఉన్న ఉద్యాన వనాలలో విహరిస్తూ లోకాలను పాలిస్తున్నారు.

డాక్టర్ గాది శ్రీనివాస్
998907974

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

అమ్మ - అళగమ్మ



3-4-47

మొన్న భగవాన్ సన్నిధిలో పాత పాటలను గురించిన ప్రసంగం వచ్చి, 'అమ్మ దక్షిణామూర్తి స్తోత్రం, ఇంకా ఏమో వేదాంతపరమైన పాటలు పాడేది.ఎంతో అర్థవంతంగా ఉండేవి. ఇప్పుడెవ్వరూ లక్ష్యం చేయరు గాని, కొంచెం సంస్కరించి, ప్రకటిస్తే బాగుండు'నన్నారు భగవాన్. అది విని తెలుగులో కూడా తత్త్వబోధలతో నిండి ఉన్న పాత పాటలు జ్ఞప్తికి వచ్చి అవి ప్రకటిస్తే, స్త్రీలకు ఆధ్యాత్మికంగా ఉపయోగింపగలవనీ, ఈ గేయ పఠనం వల్లస్త్రీలు తరింపగలరనీ నిరూపిస్తూ ఒక వ్యాసం వ్రాశాను. అందులో అమ్మ అళగమ్మకు భగవాన్ చేసిన ఉపదేశాల్లో అగ్ర స్థానం వహించి, గేయ రాజమని పేరొందిన అప్పడపు పాటను గురించి వివరించి, ఒక వ్యాసం గృహలక్ష్మికి పంపుదామని భగవాన్‌కు మనవి చేస్తే 'ఏదీ విందాం చదవ'మన్నారు. చదివితే విని, 'ఈ పాటకొక పెద్ద కథ ఉన్నదే' అన్నారు. 'అదేమో సెలవిస్తారా?' అన్నాను. 'అమ్మ నా వద్ద ఉండటం ప్రారంభించిన మొదటి రోజుల్లో విరూపాక్ష గుహలో ఉన్నప్పుడు వంట ఉండేది కాదు. ఎచ్చమ్మా వాళ్లేమైనా తెచ్చి ఇస్తే తినడం, పాత్రలు కడిగి పడుకోవటం, అంతే మామూలు. అబ్బాయికేమీ లేదే. జంట అప్పడమంటే ప్రియమే, ఆ అప్పడాలైనా చేస్తే బాగుండునని తోచిందామెకు. చేసిన చెయ్యిగదా, ఊరుకోలేకపోయింది. నాకు తెలియకుండా మొదలియార్ పాటికీ, ఎచ్చమ్మకూ ఇంకా ఎవళ్లకో సిద్ధంగా ఉంచమని ముందే చెప్పి ఒక దినం సాయంత్రం 'ఊళ్ళోకి వెళ్లి వస్తా'నని బయలుదేరింది. (మొదలియార్ అవ్వ, ఎచ్చమ్మాళ్ అనే వారు భగవాన్ భక్తురాళ్లు). ఆమెనటు పోనిచ్చి ఏమి చేస్తుందోనని బయట ఉన్న చెట్టు కింద కూర్చున్నాను. నేనెరుగననుకుందామె. ఆ ఇల్లూ, ఈ ఇల్లూ తిరిగి పెద్ద గిన్నెలో అన్నీ పెట్టుకుని వచ్చింది. నేను ఏమీ ఎరుగనట్టు కళ్లు మూసుకున్నాను. గుహలో వాటిని భద్రంగా ఉంచింది. చూడవచ్చిన వారంతా వెళ్లారు. చీకటి పడ్డ వెనుక ఏదో తిని, దొంగ నిద్రనభినయిస్తూ పడుకున్నాను. ఆమె సావకాశంగా గిన్నెలో నుంచి కర్రలూ, పీటలూ, పొడి పిండీ, ఉండలూ అన్నీ తీసి ప్రారంభించింది. రెండు మూడు వందలున్నవి. ఒక్కతె చేయలేదు. నాకన్నీ చేయటం తెలుసునాయె. 'నాయనా కాసిని చేయరా' అంటూ చల్లగా సాగించింది. నాకిక సమయం చిక్కింది. దీనికి సందిస్తే, ఇంకొకటి ప్రారంభిస్తుంది. ఇప్పుడే ఖండించాలనుకున్నాను. 'నీవన్నీ వదలి వచ్చావు గదా? లభించింది తిని పడి ఉండక ఇవెందుకు ? నేను చెయ్యను. నీవు చేసినా తినను. అన్నీ నీవే చేసుకో.నీవే తిను అని నా వాదం. ఆమె కాస్సేపు ఊరుకునేది. మళ్ళీ 'ఏం రా నాయనా కాస్త సహాయం చేయరా' అనేది. నేనో రానంటాను. ఆమె విడువక పిలుస్తూనే ఉంది. ఇది కాదని అట్టాగైతే నీవీ అప్పడాలు ఒత్తు. నేనింకొక అప్పడం చేస్తాను' అని.

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దానాలకు శ్రేష్ఠం సంక్రాంతి


సంక్రాంతి మూడు రోజుల పండగ. సంక్రాంతిని సూర్యుడు ధనూ రాశిలో నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయంలో జరుపుకుంటారన్నది తెలిసిందే. ఇక 'సం' అంటే చక్కని అని అర్థం. 'క్రాంతి' అంటే మార్పు అని అర్థం. అంటే చక్కని కాలంలోనికి మార్పు అని అర్థం చేసుకోవచ్చు. చలికాలం వెళ్లి వెచ్చదనం ప్రవేశించే రోజులు వస్తాయి. అంటే ఇది రెండు కాలాల మధ్య సంధి. ఈ సంధికాలం దానాలకు శ్రేష్టం. సంక్రాంతి నుంచి రథ సప్తమి వరకూ ఉన్న కాలం అంతా విశేష పుణ్యకాలం. సంక్రాంతి మూడు రోజుల పండగ అని తెలుసుకున్నాం. మొదటి రోజు భోగి. తిథి ప్రకారం ఇది దక్షిణాయనానికి, ధనుర్మాసానికి చివరి రోజు. సంక్రాంతికి ముందు రోజు వ్యవసాయదారులు పంటలను ఇళ్ళకు చేర్చి విశ్రాంతి తీసుకునే రోజు. విశ్రాంతి అవటం వల్ల భోగం అనుభవిస్తారు కనుక దీనికి భోగి అనే పేరు వచ్చినట్లు చెబుతారు. అంతేగాక ప్రతి పెద్ద పండగకు ముయు రోజును భోగి అనే వాడుక ఉండడం వల్లకూడా ఈ రోజుకు భోగి అనే పేరు వచ్చిందని అంటారు. భోగి మంటలతో ఈ పండగ రోజు మొదలవుతుంది.



ఇక సంక్రాంతి రోజు వాతావరణంలో ఒక నవ చైతన్యం ప్రవేశిస్తుందని అంటారు. అందువల్ల ఈ రోజున చేసే సాధనలు విశేష ఫలితాన్నిస్తాయని అంటారు. దీపావళి మాదిరే సంక్రాంతి రోజుకు పలు విశేషాలున్నాయి. కృష్ణుడు ఇంద్రునికి గర్వ భంగం చేసిన రోజు, పాతాళలోకంలో ఉండే బలి భూమి మీదకు వచ్చేందుకు విష్ణువు అనుమతించిన రోజుగా కూడా కొందరు భావిస్తారు. అలా వచ్చిన బలి భూలోకంలో పండగ వాతావరణాన్ని, సంబరాలను చూసి సంతోషించాడని పురాణ వచనం. సంక్రాంతి రోజున స్వర్గంలో వాకిళ్లి తెరుస్తారని అందువల్ల ఆ సమయంలో దేహత్యాగం చేసినవారు నేరుగా స్వర్గానికి వెళతారని అంటారు. ఉత్తరాయన పుణ్యకాలంలో వచ్చే సంక్రాంతి పురుషుడు తనను పూజించిన వారు దక్షిణాయనంలో చేసిన పాపాలను తొలగిస్తాడని ఒకనమ్మకం. ఈ రోజున ముఖ్య విధి స్నానం. ఈ రోజు స్నానం చేయని వారు ఏడు జన్మల వరకూ దారిద్ర్యం అనుభవిస్తారని అంటారు. ఈ కాలం దేవతారాధనకు, ముఖ్యంగా సూర్యారాధనకు, జప పూజాదులకు పితృతేవతారాధనకు కూడా ముఖ్యమైనది. ఈ రోజున పితృదేవతలకు తర్పణాలు విడుస్తారు. ఈ రోజు దానాలకు కూడా శ్రేష్ఠమైనది. ఈ రోజున ధాన్యం, పండ్లు, విసన కర్ర, వస్త్రం, పాయసం, మజ్జిగ, కంబళ్లు, గుమ్మడికాయ, బంగారం, కాయగూరలు, దుంపలు, తిలలు, చెరకు, గోవు, కాంస్య పాత్ర దానం చేస్తారు. బంగారం, వెండి లేదా కంచుతో చేయించిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ప్రతిమను దానం ఇస్తే భూమండలం దానం ఇచ్చినంత ప ుణ్యమని కూడా కొందరు చెబుతారు. ఇక ఈ రోజున పెరుగు దానం విశేషఫలదాయకం. ద్రోణాచార్యుని భార్య, కృపాచార్యుని సోదరి కృపి ఒకసారి దుర్వాసుని సూచన మేరకు ఆయనకు పెరుగు దానం చేసి ఆ పుణ్యం కారణంగా అశ్వత్థామను సుతునిగా పొందిందని ఒక కథ. దానాలకు సనాతన ధర్మంలో ఎంతో ప్రాశస్త్యం ఉంది. దీని వెనుక చిన్న తార్కికత క ూడా ఉంది ఏదైనా ఇస్తేనే మనకు వస్తుందన్నది ఆ నీతి. గ్రహ శాంతి వంటి వాటికి కూడా దానాలు చేయడం తెలిసిందే. ఇక మన ధర్మంలోని యజ్ఞాలు క ూడా దైవానికి ఏదో ఒకటి సమర్పించేవే.దేవతలకు మనకు ఇస్తున్న వాటన్నిటికీ కృతజ్ఞతగా ఈ అర్పణలు జరుగుతాయి. యజ్ఞోవై విష్ణుః అనడం ద్వారా యజ్ఞాలు విష్ణు స్వరూపమని తేల్చారు. కృష్ణుడు సంక్రాంతినాడు చేశాడని చెప్పుకునే ఇంద్ర గర్వ భంగం కూడా అతనికి హవిస్సులు కాదని పర్వతానికి అర్పణ చేయడానికి సంబంధించినవే.

సంక్రాంతి పండగ మర్నాడు వచ్చే కనుమ ముఖ్యంగా పశువుల పండగ. మనదేశం ముఖ్యంగా వ్యావసాయకమైనదైనందున ఆహారాన్నందించే రైతులు ఈ సమయంలో పంటలు వచ్చి విశ్రాంతి తీసుకునే రోజు కనుక ఆట విడుపుగా తమకు పంటపనుల్లో సాయపడుతూ, పాలు, పెరుగుతో ఆహారాన్నందిస్తున్న పశువులను అలంకరించి ఊరేగిస్తారు. అయితే ఈ పండగ ప్రస్తావన అథర్వ వేదంలో ఉందని దానిని అనడుత్సవంగా పిలిచేవారనిపెద్దలు చెబుతారు.

జీవుల గుణాలు నా నుంచి ఉద్భవించినవే



అధ్యాయం 7, శ్లోకం 12

యే చైవ సాత్త్వికా భావా
రాజసాస్తామసాశ్చ యే।
మత్త ఏవేతి తాన్ విద్ధి
న త్వహం తేషు తే మయి॥

తాత్పర్యం

సత్వగుణానికి గాని, రజో గుణానికి గాని లేదా తమోగుణానికి గాని సంబంధించిన జీవుల భావాలన్ని నా శక్తి నుండే ఉద్భవించినవని నీవు తెలుసుకో. ఒక విధంగా నేనే సర్వమునై, స్వతంత్రుడనై ఉన్నాను. ప్రకృతి త్రిగుణములు నా యందున్నను నేను వాటికి లోబడను.

భాష్యం

ఈ ప్రపంచములోని భౌతిక కార్యాలన్నీ త్రిగుణముల ఆధీనములోనే జరుపబడతాయి. ఈ త్రిగుణములు భగవంతుని సృష్టే అయినా శ్రీ కృష్ణుడు వాటికి లోబడి ఉండడు. ప్రభుత్వ నియమాల వలన ప్రజలు శిక్షింపబడినా ఆ నియమాలను చేసిన రాజు వాటికి ఏ విధముగా అతీతుడై ఉంటాడో, అదే విధముగా సత్వ రజస్తమో గుణాలను సృష్టించినా కృష్ణుడు భౌతిక ప్రకృతిచే ప్రభావితము చెందడు. అందువలన ఆయనను 'నిర్గుణుడు' లేదా 'గుణాతీతుడు' అని అంటారు. ఇది దేవాది దేవుడైన భగవంతుని ప్రత్యేక లక్షణము.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

Google play | IOS iTunes

దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు, దూర ప్రయాణాలు, విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచి కార్యాలలో పేరు ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ప్రభుత్వ వ్యవహారాల్లో వ్యతిరేకత ఉంటుంది. ఆదాయ మార్గాలు సులభతరం.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి:సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారా ల్లో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది ఆదాయంలో గట్టి ప్రయత్నాలు లాభిస్తాయి.

కర్కాటక రాశి:విదేశీ లావాదేవీలు కలిసి వస్తాయి. శుభ వార్తలు వింటారు. పి ల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. శత్రుభీతి పోతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి: గృహ కార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప ్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్య అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు లాభిస్తాయి. ఆహ్లాద పరిస్థితులు గృహ రీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరించబడతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి.

తుల రాశి: విదేశీ లావాదేవీలు, సంభాషణలు కలసివస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతితొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో నుంచి లాభాలను కూడగట్టుకునే ప్రయత్నాలు అనుకూలిస్తాయి


వృశ్చిక రాశి: స్థిరాస్తి కొనుగోళ్ళు అనుకూలం. ఆరోగ్య పరీక్షలు మేలు కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలోను, ఆరోగ్యం విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలి. వ్యాపారపరంగా అసహన పరిస్థితులుంటాయి. ఆదాయం పర్వాలేదు

ధను రాశి: ఉద్యోగ ప్రయత్నాలు సఫలం. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలు ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులను సరిదిద్దుకునే అవకాశాలు దగ్గరవుతాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు ఉంటాయి.

మకర రాశి: విదేశీ సంభాషణలు ఉపకరిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఊరట ఉంటుంది. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: నూతన వాహన కొనుగోళ్లు వంటివి ఆనందాన్ని కలిగిస్తాయి. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభ వార్తలు వింటారు. ఆకస్మిక వ్యయం లేకపోలేదు. ఆరోగ్యం విషయంలో ప్రతికూలత ఉంటుంది.

మీన రాశి: రుణ ప్రయత్నాలు, వాహన కొనుగోళ్ళు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల నుంచి, ఆరోగ్య సమస్యల నుంచి ఉపశమనం. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప ్పనిసరి.
ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com





సంస్కృతి



సంతోష సంబురాల సంక్రాంతి

"రవే సంక్రమణం రాశౌ సంక్రాంతి అధికద్యతే" (నాగరఖండం) అని చెప్పడం వలన ఒక్కొక్క మాసము ఒక్కొక్క సంక్రాంతిగా చెప్పబడింది. ఈ ప్రమాణము ననుసరించి మకర సంక్రాంతి (జనవరి14) మొదలుకొని కర్ణాటక సంక్రాంతి (జులై14)వరకు ఉత్తరాయనము తర్వాతికాలం మకర సంక్రాంతి వరకు దక్షిణాయణంగా వ్యవహరిస్తున్నారు.

ముక్త సంగ్రహములో చెప్పబడినట్లుగా ''మకర కర్కట సంక్రాంతి క్రమేణోత్తరాయణం దక్షిణాయనంస్యాత్'' ఇది మానవుల కాలమానం కాగా- ఆయనే దక్షిణే రాత్రి రుత్తరేతు దివా భవేత్' అని 'కపింజల సంపాత' పేర్కొన్నది. మాసములకు ఒక సంవత్సర కాలము దేవతలకు ఒక అహోరాత్రమై దివసముగా చెప్పబడుచున్ని. అందు ఉత్తరాయనం పగటి భాగం కాగా, దక్షిణాయనం రాత్రి భాగమగును.

పుష్యమాసంలో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రకృతి శోభను నింపుకొని వచ్చెడి అందమైన పండుగ సంక్రాంతి గడప గడపకు వ్రేలాడెడి పచ్చని మామిడి ఆకుల తోరణాలతోను, ప్రతి ఇంటి ముంగిలిలో విరబూసిన బంతిపూవుల పరిమళాలతోనూ ఆబాలగోపాలమునకు ఆనందోత్సాహులను పంచి ఇచ్చెడి ఈ పండుగను మకరసంక్రాంతియందురు.

సంక్రాంతి అనగా సంక్రమణము. 'సంక్రమణము' అనగా కదలిక సూర్యుడు ధనస్సురాశి నుండి మకరరాశిలోనికి ప్రవేశించును. అందువల్లనే ఇది మకరసంక్రాంతి అయ్యింది. ఆరోగ్య ప్రదాత అయిన భానుడు సంక్రాంతి నుండి ఆరోగ్య వాతావరణము కల్పిస్తాడు.

ఎక్కువ మంచుకురిసే దేశాల్లో సూర్యుడు కనబడిన రోజున పండుగ చేసుకుంటారు.

సూర్యనమస్కారాలు చేస్తూ ఆరాధించిన 'సాంబుడ'నే కవికి కుష్ఠురోగ వ్యాధి నివారణమైంది. అని చరిత్ర చెబుతోంది.

పురాణాలలో 'ఆదిత్యహృదయం' అనే స్తోత్రాన్ని బ్రహ్మాస్త్రానికి జోడించి ప్రయోగిస్తే గాని రావణాసురుడు మరణించలేదు.

ప్రపంచంలో అన్నిచోట్లా ప్రజలు ఏదోరకంగా సూర్యుడ్ని ఆరాధిస్తూనే వున్నారు. అన్ని యుగాల్లో అంతెందుకు మనిషికి సంతోషం వస్తే ఆహా! అంటాడు. ఆహా! అంటే సూర్యుడని అర్థముంది. అహఃస్కర భాస్కరా, సూర్యుని అనుగ్రహం వల్లనే శమంతకమణి ప్రతిరోజూ బోలెడు బంగారాన్ని ఇచ్చేది.

సంక్రాంతి మూడు రోజుల పండుగ. ఆరోజూ తెల్లవారుఝామునే లేచి ఇండ్లలోని పనికిరాని వస్తువులను వీధుల్లో కుప్పబోసి మంటలు వేస్తారు. మంటల్లో నువ్వులు, జీలకర్ర వేసి మంటలారిన పిదప కొద్దిపాటి బూడిదను సేకరించి నుదుట బొట్టుపెట్టుకొని స్నానంచేస్తారు. స్త్రీలు ఆ సాయంత్రం తమ ఇండ్లలో పులగం చేసి తమ బంధువులకు, ఆత్మీయులకు తినిపిస్తారు. అంతేకాక సంధ్యాసమయమందు స్త్రీలు చిన్నపిల్లలను చేరదీసి రేగుపళ్ళు, చెఱకు ముక్కలు చిల్లర నాణేలు కలిపి పిల్లల తల చుట్టూ తిప్పి వారి తలపై పోస్తారు. వీటినే భోగిపళ్ళు అంటారు. భోగినాడు వేసే మంటల్ని కొన్ని ప్రాంతాల్లో రావణకాష్ఠంగా, మరికొందరు హిరణ్యకశిపుని చెల్లెలు హోలికను ప్రహ్లాదుని ఒడిలో కూర్చుండ బెట్టుకొని భస్మమైన దానికి గుర్తుగా భావిస్తారు. పంజాబ్ రాష్ట్రంలో భోగి పండుగ రోజున వేసే మంటలను 'లోహిరి' అంటారు. బెంగాలీ ప్రజలు ఆ రోజున గడ్డిపరకలు చేతబట్టి ధాన్యం చుట్టూ ''భావన్‌పురి'' అని నాట్యం చేస్తారు. రకరకాలుగా తీర్చబడిన ముగ్గులతో కళకళలాడే వాకిళ్లతో పల్లెలు, పట్నాలు కూడా వింత వింత అందాల్ని సంతరించుకుంటాయి. స్త్రీల కళాభిరుచి నైపుణ్యము వ్యక్తమగుచుండును.






ఆడపిల్లలు గోమయంతో గొబ్బెమ్మలను గుండ్రంగా చేసి, పసుపు కుంకుమలతోను, బంతిపూలతోను, గుమ్మడిపూలతో అలంకరించి, ఆ ముగ్గులలో చక్కగా అమర్చెదరు. సందెవేళలలో పెద్ద గొబ్బెమ్మను చేసి పూజించి ఇరుగుపొరుగు వారిని పేరంటమునకు పిలిచి పసుపు, కుంకుమ పూలతో సత్కరించెదరు.

"చామంతి పూవంటి చెల్లెల్నియ్యవే
తామర పూవంటి తమ్ముణ్ణియ్యవే
మొగిలి పూవంటి మొగిణ్ణియ్యవే
పనస పండంటి పాపణ్ణియ్యవే''॥

అంటూ పాడుతూ చప్పట్లు చరుస్తూ ఆ గొబ్బి దేవత చుట్టూ తిరిగెదరు. రమ్యమైన ఆ సన్నివేశం చూపరుల మనస్సులను రంజింపజేస్తుంది.

రెండవరోజు సంక్రాంతి. ఈరోజు సూర్యుడు ధనస్సు నుండి మకర రాశిలోనికి ప్రవేశిస్తాడు. ఈ సమయం నుండే ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమౌతుంది. ఈ శుభ గడియలో వైకుంఠమందు వాకిళ్లు తెరుస్తారట. ఈరోజు మరణించినవారు ఎటువంటి ఆటంకాలు లేక వైకుంఠ ప్రాప్తి పొందుతారట. అందుచేత భీష్మ పితామహుడు మహాభారత యుద్ధమందు గాయపడి నేలకూలినా అంపశయ్యపై పరుండి ఉత్తరాయణ పుణ్యకాలంలోనే ప్రాణత్యాగం చేశాడు. ఈ పుణ్యదినాన్నే శ్రీహరి బలిని హతమార్చాడు. శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిపైకెత్తి యాదవులను రాళ్ళవర్షం నుండి రక్షించాడని పేర్కొంటారు. మకరమాసంలో మాఘమాసం కలియడం చేత ఈ మాసమందు సూర్యోదయానికి పూర్వమే నదీజలాల్లో చన్నీటి స్నానం చేస్తే పుణ్యం లభిస్తుంది. ఈరోజు ప్రయాగలోని నదులందు స్నానం చేస్తే దేశంలోని అన్ని నదులందు స్నానం చేసినంత ఫలితం లభిస్తుందట.

మకర సంక్రాంతిరోజున బెంగాల్‌లో గంగాసాగర్ మేళా (ఉత్సవం) ప్రముఖమైంది. రోజు వేల సంఖ్యలో గంగా సాగరమందు సంక్రాంతి స్నానాలు చేస్తారు.ఆ ప్రదేశంలో పితృదేవతలకు తర్పణం వదిలితే వారి ఆత్మలు సంతృప్తి చెందుతాయని భావిస్తారు. ఈ పండుగను పెద్ద పండుగ అంటారు. సంక్రాంతి రోజు గృహస్తు తెల్లవారుఝామునే లేచి తలంటి స్నానమాచరించి నూతన వస్త్రాలు ధరించి తర్పణం వదులుతారు. ఈ సమయంలో పప్పు, బియ్యం, గుమ్మడికాయ మొదలగు వస్తువులను దానమిస్తారు. సంక్రాంతి రోజున సూర్యునికి క్షీరాన్నంతో బాటు కొత్త ధాన్యాలతో వండిన పొంగలి, పిండివంటలు, తీపి పదార్థాలు నైవేద్యంగా సమర్పిస్తారు. సంక్రాంతిరోజున తమిళ ప్రజలు చెరకు ముక్కలను, అరటి పిలకలకు పూజచేసి పొంగలి వండుతారు. సంక్రాంతి రోజున ఏ గ్రామంలో చూసినా సాతాని జీయర్ల కీర్తనలు, గంగిరెద్దు వాళ్ల వాయిద్యాలు, బుడబుక్కల వాళ్ల పొగడ్తలు వినిపిస్తాయి. వారికి ప్రతి గృహస్తు కలిగినంతలో దానం చేసివారి దీవెనలు పొందుతారు.



కర్ణాటక ప్రజలు ఈ పండుగ రోజు కందిపప్పు వండరు. చారు కాయరు. చారుభోజనం, సోదరులకు అశుభమని వారి నమ్మకం.

ఈ పండుగ మూడోరోజు 'కనుమ'. దీనినే పశువుల పండుగ అని, పలుకలు పెరికే పండుగ అని కూడా వ్యవహరిస్తారు. ఈరోజు తెల్లవారుఝామునే వ్యవసాయదారులు తమ పశువులకు స్నానం చేయించి కొమ్ములకు రంగుపూసి ప్రభలతో సింగారించి ఊరేగిస్తారు. కనుమరోజున తమిళ స్త్రీలు పొంగలిని కాకులకు సమర్పిస్తారు. పశువుల పండుగరోజు సాయంకాలం గ్రామస్తులు తమ పశువులను ఊరికి దూరంగా తీసుకెళ్ళి అచ్చట పొంగళ్ళు పెట్టి కాటమరాజు పూజ చేస్తారు. మరికొన్ని గ్రామాల్లో కోడిపందేలు వేస్తారు. కనుమ పండుగనాడు సంక్రాంతి లక్ష్మికి వీడ్కోలు పలుకుతూ వేసే రథం ముగ్గు ప్రముఖమైనది.

కాలగమనంలో మిగతా పండుగలు, వ్రతాలు మాదిరిగానే సంక్రాంతి కూడా తన పూర్వవైభవాన్ని కోల్పోతూ ఉంది. ఈనాడు ఎక్కడా సాతాని జీయర్లు జంగమదేవర్లు, బుడబుక్కలవాళ్లు, గంగిరెద్దుల వాళ్లు కంట కనబడకుండా పోవడమే. ఏది ఏమైనా తెలుగు రాష్ట్రాలలో సంక్రాంతి పండుగకు ఒక ప్రత్యేకత సంతరించుకుంది. కనుమరోజు ''తిల'' తప్పక భుజించాలి. మన ప్రాచీనులు నువ్వుల మహాత్యాన్ని గుర్తించి ఈ క్రింది విధంగా శ్లోకపరచి విశదీకరించారు.

"తిలస్నానా తిలోద్దరే
తిలహింకు తిలోదరే
తిలభుక్ తిలదనేచ
షట్ తిలపాపనాశనః''

అనగా నువ్వుల నూనెతో స్నానం చేయడం, నువ్వులను ధరించడం, హోమం చెయ్యడం, నువ్వులను తినడం నువ్వులను దానం చేయడం, అనెడి ఈ ఆరును పాపములను పోగొడుతుందంటారు ఈపండుగ ప్రజల హృదయాలలో కాంతిని ప్రసరించి సత్యముగా నిజమైన సంక్రాంతి అనుభవించునట్లుగా చేయాలని ఆశిద్దాం!

"పూర్వపు వైభవాన కొలువుతీరాలి సంక్రాంతి సిరి..''

సరస్వతి అప్పలరాజు

రసవత్తర నాటకం
శ్రీ పాదుకా పట్టాభిషేకం

ఏనాగంటి లక్ష్మీనరసింహారావుగారు రామాయణం అంతా నాటకాలుగా రాశారు. అందులోదే పాదుకాపట్టాభిషేకం. ఇది ఒకప్పుడు బాగా ఆడిన నాటకం. అద్దంకి శ్రీరామమూర్తిగారు దశరధుడుగా సి.ఎస్.ఆర్ రాముడుగా కొన్ని నాటకాలు ప్రదర్శించారు. ప్రఖ్యాత నటీమణి కన్నాంబ ఈ నాటకాన్ని సినిమాగ తీశారు 1945 ప్రాంతంలో. దశరధుడుగా అద్దంకి, రాముడుగా సి.ఎస్.ఆర్. భరతుడుగా బందా కనకలింగేశ్వరరావు, లక్ష్మణుడుగా కొచ్చెర్లకోట సత్యనారాయణ కైకగా కన్నాంబ కౌసల్యగా దాసరికోటిరత్నం సీతగా పుష్పవల్లి మంథరగా శేషమాంబ, భరద్వాజుడుగా రఘురామయ్య గొప్పగా నటించారు. కాని అది మళ్లీ రాలేదు.

అద్దంకి దశరధుడి లాంటి పాత్రకు అందెవేసిన చేయి. రాముడుగా సి.ఎస్ఆ.ర్ చెప్పనక్కరలేదు. అన్నిటా ఆరితేరిన ఆయన రాముడుగా ఎంతో భాసిల్లారు. బందా, హుందా గల నటుడు నిజానికి 'పాదుక'తో భరతుడే నాయకుడు. తెలుగు మహానటులలో సి.ఎస్.ఆర్. బందా పోటీనటులు. ఇద్దరూ ఆ పాత్రలను ఎంతో గొప్పగా తీర్చిదిద్దారు. కన్నాంబ చండీరాణి కైకగా తన అప్రతిమాన నటనా కౌశలం చూపించింది. రఘురామయ్య భరద్వాజ పాత్రలో గానామృతాన్ని కురిపించారు.

పుష్పవల్లి అందం సీత పాత్రలో శోభిల్లింది. శేషుమాంబ మధరపాత్రకు ధీటైనదే. అద్దంకివారు నాటకాలలో కూడా తరువాత తరంవాళ్లతో గాడూ పాదుకలోదశరధుడు వేశారు. పీసపాటి నరసింహమూర్తి, ఎ.వి.సుబ్బారావులు రాములుగా వేమూరి రామయ్య భరతుడుగా కొన్ని నాటకాలు వేశారు.

నాంపల్లి రామభక్త సమాజంలో-

జి.ఎస్.ఎన్.శాస్త్రి దశరధుడుగా అద్దంకివారి మేనల్లుడు ఓగిరాల జానకిరామయ్య రాముడుగా అక్కిరాజు సుందరరామకృష్ణ భరతులుగా వేశారు. మేమూ విద్యానగరిలో విద్యానగర నాట్యమండలి స్థాపించి పులిపాక సుందరరామయ్య దశరధుడుగా నేను రాముడు గుండు సత్యనారాయణగారు భరతుడుగా 1961లో ప్రదర్శించాం.

తరువాత వేమూరి సీతారామశాస్త్రిగారు దశరధుడుగా నేను రాముడుగా, యరవల్లి నాగేశ్వరరావు లక్ష్మణుడుగా శర్మ అక్కిరాజు భరతులుగా చాలా నాటకాలు వేయటం జరిగింది. వేమూరి రామయ్యగారు దశరధుడుగారు కొన్ని నాటక ప్రదర్శనలిచారు. విజయవాడ తుమ్మలపలివారి ఆడిటోరియంలో క ాడా ప్రదర్శించాం. కైకగా మల్లాది విజయలక్ష్మి పీసపాటి సత్యవతి, ఇందిరాదేవి మొదలైనవారు పాత్రధారణ చేశారు. శ్రీరామపాదుకా పట్టాభిషేకం గొప్ప దృశ్య కళాఖండం. మాటలు పద్యాలు పాత్రోచితమై రసవత్తరంగా ఉంటాయి. ఈ నాటకాన్ని జీవింప చేయటం ఎంతైనా అవసరం. తగిన శ్రద్ధ కళాభిమానులు ప్రభుత్వ తీసుకోవాలి.

- అయ్యదేవర
పురుషోత్తమరావు
9290448444



పల్లెవాసులనలరించే
గొంతాలమ్మ అశ్వనృత్యం

అశ్వనృత్యాలు ఎక్కువగా కృష్ణ, గుంటూరు జిల్లాలలో ఉన్నాయి. అశ్వనృత్యాలను ముఖ్యంగా హరిజనులు దసరా సమయాలలో గొంతాలమ్మను పంట చేలో ప్రతిష్టించి తొమ్మిది రోజులు ఉత్సవం జరిపి తరువాత గొంతాలమ్మను తృప్తిపరిచి ఉత్సవంతో సాగనంపుతారు. ఈ సందర్భంలో వివిధ విచిత్రవేషాలు ధరించి చుట్టుప్రక్కల గ్రామాలన్నీ సంచారం చేసి డబ్బు, ధాన్యం వస్త్రాలు సంపాదిస్తారు.

అశ్వనృత్యం

వీరి ప్రదర్శనల్లో ప్రాముఖ్యం వహించేది అశ్వనృత్యం. మెడవరకు గల ఒక గుఱ్ఱపు తలను పేడతో చేయించి వివిధ వార్నీషు రంగులతో అలంకరించి, ఇతర శరీర భాగాన్నంతా, తేలిక వెదురుబద్దలతో గుఱ్ఱపు ఆకారాన్ని తయారుచేసి చుట్టూ ఎఱ్ఱరంగు చీరను కట్టి, ఆ గుఱ్ఱాన్ని చంకలను తగిలించుకుని వెనకకూ, ముందుకూ నడుస్తూ, మధ్యమధ్య ఎగురుతూ, కేలమ్మ కేల్‌భాయి కేల్, అబ్బబ్బ రాయుడే అల్పాడి బుంగడి అంటూ అద్భుతంగా నృత్యం చేస్తారు. వీరి నృత్యానికి ఉత్తేజం కలిగించేది డప్పుల వాయిద్యం. ఈ వాయిద్యపు వరుసల గమకాల ననుసరించి నృత్యగతిని మారుస్తూ ఉధృతంగా నృత్యం చేస్తారు. ఈ నృత్యంలో డప్పు వాయిద్యాన్ని నిలిపి అందరూ సమిష్టిగా చేతుల్లో చిరుతలు ధరించి ఈ విధంగా పాట పాడుతూ నృత్యం చేస్తారు.

పాడే పాట

1. కంచెల చెరిగే చేడి కురులపై
లలన కురులపై
2. తుమ్మెద లాడిన ఓ లలనా,
ఘన తుమ్మెద లాడిన ఓ లలనా...॥కంచె॥
3. చెమటకు తడిసిన చెదిరిన గంధం
ఘుమఘుమలాడిందో లలనా...॥కంచె॥
4. చెరిగేటప్పుడు చేతులు గాజులు
గలగలలాడిన ఓ లలనా...॥కంచె॥
5. గొప్పది రోకలి గుప్పున దండగ
జబ్బలు కదిలిన ఓ లలనా
ఘన జబ్బలు కదిలిన ఓ లలనా..॥కంచె॥

ఈవిధంగా ఒక ప్రక్క నృత్యం జరుగుతూ ఉంటే, చుట్టుప్రక్కల ఇళ్లలో వుండే స్త్రీ,పురుషులతో పాటు, పిల్లలు కూడా ఉత్సాహంగా మూగుతారు. ఈ సమయంలో సోడిగాడు వంకర దుడ్డుకఱ్ఱను పిల్లల కాళ్లకు పట్టి లాగుతూ, భయపెట్టి నవ్విస్తూ వుంటాడు. సోడిగాడు వేషధారణ నవ్విస్తూ ఉంటుంది.

ఓ చిన్నదాన ఈ నృత్యంలోనే
ఓ చిన్నదాన, ఓ చిన్నదాన
గుంటూ చిన్నదానా
గురుగూ మెట్టల మీద
గజ్జలుంటే పో...॥ఓ చిన్నదానా॥
నల్లనల్లటిదానా
ల్నడుము సన్ననిదాన
నడుము సన్నము మీద
నగలుంటే పోకే...॥ఓ చిన్నదానా॥



గుఱ్ఱాల కథ

ముఖ్యంగా గుంటూరు జిల్లాలో ఒకప్పుడు పెళ్లి సందర్భాలలో, పెండ్లి కొడుకులు నిజమైన గుఱ్ఱమెక్కి పెళ్లికూతురు వూరికి పెళ్లి పెద్దలతో తరలివెళ్లేవారు. ఇలా పెళ్లి సందర్భంలో దారిలో వున్న గ్రామాలలో డప్పులు వాయిద్యాలతో గుఱ్ఱాన్ని కదను త్రొక్కిస్తారు. డప్పు వాయిద్యానికి అనుగుణంగా కాళ్లతో నృత్యం చేయిస్తారు. దీనిని కదం త్రొక్కించటం అనేవారు. అందుకోసం గుఱ్ఱాలను తయారుచేసి, వాటిని చక్కగా అలంకరించి, వారికి నృత్యం నేర్పేవారు. ఈ గుఱ్ఱపు నృత్యాన్ని చూడడానికి గ్రామప్రజలు గుమికూడి ఆసక్తితో చూసేవారు. చెప్పినట్లు చేసే ఈ గుఱ్ఱపు నృత్యం కనుల పండువగా ఉంటుంది.

వ్యక్తిగతంగా కలుస్తా...!



అనుష్క

ప్రపంచమంతా సామాజిక మాధ్యమంలోకి వచ్చేసింది. ఎక్కడా దొరికని వాళ్లు కూడా ట్విట్టర్‌లోనో, ఫేస్‌బుక్‌లోనే దొరికేస్తారు. అంతలా ప్రతి ఒక్కరికీ చేరువైంది సాంకేతికత. ఈ సామాజిక మాధ్యమాల వాడకం తారలకు మరీ ముఖ్యం. వాళ్ల కొత్త చిత్రాల వివరాలు, అభిమానులకు సందేశాలు, పండగల శుభాకాంక్షలు ఇలా ప్రతి సందర్భాన్నీ తమ ఖాతా ద్వారా తెలిపే అవకాశం ఉంటుంది. తారలందరికీ సొంత ఖాతాలు ఉన్నాయి. అయితే అందాల తార అనుష్క మాత్రం వీళ్లలో తాను చేరనని చెబుతోంది. ఈ సోషల్ మీడియా బంధాలు కొనసాగించడం తన వల్ల కాదంటోంది. మనుషులను కలవడం ముఖ్యమే కానీ...తెలియని వాళ్ల కోసం తోచింది రాసి పోస్టులు చేయలేనని అంటోంది అనుష్క. ఈ సుందరి మాట్లాడుతూ....రాత్రి తీరిగ్గా ట్విట్టర్‌లో ఏదో పోస్టు పెట్టి నిద్రపోవడం నాకు ఇష్టముండదు. నా చుట్టూ ఉన్న అందరితోనూ స్నేహంగా కలిసి ఉంటాను. ఇక్కడ సామాజిక మాధ్యమాలలో ఎవరో తెలియని వాళ్లతో అభిప్రాయాలు పంచుకోవడంలో ఆసక్తి లేదు. ఎవరినైనా వ్యక్తిగతంగా కలవడాన్నే ఇష్టపడతాను. అని చెప్పింది. అనుష్క తానుగా సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు తెరవకున్నా...ఆమె తరుపున ఎంతోమంది అభిమానులు ఖాతాలు తెరిచి నిర్వహిస్తుండటం విశేషం.



న్యూ లుక్.. మెగాస్టార్ చిరంజీవి కొత్తలుక్‌లో కనిపించారు. సైరా సినిమా కోసం ఆయన మీసాలు తీశారు.

చిరంజీవి ఆవిష్కరించిన జువ్వ ఫస్ట్‌లుక్



నూతన జంట రంజిత్, పాలక్ లల్వానీ నటిస్తున్న జువ్వా చిత్రం ఫస్ట్‌లుక్‌ను మెగాస్టార్ చిరంజీవి తన నివాసంలో ఆవిష్కరించారు. త్రికోటి పేట దర్శకత్వంలో సోమి ఫిలింస్ పతాకంపై డా.భరత్ సోమి నిర్మిస్తున్నారు.

ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ జువ్వ ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. హీరో రంజిత్, నిర్మాత భరత్ అన్నదమ్ములు. వీళ్ళనాన్న గారితో నాకు మంచి పరిచయం ఉంది. డాక్టర్ అయిన భరత్ తన తమ్ముడికోసం నిర్మాత అయ్యారు. ఆ విధంగా అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా ఈ సినిమా నిలబడింది. టీజర్‌లో రంజిత్ డైనమిక్‌గా, హుషారుగా కనిపించాడు. క్యారెక్టర్ పరంగా పక్కా మాస్ అని అర్ధమవుతోంది. హీరోయిన్ పాలక్ లల్వానీ రొమాంటిక్‌గా, అందంగా కనిపించింది. రాజమౌళి శిష్యుడు త్రికోటి దర్శకత్వం వహించిన ఈ సినిమాను వీళ్ళిద్దరి కోసం తప్పకుండా చూస్తా అన్నారు.

హీరో రంజిత్ మాట్లాడుతూ చిరంజీవిగారి నటన అంటే నాకు ఎంతో ఇష్టం. ఆయనే నాకు ప్రేరణ. ఆయనతో ఒక్క ఫోటో దిగితే చాలు అనుకునేవాడిని. ఈ రోజు నేను హీరోగా నటిస్తున్న సినిమా టీజర్‌ను చిరంజీవిగారు విడుదల చేయడం ఆనందంగా ఉంది అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ప్రేమకథతో తీసిన సినిమా ఇది. చిన్న థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ జువ్వ చిత్రం పాటలను ఈ నెలాఖరున, ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం అని తెలిపారు.

ఈ చిత్రానికి మాటలు ఎమ్.రత్నం, ఛాయాగ్రహణం సురేష్, సంగీతం కీరవాణి

ఇంకా వేగంగా సినిమాలు చేయాలి...



కేఎస్ రవికుమార్

తనకు వేగంగా చిత్రాలు రూపొందించే దర్శకుడిగా పేరుందని...అయితే ఈ వేగాన్ని మరింత పెంచాలనుకుంటున్నట్లు దర్శకులు కేఎస్ రవికుమార్ తెలిపారు. ఈ దర్శకుడి పలు చిత్రాలు కోలీవుడ్‌లో అద్భుత విజయాలు సాధించాయి. వాటిలో నరసింహా, ముత్తు లాంటి చిత్రాలు తెలుగులోనూ ఘన విజయాలు సాధించాయి. తాజాగా కేఎస్ రవికుమార్ తెలుగులో దర్శకత్వం వహించిన చిత్రం జైసింహా. బాలకృష్ణ, నయనతార జంటగా నటించిన జైసింహా ఈ వారమే ప్రేక్షకుల ముందుకొచ్చింది. సీకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి కళ్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. జైసింహా విజయంపై దర్శకులు కేఎస్ రవికుమార్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సినిమాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కేఎస్ రవికుమార్ మాట్లాడుతూ....జైసింహాకు మంచి స్పందన వస్తోంది. సినిమా హిట్ అని చెబుతున్నారు. సంతోషంగా ఉంది. బాలకృష్ణగారికి ఇలాంటి విజయాలు రావాలి. ఆయనతో సినిమా చేస్తానని చెప్పినప్పుడు కొంతమంది బాలకృష్ణకు కోపం ఎక్కువ అని చెప్పారు. కానీ నేను సినిమా చేస్తున్నప్పుడు అలాంటి సందర్భాలు రాలేదు. మొత్తం చిత్రీకరణలో చెప్పినట్లు నటించారు. ఇది ఎందుకు మార్చండి అని ఏ రోజూ చెప్పలేదు. సాధారణంగా సన్నివేశాలను నటించి చూపించడం నాకు అలవాటు. బాలకృష్ణకూ అలాగే చెప్పాను. ఆయన తన తరహాలో మార్చుకుని నటించారు. నయనతార, ప్రకాష్ రాజ్ తమ పాత్రలను చక్కగా పోషించారు. చిన్న పిల్లాడి పాత్ర కూడా ప్రేక్షకులకు బాగా నచ్చుతోంది. సంగీత దర్శకులు చిరంతన్ భట్ మంచి స్వరాలు అందించారు. భవిష్యత్‌లో మరింత వేగంగా సినిమాలు చేస్తాను. తరువాతి చిత్రం ఏంటన్నది త్వరలో చెబుతాను. అన్నారు.

టిఎస్సార్ కాకతీయ కళా వైభవ మహోత్సవం



కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి తన లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, బెంగళూరు, విశాఖపట్టణం నగరాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పుడు కాకతీయుల వైభవాన్ని చాటిచెప్పే విధంగా కాకతీయ కళా వైభవ మహోత్సవం నిర్వహిస్తున్నారు. టిఎస్సార్ కాకతీయ లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 17న హైదరాబాద్‌లో వేడుక జరగనుంది. దీనికి సంబంధించిన వివరాలను శనివారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో తెలియజేశారు.

టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ కాకతీయుల పరిపాలన స్వర్ణయుగం. 600 ఏళ్ల క్రితమే తెలుగు సంస్కృతి, నాగరికతలు ఘనంగా చాటారు. కళల్ని పోషించారు. ఎన్నో దేవాలయాలను నిర్మించి, శిల్పకళా నైపుణ్యం చాటారు. శ్రీకృష్ణదేవరాయల కంటే ముందు నుంచి తెలుగుజాతికి వారసత్వాన్ని అందించారు. వరంగల్ రాజధానిగా 300 ఏళ్లు పరిపాలించారు. వారి పేరు మీదుగా కాకతీయ కళావైభవ మహోత్సవం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ నెల 17న హైదరాబాద్ శిల్పకళావేదికలో వేడుక నిర్వహిస్తాం. మహారాష్ట్ర గవర్నర్ సిహెచ్. విద్యాసాగర్ చేతుల మీదుగా వేడుక ప్రారంభమవుతుంది. ఇదే వేదికలో చిత్ర పరిశ్రమలో 42 ఏళ్ళు పూర్తిచేసుకున్న మోహన్‌బాబును విశ్వనట సార్వభౌమ బిరుదుతో సత్కరిస్తున్నాం. పలువురు ఆధ్యాత్మిక, రాజకీయ, సినీ, సాంస్కృతిక ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఇలాంటి వేడుకలను తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో నెలల వ్యవధిలో నిర్వహిస్తాం అని చెప్పారు.

నటులు మోహన్‌బాబు మాట్లాడుతూ కళాకారులను, కళలను గౌరవించే వ్యక్తుల్లో టి.సుబ్బరామిరెడ్డిగారు ముందుంటారు. కాకతీయుల కళా వైభోగాన్ని ప్రజలకు చాటి చెప్పాలనుకోవడం అభినందనీయం. ఇక నాకు ఇవ్వనున్న విశ్వనట సార్వభౌమ బిరుదు గురించి ముంది చెప్పగానే బిరుదులు నాకు ఎందుకు? అన్నాను. వద్దని విశాఖలో చెప్పాను. మళ్లీ ఇప్పుడు ఇస్తున్నట్టు చెప్పారు. దాంతో ఆయన అభీష్టాన్ని కాదనలేకపోయా అని అన్నారు.

ఈ కార్యక్రమంలో రచయిత పరుచూరి గోపాలకృష్ణ లయన్ క్లబ్ సభ్యులు, కాకతీయ కళావైభవ మహోత్సవం ఉత్సవ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, కూచిపూడి నృత్యకళాకారిణిలు పద్మజ, సుజాత పాల్గొన్నారు.

ఈ నెల 17న నిర్వహించే కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, కౌన్సిల్ చైర్మన్ స్వామిగౌడ్, సినిమాటోగ్రఫి మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, పార్లమెంట్ సభ్యులు కె.కేశవరావు, జితేందర్ రెడ్డి, వినోద్‌కుమార్, శాసనసభ్యులు డి.కె.అరుణ, గీతారెడ్డి, జి.కృష్ణారెడ్డి, ఎర్రబెల్లి దయాకరరావు, పద్మావతిరెడ్డితో పాటుగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి తదితరులు హాజరుకానున్నారు.

ప్రయోగానికి బ్రహ్మాస్త్ర సిద్ధం...



రణ్‌బీర్ కపూర్

బాలీవుడ్‌లో వస్తున్న మరో సూపర్‌హీరో మూవీ బ్రహ్మాస్త్ర. రణ్‌బీర్ కపూర్ కథానాయకుడిగా నటిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, ఆలియా భట్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సూపర్ హీరో మూవీకి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తుండగా...ధర్మ ప్రొడక్షన్స్ పతాకంపై కరణ్ జోహార్ నిర్మిస్తున్నారు. బ్రహ్మాస్త్ర ఒక సినిమాతో ఆగిపోదని...దీనికి కొనసాగింపు చిత్రాలు కూడా ఉంటాయని నిర్మాత కరణ్ జోహార్ తెలిపారు. ఈ సిరీస్‌లో ప్రతి రెండేళ్లకొక కొత్త చిత్రాన్ని తెరపైకి తీసుకురావాలని భావిస్తున్నట్లు కరణ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ....మా సంస్థలో ప్రతిష్ఠాత్మకంగా బ్రహ్మాస్త్ర సూపర్ హీరో మూవీని నిర్మిస్తున్నాం. దర్శకుడు అయాన్ ముఖర్జీ బ్రహ్మాండమైన కథను చెప్పారు. కేవలం ఒక చిత్రానికే కాకుండా...సిరీస్‌కు సరిపోయేంత కథ దర్శకుడి ఆలోచనలో ఉంది. అందుకే బ్రహ్మాస్త్రను ఒక చిత్రంతో ఆపేయకుండా సిరీస్‌లా రూపొందించాలనుకుంటున్నాం. తొలి భాగం చిత్రీకరణ ఫిబ్రవరి మార్చ్ లో ప్రారంభిస్తాం. రెండేళ్లకొక కొత్త భాగాన్ని తెరపైకి తీసుకురావాలని ఆశిస్తున్నాం. దర్శకుడు అయాన్ ముఖర్జీ గత చిత్రాలు వేక్ అప్ సిద్, యే జవానీ హై దీవానీ బాక్సాఫీస్ వద్ద ఘన విజయాలు సాధించడంతో...బ్రహ్మాస్త్రపై అంచనాలు భారీగానే ఏర్పడుతున్నాయి.

నాపై ప్రేమ తగ్గలేదు..



శ్రద్ధా కపూర్

నటుడు శక్తి కపూర్ వారసురాలిగా తెరపైకి వచ్చిన శ్రద్ధా. తీన్ పత్తి, లవ్ కా ద ఎండ్ చిత్రాలతో అరంగేట్రం చేసింది. అయితే ఈ చిత్రాలేవీ శ్రద్ధా కపూర్‌కు కావాల్సిన గుర్తింపు తీసుకురాలేక పోయాయి. విషాదాంత ప్రేమ కథ ఆశికీ - 2 ఈ సుందరిని స్టార్‌ను చేసింది. ఆ తర్వాత ఏబీసీడీ ఎనీ బడీ కెన్ డాన్స్, భాగీ, హైదర్ లాంటి చిత్రాలు ఆమెకు వరుస విజయాలను అందించాయి. దీంతో...బాలీవుడ్ లో అగ్ర నాయికల్లో ఒకరైంది శ్రద్ధా. విజయాల తోడుగా ప్రయాణం కొనసాగిస్తున్న ఈ నాయికకు....తాజాగా విజయాలు దూరమయ్యాయి. ఈ ఏడాది ఆమెకు అస్సలు కలిసిరాలేదు. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఓకే జాను, హాఫ్ గర్ల్ ఫ్రెండ్, హసీనా పార్కర్..అనుకున్నంతగా ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. ప్రస్తుతం సైనా నెహ్వాల్ జీవిత కథతో పాటు సాహోలో నటిస్తోంది. సైనాగా మెప్పించేందుకు బ్యాడ్మింటన్‌లో కఠోర శిక్షణ తీసుకుంటోంది. తన కెరీర్ గురించి శ్రద్ధా మాట్లాడుతూ....మొదట్లో నా సినిమాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. మంచి విజయాలు సాధించాయి. ఇక ఆ తర్వాత చిత్రాలను వాటితో పోల్చడం మొదలైంది. అంచనాలు అందుకోలేకపోయిన సినిమాలు విజయానికి దగ్గరలో ఆగిపోయాయి. నా చిత్రాలు ఆడినా ఆడకపోయినా నామీద ప్రేక్షకులకున్న ప్రేమ తగ్గలేదు. అది గొప్ప విషయంగా భావిస్తాను. నా ప్రతిభ చూసి గర్వించేలా కష్టపడతాను. వీలైనంత విభిన్నమైన కథల్లో నటిస్తాను. అవి కొన్నిసార్లు విజయవంతం కావొచ్చు. కాకపోవచ్చు. జీవితంలో ఈ ఎత్తుపల్లాలు సహజమే కదా. అని చెప్పింది.